ఈనాడు

విజయవాడ 26-9-2024 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 47

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఛాంపియన్


కాన్పూర్‌లో భారత ఆటగాళ్ల సాధన


ప్రజ్ఞానంద, అర్జున్ మధ్య చెస్ గేమ్‌ను పరిశీలిస్తున్న ప్రధాని.


చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాలు సాధించిన భారత పురుషులు, మహిళల జట్లతో మోదీ.

కుల్‌దీపా.. అక్షరా?

కాన్పూర్

బంగ్లాదేశ్‌తో తొలి టెస్టును అలవోకగా చేజిక్కించుకుంది టీమ్‌ఇండియా. సంప్రదాయంగా స్పిన్నర్ల ఆధిపత్యం సాగే చెపాక్ పిచ్.. ఈసారి పేసర్లకు అనుకూలించినప్పటికీ పరిస్థితులకు తగ్గట్లు అన్వయించుకున్న భారత జట్టు బంగ్లాను చిత్తు చేసింది. ఇప్పుడిక కాన్పూర్‌లో శుక్రవారం మొదలయ్యే రెండో టెస్టునూ గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. చెపాక్‌లో పిచ్‌ను సరిగ్గా అంచనా వేసి ఒక స్పిన్నర్‌ను తగ్గించుకుని మూడో పేసర్‌తో ఆడిన భారత్ చక్కటి ప్రయోజనాన్ని పొందింది. కానీ కాన్పూర్ వికెట్‌లో మార్పు ఉండే అవకాశాలు లేవు. ఎప్పట్లాగే స్పిన్నర్లకు సహకారం అందుతుంది. దీంతో ఒక పేసర్‌ను తగ్గించుకుని ఎప్పట్లా ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్ల కూర్పుతో భారత్ బరిలోకి దిగనుందన్నది స్పష్టం. అయితే రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలకు తోడుగా మూడో స్పిన్నర్‌గా ఎవరు అవకాశం దక్కించుకుంటారన్నది ఆసక్తికరం. ఈ స్థానానికి అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్‌ల మధ్య పోటీ నెలకొంది. ఇటీవలి ఫామ్ ప్రకారం చూస్తే కుల్‌దీప్‌కే అవకాశం దక్కాలి. ఏడాది నుంచి వివిధ ఫార్మాట్లలో నిలకడగా రాణిస్తున్నాడు కుల్‌దీప్. ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లాండ్‌తో నాలుగు టెస్టు సిరీస్‌లో 20.15 సగటుతో 19 వికెట్లు పడగొట్టాడు. అతను ఎలాంటి పిచ్ మీదైనా బంతిని బాగా తిప్పగలడు. స్పిన్‌కు సహకరిస్తే మరింతగా రెచ్చిపోతాడు. కుల్‌దీప్ ఓ మోస్తరుగా బ్యాటింగ్ చేయగలడు. అతడితో పోలిస్తే అక్షర్ బ్యాటింగ్‌లో ఎంతో మెరుగు. కానీ భారత్‌కు బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న నేపథ్యంలో అక్షర్ మీద ఆధార పడాల్సిన అవసరం ఉండకపోవచ్చు. పైగా కాన్పూర్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. అక్షర్ లాగే ఎడమ చేతి వాటంతో సంప్రదాయ శైలితోనే బౌలింగ్ చేసే జడేజా జట్టులో ఉన్న నేపథ్యంలో అలాంటి బౌలర్ ఇంకొకరిని తుది జట్టులోకి తీసుకోవడం కష్టమే. అలా చేస్తే బౌలింగ్‌లో వైవిధ్యం కూడా ఉండదు. ఇక టెస్టుల్లో అక్షర్ ఫామ్ కూడా ఇటీవల అంత గొప్పగా లేదు. చివరగా ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో అతను రెండు మ్యాచ్‌లు ఆడి 5 వికెట్లే పడగొట్టి తుది జట్టులో చోటు కోల్పోయాడు. ఈ నేపథ్యంలో కుల్‌దీప్‌కే జట్టు యాజమాన్యం ఓటేసే అవకాశాలు ఎక్కువ. మరోవైపు బంగ్లాదేశ్.. పేసర్ నహిద్ రాణా స్థానంలోకి తైజుల్ ఇస్లామ్‌ను ఎంపిక చేసే సూచనలు కనిపిస్తున్నాయి.


అశ్విన్

అశ్విన్ ముంగిట ఎన్ని రికార్డులో..

టెస్టు క్రికెట్లో ఇప్పటికే అనేక రికార్డులు ఖాతాలో వేసుకున్నాడు రవిచంద్రన్ అశ్విన్. ఇప్పుడు బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు ముంగిట అతడిని పలు రికార్డులు ఊరిస్తున్నాయి. అవేంటంటే..?

- భారత్ తరపున నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అశ్విన్ ఇప్పటికే రికార్డు సృష్టించాడు. మరో వికెట్ తీస్తే వంద వికెట్ల మైలురాయిని అందుకుంటాడు.
- బంగ్లాదేశ్‌పై భారత్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా జహీర్ ఖాన్ (31) కొనసాగుతున్నాడు. అశ్విన్ మరో మూడు వికెట్లు తీస్తే అతణ్ని అధిగమిస్తాడు.
- ప్రస్తుత టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్లో అత్యధిక వికెట్ల వీరుడిగా నిలిచేందుకు అశ్విన్ మరో నాలుగు వికెట్లు పడగొట్టాలి. హేజిల్‌వుడ్ (48)ను అధిగమిస్తాడు.
- కాన్పూర్ టెస్టులో అశ్విన్ 8 వికెట్లు తీస్తే.. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ చరిత్రలో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలరవుతాడు. లైయన్ 187 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు.
- రెండో టెస్టులో ఏదో ఒక ఇన్నింగ్స్‌లో అశ్విన్ 5 వికెట్లు పడగొడితే.. అత్యధికసార్లు అయిదు వికెట్ల ఘనత సాధించిన బౌలర్లలో రెండో స్థానానికి ఎగబాకుతాడు. ప్రస్తుతం అతను వార్న్ (37)తో సమానంగా ఉన్నాడు. మురళీధరన్ (67) అగ్రస్థానంలో ఉన్నాడు.
- కాన్పూర్‌లో అశ్విన్ 9 వికెట్లు తీస్తే.. టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్లలో లైయన్ (520)ను వెనక్కి నెట్టి ఏడో స్థానానికి చేరుకుంటాడు.

చెస్ ఛాంపియన్లకు ప్రధాని ఆతిథ్యం

దిల్లీ

చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాలు గెలిచిన భారత పురుషులు, మహిళల జట్లను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం కలుసుకున్నారు. వైశాలి, హారిక, తానియా సచ్‌దేవ్, విదిత్, అర్జున్ ఇరిగేశి, ప్రజ్ఞానంద సహా క్రీడాకారులతో ఆయన మాట్లాడారు. వారిని అభినందించారు. ప్రధాని సమక్షంలో ప్రజ్ఞానంద, అర్జున్ ఓ గేమ్ కూడా ఆడారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ప్రధానికి చెస్ బోర్డును బహూకరించారు. మరోవైపు చెస్ ఒలింపియాడ్‌లో సత్తా చాటిన భారత జట్లకు అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) రూ.3.2 కోట్ల నగదు బహుమతిని ప్రకటించింది. స్వర్ణం గెలిచిన జట్లలో ఒక్కో ప్లేయర్‌కు రూ.25 లక్షల నగదు బహుమతి అందుతుంది. పురుషులు, మహిళల జట్ల కోచ్‌లు అభిజీత్ కుంతే, శ్రీనాథ్ నారాయణన్‌లకు చెరో రూ.15 లక్షలు ఇస్తారు. భారత బృందం అధిపతి దివ్యేందు బారువా రూ.10 లక్షలు అందుకోనున్నాడు. సహాయ కోచ్‌లకు తలో రూ.7.5 లక్షలు లభిస్తాయి. "హంగేరిలో పసిడి ఆకలి తీరింది. కానీ విజయం సాధించాలన్న ఆకాంక్ష మాత్రం కొనసాగుతూనే ఉంటుంది. చెస్ ఒలింపియాడ్‌లో మన జట్లు ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి" అని ఏఐసీఎఫ్ అధ్యక్షుడు నారంగ్ అన్నాడు.

ప్రధానిని కలవడం కోసం..: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలవడం కోసం గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతి ఓ టోర్నమెంట్ నుంచి వైదొలిగాడు. చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణం గెలిచిన భారత జట్టు సభ్యుడైన విదిత్.. వుగర్ గషిమోవ్ స్మారక చెస్ టోర్నమెంట్లో పోటీపడేందుకు బాకు (అజర్‌బైజాన్) వెళ్లాడు. ఈ టోర్నీలో అతడు డిఫెండింగ్ ఛాంపియన్. కానీ స్వర్ణం గెలిచిన తమ జట్టును ప్రధాని సన్మానిస్తున్నారని తెలిసి వెంటనే స్వదేశానికి రావాలని నిర్ణయించుకున్నాడు. "నేను టోర్నీ కోసం బాకు చేరుకున్నా. కానీ ప్రధాన మంత్రి.. భారత జట్టును సన్మానించాలని అనుకుంటున్నారని తెలిసింది. నాకు చాలా సంతోషం కలిగింది. ప్రధానిని కలవాలనుకున్నా" అని విదిత్ ఎక్స్‌లో పేర్కొన్నాడు. "టోర్నీ నిర్వాహకులు నా పరిస్థితిని అర్థం చేసుకున్నారు. వారికి కృతజ్ఞతలు" అని అన్నాడు. విదిత్ స్థానంలో అరవింద్ ఈ టోర్నీలో ఆడనున్నాడు.

నలుగురు కాదు.. అయిదుగురు!

ఐపీఎల్ జట్లకు మరొకరిని అట్టిపెట్టుకునే అవకాశం



ముంబయి: ఐపీఎల్‌లో మెగా వేలం వచ్చిన ప్రతిసారీ జట్లలో చాలా మార్పులు చేర్పులు చోటు చేసుకుంటాయి. అయితే జట్టు స్వరూపం పూర్తిగా మారిపోకుండా.. తమకు కీలకం అనుకున్న నలుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకునే అవకాశం ఐపీఎల్ జట్లకు ఉంటుంది. అయితే తొలిసారి ఈ నిబంధనలో చిన్న మార్పు చూడబోతున్నాం. ఈసారి ఒకరిని అదనంగా అట్టిపెట్టుకునే అవకాశాన్ని ఐపీఎల్ జట్లకు కల్పించబోతోందట బీసీసీఐ. అట్టిపెట్టుకునే ఆటగాళ్ల సంఖ్యను అయిదుకు పెంచాలని ఫ్రాంఛైజీలు ఎప్పట్నుంచో డిమాండ్ చేస్తుండగా.. కొన్ని కారణాల వల్ల బీసీసీఐ అందుకు అంగీకరించలేదు. కానీ ఈసారి ఈ డిమాండ్‌కు సరే అన్నట్లు సమాచారం. ఇది ముంబయి ఇండియన్స్ లాంటి జట్లకు ఎంతో ప్రయోజనం చేకూర్చేదే. ఆ జట్టు ప్రస్తుత కెప్టెన్ హార్దిక్ పాండ్య, రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్‌లతో పాటు తిలక్ వర్మ, ఇషాన్ కిషన్‌ల్లో ఒకరిని అట్టిపెట్టుకునే అవకాశముంది. రోహిత్‌ను కెప్టెన్‌గా తప్పించిన నేపథ్యంలో అతను తర్వాతి సీజన్‌కు వేరే జట్టుకు వెళ్తాడనే ప్రచారం జరిగింది. ముంబయి కూడా అతణ్ని వదులుకుంటుందని వార్తలొచ్చాయి. కానీ ఇప్పుడు జట్టు యాజమాన్యం, రోహిత్ మధ్య మంచి సంబంధాలే ఉన్నాయని.. అతణ్ని అట్టిపెట్టుకోవాలనే చూస్తున్నారని, రోహిత్ కూడా ఆటగాడిగా జట్టుతో కొనసాగేందుకు సుముఖంగానే ఉన్నాడని తెలుస్తోంది. అట్టిపెట్టుకునే ఆటగాళ్ల సంఖ్యను అయిదుకు పెంచడం కూడా ఈ విషయంలో కలిసి రానుంది.

కాన్పూర్ పిచ్ అందరిదీ: క్యురేటర్

కాన్పూర్: భారత్-బంగ్లాదేశ్ రెండో టెస్టుకు ఆతిథ్యమివ్వనున్న గ్రీన్ పార్క్ స్టేడియం పిచ్ సమతూకంతో ఉంటుందని, అందరికీ సహకరిస్తుందని క్యురేటర్ శివ్ కుమార్ తెలిపాడు. "చెన్నైలో టెస్టు తరహాలోనే ఇక్కడ కూడా అందరికీ పరిస్థితులు సహకరిస్తాయి. తొలి రెండు సెషన్లలో బౌన్స్ ఉంటుంది. తొలి రెండు రోజుల్లో బ్యాటింగ్ చేయడానికి అనువుగా ఉంటుంది. చివరి మూడు రోజులు స్పిన్నర్ల జోరు సాగుతుంది" అని శివ్ చెప్పాడు. చెన్నైలో నాలుగో రోజే ముగిసిన తొలి టెస్టులో భారత్ 280 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. సిరీస్‌లో చివరిదైన రెండో టెస్టు శుక్రవారం ఆరంభమవుతుంది.

'ఆ స్టాండు ప్రమాదకరం'

కాన్పూర్: భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండో టెస్టుకు ఆతిథ్యమిస్తున్న గ్రీన్ పార్క్ స్టేడియంలో ఒక స్టాండు ప్రమాదకరంగా ఉందంటూ ఉత్తర్‌ప్రదేశ్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) నిర్వాహకుల్ని హెచ్చరించింది. సి- స్టాండు బాల్కనీ ఎక్కువ మంది ప్రేక్షకుల బరువు ఆపదని పీడబ్ల్యూడీ పేర్కొన్నట్లు యూపీ క్రికెట్ సంఘం సీఈఓ అంకిత్ ఛటర్జీ పేర్కొన్నాడు. "సి- స్టాండు బాల్కనీ సామర్థ్యం విషయంలో పీడబ్ల్యూడీ కొన్ని అభ్యంతరాలు వ్యక్తంజేసింది. 4,800 సీట్లలో 1700 టిక్కెట్లు మాత్రమే అమ్మాలని సూచించింది. అందుకు మేం అంగీకరించాం. మరమ్మతుల పనులు మరికొన్ని రోజులు కొనసాగుతాయి" అని ఓ పత్రికతో అంకిత్ చెప్పాడు. "ఒకవేళ రిషబ్ పంత్ సిక్సర్ కొడితే 50 మంది అభిమానులు కేరింతలు కొడుతూ ఒక్కసారిగా ఎగిరితే.. ఆ బరువును స్టాండు ఆపలేదు. స్టేడియంలోని ఈ భాగానికి మరమ్మతులు అవసరం" అని పీడబ్ల్యూడీ ఇంజినీర్ అన్నట్లు పత్రిక పేర్కొంది.

పంజాబ్ గెలుపు

దిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్‌లో బుధవారం పంజాబ్ ఎఫ్‌సీ 2-0తో హైదరాబాద్ ఎఫ్‌సీపై విజయం సాధించింది. పంజాబ్ తరఫున ఫిలిప్ (71వ), విదాల్ (35వ) చెరో గోల్ కొట్టారు. పంజాబ్‌కు ఇది వరుసగా మూడో విజయం. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన ఆ జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. హైదరాబాద్ ఎఫ్‌సీ వరుసగా రెండో ఓటమి చవిచూసింది.

బ్రూక్ సెంచరీ..

మూడో వన్డే ఇంగ్లాండ్‌ది


బ్రూక్

చెస్టర్ లీ స్ట్రీట్: ఆస్ట్రేలియాతో అయిదు వన్డేల సిరీస్‌లో అవకాశాలను ఇంగ్లాండ్ సజీవంగా ఉంచుకుంది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (110 నాటౌట్; 94 బంతుల్లో 13×4, 2×6) సెంచరీతో చెలరేగడంతో మూడో వన్డేలో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 46 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలి రెండు వన్డేల్లో కంగారూ జట్టు గెలిచిన సంగతి తెలిసిందే. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 304 పరుగులు సాధించింది. స్టీవ్ స్మిత్ (60; 82 బంతుల్లో 5×4), కామెరూన్ గ్రీన్ (42; 49 బంతుల్లో 4×40), అలెక్స్ కేరీ (77 నాటౌట్; 65 బంతుల్లో 7×4, 1×6), ఆరోన్ హార్డీ (44; 26 బంతుల్లో 3×4, 2×6) రాణించి జట్టు స్కోరును 300 దాటించారు. అనంతరం 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' బ్రూక్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడటంతో లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ దూసుకెళ్లింది. ఒకదశలో 11 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన ఇంగ్లాండ్‌ను.. విల్ జాక్స్ (84; 82 బంతుల్లో 9×4, 1×6), బ్రూక్ మూడో వికెట్‌కు 156 పరుగులు జోడించి పటిష్ఠ స్థితికి చేర్చారు. బ్రూక్, లివింగ్‌స్టోన్ (33 నాటౌట్; 20 బంతుల్లో 2×4, 3×6) అయిదో వికెట్‌కు అజేయంగా 57 పరుగులు జతచేశారు. వర్షం కారణంగా ఆట నిలిచే సమయానికి ఇంగ్లాండ్ 37.4 ఓవర్లలో 4 వికెట్లకు 254 పరుగులు రాబట్టింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం సవరించిన లక్ష్యం (37.4 ఓవర్లలో 209) కంటే ఇంగ్లాండ్ ఎక్కువ పరుగులే చేసింది.

శ్రీకాంత్ ముందంజ


శ్రీకాంత్

మకావు: మకావు ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 300 టోర్నీలో భారత స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ ముందంజ వేశాడు. బుధవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ఆరో సీడ్ శ్రీకాంత్ 21-14, 21-15తో డానిల్ దుబొవెంకో (ఇజ్రాయెల్)పై నెగ్గి ప్రిక్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. ఆయుష్ శెట్టి 21-13, 21-15తో ఆలాప్ మిశ్రాపై గెలిచి ప్రిక్వార్టర్స్ చేరుకున్నాడు. చిరాగ్ సేన్ 12-21, 17-21తో లాంగ్ ఆగ్నస్ (హాంకాంగ్) చేతిలో, శంకర్ ముత్తుసామి 14-21, 21-10, 12-21తో పనిచఫోన్ (థాయ్‌లాండ్) చేతిలో, సమీర్‌వర్మ 21-18, 11-21, 13-21తో వాంగ్ జెంగ్ (చైనా) చేతిలో, మిథున్ మంజునాథ్ 12-21, 15-21తో హువాంగ్ కాయ్ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం చవిచూశారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో తస్నిమ్ మీర్ 15-21, 21-18, 22-20తో దేవిక సిహాగ్‌పై గెలిచి ప్రిక్వార్టర్స్ చేరుకుంది. అనుపమ ఉపాధ్యాయా 12-21, 22-20, 7-21తో రికో గుంజి (జపాన్) చేతిలో, తాన్యా హేమంత్ 18-21, 19-21తో లియాంగ్ టింగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో సుమీత్‌రెడ్డి- సిక్కిరెడ్డి జోడీ 24-22, 10-21, 21-13తో బింగ్ కున్- హో లో (మలేసియా) జంటపై విజయం సాధించింది. రోహన్ కపూర్- రుత్విక శివాని జోడీ 21-23, 22-24తో రుతనపక్- జెనిచ (థాయ్‌లాండ్) జంట చేతిలో పోరాడి ఓడింది.


ముంబయిలో టెన్నిస్ ప్రీమియర్ లీగ్ వేలం సందర్భంగా లియాండర్ పేస్, సానియా మీర్జా, మహేష్ భూపతి

మళ్లీ టాప్ 10లోకి పంత్


పంత్


దుబాయ్: టెస్టు పునరాగమనంలో సూపర్ శతకం సాధించిన టీమ్‌ఇండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో తిరిగి టాప్-10లో చోటు సంపాదించాడు. అతను ఆరో స్థానంలో నిలిచాడు. యశస్వి జైస్వాల్ అయిదో ర్యాంకుకు ఎగబాకాడు. కెప్టెన్ రోహిత్ శర్మ అయిదు స్థానాలు కోల్పోయి పదో స్థానంలో నిలిచాడు. 5 స్థానాలు కోల్పోయిన కోహ్లి.. 12వ స్థానంలో ఉన్నాడు. జో రూట్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. విలియమ్సన్‌కు రెండో ర్యాంకు, మిచెల్‌కు మూడో ర్యాంకు దక్కాయి. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అశ్విన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. బుమ్రా రెండో స్థానంలో ఉన్నాడు. జడేజా (6) కూడా టాప్-10లో ఉన్నాడు. వన్డే బ్యాటర్ల జాబితాలో రోహిత్ (2వ), గిల్ (3వ), కోహ్లి (4వ) టాప్-10లో ఉన్నారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో కుల్‌దీప్ యాదవ్ మూడో స్థానంలో నిలిచాడు. బుమ్రా 8వ స్థానంలో ఉన్నాడు.

అందుకే రిటైరయ్యా..


ధావన్

జోధ్‌పూర్: జాతీయ జట్టులో స్థానం కోసం దేశవాళీ క్రికెట్లో ఆడే ప్రేరణ లేకపోవడం వల్లే రిటైరయ్యానని టీమ్‌ఇండియా మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ చెప్పాడు. 38 ఏళ్ల ధావన్ గత నెలలో అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. "నేను దేశవాళీ క్రికెట్ ఆడాలనుకోలేదు. అందులో ఆడాలనే ఉత్తేజం నాలో లేదు" అని అన్నాడు. "నా కెరీర్ చివరి రెండేళ్లలో నేను పెద్దగా అంతర్జాతీయ క్రికెట్ ఆడలేదు. ఐపీఎల్‌లో మాత్రమే ఆడా. మొత్తంగా ఆ రెండేళ్లలో నేను ఆడింది తక్కువ" అని ధావన్ చెప్పాడు. "ఇక చాలు, చాలా క్రికెట్టే ఆడాననుకున్నా. విరామం కావాలనిపించింది. ఎక్కువగా క్రికెట్ ఆడకపోవడంతో అంతగా ఫామ్‌లో కూడా లేను" అని అన్నాడు. "నేను సంతోషంగా ఉన్నా. కెరీర్‌లో సాధించిన దాని పట్ల సంతృప్తి చెందా. ప్రపంచకప్ గెలిస్తే బాగుండేదనుకోండి" అని ధావన్ చెప్పాడు. రోహిత్ శర్మ గొప్ప కెప్టెనని అతడు అన్నాడు. "రోహిత్ గొప్ప కెప్టెన్. కెప్టెన్‌గా అతడు దేశానికి ప్రపంచకప్‌ను అందించినందుకు సంతోషంగా ఉంది. చాలా కాలం ప్రపంచకప్ కోసం ఎదురుచూశాం. టైటిల్‌కు చేరువయ్యాం కూడా. ఇప్పుడు టీ20 ప్రపంచకప్‌తో లక్ష్యాన్ని అందుకున్నాం" అని ధావన్ చెప్పాడు. ధావన్ టీమ్‌ఇండియా తరఫున 34 టెస్టులు, 167 వన్డేలు, 68 టీ20 మ్యాచ్‌లు ఆడాడు.

ఆయన అడిగితే కాదనగలనా!



బెన్ స్టోక్స్

చెస్టర్ లీ స్ట్రీట్: పరిమిత ఓవర్ల క్రికెట్లోకి పునరాగమనం చేయాలని తమ కోచ్ బ్రెండన్ మెక్‌కలమ్ అడిగితే తాను కాదని అనలేనని ఇంగ్లాండ్ టెస్టు జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ అన్నాడు. కోచ్ అయ్యాక బజ్‌బాల్ విధానంతో ఇంగ్లాండ్ టెస్టు జట్టును అత్యున్నత స్థాయికి తీసుకెళ్లిన మెక్‌కలమ్.. త్వరలోనే ఇంగ్లాండ్ వన్డే, టీ20 జట్లకూ శిక్షకుడిగా బాధ్యతలు అందుకోబోతున్నాడు. మరోవైపు టెస్టు సారథి అయ్యాక ఆ ఫార్మాట్‌కే ప్రాధాన్యమిస్తూ నెమ్మదిగా వన్డే, టీ20 జట్లకు స్టోక్స్ దూరమయ్యాడు. అయితే మెక్‌కలమ్ వన్డే, టీ20 జట్లకూ కోచ్‌గా మారిన నేపథ్యంలో అతను కోరితే పరిమిత ఓవర్ల క్రికెట్లోకి పునరాగమనం చేస్తానని స్టోక్స్ అంటున్నాడు. "నాకు మెక్‌కలమ్ ఫోన్ చేసి 'నువ్వు ఈ ఫార్మాట్లలోకి తిరిగొస్తావా' అని అడిగితే కచ్చితంగా 'సరే' అనే చెబుతా. కానీ మెక్‌కలమ్ నన్నలా అడక్కపోయినా నేను నిరాశ చెందను. ప్రశాంతంగా కూర్చుని మా జట్టు ఆటను ఆస్వాదిస్తా. మా మధ్య దీని గురించి ఇప్పటిదాకా ఏ చర్చా జరగలేదు. నేను పరిమిత ఓవర్ల క్రికెట్లో ఇంగ్లాండ్ తరఫున చాలా మ్యాచ్‌లు ఆడాను. నేను ఆ ఫార్మాట్లలో సాధించిన దాని పట్ల చాలా సంతోషంగా ఉన్నా" అని స్టోక్స్ చెప్పాడు.

కొత్త ఎన్‌సీఏ అద్భుతం: వెంగీ

దిల్లీ: బెంగళూరులో కొత్తగా నిర్మించిన జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో సదుపాయాలు అద్భుతంగా ఉన్నాయని భారత మాజీ కెప్టెన్, బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు దిలీప్ వెంగ్‌సర్కార్ అన్నాడు. వెంగ్‌సర్కార్ గతవారం బెంగళూరు వెళ్లి అకాడమీని చూశాడు. కొత్త ఎన్‌సీఏలో మూడు మైదానాలు, 45 ప్రాక్టీస్ పిచ్‌లు, ఎనిమిది ఇండోర్ నెట్స్, ఒలింపిక్ పరిమాణంలో స్విమ్మింగ్‌పూల్, పెద్ద జిమ్, పునరావాస కేంద్రం ఉన్నాయి. "గత వారంలో ఎన్‌సీఏకి వెళ్లా. మౌలిక సదుపాయాలు అద్భుతంగా ఉన్నాయి. మైదానాలు పెద్దవి. అకాడమీ దాదాపు సిద్ధమైంది. ఇప్పుడు అకాడమీలో పనులన్నీ పూర్తి అయ్యుంటాయి" అని వెంగీ అన్నాడు. కొత్త ఎన్‌సీఏను శుక్రవారం ఆరంభించనున్నారు.

ఈనాడు



విజయవాడ 26-9-2024 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 47

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అంతా ఒక్కటై కదిలాం



వరద బాధితురాలు టి.కుమారికి విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఆర్థికసాయం లేఖ అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

రూ. 400 కోట్ల విరాళాలు అందాయి

స్పందించిన అందరికీ కృతజ్ఞతలు

రాష్ట్రంలో వరద బాధితులకు రూ.602 కోట్ల విడుదల

బ్యారేజీ విధ్వంసానికే వైకాపా కుట్ర

ఎంతటి వారైనా.. అరెస్టు చేసి తీరుతాం: సీఎం చంద్రబాబు

ఈనాడు, ఈనాడు డిజిటల్ - అమరావతి: 'ఇటీవల కురిసిన వర్షాలు రాష్ట్రంలో అనేక ప్రాంతాలను అతలాకుతలం చేశాయి. భారీస్థాయిలో నష్టం సంభవించింది. విజయవాడ నగరంలోకి ఓ వైపు వర్షం నీరు వస్తుంటే.. మరో వైపు బుడమేరు వరద పోటెత్తింది. అధికార యంత్రాంగంతోపాటు నేనూ స్వయంగా వరదలో దిగాను. పదిరోజుల పాటు మంత్రులు, ఉన్నతాధికారులు.. అంతా ఒక్కటై పని చేశాం. విపత్తు నుంచి బయటపడ్డాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు పరిహారం అందించే కార్యక్రమాన్ని బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. కొంత మంది లబ్ధిదారులకు సీఎం చేతులమీదుగా ఆర్థికసహాయం పంపిణీ లేఖలు అందించారు. రాష్ట్రంలో మొత్తం రూ.602 కోట్ల పరిహారం విడుదల చేసినట్లు సీఎం ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు విలేకర్లకు వివరాలు వెల్లడించారు.

అర్హులు అందరికీ సాయం అందిస్తాం

'సంఘటితంగా ఉంటే ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోగలమని చేసి చూపించాం. ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.400 కోట్ల మేర విరాళాలు వచ్చాయి. నడవలేనివారు సైతం వీల్‌ఛైర్‌లో

(మిగతా 2లో)

పదవులు దక్కని వారికి... తొందరపాటు మంచిది కాదు

ఇంకా నామినేటెడ్ పోస్టులున్నాయి.. లిస్టులొస్తాయి

సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

నామినేటెడ్ పదవులు పొందిన వారితో భేటీ

ప్రతి కదలికా, మాటా, పనీ.. హుందాగా ఉండాలని సూచన

పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం

అందుకోసం ఏపీఐసీడీబీ ఏర్పాటు: సీఎం చంద్రబాబు 3లో



వరద బాధితులకు ఆర్థిక సాయం లేఖల పంపిణీ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, బాధితులతో సమావేశమైన సీఎం చంద్రబాబు.. వేదికపై మంత్రి పి.నారాయణ, సీఎస్ నీరబ్‌కుమార్‌ప్రసాద్, మంత్రులు పయ్యావుల కేశవ్, అనిత, సంధ్యారాణి

జీడిపప్పు, యాలకులూ నాసిరకమే



- అత్యవసరం పేరుతో అస్మదీయ గుత్తేదారుల నుంచి అధిక ధరలకు కొనుగోళ్లు
- ఐదేళ్ల వైకాపా పాలనలో తిరుమల కొండపై అడుగడుగునా అవకతవకలే
- విజిలెన్స్ విచారణలో విస్తుపోయే అంశాలు.. త్వరలో ప్రభుత్వానికి నివేదిక

ఈనాడు - తిరుపతి, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దర్యాప్తులో విస్తుపోయే అంశాలు వెలుగుచూసినట్టు తెలిసింది. నెయ్యి కల్తీ మాత్రమే కాదని.. స్వామివారి ప్రసాదాల్లో జీడిపప్పు, యాలకులు, కిస్‌మిస్ వంటివన్నీ నాసిరకమే వాడేవారని, చాలా వస్తువుల కొనుగోళ్లలో గోల్‌మాల్ జరిగిందని వెల్లడైనట్టు సమాచారం. అస్మదీయ గుత్తేదారుల నుంచి వాటిని అధిక ధరలకు కొనేవారని తేలింది. నిబంధనల ప్రకారం 8 మి.మీ. పరిమాణం ఉన్న యాలకులు సరఫరా చేయాల్సి ఉండగా... గుత్తేదారులు 4 మి.మీ. ఉన్నవి కలిపేసి ఇచ్చినా.. అప్పటి తితిదే పాలకమండలి, కొనుగోళ్ల కమిటీ పట్టించుకోలేదని విజిలెన్స్ విభాగం గుర్తించింది. గుత్తేదారులు బస్తాల్లో కిందంతా నాసిరకం సరకు నింపేసి, పైపైన నాణ్యమైన సరకులు పెట్టి పంపేవారని సమాచారం. నాణ్యమైన సరకు నుంచే నమూనాలు తీసుకుని తిరుమలలో ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షించి, అంతా బాగున్నట్టు ధ్రువీకరించేవారని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. విజిలెన్స్ విభాగం వారం రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

(మిగతా 2లో)

కల్తీ నెయ్యి వ్యవహారంలో.. ఏఆర్ డెయిరీ ఫుడ్స్‌పై కేసు

ప్రసాదాల తయారీకి జంతు కొవ్వు కలిసిన నెయ్యి సరఫరా చేసిందని తితిదే ఫిర్యాదు

కల్తీ గురించి తెలియక 4 ట్యాంకర్లు వాడేశాం

అనుమానం వచ్చి నమూనాలు బయటి ల్యాబ్‌కు పంపాం

స్వార్థపరశక్తులతో కలసి నేరపూరిత కుట్రకు పాల్పడిందని పేర్కొన్న తితిదే జీఎం మురళీకృష్ణ

లోపలి పేజీలో

వేంకటనాథా... క్షమించు స్వామీ!

-ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖ శర్మ ప్రత్యేక వ్యాసం సంపాదకీయం పేజీలో

నిఘా విభాగం ఐజీగా పీహెచ్‌డీ రామకృష్ణ

- పీ అండ్ ఎల్‌కు ఎం.రవిప్రకాశ్
- వినీత్ బ్రిజ్‌లాల్ సీఐడీకి
- అనకాపల్లి ఎస్పీగా తుహిన్ సిన్హా
- మేరీ ప్రశాంతికి విశాఖ డీసీపీ పోస్టు
- వెయిటింగ్‌లోని ఏడుగురు ఐపీఎస్‌లకు పోస్టింగ్‌లు
- రాష్ట్రంలో 15 మంది ఐపీఎస్‌లు, ఒక నాన్ క్యాడర్ ఎస్పీ బదిలీ



రామకృష్ణ రవిప్రకాశ్ బ్రిజ్‌లాల్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో 15 మంది ఐపీఎస్ అధికారులు, ఒక నాన్ క్యాడర్ ఎస్పీని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం బదిలీ చేసింది. నిఘా విభాగం ఐజీగా పీహెచ్‌డీ రామకృష్ణను, ప్రొవిజెన్స్ అండ్ లాజిస్టిక్స్ విభాగం ఐజీగా ఎం.రవిప్రకాశ్‌ను నియమించింది. ఎస్ఐబీ ఐజీగా ఉన్న వినీత్ బ్రిజ్‌లాల్‌ను సీఐడీకి పంపించింది. అనకాపల్లి ఎస్పీగా తుహిన్ సిన్హాకు పోస్టింగు ఇచ్చింది. ప్రస్తుతం ఆ స్థానంలో కొనసాగుతున్న ఎం.దీపికను కాకినాడ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేసింది. ఆమె భర్త విక్రాంత్ పాటిల్ కాకినాడ ఎస్పీ. దీంతో ఆమె వినతి మేరకు ఈ బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న డి.మేరీప్రశాంతిని విశాఖపట్నం శాంతిభద్రతల విభాగం డీసీపీగా కీలక స్థానంలో నియమించారు. నిఘా విభాగం ఎస్పీ అట్టాడ బాబూజీని అక్కడి నుంచి బదిలీ చేశారు. ఎక్కడా పోస్టింగు ఇవ్వలేదు. పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయన గత ఐదేళ్లు నిఘా విభాగంలోనే ఉన్నారు. ఈ మేరకు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

■ గత కొన్ని నెలలుగా వెయిటింగ్‌లో ఉన్న డీఐజీలు ఆర్.ఎన్.అమ్మిరెడ్డి, సీహెచ్.విజయరావు, ఎస్పీలు సిద్దార్థ కౌశల్, డి.మేరీ ప్రశాంతి, జీఆర్.రాధిక, కె.ఆరిఫ్ హఫీజ్, కె.తిరుమలేశ్వర్‌రెడ్డిలకు వివిధ విభాగాల్లో ప్రభుత్వం పోస్టింగులిచ్చింది. అమ్మిరెడ్డి, సీహెచ్.విజయరావు, కె.తిరుమలేశ్వర్‌రెడ్డి, కె.అరిఫ్ హఫీజ్‌లు వైకాపా నాయకులతో అంటకాగుతూ, ఆ పార్టీకి అనుకూలంగా పనిచేశారన్న ఫిర్యాదులున్నాయి.

(మిగతా 2లో)

చెన్నైలో ఓ వీధికి ఎస్పీబీ పేరు



చెన్నై, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంస్మరణార్థం ఆయన నివాసం ఉన్న చెన్నై నుంగంబాక్కంలోని కాందార్‌నగర్ రోడ్డుకు 'ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం రోడ్డు' అని పేరు పెట్టనున్నట్లు తమిళనాడు సీఎం స్టాలిన్ బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో.. ఎస్పీబీ పలు భాషల్లో 40వేలకు పైగా పాటలు పాడారని, పలు చిత్రాలకు సంగీతం సమకూర్చారని గుర్తుచేసుకున్నారు. అంతే కాకుండా సినిమాల్లోనూ నటించి మెప్పించారన్నారు. తమిళ చిత్రసీమకు ఆయన చేసిన సేవలు మరువలేనివని సీఎం పేర్కొన్నారు.

ప్రభుత్వ విధానాలపై జనంలోకి వెళదాం



అబద్ధాలతో తిరుమలను అపవిత్రం చేస్తున్నారు

పాప ప్రక్షాళనకు 28న దేవాలయాల్లో పూజలు

జిల్లా నేతలతో భేటీల్లో జగన్ 11లో

28నే తిరుమల దర్శనానికి వైకాపా అధినేత

మిథున్ రెడ్డి గుప్పిట్లోని మద్యం కంపెనీకే భారీ ఆర్డర్లు



విజయసాయిరెడ్డి అల్లుడి బినామీ సంస్థ ఆదాన్ డిస్టిలరీస్‌కూ ఎక్కువే!

అస్మదీయ, కమీషన్లు చెల్లించిన కంపెనీలకే 90% • బేసిక్ ప్రైస్ పెంచేసి అనుచిత లబ్ధి

జగన్ హయాంలో మద్యం కొనుగోలులో దోపిడీపై సీఐడీకి కీలక ఆధారాలు

మిథున్‌రెడ్డి సహా మరికొందరిని నిందితులుగా చేర్చే అవకాశం • బెవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయంలో రెండో రోజూ సోదాలు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వం.. పార్టీలో నంబర్-2గా చలామణీ అయిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి.. నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌ను తన గుప్పిట్లో పెట్టుకుని 'జే బ్రాండ్లు' ఉత్పత్తి చేసినట్లు, ఇక్కడ తయారు చేసిన మద్యానికే (బ్రాండ్లకే) అత్యధికంగా సరఫరా ఆర్డర్లు లభించినట్లు సీఐడీ దర్యాప్తు చేసి తేల్చింది.. వైకాపా అధికారం చేపట్టాక ఆదాన్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటైందని, ఇది వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి అల్లుడైన రోహిత్‌రెడ్డి బినామీ సంస్థ అని గుర్తించింది. దీనికి సొంతంగా ఒక్క డిస్టిలరీ లేకపోయినా విశాఖ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్, పీఎంకే డిస్టిలేషన్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌లను సబ్‌లీజు పేరిట బలవంతంగా ఆధీనంలోకి తీసుకుని అక్కడ ఉత్పత్తి చేసిన బ్రాండ్లను సరఫరా చేసినట్లు ఆధారాలను సేకరించింది. నాణ్యత లేని, నాసిరకమైన జే బ్రాండ్లను ప్రవేశపెట్టి ప్రజల ప్రాణాలను పణంగా పెట్టారన్న ఫిర్యాదులపై రెండు రోజుల కిందట కేసు నమోదు చేసిన సీఐడీ అధికారులు.. నిందితుల జాబితాలో వివరాలు తెలియని వ్యక్తులు (అన్ నోన్) అని పేర్కొన్నారు. దర్యాప్తులో వెలుగు చూసిన అంశాల ఆధారంగా మిథున్‌రెడ్డితో పాటు పలువురు అధికారులు, డిస్టిలరీల

(మిగతా 2లో)

లోపలి పేజీల్లో

జమ్మూ కశ్మీర్‌లో 56.05% పోలింగ్

• 2014 కంటే తక్కువే..



ఎదురులేని భారత్


ప్రపంచాభివృద్ధికి మనమే చుక్కాని: ప్రధాని మోదీ

పోలవరంలో కీలక వర్క్‌షాపు అక్టోబరు 20న

విదేశీ నిపుణుల బృందం ప్రతిపాదన మేరకు ఏర్పాటు

సాంకేతిక అంశాలపై తుది నిర్ణయాలక్కడే

ఇదీ సంగతి!



కృత్రిమ ఆక్సిజన్ కూడా ఇమ్మంటున్నారు సార్!

దివ్యాంగ విద్యార్థుల ఖాతాల్లోకి పింఛను నగదు



దూరప్రాంతాల్లో చదువుకునేవారికి వెసులుబాటు

నవంబరు నుంచి అమల్లోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు

ఈనాడు, అమరావతి: నివాస ప్రాంతానికి దూరంగా వసతి గృహాలు, గురుకులాల్లో చదువుకుంటూ సామాజిక భద్రత పింఛను తీసుకునేందుకు విద్యార్థులు ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులకు రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. పింఛను తీసుకునేందుకు ప్రతి నెలా సెలవు పెట్టి ఇళ్లకు వెళుతూ పడుతున్న ఇక్కట్లను తొలగించేందుకు వారి బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేయాలని నిర్ణయించింది. వైకాపా ప్రభుత్వంలో ఈ సమస్యను పరిష్కరించాలని అప్పట్లో తల్లిదండ్రులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. రెండు రోజుల క్రితం దివ్యాంగుల సంక్షేమశాఖపై జరిగిన తొలి సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విధానానికి ఆమోదం తెలిపారు. నవంబరు 1వ తేదీన ఇలాంటి విద్యార్థులకు పింఛన్ నగదును బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పట్టించుకోని వైకాపా ప్రభుత్వం...

రాష్ట్రవ్యాప్తంగా 8.50 లక్షల మంది దివ్యాంగుల కోటాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రత పింఛన్లను ప్రతి నెలా తీసుకుంటున్నారు. వయసుతో సంబంధం లేకుండా 45 శాతం వైకల్యం పైబడిన వారికి వివిధ విభాగాల్లో రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు ప్రభుత్వం పింఛను అందిస్తోంది. ఇందులో దాదాపుగా 10 వేల మంది విద్యార్థులు గురుకులాలు, వసతి గృహాల్లో చదువుకుంటూ పింఛను తీసుకుంటున్నారని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటున్న విద్యార్థులూ ఉన్నారు. వైకాపా ప్రభుత్వంలో రెండు, మూడు నెలల మొత్తాన్ని ఒకేసారి తీసుకునే వెసులుబాటును రద్దు చేయడంతో ఇలాంటి విద్యార్థులు పింఛను తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటు, వ్యయ ప్రయాసలకు గురయ్యారు. అప్పట్లో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు.

(మిగతా 2లో)

నేలలు బీలు.. చేపలు ఎండి..



కోస్తా జిల్లాలను వర్షాలు వణికించినప్పటికీ.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలు నీటి చుక్క కోసం ఇంకా నింగి వైపు చూస్తూనే ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇక్కడ ఆశించిన మేర వర్షాలు కురవక రైతన్నలు అల్లాడుతున్నారు. పొలాలే కాదు.. చెరువులూ బీటలువారి కరవు పరిస్థితులకు దర్పణంగా నిలుస్తున్నాయి. చిత్తూరులోని కట్టమంచి చెరువు అడుగంటి ఇలా నెర్రెలిడింది. చేపలూ మృత్యువాతపడి ఎండిపోయాయి. వర్షాధారంగా సాగుచేసే వేరుసెనగ తదితర పంటలూ ఎండిపోయాయి.

-ఈనాడు, చిత్తూరు

దివ్యాంగ విద్యార్థుల ఖాతాల్లోకి పింఛను నగదు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైతే విద్యార్థులు ఉండే వసతి గృహాలు, గురుకులాల పరిధిలోని సచివాలయాలకు పింఛను మార్పు చేసుకోవచ్చని చెప్పి మిన్నకుంది. కొత్త ప్రభుత్వం ఈ సమస్యకు పరిష్కారం చూపించింది.

గ్రామ, వార్డు సచివాలయ ద్వారా అర్హుల గుర్తింపు

ఈ వెసులుబాటు కేవలం దూర ప్రాంతాల్లో చదువుకుంటున్న వారికే పరిమితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదీ కూడా తమకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసేందుకు సమ్మతి తెలిపిన వారికే వర్తింప చేయనుంది. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అర్హులను గుర్తించనుంది.

ఎర్రమట్టి దిబ్బల రక్షణకు హైకోర్టు కీలక ఉత్తర్వులు

తవ్వకాలను వెంటనే నిలువరించాలని ఆదేశం



ఈనాడు, అమరావతి: విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం నేరెళ్లవలస గ్రామ పరిధిలోని సాంస్కృతిక వారసత్వ సంపద అయిన ఎర్రమట్టి దిబ్బలను రక్షించేందుకు హైకోర్టు బుధవారం కీలక ఉత్తర్వులిచ్చింది. అక్కడి తవ్వకాలను వెంటనే నిలువరించి ఆ ప్రాంతాన్ని రక్షించాలని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) అధికారులను ఆదేశించింది. మట్టి తవ్వకాలను నిలువరిస్తూ స్టాప్ వర్క్ ఆర్డర్‌ను తు.చ. తప్పకుండా అమలు చేయాలని తేల్చిచెప్పింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, విశాఖ జిల్లా కలెక్టర్, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, జిల్లా అటవీశాఖ అధికారి, భీమునిపట్నం తహశీల్దార్, భీమునిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

■ భీమునిపట్నం మండలం నేరెళ్లవలస గ్రామ పరిధిలోని ఎర్రమట్టి దిబ్బలను విధ్వంసం నుంచి రక్షించాలని, వాటిని వారసత్వ సంపదగా ప్రకటిస్తూ జియోలాజికల్ సర్వే 2014లో ఇచ్చిన నోటిఫికేషన్ అమలయ్యేలా చూడాలని కోరుతూ జనసేన కార్పొరేటర్ పీవీఎల్ఎన్ మూర్తియాదవ్ హైకోర్టులో ఈ పిల్ వేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్.మూర్తి వాదనలు వినిపిస్తూ.. ఇళ్ల నిర్మాణం కోసం భీమునిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి భూములు కేటాయించారని, అందులో భాగంగా ఎర్రమట్టి దిబ్బలను తవ్వేస్తున్నారన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది తిరుమాని విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ.. ఇళ్ల నిర్మాణం కోసం సంబంధిత సొసైటీకి 373 ఎకరాలు కేటాయిస్తూ 2012లో జీవో ఇచ్చారన్నారు. 91 ఎకరాలను ఇంకా వినియోగించలేదని, అక్కడి తవ్వకాలను నిలువరిస్తూ జీవీఎంసీ ఇప్పటికే ఉత్తర్వులిచ్చిందన్నారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. అక్కడి తవ్వకాలను నిలువరించాలని అధికారులను ఆదేశించింది.

అంతా ఒక్కటై కదిలాం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చి సహాయం చేశారు. పిల్లలు తమ కిడ్డీబ్యాంకుల్లో సొమ్మును ఇచ్చారు. గతంలో లేని విధంగా అందరూ స్పందించారు. మానవతావాదంతో స్పందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఆ నిధులన్నింటినీ సద్వినియోగం చేస్తాం. రాష్ట్రంలో వరద బాధితులకు రూ.602 కోట్లు విడుదల చేశాం. ఇంకా అర్హులు ఉన్నా... వారికీ అందిస్తాం. విజయవాడలో 13వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించాను. అదే సమయంలో అన్యాయం, అవినీతికి పాల్పడితే క్షమించేది లేదు. విజయవాడ 38వ డివిజన్‌లో కొంతమంది ఆందోళన చేశారు. వాస్తవానికి అక్కడ ముంపు లేదు. దీనివెనుక కొందరు వ్యక్తులు ఉండి నడిపించారు. ఒక వర్గం మీడియా పిచ్చి రాతలు రాస్తుంది. దీన్ని సహించేది లేదు' అని హెచ్చరించారు.

తప్పు చేసినవారిని వదిలేది లేదు

'బుడమేరుతో పాటు ప్రకాశం బ్యారేజీకి ఈ స్థాయిలో వరద ఎప్పుడూ రాలేదు. బ్యారేజీకి 11.90 లక్షల క్యూసెక్కుల వరద సామర్థ్యం ఉంటే 11.47 లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చింది. గత పాలకుల నిర్లక్ష్య వైఖరి.. విజయవాడ వరద ముంపునకు కారణమైంది. బుడమేరును అన్యాక్రాంతం చేశారు. బుడమేరు కట్టపై వరద ప్రవాహానికి అవరోధంగా నిర్మాణాలు చేపట్టారు. త్వరలో ఆపరేషన్ బుడమేరు చేపడతాం. ఆక్రమణలు తొలగిస్తాం' అని స్పష్టం చేశారు. 'ప్రకాశం బ్యారేజీని ధ్వంసం చేసేందుకు కుట్రపన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా వరద వస్తుంటే.. వైకాపా నేతలు 40 టన్నుల మేర సామర్థ్యం ఉన్న మూడు పడవలను లంకె వేసి వదిలిపెట్టారు. అవి బ్యారేజీ కౌంటర్ వెయిట్లను ఢీకొన్నాయి. అదే పిల్లర్లను ఢీకొంటే.. ఎంత ప్రమాదం జరిగేది? ఇలాంటి కుట్రలు వైకాపా చేసింది. ఆ పడవలన్నీ వైకాపావే. తప్పు జరిగిందని క్షమాపణలు చెప్పాల్సింది పోయి.. తిరిగి దబాయిస్తారా? తప్పుచేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు. కఠినంగా శిక్షిస్తాం. జాగ్రత్తగా లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటివారైనా.. అరెస్టు చేసి తీరుతాం. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. అనంతపురంలో రథాన్ని దహనం చేశారు. వారి అరాచకాలకు అంతు లేకుండా పోతోంది..! ఇలాంటి అరాచకాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయి' అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. 'అర్హులైన ప్రతి ఒక్కరికీ వరద సహాయం అందుతుంది. కానీ, అర్హత లేకపోయినా.. కొంతమంది నాయకుల ప్రోత్సాహంతో ఆందోళనలకు దిగితే సహించను' అని మందలించారు.

సాయం పెంచాం

గతంలో ఎన్నడూలేని విధంగా వరద నష్టపరిహారం పెంచాం. రాష్ట్రంలో రూ.6,800 కోట్ల మేర ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం జరిగింది. 16 జిల్లాలు ప్రభావితం అయ్యాయి. మొత్తం 4లక్షల మంది బాధితులకు సహాయం అందించాం. కిరాణా దుకాణాలకు రూ.20 వేలు, తోపుడు బండ్లకు రూ.20 వేలు, చేనేత, చేతి వృత్తిదారులకు రూ.25 వేలు చొప్పున సహాయం చేస్తున్నాం. ఇల్లు మునిగినవారికి రూ.25 వేలు, మొదటి అంతస్తులో ఉన్నవారికి రూ.10వేల చొప్పున సాయం చేస్తున్నాం. ఎస్‌డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం ఉన్న పరిహారం కంటే రెట్టింపు ఇచ్చాం. ఇంటికి రూ.11 వేలు ఉంటే రూ.25 వేలు చేశాం. పరిశ్రమలకు టర్నోవర్ స్థాయి బట్టి రూ.50 వేలు, రూ.లక్ష, రూ.1.50 లక్షలు అందించాం. వరికి రూ.25 వేలకు పెంచాం. ఇతర పంటలకూ పరిహారం పెంచి ఇస్తున్నాం' అని వివరించారు. చిన్న దుకాణాల వారికి విచారణ చేసి ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చానన్నారు.

బటన్ నొక్కలేదు

వరద బాధితులకు పరిహారం అందించే కార్యక్రమం సమీక్ష అనంతరం పలువురికి ప్రభుత్వం నుంచి లేఖలు అందించారు. లబ్ధిదారుల ఖాతాలో నేరుగా పరిహారం జమచేస్తున్నట్లు ప్రకటించిన చంద్రబాబు తాను బటన్ నొక్కలేదని... అలాంటివాటికి తాను దూరమని ఛలోక్తి విసిరారు. దీంతో సమావేశంలో నవ్వులు విరిశాయి.

ఈనెల 30వ తేదీలోగా పరిష్కారం

'అందరికీ ఈ నెల 30లోగా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. విజయవాడలో 18వేల మంది బాధితులు నష్టపరిహారం కోసం వినతులిచ్చారు. అందులో 13,300 మంది బాధితులుగా ఉన్నారు. మరోసారి నిర్ధారించుకుని మిగిలినవారికీ అందిస్తాం. ముంపు ప్రాంతాల్లోని ఇళ్లలో పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా 50% బాగుచేయగలిగాం. 15వేల గ్యాస్ పొయ్యిలకు మరమ్మతులు చేయించాం. వాహనాలకు, గృహోపకరణాలకు బీమా క్లెయిమ్‌లను చేయించాం. బ్యాంకుల ద్వారా బాధితులకు రుణాలు అందిస్తున్నాం. ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు పాఠ్యాంశ, నోట్ పుస్తకాలు అందిస్తున్నాం. వరద కారణంగా పోయిన సర్టిఫికెట్లు మంజూరు చేస్తాం. వరద ప్రాంతాల్లో ఉన్న చిన్న చిన్న సమస్యలను ఈనెల 30వ తేదీలోగా పరిష్కరిస్తాం' అని ముఖ్యమంత్రి తెలిపారు. అంతకుముందు రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులతో శాఖల వారీగా సీఎం చంద్రబాబు సమీక్షించారు. బీమా క్లెయిమ్‌ల పరిష్కారం, బ్యాంకుల రుణాల రీషెడ్యూల్, ఎలక్ట్రానిక్ పరికరాల మరమ్మతులు, అంశాల వారీగా సమీక్షించారు.

జీడిపప్పు, యాలకులూ నాసిరకమే..!

(మొదటి పేజీ తరువాయి)

■ వైకాపా అధికారంలోకి వచ్చేనాటికి తితిదేకి వివిధ సరకులు సరఫరా చేస్తున్న గుత్తేదారుల్లో పాలకమండలి పెద్దలకు గిట్టనివారిని వేధించి బయటకు పంపేసినట్టు దర్యాప్తులో తేలింది. అత్యవసరం పేరుతో వారికి కావలసిన వారికి అధిక ధరలు చెల్లించి సరకులు కొన్నట్లు గుర్తించింది. సింగిల్‌బిడ్ దాఖలై, వేసినవారు బయటివాళ్లయితే... టెండర్ రద్దు చేసేవారని, అదే కావలసినవాళ్లు సింగిల్ బిడ్ దాఖలుచేసినా వారికి కాంట్రాక్ట్ కట్టబెట్టేవారని విజిలెన్స్ దర్యాప్తులో తేలింది.

■ జీడిపప్పు కొనుగోళ్లలోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, పురుగులు పట్టిన నాసిరకం జీడిపప్పును గుత్తేదారులు సరఫరా చేశారని విజిలెన్స్ అధికారులు గుర్తించినట్టు సమాచారం.

■ తిరుమల కొండపై ఉన్నది వాటర్ సేఫ్టీల్యాబ్ మాత్రమే. అక్కడ నెయ్యి నాణ్యతను నిర్ధారించే పరీక్షలకు కావల్సిన పరికరాలు, నిపుణులైన సిబ్బంది లేరు. నెయ్యి ట్యాంకర్లలో మూడు అరలు ఉంటాయి. నాణ్యతను పరీక్షించేందుకు మూడు అరల నుంచి 100 గ్రాముల చొప్పున సేకరించి, ఆ మొత్తాన్ని కలిపి, దానిలోంచి నమూనాను తీసుకోవాలి. మూడు అరల్లో ఒక దాంట్లోనే నాణ్యమైన నెయ్యి సరఫరా చేసి, మిగతా రెండు అరల్లో కల్తీ నెయ్యితో నింపేవారా? బాగున్న నెయ్యి శాంపిళ్లనే పరీక్షకు తీసుకునేవారా అన్న కోణంలోనూ విజిలెన్స్ దర్యాప్తు సాగినట్టు సమాచారం.

శ్రీవాణి ట్రస్టు నిధుల్ని ఇష్టానుసారం ఖర్చుపెట్టేశారు

శ్రీవాణి ట్రస్టు పేరుతో ఆలయాల పునరుద్ధరణ/జీర్ణోద్ధరణకు నాటి తితిదే పాలకులు ఇష్టానుసారం నిధులు విడుదల చేసినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. రాజకీయ ప్రయోజనాల కోసం వైకాపా నాయకులకు ఇష్టానుసారం నిధుల పందేరం చేశారని గుర్తించారు. ఎన్నికలకు ముందు ఎక్కువగా వర్క్‌ఆర్డర్లు ఇచ్చినట్టు తేలిందని సమాచారం. ఇతర ఆలయాలకు గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు ఇచ్చేందుకే నిబంధనలు అనుమతిస్తుండగా, 63 ఆలయాలకు రూ.35 లక్షల వరకు కేటాయించినట్టు తెలిసింది. కొన్ని నిర్మాణం పూర్తయిన ఆలయాలకూ నిధులు విడుదల చేసినట్టు గుర్తించారని సమాచారం.

ఆక్రమించి కట్టినా...

తిరుమలలో నిర్దిష్ట గడువు ముగిసిన 13 ప్రైవేటు వసతిగృహాల్ని తీసేసి కొత్తవి కట్టేందుకు... కాటేజ్ డొనేషన్ స్కీం కింద పలువురికి కేటాయించారు. ఎన్నికలకు ముందు మరో నాలుగు అతిథి గృహాలు కేటాయించేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. వాటిలో కొన్ని కాటేజీల్ని... గతంలో వాటికి కేటాయించిన స్థలానికి మించి, మరికొంత ఆక్రమించి కట్టేసినా పాలకమండలి కళ్లుమూసుకుంది. గతంలో ఒక అతిథిగృహం 299 చ.మీ. విస్తీర్ణంలో ఉంటే... ఇప్పుడు మరో 100 చ.మీ. మేరకు ఆక్రమించి కట్టేశారని విజిలెన్స్ నివేదికలో పొందుపరిచినట్టు తెలిసింది. ఇవన్నీ తితిదే ఉన్నతాధికారులకు తెలిసే జరిగాయని, వారు చూసీచూడనట్టు వ్యవహరించారని నిగ్గుతేల్చింది.

పటిష్ఠంగా ఉన్న సత్రాల్ని కూల్చేశారు

తిరుపతిలో గోవిందరాజస్వామి సత్రాల్ని భూమన కరుణాకర్‌రెడ్డి ఛైర్మన్‌గా ఉండగా ఆఘమేఘాలపై కూల్చేసి రూ.600 కోట్లతో టెండర్లు పిలవడంపైనా విజిలెన్స్ విభాగం దృష్టిపెట్టింది. పటిష్ఠంగా ఉన్న ఆ సత్రాలకు మరమ్మతులు చేస్తే సరిపోయేదని నివేదికలో పొందుపరిచినట్టు సమాచారం.

■ స్విమ్స్‌లో భవనాల పునర్నిర్మాణం, అభివృద్ధి పేరుతో రూ.197 కోట్లు కేటాయించేందుకు 2023 నవంబరులో తీర్మానం చేశారని, ఇక్కడ అవసరం లేకున్నా నిధులు ఖర్చుచేసేందుకు సిద్ధపడ్డారని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

■ తిరుమలలో దుకాణాలను ఇష్టానుసారంగా కేటాయించారని విజిలెన్స్ విచారణలో తేల్చారు. తట్టల పేరుతో అనధికార దుకాణాల్ని ఏర్పాటుచేసినా చూసీచూడనట్లు వ్యవహరించారని నివేదికలో పొందుపర్చారు. లైసెన్సు ఒకరి పేరుతో ఉంటే లీజు పేరుతో అనేకమంది చేతులు మారినట్లు గుర్తించారు.

వాన రాకను పక్కాగా చెప్పే అర్కా, అరుణిక

సూపర్ కంప్యూటర్లను నేడు ప్రారంభించనున్న ప్రధాని



అర్కా సూపర్ కంప్యూటర్

ఈనాడు, హైదరాబాద్: వాతావరణ సూచనలను మరింత కచ్చితత్వంతో జారీ చేసేందుకు మార్గం సుగమమైంది. ఎక్కడ ఎంత వాన పడుతుందో గంటల ముందే పక్కాగా వెల్లడించొచ్చు. వాతావరణ మోడల్స్‌ను విశ్లేషించేందుకు ఇప్పుడు వినియోగిస్తున్న సూపర్ కంప్యూటర్ల సామర్థ్యాన్ని భారత్ ఏకంగా మూడు రెట్లకు పెంచింది. ప్రస్తుతం పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీరియాలజీ (ఐఐటీఎం)లో, నోయిడాలోని నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్ (ఎన్‌సీఎంఆర్‌డబ్ల్యూఎఫ్)లో వాతావరణ పరిశీలనకు వినియోగిస్తున్న సూపర్ కంప్యూటర్ల సామర్థ్యం 6.8 పెటాఫ్లాప్స్. రూ.850 కోట్ల వ్యయంతో ఈ రెండింటి సామర్థ్యాన్ని 22 పెటాఫ్లాప్స్‌కు పెంచారు. ప్రధాని మోదీ వీటిని గురువారం పుణెలో ప్రారంభించనున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సూపర్ కంప్యూటర్లు 12 కి.మీ. గ్రిడ్ పరిమాణంలో ఉపగ్రహ చిత్రాలను విశ్లేషిస్తున్నాయి. దీంతో కొన్నిసార్లు లెక్కలు తప్పుతున్నాయి. గ్రిడ్ సైజ్‌ను 6 కి.మీ. తగ్గించగలిగితే ఎక్కడ కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉందో కచ్చితత్వంతో చెప్పేందుకు అవకాశం ఉంటుంది. సూపర్ కంప్యూటర్ల సామర్థ్యం 22 పెటాఫ్లాప్స్‌కు పెరగడం వల్ల ఇది సాధ్యమవుతుంది.

నిఘా విభాగం ఐజీగా పీహెచ్‌డీ రామకృష్ణ

(మొదటి పేజీ తరువాయి)

వీరిలో కొంతమందిని కోడ్ అమల్లో ఉండగా ఎన్నికల సంఘమే బదిలీ చేయగా... మరికొందరిని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే బదిలీ చేసి వెయిటింగ్‌లో పెట్టింది. వారికి ఇప్పుడు పోస్టింగులు లభించాయి.

అధికారుల బదిలీ వివరాలివి..

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
1. వినీత్ బ్రిజ్‌లాల్	ఐజీ, ఎస్ఐబీ	ఐజీ, సీఐడీ
2. ఎం.రవిప్రకాశ్	ఐజీ, సెబ్	ఐజీ, ప్రొవిజెన్స్ అండ్ లాజిస్టిక్స్
3. పీహెచ్‌డీ రామకృష్ణ	ఐజీ, ప్రొవిజెన్స్ అండ్ లాజిస్టిక్స్	ఐజీ, నిఘా విభాగం
4. ఫక్కీరప్ప కగినెల్లి	సంయుక్త కమిషనర్, విశాఖ సిటీ	ఎస్పీ, నిఘా విభాగం
5. ఆర్ఎన్ అమ్మిరెడ్డి	వెయిటింగ్	డీఐజీ, అడ్మిన్, పోలీసు ప్రధాన కార్యాలయం
6. సీహెచ్ విజయరావు	వెయిటింగ్	డీఐజీ, రోడ్డు భద్రత
7. సిద్దార్థ కౌశల్	వెయిటింగ్	ఏఐజీ, శాంతిభద్రతలు, పోలీసు ప్రధాన కార్యాలయం
8. డి.మేరీ ప్రశాంతి	వెయిటింగ్	డీసీపీ, శాంతిభద్రతలు-2, విశాఖ సిటీ
9. తుహిన్ సిన్హా	డీసీపీ, శాంతిభద్రతలు-2, విశాఖ సిటీ	ఎస్పీ, అనకాపల్లి
10. ఎం.దీపిక	ఎస్పీ, అనకాపల్లి	కమాండెంట్, కాకినాడ బెటాలియన్
11. జీఆర్ రాధిక	వెయిటింగ్	ప్రిన్సిపల్, పోలీసు శిక్షణ కళాశాల, ఒంగోలు
12. కె.అరీఫ్ హఫీజ్	వెయిటింగ్	ఎస్పీ, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్
13. కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి	ఆర్‌వీఈవో, రాజమహేంద్రవరం	ఎస్పీ, పీటీవో
14. అట్టాడ బాబూజీ	ఎస్పీ నిఘా విభాగం	పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలి
15. కె.తిరుమలేశ్వర్‌రెడ్డి	వెయిటింగ్	డీసీపీ, క్రైమ్స్, విజయవాడ సిటీ
16. డా.కేవీ శ్రీనివాసరావు	ప్రిన్సిపల్, పోలీసు శిక్షణ కళాశాల, ఒంగోలు	పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలి

■ ప్రధానంగా మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంపైన దాడి, చంద్రబాబు ఇంటిపైకి జోగి రమేష్ దండెత్తిన ఘటనలు జరిగినప్పుడు గుంటూరు ఎస్పీగా ఉంటూ నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోని అరిఫ్ హఫీజ్‌కు తాజాగా ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం ఎస్పీగా పోస్టింగు ఇచ్చారు. నెల్లూరు ఎస్పీగా పనిచేసిన సమయంలో అప్పటి ప్రతిపక్ష పార్టీ నాయకుడు, ప్రస్తుత మంత్రి పి.నారాయణ లక్ష్యంగా అనేక సార్లు దాడులు చేయించి వేధించారనే ఫిర్యాదులున్న కె.తిరుమలేశ్వర్‌రెడ్డికి విజయవాడ సిటీ నేరాల విభాగం డీసీపీ పోస్టులో నియమించారు.

■ వైకాపా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు సంబంధించిన నగ్న వీడియోల వ్యవహారంలో కేసును పక్కదారి పట్టించారని, వైకాపా అరాచకాలకు వెన్నుదన్నుగా ఉన్నారనే ఫిర్యాదులున్న కె.ఫక్కీరప్పకు నిఘా విభాగంలో ఎస్పీగా కీలక పోస్టింగులో నియమించారు. విశాఖపట్నం సంయుక్త కమిషనర్ నుంచి ఆయన్ను ఈ పోస్టుకు బదిలీ చేశారు.

రోజూ సంతకాలు చేయాల్సిన వారిలో..

వెయిటింగ్‌లో ఉన్న అధికారుల్లో 16 మందిని రోజూ ఉదయం 10 గంటలకు డీజీపీ కార్యాలయానికి వచ్చి అక్కడ హాజరుపట్టీలో సంతకాలు చేయాలని, పనిగంటలు ముగిసేవరకూ కార్యాలయంలోనే ఉండాలని ఆదేశిస్తూ గత నెల 13న డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలు జారీ చేశారు. ఆ జాబితాలోని ఆర్.ఎన్.అమ్మిరెడ్డి, సీహెచ్.విజయరావులకు తాజా బదిలీల్లో పోస్టింగులిచ్చారు.



పిల్లలు అడిగితే.. పనులన్నీ పక్కన పెట్టేయండి

నాన్నలారా.. మీకు నాదొక సలహా! తనతో సరదాగా డ్యాన్స్ చేయమని మీ చిన్నారి కుమార్తె/కుమారుడు మిమ్మల్ని అడిగితే.. క్షణం కూడా ఆలస్యం చేయకుండా సరే అనండి. ఇప్పుడే ఆఫీసు నుంచి వచ్చాను.. అలసిపోయి ఉన్నాను.. కాస్త పని ఉంది.. తర్వాత చేద్దాం.. అనే మాటలు చెప్పకుండా వెంటనే వారితో కలిసి చిందేయండి. ఆ క్షణాలను బాగా ఆస్వాదించండి. మీకున్న ఇతర పనుల కంటే.. మీ పిల్లలతో సరదాగా, సంతోషంగా గడిపే సమయమే విలువైనదని గుర్తుంచుకోండి.

– జాన్ డెలోనీ, మానసిక వైద్య నిపుణుడు

మిథున్‌రెడ్డి గుప్పిట్లోని మద్యం కంపెనీకే భారీ ఆర్డర్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధులు, ఈ దందాను వెనకుండి నడిపించిన నాయకులు, కొందరు కీలక వ్యక్తుల్ని నిందితులుగా చేర్చే అవకాశముంది.

కీలక ఆధారాలు లభ్యం

జగన్ పాలనలో మద్యం 'కొనుగోలు ఆర్డర్ల'లో రూ. వేల కోట్లు కొల్లగొట్టినట్లు సీఐడీ గుర్తించింది. నాటి ప్రభుత్వ పెద్దలకు సన్నిహితులు, అస్మదీయులైన వారి బినామీలతో పాటు, నిర్దేశిత కమీషన్లు చెల్లించిన మద్యం సరఫరా కంపెనీలకే 90 శాతానికి పైగా కొనుగోలు ఆర్డర్లు (ఓఎఫ్ఎస్- ఆర్డర్ ఫర్ సప్లై) కట్టబెట్టినట్లుగా దర్యాప్తులో తేల్చింది. ఆ సరఫరా సంస్థల నుంచి కొన్న మద్యానికి చెల్లించే 'బేసిక్ ప్రైస్' (మూల ధర)ను అడ్డగోలుగా పెంచేసి అనుచిత లబ్ధి కలిగించినట్లు నిర్ధారణకు వచ్చింది. విజయవాడ ప్రసాదంపాడులోని బెవరేజస్ కార్పొరేషన్, డిస్టిలరీస్, బ్రూవరీస్ విభాగాల్లో వరుసగా రెండో రోజైన బుధవారమూ విస్తృతంగా సోదాలు నిర్వహించిన అధికారులు.. గత ఐదేళ్లలో ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ (ఏపీఎస్‌బీసీఎల్) జారీ చేసిన కొనుగోలు ఆర్డర్లు, వారికి ఖరారు చేసిన 'బేసిక్ ప్రైస్', వారికి చెల్లించిన బిల్లులు.. తదితర అంశాలకు సంబంధించిన రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి దోపిడీ జరిగిన తీరు గుర్తించారు.

వైకాపా వచ్చాక ఏర్పాటైన కంపెనీలే ఎక్కువ..

ఏపీఎస్‌బీసీఎల్ వద్ద మొత్తం ఎన్ని మద్యం సరఫరా కంపెనీలు రిజిస్టర్ అయ్యాయి? గత ఐదేళ్లలో ఎంత విలువైన, ఎంత పరిమాణం మద్యాన్ని ఆయా కంపెనీల నుంచి ఏపీఎస్‌బీసీఎల్ కొనుగోలు చేసింది? అందుకు ఏ విధానాన్ని అనుసరించిందనే వివరాల్ని దస్త్రాల ఆధారంగా సీఐడీ విశ్లేషించగా దోపిడీ గుట్టంతా బయటపడింది. వందకు పైగా మద్యం సరఫరా కంపెనీలు రిజిస్టరై ఉండగా.. అందులో ఓ 10 సంస్థలకే 90 శాతానికి పైగా కొనుగోలు ఆర్డర్లు ఇచ్చినట్లు తేలింది. వీటిల్లో కొన్ని కంపెనీలకు అసలు సొంత డిస్టిలరీలే లేవని, ఇతరులకు చెందిన వాటిలో పాగా వేసి..అక్కడ 'జే బ్రాండ్లు' ఉత్పత్తి చేశాయని గుర్తించింది. అత్యధిక శాతం కొనుగోలు ఆర్డర్లు దక్కించుకున్న కంపెనీలు కొన్ని వైకాపా అధికారం చేపట్టిన తర్వాత ఏర్పాటైనవేనని, దీని వెనుక ముందస్తు నేరపూరిత కుట్ర, కుమ్మక్కు ఉందని గుర్తించింది. జగన్ పాలనలో అనుమతి పొందిన మద్యం బ్రాండ్లకే ఎక్కువగా ఆర్డర్లు లభించినట్లు సీఐడీ తన దర్యాప్తులో తేల్చింది. ఏపీఎస్‌బీసీఎల్ గత ఐదేళ్లలో మద్యం సరఫరా కంపెనీలకు రూ.15 వేల కోట్ల వరకూ చెల్లించిందని అందులో అత్యధిక భాగం నాటి ప్రభుత్వ పెద్దల అస్మదీయ కంపెనీలకే చేరినట్లు గుర్తించింది.

ఏ కంపెనీ వెనక ఎవరున్నారు?

జగన్ హయాంలో అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న కంపెనీల్లో అదాన్ డిస్టిలరీస్, నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రోస్‌తో పాటు జేఆర్ అసోసియేట్స్, ఎస్ఎన్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్స్, ఎంఎస్ బయోటెక్, శర్వాణి ఆల్కో బ్రూవరీస్ వంటివి ప్రధానమైనవిగా గుర్తించారు. వాటి వెనక ఎవరున్నారు? వాటికి అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు లభించడం వెనకున్న లోగుట్టు ఏంటి? ఎవరు? ఎలా ప్రభావితం చేశారు? అనేదానిపై సీఐడీ ఆరా తీస్తోంది. కొన్ని కంపెనీలు ఒక్కో మద్యం కేసుకు కొంత మొత్తం చొప్పున కమీషన్ చెల్లించి ఆర్డర్లు దక్కించుకున్నట్లు సీఐడీ గుర్తించింది. ఆయా కంపెనీల వివరాలు సిద్ధం చేసింది.

గ్రహం అనుగ్రహం

26–9–2024 గురువారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం
నవమి: సా. 4-25 తదుపరి దశమి
పునర్వసు: తె. 3-59 తదుపరి పుష్యమి
వర్జ్యం: మ. 3-50 నుంచి 5-27 వరకు
అమృత ఘడియలు: రా. 1-33 నుంచి 3-10 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-52 నుంచి 10-40 వరకు తిరిగి మ. 2-40 నుంచి 3-28 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ. 5.53; సూర్యాస్తమయం: సా.5.53


వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	36.4	26.0
నెల్లూరు	35.1	26.8
అనంతపురం	33.7	24.3
కడప	32.0	26.0
ఒంగోలు	31.9	25.0
కర్నూలు	31.5	29.4
గుంటూరు	31.0	26.0
హైదరాబాద్	30.6	23.9
విశాఖపట్నం	30.4	25.8
విజయనగరం	30.0	27.0
తాడేపల్లిగూడెం	30.0	26.9
విజయవాడ	29.6	25.2
రాజమహేంద్రవరం	29.5	25.0
నరసాపురం	29.2	24.8
శ్రీకాకుళం	29.0	27.0

పదవులు దక్కని వారిలో...

తొందరపాటు మంచిది కాదు

- ఇంకా నామినేటెడ్ పోస్టులున్నాయి.. లిస్టులొస్తాయి
- సీఎం చంద్రబాబు స్పష్టీకరణ



ఈనాడు డిజిటల్, అమరావతి: 'నామినేటెడ్ పదవులు దక్కని కొందరు నాయకులు తొందర పడుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. పార్టీలో క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తామని గుర్తుపెట్టుకోవాలి. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్‌లు లభించని వారికి, కష్టపడిన వారికే ఈ జాబితాలో అవకాశం ఇచ్చాం. గత ప్రభుత్వ అక్రమాల్ని ప్రశ్నించి జైలుకు వెళ్లిన వారు, ఆస్తులు కోల్పోయిన వారు, కేసులు ఎదుర్కొన్న వారు ఇందులో ఉన్నారు' అని సీఎం చంద్రబాబు చెప్పారు. ఇంకా నామినేటెడ్ పోస్టులున్నాయని, లిస్టులుంటాయని తెలిపారు. కొత్తగా ఎంపికైన కార్పొరేషన్ల ఛైర్మన్లతో రాష్ట్ర సచివాలయంలో చంద్రబాబు బుధవారం సమావేశమయ్యారు. నామినేటెడ్ పదవులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. 'ఏ పదవిలో ఉన్నా మనం ప్రజా సేవకులమనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. పదవి అనేది ఓ బాధ్యత, దాని తాలూకు అహంకారం ఎక్కడా కనిపించకూడదు. నాయకుడి ప్రతి కదలికా, మాటా, పనీ.. గౌరవంగా, హుందాగా ఉండాలి. ప్రజలు ప్రతి అంశాన్నీ గమనిస్తారు' అని చంద్రబాబు గుర్తుచేశారు. 'ముందుగా చెప్పినట్లే మూడు పార్టీల వారికీ పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చాం. ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలోనూ ప్రత్యేకమైన విధానాన్ని పాటించాం. అందుకే మంచి ఫలితాలు వచ్చాయి. దాన్నే నామినేటెడ్ పదవుల భర్తీలోనూ అనుసరించాం. ట్రాక్ రికార్డు ఆధారంగా చిన్న స్థాయి నేతలకూ కార్పొరేషన్‌లలో అవకాశాలు కల్పించాం. పార్టీకి ఎవరు ఎలా పనిచేశారో నా దగ్గర పూర్తి సమాచారం ఉంది' అని చంద్రబాబు చెప్పారు.

మిగిలిన వారు కష్టపడలేదని కాదు

'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కోసం నిరంతరం పని చేసిన వారు ఉన్నారు. ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం. కష్టపడిన ఏ ఒక్కరినీ విస్మరించం. మీకు అవకాశాలు వచ్చాయంటే మిగిలిన వారు పనిచేయలేదని, అర్హత లేదని కాదు' అని చంద్రబాబు స్పష్టంచేశారు. 'నామినేటెడ్ పదవుల్లో సామాజిక న్యాయం పాటించాం. జనాభా దామాషా లెక్కన బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి, సమన్వయంతో పని చేయండి' అని చంద్రబాబు సూచించారు. 'సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నెన్స్... అని నేనూ పవన్‌కల్యాణ్ చెప్పాం. దానినే అందరూ పాటించాలి' అని చెప్పారు.

మీ కార్పొరేషన్లను అధ్యయనం చేయండి

'మీకిచ్చిన కార్పొరేషన్ల గురించి బాగా అధ్యయనం చేయండి. ఏ కార్యక్రమాలు చేపట్టవచ్చో ఆలోచించండి. పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులు రాబట్టడంలో ఏపీఐఐసీ పాత్ర కీలకం. మౌలిక సదుపాయాల కల్పనతో పెద్దపెద్ద కంపెనీలను తీసుకురావచ్చు. గతంలో మనం పరిశ్రమల కోసం భూములు సేకరిస్తే... గత ప్రభుత్వం ఆ లక్ష్యం నెరవేరకుండా చేసింది. ఆర్టీసీని నిలబెట్టాలి. ఎలక్ట్రిక్ బస్సులు తేవాలి. కార్గో పెంచాలి' అని చంద్రబాబు సూచించారు. 'బాగా పనిచేయండి... ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురండి. కష్టపడి పనిచేస్తే మరిన్ని మంచి అవకాశాలు వస్తాయి' అని చెప్పారు.

పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం

రాష్ట్రంలోని పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ బోర్డు(ఏపీఐసీడీబీ)ను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. కేంద్ర భాగస్వామ్యంతో రాష్ట్రంలో అభివృద్ధికి ప్రతిపాదించిన పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతుందన్నారు. విశాఖ-చెన్నై(వీసీఐసీ), చెన్నై-బెంగళూరు(సీబీఐసీ), హైదరాబాద్-బెంగళూరు(హెచ్‌బీఐసీ) కారిడార్ల పరిధిలోని పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త పారిశ్రామిక పార్కులకు కేంద్రం నుంచి అనుమతుల కోసం ప్రతిపాదనల రూపకల్పనపై అధికారులతో బుధవారం సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 'పారిశ్రామిక కారిడార్ల పరిధిలో ప్రతిపాదించిన పార్కుల అభివృద్ధి వేగవంతం చేసేందుకు చట్ట పరిధిలో బోర్డును ఏర్పాటు చేస్తున్నాం. పారిశ్రామిక పార్కుల్లో(నోడ్) ఎలాంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి? దీనికి అవసరమైన లేఔట్ ఎలా ఉండాలి? అనే అంశాలపై బోర్డుకు నిర్ణయం తీసుకునే అధికారం ఉంటుంది. దీంతో పాటు పారిశ్రామిక పార్కుల్లో భవనాల నిర్మాణానికి సంబంధించిన అనుమతులు ఇచ్చే అధికారమూ బోర్డుకు వస్తుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి బోర్డుకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. వైస్ ఛైర్మన్‌గా పరిశ్రమల శాఖ మంత్రి ఉంటారు. వివిధ శాఖలకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులు కలిపి 11 మంది సభ్యులుగా ఉంటారు' అని వివరించారు. మూడు పారిశ్రామిక కారిడార్లు, వాటి పరిధిలోని మూడు నోడ్‌లకు చట్టబద్ధత కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

పనులను వేగవంతం చేయాలి

'రాష్ట్రంలో వీసీఐసీ, సీబీఐసీ, హెచ్‌బీఐసీ కారిడార్ల అభివృద్ధికి కేంద్రం అనుమతించింది. వాటి పరిధిలో కొప్పర్తి, కృష్ణపట్నం, ఓర్వకల్ నోడ్‌ల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించింది. వాటికి సంబంధించిన డ్రాఫ్టు మాస్టర్‌ప్లాన్‌కు ఆ నిధులను వినియోగించి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి. పెట్టుబడుల ఆకర్షణలో ఇవి కీలకమవుతాయి. 'దొనకొండ, లేపాక్షి, కుప్పం, మూలపేటలో కొత్తగా నాలుగు నోడ్‌లను అభివృద్ధి చేయాలి. ఒక్కొక్క నోడ్‌కు రూ.5 వేల కోట్లు కేంద్రం నుంచి విడుదలయ్యే అవకాశం ఉంది' అని పేర్కొన్నారు.

రథాన్ని కాల్చింది వైకాపా కార్యకర్త

- అసూయతోనే నిప్పు
- అనంత జిల్లా ఎస్పీ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీశ్

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా కణేకల్లు మండలం హనకనహాళ్ గ్రామంలోని రాములవారి రథానికి నిప్పు పెట్టింది వైకాపా కార్యకర్త బొడిమల్ల ఈశ్వర్‌రెడ్డి అని పోలీసుల విచారణలో తేలింది. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఆయన అనంతపురం వైకాపా మాజీ ఎమ్మెల్యే సమీప బంధువు కావడం గమనార్హం. బుధవారం అనంతపురంలో ఎస్పీ జగదీశ్ వివరాలు వెల్లడించారు. హనకనహాళ్ గ్రామానికి చెందిన ఎర్రిస్వామిరెడ్డి సోదరులు రామాంజనేయులురెడ్డి, గోపాల్‌రెడ్డి 2022వ సంవత్సరంలో రూ.20 లక్షలు వెచ్చించి రామాలయానికి రథాన్ని



నిందితుడు బొడిమల్ల ఈశ్వర్‌రెడ్డి

తయారు చేయించారు. రథం ఒక కుటుంబానికి చెందినదిగా గ్రామంలోని కొందరు భావించడంతోపాటు ఆలయ వ్యవహారాలు కూడా వారి ఆధీనంలోనే ఉన్నాయనే ప్రచారం జరిగింది. దీంతో కొంత మందిలో వ్యతిరేకత వ్యక్తమైంది. ఫలితంగా కొన్ని కుటుంబాల మధ్య విభేదాలు తలెత్తాయి. ప్రధానంగా నిందితుడు ఈశ్వర్‌రెడ్డి అసూయతో రగిలిపోయేవారు. రథాన్ని మార్చాలని చాలాసార్లు గొడవ పడ్డారు. ఈ నెల 23న అర్ధరాత్రి షెడ్డు తాళాలను ఆక్సా బ్లేడుతో కత్తిరించి.. రథంపై పెట్రోల్ చల్లి నిప్పు పెట్టి పరారయ్యాడు. స్థానికులు అప్రమత్తమై మంటలు ఆర్పివేశారు. దీన్ని రాష్ట్రప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని సమగ్ర విచారణ చేయాలని జిల్లా ఎస్పీని ఆదేశించిన విషయం విదితమే. నిందితుల కోసం కళ్యాణదుర్గం డీఎస్పీ రవికుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వారు అనుమానితులను విచారించగా ఈశ్వర్‌రెడ్డే నిప్పు పెట్టినట్లు తేలిందని ఎస్పీ వివరించారు. మరికొందరు అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నారని, వారిని విచారిస్తున్నామని ఆయన తెలిపారు.

ఎక్కువ ఉద్యోగాలు కల్పించే సంస్థలకు ఎర్ర తివాచీ

- 72 గిగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తి లక్ష్యం
- సీఐఐ సదస్సులో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్

ఈనాడు డిజిటల్, విశాఖపట్నం: రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా ఎక్కువ ఉద్యోగాలు కల్పించే సంస్థలకు ఎర్ర తివాచీ పరిచి ఆహ్వానిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో బుధవారం విశాఖలో నిర్వహించిన 'మౌలిక సదుపాయాల సదస్సు'కు హాజరై మాట్లాడారు. 'రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో 72 గిగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నాం. విశాఖను దేశంలో ఐదో పెద్ద ఆర్థిక నగరంగా, ప్రపంచానికి డేటాసెంటర్ రాజధానిగా తీర్చిదిద్దుతాం. శంషాబాద్ విమానాశ్రయం.. హైదరాబాద్‌ను మార్చేసినట్లు భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత రూపురేఖలు మారతాయి' అని తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర



మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, వేదికపై మంత్రి జనార్దన్‌రెడ్డి, ఎంపీ శ్రీభరత్, సీఐఐ ప్రతినిధులు

స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన.. ఆర్థికాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తుందన్నారు.

సరైన ప్రణాళికతో ముందుకు: ఎంపీ

విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖ అభివృద్ధి సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నామన్నారు. విశాఖ విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ కార్గో నిలిచిపోయిన విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లగా ఇప్పటికే కేంద్రమంత్రితో మాట్లాడామని, త్వరలో ప్రారంభిస్తామని భరోసా ఇచ్చారన్నారు. సదస్సులో జీఎంఆర్ సంస్థ బిజినెస్ ఛైర్మన్ (విమానాశ్రయాలు) జీబీఎస్ రాజు, సీఐఐ ఏపీ ఛైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ, సీఐఐ విశాఖ ఛైర్మన్ గ్రంధి రాజేష్, వైస్‌ఛైర్మన్ అజయ్‌కుమార్, ఈఎస్‌జీ ప్యానల్ కన్వీనర్ ఈ.శంకరరావు తదితరులు ప్రసంగించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదు

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టంగా చెప్పారని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విశాఖలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాం. వైకాపా ప్రభుత్వంలో ఉక్కును పట్టించుకోలేదు. సీఎం చంద్రబాబు దీనిపై కేంద్ర ఉక్కు, ఆర్థికశాఖ మంత్రులతో మాట్లాడారు. ఫలితంగా కేంద్రం ఇటీవల రూ.500 కోట్ల నిధులు ఇచ్చింది. తిరుమల లడ్డూపై ప్రమాణం చేయడానికి నేను సిద్ధమని సవాల్ చేస్తే.. వైవీ సుబ్బారెడ్డి రాలేదు. వైకాపా హయాంలో మార్కెట్ ధర కంటే దాదాపు 40 శాతం తక్కువ ధరకు నెయ్యి తీసుకున్నారు. దీంతో నాణ్యత లేకుండా పోయింది. ఆ తప్పులను కప్పిపుచ్చుకోవాలని వైకాపా ప్రయత్నిస్తోంది' అన్నారు.

త్వరలో ఐటీ, జీసీసీ పాలసీలు

'రాబోయే రోజుల్లో విశాఖలో భారీగా పెట్టుబడులు రాబోతున్నాయి. ఐటీ కంపెనీలతో సమావేశమై వారి సమస్యలను పరిష్కరించాం. రాబోయే వందరోజుల్లో ఐటీ, జీసీసీ పాలసీలు తీసుకొస్తాం. రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిపోయిన పారిశ్రామికవేత్తలతో సంప్రదించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తాం. గత ఐటీ మంత్రి ఒక్కసారి కూడా ఐటీ పరిశ్రమలతో సమావేశం నిర్వహించలేదు. మేం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలు తెలుసుకుంటాం. నేను వచ్చేటప్పుడు బందోబస్తు అవసరం లేదని, ఎవరొచ్చినా ట్రాఫిక్ నిలువరించవద్దని పోలీసు ఉన్నతాధికారులకు సూచించాం' అని తెలిపారు.

తిరుమల నెయ్యి కాంట్రాక్టులో కమీషన్లు బొక్కేశారు: మంత్రి సత్యకుమార్

ఈనాడు, అమరావతి: తిరుమలలో జంతుకొవ్వు కలిపిన కల్తీ నెయ్యి వినియోగం ద్వారా కోట్లాది మంది భక్తుల మనోభావాలను మాజీ ముఖ్యమంత్రి జగన్ దెబ్బతీశారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మండిపడ్డారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 'లడ్డూ తయారీలో వైకాపా నేతలు రాజీపడ్డారు. నెయ్యి కాంట్రాక్టులో కమీషన్లు బొక్కి, స్వామి వారికి అపచారం చేశారు. నాటి జగన్ పాలనలో సీఎం, ఛైర్మన్, ఈఓ తప్ప.. మిగిలిన బోర్డు సభ్యులందరూ డమ్మీలే. భాజపా వారు కూడా సభ్యులుగా ఉన్నారని చెబుతూ మాపై నింద మోపాలని జగన్ చూస్తున్నారు' అని దుయ్యబట్టారు.

'డిక్లరేషన్' ఇచ్చిన తర్వాతే స్వామి వారిని దర్శించుకోవాలి

- జగన్‌కు భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి డిమాండ్

ఈనాడు, అమరావతి: మాజీ సీఎం జగన్ తితిదే అధికారులకు డిక్లరేషన్ సమర్పించిన తరువాతే తిరుమలలో స్వామి వారి దర్శనానికి వెళ్లాలని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి డిమాండ్ చేశారు. 'ఈ నెల 28న జగన్ తిరుమల వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. ఆయన అన్యమతస్తులైనందున తితిదే అధికారులకు డిక్లరేషన్ ఇవ్వాలి' అని 'ఎక్స్' వేదికగా ఆమె పేర్కొన్నారు.

ఆ క'న్నీళ్లే' కదిలించాయి!


- జలజీవన్ మిషన్‌తో ప్రజల తాగునీటి కష్టాలు తీర్చుతున్నాం
- వంద రోజుల పాలనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



ఈనాడు, అమరావతి: గత సర్కారు హయాంలో గ్రామీణ ప్రజలు ఎదుర్కొన్న తాగునీటి సమస్యలను ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో పరిష్కరిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో కొన్ని అనుభవాలను బుధవారం ఎక్స్‌లో ఆయన పంచుకున్నారు. 'గత ప్రభుత్వ హయాంలో వరదలకు కొట్టుకుపోయిన అన్నమయ్య డ్యాంను పరిశీలించి తిరిగొస్తున్నప్పుడు.. తీవ్రమైన తాగునీటి కొరత సమస్యతో బాధపడుతున్న అన్నమయ్య జిల్లాలోని ఓ దళితవాడకు చెందిన వృద్ధురాలు 'నీళ్లు లేవు సామి.. నీకు పుణ్యముంటాది' అంటూ వ్యక్తం చేసిన ఆవేదన నన్ను భావోద్వేగానికి గురిచేసింది. ప్రస్తుతం దూరదృష్టి గల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో, ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రజల తాగునీటి వెతలను పరిష్కరిస్తున్నాం' అని వివరించారు. వృద్ధురాలు తాగునీటి సమస్య చెబుతున్న వీడియోను పోస్టుకు జత చేశారు.

డీజీపీతో 'సిట్' భేటీ

ఈనాడు, అమరావతి: గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో జరిగిన అపచారాలు, లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం, ఇతర అక్రమాలపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని.. ఈ అంశంపై ఏర్పాటైన సిట్‌ను డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశించారు. సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, సభ్యులైన డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ హర్షవర్ధన్‌రాజులు బుధవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ వారితో మాట్లాడుతూ... దర్యాప్తులో పరిశీలించాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. తితిదే ప్రొక్యూర్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్ పి.మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు తిరుపతి తూర్పు పోలీసుస్టేషన్‌లో బుధవారం నమోదైన కేసును సిట్‌కు బదిలీ చేస్తామని మూలాలు వెలికితీసేలా దర్యాప్తు చేయాలని సూచించారు.



ఆరు పదుల వయసులో ఆరోగ్యంగా ఉండాలంటే..

ఆరు పదుల వయసులో ఆరోగ్యంగా ఉండటమనేది కేవలం అదృష్టం వల్ల సాధ్యమయ్యేది కాదు. 40 ఏళ్ల వయసు నుంచీ ఉన్న మెరుగైన అలవాట్లు, తీసుకునే పోషకాహారం, చేసే ప్రయోజనకర పనుల ఫలితంగా అది సాకారమవుతుంది. కాబట్టి పరిస్థితులు మీ నియంత్రణలో ఉండగానే అప్రమత్తమవండి.

– లూయీ రువోలో, ఫిట్‌నెస్ నిపుణుడు

తిరుమలలో జగన్ సంతకం పెట్టాలి..

శ్రీవారిపై నమ్మకం ఉందని చెప్పాలి

- తిరుమల వ్యవహారం జగన్‌కు పొలిటికల్ ఈవెంట్
- మీ ఒత్తిడితోనే నెయ్యి టెండర్లలో టర్నోవర్ విలువ తగ్గించారు
- ఆ ట్యాంకర్ల నెయ్యి వినియోగించిన తరువాతే కల్తీ బహిర్గతం
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజం

ఈనాడు, అమరావతి: 'తిరుమలకు ఈ నెల 28న వెళ్తానంటున్న వైకాపా అధ్యక్షుడు జగన్.. శ్రీవారిపై నమ్మకం ఉందంటూ సంతకం చేసి డిక్లరేషన్ ఇవ్వాలి' అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ డిమాండ్ చేశారు. అన్యమతస్తులు శ్రీవారిని దర్శించుకోవాలనుకుంటే.. రిజిస్టర్‌లో సంతకం చేయాలనే చట్టాన్ని మీ హయాంలో తుంగలో తొక్కారని, ఇప్పుడైనా పాటించండి అంటూ హితవు పలికారు. సచివాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'వైకాపా శ్రేణులు ఈ నెల 28న రాష్ట్రంలో అన్ని ఆలయాల్లో పూజలు చేయాలని జగన్ పిలుపునిచ్చారు. ఆయన మారలేదు. ఆయన ఆలోచనలూ మారలేదు. జగన్‌కు ఇది పొలిటికల్ ఈవెంట్. రాష్ట్ర ప్రజలకు మాత్రం సెంటిమెంట్. దీన్ని రాజకీయ కోణంలో పల్లెపల్లెలో ఈవెంట్‌గా మార్చిన ఆయన ఆలోచన బాధాకరం' అని కేశవ్ ధ్వజమెత్తారు.



ఘోరమైన తప్పులు చేశారు

'సీఎం తితిదే పాలకవర్గాన్ని మాత్రమే వేస్తారు.. అది స్వతంత్ర సంస్థ అని జగన్ అంటున్నారు. మరి మీ ప్రభుత్వంలో చేపట్టే రివర్స్ టెండర్లను ఆ స్వతంత్ర సంస్థలో ఎందుకు అమలు చేశారు? నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొనే గుత్తేదారులకు రూ. 250 కోట్ల టర్నోవర్ ఉండాలన్న నిబంధనను రూ. 150 కోట్లకు తగ్గించింది మీ ఒత్తిడితో కాదా? ఘోరమైన తప్పులు చేసి, వాటిని కప్పిపుచ్చుకునేందుకు ఎదురుదాడి చేయడం బాధాకరం. మీరు తిరుమలను పీఆర్వో ఆఫీసుగా చూశారు. లక్షల మందికి సిఫార్సు లేఖలు ఇచ్చారు. దాన్ని వ్యాపార కేంద్రంగా మార్చే ప్రయత్నం చేశారు' అని మండిపడ్డారు. 'చంద్రబాబు సీఎం కావడంతో కల్తీ నెయ్యి వ్యవహారం బయటకు వచ్చింది. తిరుమలలో కొన్ని నాణ్యత పరీక్షలే జరుగుతున్నాయని ఈవో స్పష్టంగా చెప్పారు. గత పాలకులకు దేవుడిపై నమ్మకం లేకపోవడంతోనే ఇవన్నీ జరిగాయి. కల్తీ నెయ్యి నిజం.. లడ్డూ తయారీలో వాడటం నిజం.. అపచారం జరిగిందనేది నిజం. జూన్, జులై నెలల్లో వచ్చిన నెయ్యి ట్యాంకర్లలో కొన్ని తీసుకొని, మరికొన్నింటిని తిరస్కరించారు. వాటి నమూనాలను నేషనల్ ల్యాబ్‌కు పంపి పరీక్ష చేయించగా, నిజం బహిర్గతమైంది. కానీ అప్పటికే అనుమతించిన ట్యాంకర్లలోని నెయ్యిని లడ్డూ తయారీకి వినియోగించేశారు. అన్నీ కళ్ల ముందు ఉన్నా.. మీరు అబద్ధాలు చెబుతున్నారు. చేసిన పాపాలు ఇక చాలు. భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దు' అని కేశవ్ పేర్కొన్నారు.

నాణ్యత ప్రశ్నిస్తే.. నోరు మూయించారు

'గతంలో పాలకవర్గ సమావేశంలో ఉత్తరాదికి చెందిన ఓ బోర్డు సభ్యుడు.. తక్కువ ధరకు నెయ్యి సరఫరా ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు. అప్పటి ఈవో (ధర్మారెడ్డి), ఛైర్మన్‌లు ఆయన నోరు మూయించారు. అటువంటి ఈవో ఇప్పుడు బయటకు వచ్చి ఎలా మాట్లాడగలరు? గతంలో జరిగిన బోర్డు సమావేశంలో సేవల ధరలు పెంచాలంటూ చర్చిస్తున్న వీడియో బయటకు వచ్చింది. రూ. 40 జిలేబీని రూ. 4 వేలు చేయమన్నది ఆ పెద్ద మనిషి కాదా? రూ. 150 ఉండే గది అద్దెను రూ. 2,200 చేశారు. అంతలా కమర్షియల్ చేస్తారా? తిరుమల శ్రీవారితో ఆషామాషీగా ఉండదు. తప్పు చేసిన వాళ్లందరినీ ప్రజల ముందు నిలబెడతాం. ఇప్పటికైనా బహిరంగ క్షమాపణ చెప్పండి. లేకపోతే మనసులో అయినా చెప్పుకొని.. ఈ విషయంలో బయటకు రాకండి' అని జగన్‌కు హితవు పలికారు.

చిత్తం కొండపైనా.. చూపులు శ్రీవారి ఆస్తులపైనా

- వైవీ సుబ్బారెడ్డి హయాంలో అడుగులన్నీ అటువైపే
- విపక్షాల ఆందోళనలతో నాడు అడ్డుకట్ట

ఈనాడు, తిరుపతి: శ్రీవారి ఆస్తులను అడ్డగోలుగా విక్రయించడానికి గత ఐదేళ్లలో వైకాపా పాలకులు చేయని ప్రయత్నం లేదు. స్వామివారిపై భక్తితో దాతలు ఇచ్చిన విలువైన ఆస్తులను నిరర్థకం పేరుతో విక్రయించేందుకు సిద్ధమయ్యారు. దేశవ్యాప్తంగా 50 ప్రాంతాల్లో ఉన్న భూములను గుర్తించారు. ముందుగా తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని 23 ప్రాంతాల్లోని భూముల్ని అమ్మాలని నిర్ణయించారు. అప్పట్లో తెదేపాతోపాటు విపక్షాలు పెద్దఎత్తున ఆందోళనలు చేయడంతో వెనక్కు తగ్గారు. ఈ వ్యవహారం నాటి సీఎం జగన్ బాబాయి వై.వి.సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా ఉన్న కాలంలో నడిచింది.

ఆస్తుల అమ్మకానికి 2020 ఫిబ్రవరి 29న బోర్డులో తీర్మానం చేశారు. మన రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న తితిదే ఆస్తుల విక్రయానికి ముందుగా సిద్ధమయ్యారు. ఉమ్మడి గుంటూరు, చిత్తూరు, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, అనంతపురం, కడప, కృష్ణా, విజయనగరం జిల్లాల్లోని 17 ఆస్తులను జిల్లా కలెక్టర్ల ద్వారా విక్రయించాలనుకున్నారు. తితిదేకు పట్టణ ప్రాంతాల్లోనూ విలువైన ఆస్తులున్నాయి. గుంటూరులోని కొత్తరాముల వీధి గుడిలో ఉన్న 2,487 చ.అ. భవనం, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్, అంబర్‌పేట కలాన్‌లో 1,800 చ.అ. స్థలం, హయత్‌నగర్ పసుమాములలోని 2,250 చ.అ. ఇంటి స్థలం, మల్కాజిగిరి మండలం యాదవ్‌నగర్ పరిధిలోని 800 చ.అ. ప్లాటును, మహారాష్ట్ర నాందేడ్‌లోని 1.48 ఎకరాలను, బెంగళూరు పరిధిలోని విలువైన ఆస్తులూ విక్రయించాలనుకున్నారు. తమిళనాడులోని తిరుచ్చి, ధర్మపురి, తిరువణ్ణామలై, నాగపట్నం, వెల్లూరు, కోయంబత్తూరు, తిరువళ్లూరుతోపాటు పలు జిల్లాల పరిధిలో నిరర్థక ఆస్తుల పేరుతో అమ్మాలని భావించారు.

తితిదే బృందాల ఏర్పాటుతో..

ఆస్తులను వేలంలో విక్రయించేందుకు తితిదే రెండు బృందాలను ఏర్పాటు చేసింది. వేలంలో అత్యధిక ధరకు ఆస్తుల్ని దక్కించుకున్న వారికి రిజిస్ట్రేషన్లు చేయించే బాధ్యతా ఈ బృందాలకే అప్పగించింది. తితిదేకు హుండీ ద్వారానే ఏడాదికి సుమారు రూ.1,100 కోట్ల ఆదాయం వస్తోంది. వైకాపా హయాంలో విచ్చలవిడిగా నిధులు ఖర్చు చేశారు. 2020-21లో ఆస్తుల అమ్మకం ద్వారా రూ.100 కోట్ల మేరకు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని బడ్జెట్‌లో పొందుపరిచారు. తితిదే నిర్ణయంపై నాడు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేగింది. తెదేపా, జనసేన, ఇతర విపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి.

ఇక లా డిగ్రీ కావాలంటే.. నేరచరిత్ర వెల్లడించాల్సిందే!

- వర్సిటీలు, కళాశాలలకు బీసీఐ ఆదేశాలు


ఈనాడు, హైదరాబాద్: బార్ కౌన్సిల్ ఇండియా (బీసీఐ) పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇక న్యాయవిద్య కోర్సుల్లో అభ్యర్థులకు మార్కుల మెమో, పట్టా ఇచ్చేముందు వారి పూర్వాపరాలను పరిశీలించాలని, నేరచరిత్ర ఉంటే తమ అనుమతి పొందిన తర్వాతే వారికి లా పట్టా ఇవ్వాలని బీసీఐ నిబంధన విధించింది. ఈ మేరకు దేశంలో న్యాయవిద్య అందించే విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు ఆదేశాలు జారీచేసింది. న్యాయవాద వృత్తి నైతిక ప్రమాణాలను పెంచేందుకుగాను.. లా విద్యార్థులకు నేరచరిత్ర ఉండరాదని, అందుకే క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ చెక్‌సిస్టమ్ (సీబీసీఎస్)ను అమలు చేస్తున్నట్లు పేర్కొంది. మార్కుల ధ్రువపత్రాలు, డిగ్రీ పట్టాలు జారీచేసే ముందు విద్యార్థుల నేరచరిత్ర వివరాలను తీసుకోవాలని, ప్రస్తుత ఎఫ్ఐఆర్, నేర కేసు, శిక్ష తదితర వివరాలను వెల్లడించాలని స్పష్టం చేసింది. ఒకవేళ నేరచరిత్ర ఉంటే ఆ వివరాలను బీసీఐకి పంపించి.. అనుమతి వచ్చిన తర్వాతే విద్యార్థులకు పట్టాలు ఇవ్వాలని తెలిపింది. ఈ నిబంధనను పాటించకుంటే కఠిన చర్యలుంటాయని, పట్టాలను కూడా ఇవ్వబోమని స్పష్టంచేసింది. ఆయా నిబంధనలపై విద్యార్థులంతా హామీపత్రం కూడా సమర్పించాలి.

శాంతికోసం ముందడుగు

అంతులేని విస్తరణవాదంతో బుసలుకొడుతున్న డ్రాగన్- ఇండో పసిఫిక్ ప్రాంతంలో దుందుడుకు చర్యలకు పాల్పడుతూ, దక్షిణ చైనా సముద్రం మొత్తం తనదేనంటూ అడ్డగోలుగా వాదిస్తోంది. ఉక్రెయిన్‌పై అన్యాయంగా దండెత్తి అంతర్జాతీయంగా ఏకాకిగా మారిన రష్యాకు అది చేరువవుతోంది. వాస్తవాధీన రేఖ వెంట ఉద్రిక్తతలను రాజేస్తూ, పాకిస్థాన్‌ను చంకనెక్కించుకుని ఇండియాను చీకాకు పెట్టేందుకు చైనా సదా యత్నిస్తోంది. మరోవైపు, పశ్చిమాసియా సంక్షోభం రావణకాష్ఠంగా రగులుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో అమెరికాలో పర్యటించిన ప్రధాని మోదీ- కీలక 'క్వాడ్' శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. ఐరాస సర్వప్రతినిధిసభ సదస్సులో ప్రసంగించడంతో పాటు ప్రవాస భారతీయులు, ప్రముఖ సంస్థల సీఈవోలతోనూ సమావేశమయ్యారు. ప్రపంచ జీడీపీలో మూడింట ఒక వంతు వాటా క్వాడ్ సభ్యదేశాలైన భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలదే. దాదాపు రెండొందల కోట్ల మందికి ఆవాసాలైన అవి తాజా భేటీలో భాగంగా మానవహక్కులు, స్వేచ్ఛ, చట్టబద్ధపాలన, సార్వభౌమాధికారాలకు మద్దతు చాటాయి. అంతర్జాతీయ వ్యవస్థల పరిరక్షణకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటిస్తూనే- చైనా ఆధిపత్య భావజాలాన్ని ఈసడించాయి!

బీజింగ్‌ను వ్యతిరేకించడం ఒక్కటే తన ఏకైక అజెండా కాదన్నది 'క్వాడ్' ప్రవచిత సందేశం. ఇండో-పసిఫిక్ ప్రాంత అభివృద్ధికి పాటుపడటమే తమ లక్ష్యమని ఆ కూటమి నేతలు నిరుడు ప్రకటించారు. ఆ క్రమంలో తాజాగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై పోరాటానికి వారు కట్టుబాటు చాటారు. ఆ వ్యాధి పరీక్షలు, నిర్ధారణ కోసం 75 లక్షల డాలర్లను సమకూర్చేందుకు ఇండియా ఉదారంగా ముందుకు రావడం హర్షణీయం. విపత్తు నిర్వహణ, సముద్ర భద్రత, మౌలిక వసతులు, ఆధునిక సాంకేతికతలు, శుద్ధ ఇంధనాలు తదితర రంగాల్లో పరస్పర సహకారానికి క్వాడ్ నేతలు నిశ్చయించడమూ అభినందనీయమే. వర్ధమాన, పేద దేశాల ఆహార, ఇంధన భద్రతకు ముప్పుగా మారిన ఉక్రెయిన్ యుద్ధం ముగిసిపోవాలని, గాజాలో తక్షణం కాల్పుల విరమణ పాటించాలని 'క్వాడ్' దేశాధినేతలు ఆకాంక్షించారు. 'ఇది యుద్ధాల యుగం కాద'ంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ప్రధాని మోదీ గతంలోనే స్పష్టంగా తెలియజేశారు. ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు తోడ్పడతామని ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీకి మోదీ తాజాగా హామీఇచ్చారు. యుద్ధవిరమణకు మాస్కోను ఒప్పించేందుకు దిల్లీ చొరవ తీసుకోవాలన్నదే అందరి ఆకాంక్ష!

రష్యాతో చిరకాల మైత్రీబంధాన్ని కాపాడుకుంటూనే- స్వీయభద్రత నిమిత్తం అమెరికాతోనూ ఇండియా దోస్తీ చేస్తోంది. కోల్‌కతాలో సెమీకండక్టర్ల తయారీ కేంద్రం, ఎంక్యూ-9బి ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలు తదితరాలపై మోదీ-బైడెన్ తాజాగా చర్చించారు. ఘర్షణల నివారణకు మోదీ కృషి అభినందనీయమన్న బైడెన్ ప్రశంస- ఇరుదేశాల సుహృద్భావ సంబంధాలకు అద్దంపడుతోంది. విశ్వవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నా ఇండియా జీడీపీ కొన్నేళ్లుగా స్థిరంగా వృద్ధి సాధిస్తోంది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అతిత్వరలో భారతావని అవతరించనుంది. అటువంటి చోట పెట్టుబడులకు ఇదే మంచి అవకాశమని దిగ్గజ సంస్థల సీఈవోలకు మోదీ పిలుపిచ్చారు. 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిత' అంటూ ఐరాసలో నినదించిన ప్రధాని- విశ్వమానవ కల్యాణమే భారతదేశ స్వప్నమని విశదీకరించారు. మఖలో పుట్టి పుబ్బలో మాడిపోతుందంటూ చైనా గతంలో 'క్వాడ్'పై చిర్రుబుర్రులాడింది. అందుకు భిన్నంగా, వేగంగా మారుతున్న అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో 'క్వాడ్' క్రియాశీల పాత్రధారి అవుతోంది. కూటమి సభ్యదేశాల ఐకమత్యమే జగడాల మారి చైనాను నిలువరించడంలో కీలకం కానుంది!



సంపాదించిన డబ్బూ అధికారమూ విజయానికి కొలమానాలు కావు. ఇతరుల మీద ఎంత ప్రభావం చూపామన్నది నిజమైన విజయం. వినయశీలురే ఆ ప్రభావం చూపగలరు. వినయం విద్యతోనే వస్తుంది. నేర్చుకునే అవకాశాన్ని కల్పించడమే ఇతరులకు మీరిచ్చే గొప్ప బహుమతి.

– ఈశ్వరచంద్ర విద్యాసాగర్

జనజీవన సుధ

భారతీయ సమాజంలో రామాయణం గురించి తెలియని వారుండరు. ఈ కావ్యాన్ని విని, చదివినంత మాత్రాన ప్రయోజనం ఉండదు. అందులోని విలువలను అర్థం చేసుకొని పాటించినప్పుడే మన ప్రవర్తనలో పరివర్తనకు అవకాశం ఉంటుంది. రామాయణంలో నాయక పాత్రల్ని గుర్తుచేసుకొంటే ఏదో తెలియని ఉత్తేజం, ఉల్లాసం ఎగిసిపడతాయి. వారిపట్ల ఆరాధనాభావం కలుగుతుంది. కానీ ప్రతినాయకుల్ని గుర్తుచేసుకొంటే ఆవేశం పెల్లుబికి వారిపట్ల ప్రతీకార, తిరస్కార భావాలు ఏర్పడతాయి. మనిషి ఎలా ఉండాలి, ఎలా ఉండకూడదనే విచక్షణా జ్ఞానం అందరిలోనూ ఉంటుంది. కాకపోతే తనలో ఉన్నవన్నీ నాయకుడి లక్షణాలే, ప్రతినాయకుడి గుణాలు మచ్చుకైనా లేవని ఎవరికివారు భావిస్తుంటారు. ఎదుటి వాణ్నే మాత్రం ప్రతినాయకుడిగా ఊహించడం చాలామందిలో ఉన్న దుర్గుణం. ఈ తత్త్వం మనిషి ఎదుగుదలకు అడ్డుగోడ వంటిది. ప్రతి ఒక్కరిలోనూ రెండు రకాల గుణాలూ ఉంటాయి. నాయకుడి గుణాలు బయటికొస్తే ప్రశంసలు కురుస్తాయి. ప్రతినాయకుడి లక్షణాలు విజృంభిస్తే అరాచకం, అశాంతి నెలకొంటాయి..



అంతర్యామి

రామాయణాన్ని మంథర మలుపు తిప్పింది. మాయమాటలతో కైక మనసు విరిచింది. కేవలం మంథర వక్రబుద్ధే రాముణ్ని అడవులకు పంపి, దశరథుడి ప్రాణాలు తీసింది. వ్యక్తిలోని దుర్గుణాలు బయటికి వచ్చాయంటే ఊహకు అందని విషవలయం ఏర్పడి అపార్థాలు సృష్టిస్తుంది. మంథరలా మాట్లాడేవారు సమాజంలో చాలామంది ఉంటారు. అయోధ్యకు తిరిగొచ్చిన భరతుడు జరిగినదంతా తెలుసుకుని కోపంతో తల్లిని దూషించాడు. తిన్నగా రాముడి దగ్గరికెళ్లి అయోధ్యకు తిరిగి రమ్మని బతిమలాడాడు. చివరికి పాదుకల్ని తీసుకెళ్ళి పట్టాభిషేకం చేసి అధికారానికి, కీర్తి ప్రతిష్ఠలకు అతీతుడినని నిరూపించుకొన్నాడు. ఇవన్నీ చూసి భరతుణ్ని కొనియాడుతున్నామే కానీ ఆయన ఆదర్శభావాలను మనం ఎంతవరకు ఆచరించగల్గుతున్నాం?

రామలక్ష్మణులను చూసి శూర్పణఖ మోహించింది. వారు తిరస్కరించారు. అందుకామె తన అన్న రావణుడితో వారిపై లేనిపోనివన్నీ కల్పించి చెప్పింది. ఫలితంగా యుద్ధం జరిగి రావణుడు మరణించాడు. రావణుడు సీతమ్మను తీసుకువెళ్తుండగా జటాయువు అడ్డుపడి అతడితో పోరాడి అసువులు బాసింది. నేటి సమాజంలో పట్టపగలే ఆడపడుచుల పట్ల అకృత్యాలు, అత్యాచారాలు జరుగుతుంటే చూస్తూ వెళ్లిపోతుంటారు చాలామంది. .

ప్రతి వ్యక్తి తన జీవితంలో ప్రేమ, దయ, నిస్వార్థం, త్యాగం, పరోపకార గుణం అనే ఐదు దైవీ గుణాలను అలవరచుకొని మంచి మార్గాన ముందుకెళ్లాలి. క్రూరత్వం, కపట స్వభావం, నిర్దయ, స్వార్థ బుద్ధి వంటి అసుర గుణాలను దరిచేరనివ్వకూడదు. మనిషి ఎలా ఉండాలో ఎలా ఉండకూడదో రామాయణ పాత్రలు చక్కగా చెప్పాయి. ఈ కావ్యం బోధించిన జీవన విలువల్ని అర్థం చేసుకొని పాటించగలిగితే మానవజన్మ ధన్యం.

– యం.సి.శివశంకరశాస్త్రి

వేంకటనాథా... క్షమించు స్వామీ!

తిరుమల.. పురాణ ప్రసిద్ధి చెందిన అత్యంత ప్రాచీన మహాక్షేత్రం. చారిత్రకంగా కూడా చాలా ప్రాధాన్యం కలిగిన దివ్యధామం. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలవారి భక్తిశ్రద్ధలకు అది ప్రముఖ కేంద్రం. ఎందరో చక్రవర్తులు, భక్తయోగులు కొలుచుకున్న సంస్కృతీ సౌధం: వైఖానస ఆగమరీతులతో అర్చనా విధానాలు జరుగుతున్న సంప్రదాయ పరంపర ఈ శేషాచలానికి ఉంది. ఇక్కడ శ్రీవేంకటేశ్వరుడు సర్వదేవతాత్మకుడైన నారాయణ పరబ్రహ్మమని రుషుల ప్రతిపాదన. ఈ విష్ణువిరాణ్మూర్తి సాక్షాత్ వైకుంఠవాసుడే!

స్వామి కైంకర్యంలో నైవేద్యాలకు పురాతనకాలం నుంచి ప్రాముఖ్యముంది. 'తిండి మెండయ్య' అనే పేరు కూడా ప్రసిద్ధిలో ఉంది. కొన్ని వందల సంవత్సరాల నుంచి ఈ క్షేత్రంలో భక్తుల కోసం లడ్డూ ప్రసాదం అందిస్తున్నట్లు కొన్ని ఆధారాలు చెబుతున్నాయి. కానీ లడ్డుకాలు, పేణీలు, వడలు- వంటివి ప్రాచీన కాలం నుంచే నివేదనలో భాగాలుగా ఉన్నాయని ఆగమజ్ఞుల మాట.

ఎన్నో మహిమానుభవాలతో కోట్లాది భక్తులకు శ్రీనివాసుడితో అనుబంధముంది. లడ్డూ ప్రసాదం పట్ల పవిత్రమైన భావముంది. ఈ భావనాబంధానికి విఘాతం కలిగించే రాజకీయ స్వార్థం, అవినీతి, అవిశ్వాసం క్షమార్హాలు కావు.

సనాతన ధర్మంలో భగవంతుణ్ని నిరాకారంగానూ, సాకారంగానూ ఆరాధిస్తారు. నిర్గుణుడే లోకనిర్వహణ కోసం సగుణుడై, భక్తులను అనుగ్రహించడానికి సాకారుడై పూజలు అందుకుంటాడు. నిరాకారుడిగా ఏకం. సాకారుడిగా అనేకం. ఈ ఏక, అనేక సమన్వయం ఒక అద్భుతం.

ఈ సాకార భగవత్ స్వరూపాలను విగ్రహాలుగా మలచి; మంత్ర, శాస్త్ర పద్ధతులతో అర్చన కైంకర్యాల ద్వారా దివ్యశక్తిని ప్రతిష్ఠించే శాస్త్రాన్ని 'ఆగమశాస్త్రం' అంటారు. ఇది అనేక గ్రంథాలుగా లభ్యమవుతుంది. ఒక్కొక్క ఆలయంలో మూర్తిని అనుసరించి ఆరాధనా పద్ధతులుంటాయి. అవి వేదాగమ సంప్రదాయాలను అనుసరించి సాగుతాయి.

ఈ క్షేత్రాల ఆలయాల మూర్తుల్లో కొన్ని స్వయంభువులు- కొన్ని మానవ ప్రతిష్ఠాలు. ఈ రెండు రకాల ఆలయాల్లోనూ ఆగమానుసారంగా నిత్యకైంకర్యాలు, మంత్రపూర్వక అనుష్ఠానాలు పవిత్రతనీ, దివ్యత్వాన్నీ ప్రోదిచేస్తాయి. అవి ప్రకృతికీ, ప్రజలకీ క్షేమం కలిగించే పద్ధతులతో ఉంటాయి.

శుద్ధత, నాణ్యత, పవిత్రత...

అభిషేకం, ధూపం, దీపం, పుష్ప పత్రార్చన, నైవేద్యం, మంగళహారతి... మొదలైనవి నిత్యపూజలు. అవికాక వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలు; ప్రత్యేక తిథుల, పర్వాల యాగాదులు ఆలయానికి మహాశక్తిని కేంద్రీకరిస్తాయనేది శాస్త్రవచనం. ఇలా వివిధోత్సవ కైంకర్య విధులతో ఉన్న ఆలయాలను దర్శించడం, మూర్తులకు నమస్కరించడం తమను అనుగ్రహిస్తుందని, శాంతిని చేకూరుస్తుందని భక్తుల విశ్వాసం. విశ్వాసం తర్కాలకు అందని మనోభావం. దాని ప్రభావం బలీయమైనది కూడా.

భగవంతుడికి సమర్పించే పదార్థాలు, ప్రసాదాలై మనకు లభిస్తాయి. ఆయనకు సమర్పించే వరకు పదార్థాలుగా విడివిడి పేర్లుంటాయి. నివేదించిన తరవాత అన్నింటికీ 'ప్రసాదం' అనే ఒక్క పేరు ఉంటుంది. నివేదనకు పక్వాలు (వండినవి), అపక్వాలు (వండనివి)- పళ్ల వంటివి వినియోగిస్తారు. పక్వం చేసేటప్పుడు ప్రత్యేక దీక్షతో, సదాచారంతో వ్యవహరించాలి. వాటిని మూర్తి సమీపంలో



ఉంచి, పవిత్ర మంత్రజలాలను ప్రోక్షించి, ప్రత్యేక మంత్రాలతో అభిమంత్రించి నివేదిస్తారు. దేవతా దృష్టి ప్రసరించి ఆ పదార్థాలు ప్రసాదాలవుతాయి. అవి దేవతాశక్తిని నింపుకొంటాయి. శాస్త్రంపై ఉన్న ఈ నమ్మకాన్నే 'శ్రద్ధ' అంటారు. అలాంటి శ్రద్ధతో భక్తులు వాటిని స్వీకరిస్తారు. వండిన దధ్యోదనం (పెరుగన్నం), చక్కెరపొంగలి వంటివి ఆలయ సమీపంలోనే భక్తులు వినియోగిస్తారు. లడ్డు, కాజా- వంటి తైల, ఘృత(నూనె, నేతి) వంటకాలను భక్తిగా తమ ఇళ్లకు తీసుకెళ్లి, బంధుమిత్రులతో పంచుకుంటారు. ఇంచుమించుగా ప్రతి క్షేత్రంలోనూ ఇది ఆనవాయితీ. భగవంతుడికి ఉపయోగించే ప్రతి ద్రవ్యానికీ శుద్ధత, నాణ్యత, పవిత్రత- ఉండాలన్నది సంప్రదాయ నియమం.

దేవతలు శుద్ధ సత్త్వగుణ శక్తిమంతులు. అందుకని సాత్త్వికపదార్థాలే నివేదించాలి. అందుకే దేవతామూర్తులకు శాకాహారం, మధుర పదార్థాలు, ధాన్యాలు, పప్పుదినుసులు వండి నివేదిస్తారు. ఆలయాల్లో కచ్చితంగా సాత్త్విక పదార్థాలు, శాస్త్రోక్తంగా సంప్రదాయ సదాచారాలతో వండి నివేదించాలి. వాటిలో మాంస, మాదకద్రవ్యాలు నిషిద్ధాలు. అటువంటివి కలిస్తే అపచారమన్నది- శాస్త్ర నిర్దేశం.


ఆగమాది శాస్త్రాల ప్రకారం దేశీయ ఆవు పాలు, పెరుగు, నెయ్యి మాత్రమే వినియోగిస్తారు. వేరుశెనగ, నువ్వులనూనె వంటివి మాత్రమే వాడతారు. దేవతలు అమృతాన్ని ఆహారంగా స్వీకరిస్తారు కనుక, ఆహారాన్ని అమృతంగా మార్చే పద్ధతులను శాస్త్రాలు బోధించాయి. 'భూమియందు దొరికే అమృతం ఆవుపాలు' అని మహాభారతంలో భీష్మ పితామహుడు వర్ణించాడు. అందుకే ఆవుపాలతో వండిన అన్నం పరమాన్నమై ఆవు పెరుగుతో చేసింది దధ్యోదనమై, ఆవునెయ్యి వేసి నైవేద్యం పెడితే పవిత్రమై, ఆవునేతితో వండిన మధుర పదార్థాలు పావన ప్రసాదాలై ఒక దివ్య భావాన్ని కలిగిస్తాయి. బెల్లం, ఖండశర్కర (కండచక్కెర) శ్రేష్ఠాలుగా చెబుతారు. జీవ'హింస' లేని ఆహారాలే భగవన్నివేదనలో ఉండాలని నియమం. ఆవు అనగానే 'దేశీయ గోవు మాత్రమే' అని స్పష్టంగా గుర్తుపెట్టుకోవాలి. ఇన్ని నియమాలు శాస్త్రప్రోక్తాలు కనుక, వాటికి విరుద్ధంగా ప్రవర్తిస్తే తీవ్ర అపచారమై, దోష ఫలితాన్ని అనుభవించాల్సి వస్తుందని కూడా ధార్మిక గ్రంథాలు హెచ్చరించాయి.

దైవాపచారం

వేల సంవత్సరాల చరిత్ర ఉన్న తిరుమల వంటి ఆలయాల్లో ప్రాచీన కాలం నుంచి వివిధ నైవేద్యాలు సంప్రదాయంగా ఉన్నాయి. అన్నమయ్య తన కీర్తనల్లోనూ స్వామికి పెట్టే నైవేద్యాలు బోలెడు రకాలుగా ఉండేవని వర్ణించాడు. వివిధ నైవేద్యాలు అనేక శాంతులను కలిగిస్తాయి కూడా. అవి కనబడని సూక్ష్మ ప్రపంచానికి శాంతిని, కనిపించే ప్రకృతికి హాయినీ, భక్తుల శరీర మనస్సులకు ప్రసన్నతను కలిగిస్తాయని శాస్త్రవిజ్ఞుల వచనం. అలాంటి ప్రసాదాల్లో శాస్త్రవిరుద్ధంగా అవకతవకలు చేస్తే అనేక ప్రమాదాలు కలుగుతాయని కూడా తెలియజేశారు. శాస్త్రాపచారం దైవాపచారమవుతుంది. కోట్లమంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తుంది. అందుకే ఆలయ నిర్వహణలో రాజకీయ పలుకుబడి, ధన ప్రాధాన్యం ఉండకుండా శాస్త్ర విధుల పాలన, ఆలయ చరిత్ర-సంప్రదాయాలు తెలిసిన ఆస్తిక జనుల నిబద్ధత ముఖ్యంగా ఉండాలి.

నైతికంగా చూసినా, ధార్మికంగా భావించినా, ఆధ్యాత్మికంగా ఆలోచించినా దేవాలయ విధివిధానాలు అస్తవ్యస్తం కారాదు. ఏ వ్యవస్థను ఆ వ్యవస్థా సంప్రదాయంతో గౌరవించి నిర్వహించే సంస్కారవంతులు అధికారులుగా ఉండాలి. ధర్మవిరోధుల ఆగడాలకు ధార్మికులే సమాధానం చెప్పాలి.


'క్షమస్వత్వం శేషశైల శిఖామణే!' అని స్వామిని ప్రార్థించి, ఆలయ వ్యవస్థలను ధర్మానుగుణంగా సంస్కరించుకునే చైతన్యం రావాలని ఆశిద్దాం!



సామవేదం షణ్ముఖశర్మ
ఆధ్యాత్మికవేత్త

సింధు జలాలపై పాక్ పేచీ

సింధు నదీ జలాల పంపిణీ ఒప్పందాన్ని సమీక్షించాలని పట్టుపడుతున్న భారత్ ఈ విషయమై పాకిస్థాన్‌కు నోటీసు ఇచ్చింది. ఒప్పందంపై మళ్లీ సంప్రదింపులు జరపడానికి సిద్ధమేనని పాకిస్థాన్ అంటున్నా, వాస్తవంగా ఆ పని చేస్తుందా అన్నదే ప్రశ్నార్థకం.



ఆరు దశాబ్దాల క్రితం సింధు జలాల ఒప్పందం కుదిరిన తరవాత నుంచి పర్యావరణపరంగా, భౌగోళికంగా, రాజకీయంగా చాలా మార్పులు వచ్చాయి. వాటిని పరిగణనలోకి తీసుకుని ఒప్పందాన్ని సమీక్షించాల్సి ఉందని భారత్ స్పష్టం చేసింది. ఆ సమీక్ష జరగనంత వరకు పాకిస్థాన్‌తో చర్చలు జరిపే ప్రసక్తి లేదని ప్రకటించింది. దీనిపై పాక్ విదేశాంగ శాఖ ప్రతినిధి ముంతాజ్ జాహ్రా బలూచ్ స్పందిస్తూ సింధు ఒప్పందం అమలుకు పాకిస్థాన్ పూర్తిగా కట్టుబడి ఉందనీ, భారత్ కూడా అదే నిబద్ధత చూపుతుందని ఆశిస్తున్నామన్నారు.

సహకార యంత్రాంగం

సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. దీనిపై 1960 సెప్టెంబరులో నాటి భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం సింధు ఉపనదుల్లో తూర్పున పారే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారతదేశానికి హక్కులు లభించాయి. సింధు నదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చినాబ్‌లపై పాకిస్థాన్‌కు హక్కులు దత్తమయ్యాయి. ఈ నదీ జలాల వినియోగ సమాచారాన్ని పంచుకోవడానికి ఒప్పందం కింద ఓ సహకార యంత్రాంగాన్ని నెలకొల్పారు. సింధు, దాని ఉపనదుల జలాలను భారత్, పాక్‌లు పరస్పర స్నేహ, సహకార, సుహృద్భావాలతో పంచుకోవాలని ఒప్పంద పీఠిక నిర్దేశిస్తోంది. పశ్చిమ నదుల జలాలలో భారత్ వాటాను సేద్యానికి పరిమితంగా; జలవిద్యుదుత్పాదన, జల రవాణా, చేపల వేటకు గరిష్ఠంగా ఉపయోగించుకోవచ్చు. ఒప్పందం కింద శాశ్వత సింధు కమిషన్‌ను నెలకొల్పారు. అందులో రెండు దేశాల నుంచి చెరొక కమిషనర్ సభ్యులుగా ఉంటారు. ఒప్పందం అమలు గురించి ఏటా సమావేశాలు జరుగుతాయి. ఒక ఏడాది భారత్‌లో, మలి ఏడాది పాక్‌లో వాటిని జరపాలని ఒప్పందం నిర్దేశించింది.

భారత్‌లో సింధు పరీవాహక ప్రాంతం ఇలా...

రాష్ట్రం / యూటీ	విస్తీర్ణం
జమ్మూకశ్మీర్	60.31%
పంజాబ్	15.66%
హరియాణా	3.09%
హిమాచల్‌ప్రదేశ్	15.98%
రాజస్థాన్	4.92%
చండీగఢ్	0.04%

తాజా వివాదాలు

గడచిన ఆరు దశాబ్దాల్లో భారత్, పాక్‌ల మధ్య యుద్ధాలు జరిగినా, పలుమార్లు ఉద్రిక్తతలు నెలకొన్నా సింధు జలాల ఒప్పందం అమలుకు అవేవీ అడ్డురాలేదు. కానీ, ఇటీవలి కాలంలో డ్యామ్‌ల నిర్మాణం, నీటి వినియోగం, ఒప్పంద నిబంధనల అమలుకు సంబంధించి వివాదాలు తలెత్తాయి. ముఖ్యంగా పశ్చిమ నదులైన జీలం, చినాబ్‌లపై జమ్మూకశ్మీర్‌లో నిర్మితమవుతున్న జల విద్యుత్కేంద్రాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తోంది. కానీ, ఒప్పందం ప్రకారం ఈ ఉపనదుల జలాలను భారత్ సాగు కోసం పరిమితంగా, జలవిద్యుత్ కోసం గరిష్ఠంగా ఉపయోగించుకోవచ్చు. అయినా కిషన్‌గంగ, రాట్లే ప్రాజెక్టులపై పాకిస్థాన్ వివాదం లేవనెత్తి, మధ్యవర్తిత్వ కోర్టును ఏర్పాటు చేయాల్సిందిగా ప్రపంచబ్యాంకును కోరింది. ఏ వివాదాన్ని పరిష్కరించుకోవాలన్నా తటస్థ నిపుణుడిని నియమించాలని ఒప్పందం నిర్దేశిస్తోంది. ఈ అంశాన్నే భారత్ గుర్తుచేసింది. అయినా ప్రపంచబ్యాంకు అటు భారత్ కోరిన ప్రకారం మైకేల్ లీనోను తటస్థ నిపుణుడిగా, పాకిస్థాన్ కోరిన ప్రకారం షాన్ మర్ఫీ అధ్యక్షతన మధ్యవర్తిత్వ కోర్టునూ నియమించింది. ఇలా ఒకే సమస్యపై రెండు రకాలుగా చర్యలు తీసుకోవడం చట్టపరంగా, ఆచరణపరంగా సమస్యలకు దారితీస్తుందన్నది భారత్ వాదన. అందరూ సింధు జలాల ఒప్పందం ప్రకారమే నడచుకోవాలని ఇండియా స్పష్టం చేస్తోంది.

మార్పుల నేపథ్యంలో...

భారత ప్రభుత్వం 2023 జనవరిలో పాకిస్థాన్‌కు రాసిన లేఖలో సింధు నదీ జలాల పంపిణీ ఒప్పంద నియమనిబంధనలపై పునస్సమీక్ష జరపాల్సి ఉందని పేర్కొంది. 1960లో ఒప్పందం కుదిరిన నాటికీ ఇప్పటికీ రెండు దేశాల జనాభాలో, తాగు, సాగు నీటి అవసరాలలో చాలా మార్పులు వచ్చాయనీ, పర్యావరణ, భౌగోళిక, రాజకీయపరంగా కూడా మార్పులు చోటు చేసుకున్నాయని గుర్తుచేసింది. ఈ అంశాలను విచారించి పరిష్కరించే సామర్థ్యం షాన్ మర్ఫీ నేతృత్వంలోని కోర్టుకు ఉందని నిరుడు జులైలో అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టు తీర్మానించింది. తద్వారా పాక్ వైఖరిని సమర్థించింది. దాంతో ఈ మధ్యవర్తిత్వ కోర్టు ఇవ్వబోయే ఏ తీర్పునూ తాను గౌరవించబోనని భారత్ స్పష్టం చేసింది. ఈ కోర్టు నియామకం సింధు నదీ జలాల ఒప్పందానికి విరుద్ధమని భారత్ తేల్చిచెప్పింది. పైగా తటస్థ నిపుణుడు మైకేల్ లీనో ఇప్పటికీ ఈ వివాదాన్ని పరిశీలిస్తున్నారని గుర్తు చేసింది. దీనికి సమాంతరంగా మధ్యవర్తిత్వ కోర్టును నియమించడమేంటని నిలదీసింది. ఈ నేపథ్యంలో సింధు నదీ జలాల ఒప్పంద సమీక్షను చేపడదామని భారత్ 2023 జనవరిలో పాకిస్థాన్‌కు సూచించింది. ఆ తరవాత పలుమార్లు ఈ అంశాన్ని గుర్తుచేసింది. చివరగా ఈ ఏడాది ఆగస్టు 30న పాకిస్థాన్‌కు అల్టిమేటం జారీచేసింది. ఇక పాకిస్థాన్ సంప్రదింపులకు దిగివస్తుందా లేదా అన్నది వేచిచూడాలి.

– అరుణిమ్ భుయాన్

సర్లే... ఊరుకో!

ఇప్పుడూ.. కూరలో చెంచాతో ఉప్పేస్తున్నప్పుడు పొరపాటున చెయ్యిజారి స్పూన్ అందులో పడిపోయిందనుకోండి! అయ్యో అని తీసి కడుక్కుంటాం కానీ కూర పారేసుకోం కదా? మరి అంతటి ఉపద్రవాన్ని(ఉప్పు ద్రవాన్ని) సైతం తగ్గని పొట్టని తీసుకున్నట్టు తేలిగ్గా తీసుకున్నప్పుడు, మిగతా విషయాల్లో అంతటి పాజిటివ్ సానుకూల ప్రశాంత చిత్తం ఎందుకుండదు? అన్నింటికీ కట్టేసిన కుక్కపిల్లలా భౌభౌమనడం, కొమ్మ మీద కాకిలా గోలగోల చేయడం, కాలుగాలిన పిల్లిలా అటూఇటూ తిరగడం, చెవికాడ జోరీగలా రాగాలు తీయడం అవసరమా మనకి..!

ఊరుకున్నోడితో ఊరంతా చాల్లేరని సామెత. కాకపోతే మనం ఆ ఊరుకోవడం అన్న కాన్సెప్ట్ మర్చిపోయి ఊరంతటికీ కాదు కదా.. కనీసం ఇంట్లో వాళ్లకి కూడా మనతో చాలే అవకాశం ఇవ్వడం లేదు. ఏమైనా అంటే.. 'రోజంతా బోలెడు కష్టపడి ఇంటికొస్తాం, ఆమాత్రం చిరాకు ఉండదా?' అని ఎదురుప్రశ్న ఒకటి.



కష్టపడి చిరాగ్గా ఇంటికొచ్చారు కాబట్టే కదా.. ఇంట్లో వారితో నిద్రపోయే వరకూ సరదాగా గడపాల్సింది! అది మానేసి ప్రెజర్ కుక్కర్‌లో పప్పులా ఎప్పుడు బుస్సుమందామా అని చూస్తే ఎలా అసలు.. హౌ? ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్సవుతున్నారు?

అదేంటో విచిత్రం.. ఎక్కడలేని సాఫ్ట్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్సూ కోచింగ్ క్లాసుల్లో బోలెడు ఫీజులు కట్టి మరీ నేర్చేసుకుని, వీధి అవతల వంకాయలు అమ్మే చోట, ఆఫీసులో అరిచే బాసు దగ్గర, మెట్రోలో మొహాలైనా చూడని వాళ్ల దగ్గర చూపిస్తామే తప్ప, ఇంట్లో మాత్రం వాటిని మడిచి మూలకు విసిరేస్తాం. అసలు కలిసి ఒక ఇంట్లో, ఒకేచోట బతకాల్సిన వారి మధ్యే కదా ఆ జాగ్రత్త ఉండాలి. ఎక్కడో లోకువ.. ఇంట్లో వారే కదా, ఎక్కడికి పోతార్లే అని! చిన్నప్పటి నాన్న- మేకుల కథ గుర్తుందా! కోపం వచ్చి మేకు కొట్టి, కోపం తీరాక దాన్ని తీసేసినా.. అది చేసిన రంధ్రం మాత్రం అలాగే ఉంటుంది. అచ్చం మనసుకైన గాయంలాగే!

అందుచేత.. ఊరుకో నాయకా! ఇల్లు పీకి పందిరేయక, రాకెట్టులా అంతెత్తున లేవక, మతాబులా ఊరికే పేలక.. కాస్త ఊరుకో. అగ్గిలా భగ్గుమనేచోట మంచు పర్వతాలైనా ఆవిరి కాక తప్పనట్టు.. నిత్యం ధుమధుమలాడే మనుషుల చుట్టూ మంచి మనసులేవీ నిలవలేవు, అవసరాలు - అవకాశాల కోసం వేచి చూసేవారు తప్ప. ఒక్కసారి ఊరుకుని చూస్తే, ఊరూ ఇల్లూ అంతా ప్రశాంతంగా ఉంటుంది. ఊరుకున్నంత ఉత్తమం లేదన్న బామ్మ మాట బంగారం మూటే. అలాగని ఊరకే మూతి ముడుచుకుని కూర్చోకుండా అందరితోనూ కాస్త కలివిడిగా ఉన్నామనుకోండి.. అప్పుడు జీవితం ఆదివారం బిర్యానీలాగా, కరెక్షన్స్ లేని కోడ్‌లాగా, రిపేరు రాని బైక్ లాగా ప్రశాంతంగా ఉంటుంది.. ఏమంటారు?

– మౌళిక

నిజాయతీ!

హాయ్! బుజ్జీ!!

నరసింహపురంలో రామయ్య తన కుటుంబంతో నివాసం ఉండేవాడు. ఒకసారి పని కోసం పొరుగూరికి బయలుదేరాడు. దారిలో ఒక వంద రూపాయల నోటు కనిపించింది. అది తీసుకొని.. 'అయ్యో ఎవరిదో ఈ నోటు పాపం' అని కాస్త గట్టిగా అన్నాడు. పక్కనే దుకాణంలో ఉన్న ఓ వ్యక్తి, అక్కడే అరటిపండ్లు అమ్ముకునే మరో వ్యక్తి ఆ మాటలు విని రామయ్య దగ్గరకు వెళ్లారు. ఆ నోటు నాదంటే.. నాదని గొడవకు దిగారు. అప్పుడు రామయ్య.. 'ఈ డబ్బు నిజంగా మీదైతేనే.. తీసుకోండి. ఎవరో కష్టపడి సంపాదించుకున్నది. పాపం వాళ్లు ఎంత బాధపడుతుంటారో! దొరికింది కదా.. అని తీసుకోవడం మంచి పద్ధతి కాదు' అన్నాడు. అప్పుడు వాళ్లిద్దరూ.. 'క్షమించండి! ఇవి మావి కాదు!' అన్నారు. దాంతో రామయ్య కాసేపు అక్కడే ఎదురుచూశాడు. కానీ ఎవరూ రాకపోవడంతో.. ఆ వంద రూపాయలు తీసుకొని ముందుకు కదిలాడు.



కాస్త దూరం వెళ్లాక అక్కడ ఇద్దరు వృద్ధులు ఎదురై.. 'అయ్యా! మాకు చాలా ఆకలిగా ఉంది. ఉదయం నుంచి ఏమీ తినలేదు. కాస్త సాయం చేయండి' అని అడిగారు. వెంటనే రామయ్య ఆ వంద రూపాయలు వారికి ఇచ్చేశాడు. ఇంతలో వెనక నుంచి.. ఒకబ్బాయి ఏడ్చుకుంటూ వచ్చి 'ఈ దారిలో మీకు వంద రూపాయల నోటు కనిపించిందా?' అని అడిగాడు. అది విన్న రామయ్య 'దొరికింది.. కానీ ఎవరూ రాకపోవడంతో ఇప్పుడే వృద్ధులకు ఇచ్చేశాను. దానికి బదులుగా నీకు ఇంకో నోటు ఇస్తాలే!' అంటూ తన జేబులోని వంద నోటును ఇవ్వబోయాడు. అప్పుడే ఒక వ్యక్తి వచ్చి.. 'మా సత్రంలో ఒక కొలువుంది. దానికి నిజాయతీపరుడైన వ్యక్తి కోసం వెతుకుతున్నాం. దానిలో భాగంగానే ఆ నోటును అక్కడ వేశాం. మేము పెట్టిన పరీక్షలో మీరు విజయం సాధించారు' అన్నాడు. ఉద్యోగం కోసమే వెతుకుతున్న రామయ్యకు ఆ వార్త చాలా ఆనందాన్ని కలిగించింది.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య


ఒకే అక్షరం

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటి పదం చివరి అక్షరంతోనే రెండోది ప్రారంభమవుతుంది. ఓసారి ప్రయత్నించండి.

1.	గెలిచినప్పుడు ఇచ్చేది	☐☐కం☐☐	చేతికి ధరించేది
2.	వంద మరోలా..	☐☐కం☐	అడ్డుగా వేసేది
3.	స్వర్గం కానిది..	☐☐కం☐	గొంతు
4.	కుక్క	☐☐కం☐☐	ఒక జీవి
5.	గుర్తు	☐☐కం☐	పళ్లెం మరోలా..



కష్టంలో తోడుగా.. నష్టంలో చేదోడుగా..



- తక్కువ సమయంలో వైపరీత్యాన్ని దాటేశాం
- ఏకంగా 15 రోజుల్లోనే పరిహారం అందజేత
- ఈనెల 30లోగా చివరి బాధితుడికీ సాయం
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన

ఈనాడు డిజిటల్, అమరావతి

"భారీ వర్షాలు.. వరదలకు అనేక ప్రాంతాలు నీటమునిగాయి. బుడమేరు ముంచెత్తి.. విజయవాడ అతలాకుతలమైంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు ఏకమయ్యారు. ఉద్యమంలా అంతా కదిలారు. దీంతో 10 రోజుల్లోనే విపత్తు నుంచి బయటపడగలిగాం."

- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో బుధవారం వరద బాధితులకు పరిహారం విడుదల చేశారు. అనంతరం మీడియాతో చంద్రబాబు మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా 32 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైతే.. ఒక్క విజయవాడలోనే 42 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుడమేరు కట్టలన్నీ గత ప్రభుత్వంలో ఆక్రమణలకు గురవడంతో వరద ఉద్ధృతికి గండ్లు పడ్డాయి. ఫలితంగా నగరం నీటమునిగిందన్నారు.

జిల్లాకు సీఎం విడుదల చేసిన నష్టపరిహారం వివరాలు..

	ఎన్ని	ఒక్కోదానికి (రూ.వేలు)	పరిహారం (రూ.కోట్లు)
మొత్తం ఇళ్లు	78,558		
గ్రౌండ్ ఫ్లోర్	64,799	25	161.99
మొదటి అంతస్తు, ఆపైన	13,759	10	13.76
ద్విచక్ర వాహనాలు	44,402	3	13.22
ఆటోలు	4,348	10	4.34
చనిపోయిన పశుసంపద, మనుషులకు			6.83
వ్యవసాయ పంటలు హెక్టార్లు	1,12,345	25	278
హార్టికల్చర్ (హెక్టార్లు)	9,236	35	32.67
తోపుడు బళ్లు	1,243	20	2.48
కిరాణా షాపులు, హోటళ్లు	5,181	25	12.97
చిన్నతరహా పరిశ్రమలు	2,500	50	12.50
మధ్య తరహా పరిశ్రమలు	469	రూ.లక్ష	4.69
పెద్ద తరహా పరిశ్రమలు	197	1.5లక్ష	2.95

నగరంలోనే అధిక నష్టం..

చరిత్రలో విజయవాడకు ఎప్పుడూ రాని వరద ముంచెత్తింది. బుడమేరుకు గండ్లు పడడంతో నగరంలోనే అధిక నష్టం జరిగింది. అనేక ఇళ్లు, గృహోపకరణాలు, వాహనాలు, వ్యాపార సముదాయాలు, పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. వరద తగ్గిన 15 రోజుల్లోనే నష్టాన్ని అంచనా వేసి, పరిహారాన్ని అందించామన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ ఎన్నడూ ఇవ్వనంత పరిహారాన్ని అందించామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకులు, ప్రైవేటు ఏజెన్సీల ద్వారా బాధితులకు రుణాలు, గృహోపకరణాల మరమ్మతులు, వాహనాల ఇన్సూరెన్సు క్లెయిమ్‌లు చేశామన్నారు. నగరంలో కొత్తగా 18 వేలు దరఖాస్తులు వచ్చాయనీ, వాటిలో 5 వేల దరఖాస్తుల వరకు నకిలీవన్నారు. మిగిలినవి పునఃపరిశీలించి పరిహారాన్ని అందిస్తామన్నారు. చిన్నచిన్న సమస్యలను ఈ నెల 30వ తేదీ లోగా పరిష్కరిస్తామన్నారు.



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. పక్కన మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్, మంత్రులు సత్యకుమార్, పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి



కలెక్టరేట్ వద్ద సీఎం అభివాదం

యంత్రాంగం కృషి భేష్

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ పరంగా సేవలందించడంతో జిల్లా యంత్రాంగం సమర్థంగా పని చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. వరద బాధితులకు నష్టపరిహారం అందించేందుకు జిల్లా కలెక్టరేట్‌కు వచ్చిన ముఖ్యమంత్రి బ్యాంకింగ్, బీమా సంస్థల ప్రతినిధులతో పాటు ఎన్యూమరేషన్‌లో భాగమైన జిల్లా అధికారులతో మాట్లాడారు. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంగా నష్ట గణన వేసేలా సమర్థంగా పనిచేసిన కలెక్టర్ సృజనను ప్రత్యేకంగా అభినందించారు.


కన్నబిడ్డలా చూసుకున్నారు..

– సమీరున్నీసా, రామలింగేశ్వర నగర్, విజయవాడ

మేం రామలింగేశ్వర నగర్‌లో ఉంటాం. మా కాలనీకి వరదొచ్చిన మొదటి రోజు చాలా ఇబ్బంది పడ్డాం. రాత్రంతా నిద్రలేకుండా గడిపాం. తర్వాత రోజు పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడ మూడు పూటలా నాణ్యమైన భోజనం పెట్టారు. కన్నబిడ్డలా చూసుకున్నారు. వరదకు ఇంట్లో వస్తువులన్నీ దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ప్రకటించిన ఈ రూ.25వేలు ఆర్థిక సహాయంతో వస్తువులన్నీ సమకూర్చుకుంటాం. సీఎంకు రుణపడి ఉంటాం.

మళ్లీ దుకాణం ప్రారంభిస్తా

– మహ్మద్ రఫీ, కిరాణా షాపు, కండ్రిక



మా ఇంట్లో నలుగురం ఉంటాం. మాకు కిరాణా దుకాణమే జీవనాధారం. రాత్రికి రాత్రి వరద ముంచెత్తింది. ఇల్లు.. దుకాణం నీటమునిగాయి. వరద ఉన్నన్ని రోజులూ.. ఆహారానికి కొరత లేకుండా ఇచ్చారు. పడవపైన సీఎం పర్యటించి మా సమస్యలు తెలుసుకున్నారు. కిరాణా దుకాణానికి రూ.5 వేలు వస్తుందనుకున్నా. ఊహించిన దాని కంటే.. ఎక్కువగా రూ.25 వేలు సాయం చేశారు. దీంతో దుకాణాన్ని మళ్లీ ప్రారంభిస్తాను.

ప్రభుత్వ అన్ని విధాలుగా ఆదుకుంది

- సాపావతి కుమారి, రామలింగేశ్వరనగర్, విజయవాడ



మా ప్రాంతంలో మూడు రోజులు వరద నిల్వ ఉంది. పడవల ద్వారా ఆహారం, మంచి నీరు సంవృద్ధిగా అందించారు. వరద నుంచి తేరుకున్నాక కూడా బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇంట్లో సామగ్రి తడిచి పాడయ్యాయి. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి మా సమస్యలు తీసుకెళ్లాం. అధికారులు వచ్చి ఇంటిని పరిశీలించారు. రూ.25 వేలు ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంది.

కొండ పైనుంచి దిగే..

మార్గాలు సిద్ధం

- శివాలయం మెట్ల పక్కనే భారీగా తాత్కాలిక ఏర్పాట్లు

ఈనాడు, అమరావతి

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలకు మరో వారం రోజులే ఉండడంతో.. నిర్వహణ ఏర్పాట్లు త్వరితగతిన సాగుతున్నాయి. భక్తులు కొండ దిగువ నుంచి ఐదు లైన్లలో దర్శనాలకు వెళ్లి.. తిరిగి కిందకు దిగేందుకు రెండు మూడు మార్గాలను ఈసారి వినియోగించాలని భావిస్తున్నారు. ఈసారి శివాలయం మెట్ల మార్గం లేకపోవడంతో.. ప్రధానంగా దిగే మార్గాలపైనే దృష్టిసారించారు. ఈ నేపథ్యంలోనే శివాలయం మెట్ల మార్గం పక్కనే తాత్కాలిక మెట్ల మార్గాన్ని సిద్ధం చేశారు. విశాలంగా ఉండేలా.. భారీ ఇనుప మెట్ల మార్గాన్ని భక్తుల కోసం ఏర్పాటు చేశారు. ఈ మార్గాన్ని నగర పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు బుధవారం పరిశీలించి.. సంతృప్తి వ్యక్తం చేశారు. దీనితో పాటు మహామండపం ర్యాంప్, మెట్ల మార్గాలు కూడా భక్తులు దిగేందుకు వాడనున్నట్టు ఈవో రామారావు వెల్లడించారు.

శరవేగంగా...

ఘాట్‌రోడ్డులో ప్రస్తుతం క్యూలైన్ల పనులు చేపడుతున్నారు. టోల్‌గేట్ దాటాక మొదటి మలుపు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయింది. క్యూలైన్లు, వాటిపైన రెయిన్‌ప్రూఫ్ పైకప్పు, ప్రసాదాలు, టిక్కెట్ కౌంటర్లు, వైద్యారోగ్యశాఖ సహా అన్ని విభాగాలు సేవలు అందించేలా షామియానాల ఏర్పాటు, కేశఖండనశాల, స్నానాల ఘాట్లలో సౌకర్యాలు చేపడుతున్నారు. రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ సత్యనారాయణ దుర్గగుడిలో దసరా ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం సమీక్షించారు. ప్రధానంగా ఇంజినీరింగ్ పనులు, ఘాట్‌రోడ్డులో సౌకర్యాలు, ప్రముఖులు, దివ్యాంగులు, వృద్ధుల దర్శనాలకు ప్రత్యేక సమయం కేటాయింపు, ఉభయదాతలకు వాహనాల ఏర్పాటు, ఆలయ అలంకరణ, లైటింగ్, కౌంటర్లు, ఉచిత ప్రసాదం, అన్నదానం, పది రోజులు భక్తులకు సరిపడా ప్రసాదాల విక్రయాలు, నిరుడు ఇబ్బందులు అధిగమించాల్సిన చర్యలను సమీక్షించారు. పనుల పురోగతిపై.. ఈవో రామారావు, ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాల్లో ఏటా ప్రధానంగా ఎదురయ్యే సమస్య వీఐపీ, వీవీఐపీల రాకపోకలే. పెద్ద సంఖ్యలో కార్లలో ఘాట్ రోడ్డుపైకి ప్రముఖులు అన్ని వేళల్లా వచ్చేస్తుండడంతో సాధారణ భక్తుల దర్శనాలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. దసరా తొమ్మిది రోజులు. ప్రధాన ఆలయం చుట్టుపక్కల, మెట్ల మార్గాల్లో సిఫార్సులతో వచ్చేవారు, ప్రముఖుల రద్దీ విపరీతంగా ఉంటుంది. దీంతో సాధారణ క్యూలైన్లలో భక్తుల దర్శనాలు ఆలస్యం అవుతుంటాయి. అందుకే ఈసారి అలా జరగకుండా ప్రముఖులకు ఉదయం 8-10 గంటలు, మధ్యాహ్నం 2-4గంటల మధ్యలోనే దర్శనాలకు రావాలని ప్రత్యేక సమయాన్ని కేటాయిస్తున్నారు. దివ్యాంగులు, వృద్ధులకు కూడా సాయంత్రం 04-05 గంటల మధ్యలోనే ప్రత్యేక దర్శనాలకు అనుమతించాలని ప్రాథమికంగా నిర్ధరించారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాల ముందు నిర్వహించబోయే సమావేశంలో ఈ ప్రత్యేక సమయాలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.



దుర్గాఘాట్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన నదీ హారతి

నిత్య హారతుల ట్రయల్ రన్..

దుర్గాఘాట్‌లోనే ఈసారి నదీ హారతులు కొనసాగించనున్నారు. ఇప్పటికే ఘాట్‌లో పంట్‌లపై నవ హారతుల ట్రయల్‌రన్‌ను నిత్యం కొనసాగిస్తున్నారు. నగరానికి సమీపంలోనే ఘాట్ ఉండడంతో ఆలయానికి నిత్యం తరలివచ్చే వేల మంది భక్తులు వీక్షించే వీలుందనీ, ఇక్కడే హారతులను నిర్వహించాలని నిర్ణయించారు. ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం ప్రాంతంలో కృష్ణా, గోదావరి నదులు కలిసే ప్రాంతంలో గతంలో హారతులు వైభవంగా నిర్వహించారు. ఇప్పుడు కూడా అక్కడే నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని తొలుత భావించారు. కానీ.. అక్కడ పూర్తి ఏర్పాట్లు చేసే వరకు దుర్గాఘాట్‌లోనే కొనసాగించాలని నిర్ణయించారు. ఉత్సవాల తొలి రోజున అక్టోబరు 03 నుంచే పూర్తిస్థాయిలో దుర్గాఘాట్‌లో నదీ హారతి ఆరంభం కానుంది. హారతులను తిలకించేందుకు దసరాల్లో భక్తులను అనుమతించాలా? లేదా అనే దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

'విజయ' ఛైర్మన్ చలసానికి

పదవీ గండం..!

- రాజీనామా చేయాలని అధిష్ఠానం ఆదేశం
- డెయిరీ పాలకవర్గ సభ్యుల మల్లాగుల్లాలు

ఈనాడు, అమరావతి
– న్యూస్‌టుడే హనుమాన్ జంక్షన్




కృష్ణా జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘం.. విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులుకు పదవీ గండం ఏర్పడింది. ఆయన స్థానంలో మరొకరికి అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో డెయిరీ ఛైర్మన్ చలసానిని రాజీనామా చేయాలని సూచించినట్లు సమాచారం. అధిష్ఠానం నిర్ణయం ప్రకారం రాజీనామా చేసి పదవి నుంచి వైదొలగాలని ఎంపీ కేశినేని చిన్ని.. చలసానికి తెలియజేశారు. దీంతో విజయ డెయిరీ పాలకవర్గంలో కలకలం రేగింది. దీనిపై బాపులపాడు మండలం వీరవల్లిలోని పాల కర్మాగారంలో బుధవారం పాలకవర్గ అత్యవసర భేటీ నిర్వహించారు. దీనిలో అత్యధిక సభ్యులు సీఎం చంద్రబాబును కలిసి విన్నవించాలనీ, ఆయన నిర్ణయం ప్రకారం ముందుకు వెళదామని నిర్ణయించినట్లు తెలిసింది. ఒక దశలో రాజీనామాకు సిద్ధపడిన ఆంజనేయులును డైరెక్టర్లు వారించినట్లు తెలుస్తుండగా.. అసలు డైరెక్టర్ల మద్దతు ఉన్నందున రాజీనామా చేయాల్సిన పనిలేదని కొందరు పేర్కొన్నట్లు తెలిసింది. విజయ డెయిరీ ఛైర్మన్‌గా చలసాని అయిదేళ్లుగా కొనసాగుతున్నారు. అంతకు ముందు రెండేళ్లు డైరెక్టర్‌గా ఉన్నారు.

ఎమ్మెల్యేతో విభేదాలా..?

ఇటీవల గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఛైర్మన్‌పై ఆరోపణలు చేసిన నేపథ్యంలో ప్రస్తుతం రాజీనామా వ్యవహారం తెదేపాలో చర్చనీయాంశంగా మారింది. తనపై ప్రతికూల వార్తలు రాయించారని (ఈనాడులో కాదు) చలసానిపై ఎమ్మెల్యే యార్లగడ్డ పత్రికా సమావేశం పెట్టి మరీ ఆరోపించారు. దీనికి చలసాని సమాధానం ఇస్తూ.. తనకు ఏమాత్రం సంబంధం లేదని వివరణ ఇచ్చారు. ఈ పంచాయతీ అధినేత చంద్రబాబు దృష్టికి వెళ్లింది. యువనేత లోకేశ్ సీరియస్ అయ్యారని తెలిసింది. ఇటీవల ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మెల్యేలు ఎంపీ చిన్ని ఇంట సమావేశమై పలు అంశాలతోపాటు.. విజయ డెయిరీ అంశమూ చర్చించినట్లు తెలిసింది. దీనిపై పార్టీకి నివేదించడం ఆ మేరకు పదవి నుంచి వైదొలగాలని ఆదేశాలు రావడం జరిగాయి.





తటస్థంగా ఉండడమేనా..?

గత అయిదేళ్లలో చలసాని తెదేపా కార్యక్రమాలకు దూరంగా ఉంటూ తటస్థంగా వ్యవహరించారనేది ప్రధాన ఆరోపణ. గన్నవరం నియోజకవర్గ నేతగా ఆయన పార్టీ శ్రేణులను నడిపించడంలో క్రియాశీలకంగా వ్యవహరించలేదనే ఫిర్యాదులు ఉన్నాయి. లోకేశ్ పాదయాత్ర గన్నవరం మీదుగా వెళ్లినా.. చలసాని పాల్గొనలేదనేది శ్రేణుల ఫిర్యాదు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరిపై ప్రేలాపనల వేళ క్రియాశీలకంగా గళం వినిపించలేదనే ఆరోపణ ఉంది. వీటిని ఆయన ఖండిస్తున్నారు. పార్టీ కోసం పనిచేశాననీ.. అమూల్ సంస్థను ఢీ కొట్టి విజయ డెయిరీని నిలబెట్టానని చెబుతున్నారు. వీరవల్లి వద్ద రూ.200 కోట్లు పెట్టుబడితో కొత్త మిల్క్ ప్రాజెక్టు చేపట్టామనీ, దానికి వైకాపా ప్రభుత్వం నుంచి ఆటంకాలు రాకుండా పోరాడానని చెబుతున్నారు. తాను వచ్చే నాటికి రూ.600 కోట్లు టర్నోవర్ ఉన్న మిల్క్ ప్రాజెక్టును నేడు రూ.వెయ్యి కోట్లకు చేర్చామని అంటున్నారు. మండవ జానకి రామయ్య తర్వాత చలసానికి డెయిరీ ఛైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. మండవ రాజీనామా కూడా నాటకీయ పరిణామాల మధ్య జరిగింది.

డైరెక్టర్ల నియామకం..!

పాలకవర్గంలో ఇటీవల ఖాళీ అయిన మూడు డైరెక్టర్ల పదవుల నియామకమూ వివాదస్పదమైంది. ఎన్నిక నిర్వహించగా అధిష్ఠానం సూచన మేరకు ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో ఎన్నిక రద్దయింది. అయితే పాలకవర్గ సమావేశం రెండుసార్లు వాయిదా పడింది. మూడోసారి డైరెక్టర్ల నియామకం చేపట్టాలని నూజివీడు, గుడివాడ, పెనమలూరు ఎమ్మెల్యేల సిఫార్సుతో ముగ్గురు తెదేపా నాయకులను డైరెక్టర్లుగా ఎన్నుకొన్నారు. అధిష్ఠానం అనుమతి లేకుండా నియమించారనే ఫిర్యాదు ఉంది. దీనిపై కూడా పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

దాసరి బాలవర్ధనరావు..?

కొత్త ఛైర్మన్‌గా దాసరి బాలవర్ధనరావుకు అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. అయితే.. సీఎంను కలిసి తననే కొనసాగించాలని చలసాని, పాలకవర్గ సభ్యులు కోరాలని నిర్ణయించారు. సీఎం కరుణిస్తే.. చలసాని కొనసాగుతారు. లేకపోతే డైరెక్టర్లలో ఒకరైన బాలవర్ధనరావుకు అవకాశం లభించనుంది.

బీమా లోక్ అదాలత్

అక్టోబరు 1 నుంచి 7 వరకు నిర్వహణ

ఈనాడు, అమరావతి: వరదలతో దెబ్బతిన్న వాహనాల బీమా క్లెయిమ్‌ల సత్వర పరిష్కారానికి వచ్చే నెల 1 నుంచి 7వ తేదీ వరకు విజయవాడలో బీమా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి (జిల్లా అండ్ సెషన్స్ జడ్జి) ఎం.బబిత తెలిపారు. రాష్ట్ర సచివాలయం సమీపంలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో బీమా కంపెనీలు, ఆటో మొబైల్ బాడీ షాప్స్, ఆటో డ్రైవర్ల సంఘాల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. బబిత మాట్లాడుతూ.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ జి.నరేందర్ ఆదేశాలతో అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడలోని న్యాయస్థానాల సముదాయంలో అదాలత్ జరుగుతుందని వెల్లడించారు. బీమా క్లెయిమ్‌లు, వాహన మరమ్మతుల విషయంలో సమస్యలుంటే పరిష్కారానికి జాతీయ టోల్ ఫ్రీ నంబరు 15100కు ఫోన్ చేసి, ఉచిత న్యాయ సేవలు పొందొచ్చని తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉప కార్యదర్శి డాక్టర్ హెచ్.అమర రంగేశ్వరరావు మాట్లాడుతూ బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి లోక్‌అదాలత్ సరైన వేదిక అని తెలిపారు.

అక్టోబరు 3 నుంచి

దసరా ప్రత్యేక బస్సులు

13 రోజుల పాటు తిరగనున్న సర్వీసులు ◆ మొత్తం 964 తిప్పేలా ఆర్టీసీ ప్రణాళిక

ఈనాడు, అమరావతి


దసరా ఉత్సవాలకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. రద్దీకి తగ్గట్లుగా సర్వీసులు నడిపేందుకు సంస్థ ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసింది. కనకదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు వచ్చే నెల 3 నుంచి 12 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు రాకపోకలు సాగించేందుకు.. అమ్మవారి దర్శనార్థం పెద్దసంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. ఇదే సమయంలో పాఠశాలలు, కళాశాలలకు పండగ సెలవులు ఉన్నందున ఊళ్లకు వెళ్లే వారు ఎక్కువగా ఉంటారు. దీంతో పండగకు ఉండే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అక్టోబరు 3 నుంచి 15 వరకు 13 రోజులపాటు ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

ఈ ఏడాది రూట్ల వారీగా దసరా బస్సుల ప్రణాళిక

మార్గం	బస్సులు
హైదరాబాద్	353
రాజమహేంద్రవరం	241
విశాఖపట్నం	90
బెంగళూరు	14
చెన్నై	22
ఇతర ప్రాంతాలు	244
మొత్తం	964

విజయవాడ - హైదరాబాద్ అత్యధికం...

ఈ ఏడాది అన్ని మార్గాల్లో కంటే హైదరాబాద్‌కు అత్యధికంగా 353 తిప్పనున్నారు. ఈ రూట్‌లోనే ఎక్కువ డిమాండ్ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భాగ్యనగరంలో విద్య, ఉద్యోగాల నిమిత్తం ఉంటున్న జిల్లావాసుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆతర్వాత రాజమహేంద్రవరం మార్గంలో తిరుగుతాయి. తొలి మూడు రోజులు 37 సర్వీసులు చొప్పున నడుపుతారు. మూలా నక్షత్రం.. 9వ తేదీన అమ్మవారి దర్శనానికి సుమారు 2.5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. ఈ నేపథ్యంలో ముందు రోజు నుంచి బస్సుల సంఖ్యను గణనీయంగా పెంచి 9న.. 105, 10న.. 117, 11న.. 128 తిప్పనున్నారు. పండగ తర్వాత రోజు ఆదివారం రావడంతో 13న 128, 14న.. 103 సర్వీసులు నడపాలని నిర్ణయానికి వచ్చారు.



గత ఏడాది రూ.2.35 కోట్ల ఆదాయం

2023లో దసరా ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ.2.35 కోట్ల ఆదాయం సమకూరింది. కొవిడ్ తర్వాత ఇంత ఆదాయం రావడం ఇదే మొదటిసారి. మొత్తం 959 బస్సులు 5.30 లక్షల కి.మీ మేర తిప్పారు. కి.మీకు రూ.44.36 మేర రాబడి వచ్చింది. ఓఆర్ 66 శాతం నమోదైంది. హైదరాబాద్ - విజయవాడ మార్గంలో నడిచిన సర్వీసుల ద్వారా గరిష్ఠంగా రూ.1.08 కోట్ల ఆదాయం దక్కింది. ఆతర్వాత విశాఖపట్నం రూట్‌లో రూ.75.52 లక్షల మేర రాబడి వచ్చింది. 2021లో రూ.1.45 కోట్లు, 2022లో రూ.2.10 కోట్లు ప్రత్యేక సర్వీసుల ద్వారా ఆర్టీసీకి సమకూరింది.

ఈనాడు డిజిటల్, అమరావతి: ముంపు ప్రాంతాల్లో వాహనాల మరమ్మతులు, బీమా క్లెయిమ్‌ల వివరాల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు.. రవాణా శాఖ కమిషనర్ ఎం.కె.సిన్హాను అడిగారు. అధిక శాతం మర

వాహనాల బీమా క్లెయిమ్‌ల పరిష్కారం వేగవంతం

మ్మతులు ఇంకా చేయాల్సి ఉండటంతో ఈనెల ఆఖరుకు పూర్తి చేయాలని సూచించారు. దీంతో రవాణా శాఖ అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. బుధవారం సాయంత్రం నగరంలోని రవాణా శాఖ కార్యాలయంలో బీమా కంపెనీల ప్రతినిధులు, సిబ్బందితో సిన్హా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు పరిష్కారం కాని క్లెయిమ్‌లను ఈనెల 29కి పూర్తి చేయాలని ఆదేశించారు.

LIC లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
డివిజనల్ ఆఫీస్: జీవన్ ప్రకాష్, కెన్నడీ రోడ్, మచిలీపట్నం - 521001.
ఫోన్: 08672-223438, ఇ-మెయిల్: sales.machilipatnam@licindia.com

కార్పొరేట్ గిఫ్టింగ్ కంపెనీలకు మాత్రమే విక్రేతల ఎంపానెల్‌మెంట్ కోసం ప్రకటన

ఎల్ఐసి ఆఫ్ ఇండియా, మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్, డివిజనల్ ఆఫీస్, మచిలీపట్నం, ఆంధ్రప్రదేశ్ లోని ఉమ్మడి కృష్ణా/ గుంటూరు జిల్లాలలోని కార్పొరేట్ గిఫ్టింగ్ కంపెనీల ఎంపానెల్‌మెంట్ కోసం దరఖాస్తులు కోరుతున్నారు. కంపెనీ ఉమ్మడి కృష్ణా/ గుంటూరు జిల్లాలలో ఉండి పూర్తి స్థాయి సౌకర్యాలతో కనీసం 3 సంవత్సరాలు అనుభవాన్ని (జిఎస్‌టి రిజిస్ట్రేషన్‌తో) కలిగి ఉండవలెను మరియు గిఫ్ట్ ఆర్టికల్స్ అనగా లెదర్ వస్తువులు, బ్యాగులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణ వస్తువులు, ట్రోఫీలు, బంగారం & వెండి వస్తువులు మరియు ఏదేని ఇతర కార్పొరేట్ గిఫ్ట్ ఆర్టికల్స్‌ను సరఫరా చేయుటలో బాగా పేరొందినదై, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో త్వరితగతిన సుమారు 1000 సంఖ్యగల వస్తువులు సరఫరా చేయగలిగి ఉండవలెను. కంపెనీ ప్రొఫైల్ మరియు ఇతర వివరాలు (జిఎస్‌టి రిజిస్ట్రేషన్, బ్యాంక్ ఖాతా మరియు నెఫ్ట్ వివరములు) దరఖాస్తు నమూనాలో పూర్తి చేయవలసి ఉంటుంది. దరఖాస్తులను ది.26-09-2024 నుండి మా వెబ్‌సైటు www.licindia.com నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. మరియు ది.10-10-2024న సా॥గం॥5.30ని॥ లోగా Application for inclusion in panel of Corporate Gifting Company అని సీల్ కవరుపై వ్రాసి మార్కెటింగ్ మేనేజర్, మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్, ఎల్ఐసి ఆఫ్ ఇండియా, డివిజనల్ ఆఫీస్, కెనెడీ రోడ్, మచిలీపట్నంకు పోస్టు/ కొరియర్/ స్వయంగా పంపించవలసి ఉంటుంది. ఎటువంటి కారణాలు తెలియజేయకుండా ఏదేని లేదా అన్ని ఆఫర్లను అంగీకరించు లేదా తిరస్కరించు హక్కు ఎల్ఐసి ఆఫ్ ఇండియా కలిగి ఉన్నది.

తేది: 26-09-2024 సం/- సీనియర్ డివిజనల్ మేనేజరు

VIJAYAWADA MUNICIPAL CORPORATION
'E' Procurement Notice No. 21/VMC/CDB/2024-25, Dt. 21-09-2024

Engaging of contract workers, DCM Vehicles for conveyance and collection of removed red cloths for Dasara Festival-2024 **(Total 6 works)-Est. Amount 67.00 Lakhs**

All rights are reserved to the Commissioner to Cancle or Reject the tenders without assigning any reasons there of

Further details and any corrigendum can be seen @ **www.tender.apeprocurement.gov.in**

Sd/-
For COMMISSIONER

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ – 1, హైదరాబాద్‌వద్ద
ఎస్.ఎస్.వి.ఎస్.హరికృష్ణ, రికవరీ అధికారి సమక్షంలో
తేది: 30 ఆగస్టు 2024
ఒ.ఎ. నెం.63/2018
లోని
ఆర్.పి. నెం.310/2019

దిగువతెలిపిన వారి మధ్య:
జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, (గతంలో జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రై.లి., గా పిలువబడేది) జెఎంఎఫ్ఏఆర్‌సి-యాక్సిస్ బ్యాంక్ యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తున్నది, సిమెంట్ మార్స్, 2015- ట్రస్ట్, 7 వ అంతస్తు, సినర్జీ, అప్పాసాహెబ్ మరాఠి మార్గ్, ప్రభాదేవి, ముంబాయి- 400025 ...సర్టిఫికెట్ హోల్డర్
మరియు
మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్ మరియు ఇతరులు ...సర్టిఫికెట్ డెటార్స్
కు,
1. మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్
2. శ్రీ ఎస్.ఆర్.బి. రమేశ్ చంద్ర, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.949, రోడ్ నెం.47, అంబేడ్కర్ యూనివర్శిటీ సమీపాన, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, తెలంగాణ రాష్ట్రం ...సర్టిఫికెట్ డెటార్ నెం.2
3. శ్రీ ఎస్.చంద్రమోహన్, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.ఎ-58, రోడ్ నెం.13, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, టి.ఎస్.
మరొక చిరునామా: 3-6-67/68, ఫ్లాట్ నెం.19, బి.ఎస్. రెడ్డి కాంప్లెక్స్, స్కైలైన్ థియేటర్ ఎదురుగా, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం - 500029.
మరొక చిరునామా: 8-2-293/82, ప్లాట్ నెం.ఎ58, రోడ్ నెం.13, సాయిబాబా గుడి సమీపాన, ఫిలింనగర్, షేక్‌పేట్, జూబ్లీహిల్స్ హైదరాబాద్ - 500033. ...సర్టిఫికెట్ డెటార్ నెం.3
4. శ్రీ ఎస్.కిషోర్ చంద్ర తండ్రి ఎస్. సుబ్బారావు, నివాసం: 29-28/1-35, కోవెలమూరివారి వీధి, సూర్యారావు పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520004.
మరొక చిరునామా: 48-13-3డి, ఫ్లాట్ నం.ఎ1, శ్రీ రామా రెసిడెన్సీ, శ్రీ రామచంద్ర నగర్, ఆయుష్ ఆసుపత్రి ప్రక్కన, విజయవాడ - 520008. ...సర్టిఫికెట్ డెటార్ నెం.4

నోటీసు

సర్టిఫికెట్ డెటార్స్ నుండి సిఐఆర్‌పి (రెజల్యూషన్ ప్లాన్) క్రింద రావల్సిన మొత్తము **రూ. 83,04,84,505.70 పై. (ఎనభైమూడు కోట్ల నాలుగు లక్షల ఎనభైనాలుగువేల ఐదువందల ఐదు రూపాయల డెబ్బై పైసలు మాత్రమే)** తోపాటు దీనిపై వ్యయాలు మరియు భవిష్యత్ వడ్డీ (మొత్తము **రూ.5,28,67,320/– (ఐదు కోట్ల ఇరవై ఎనిమిది లక్షల అరవై ఏడు వేల మూడువందల ఇరవై రూపాయలు మాత్రమే పోను)**ని రాబట్టుకొనుటకు గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారిచే నెం.310/2019 గల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడినది. తదనుగుణంగా రికవరీ అధికారి రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 28(4ఎ) క్రింద రికవరీ ప్రొసీడింగ్స్‌ను చేపట్టారు.

"ఎవరి మీద సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ జారీ చేయబడినదో ఆ వ్యక్తి, కంపెనీ అయిన పక్షంలో దాని అధికార్లను సదరు సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ అమలు యొక్క ఏదేని దశలో తన లేదా దీని అసెట్స్ వివరాల అఫిడవిట్‌ను ప్రకటించవల్సిందిగా ఉత్తర్వు ద్వారా రికవరీ అధికారి కోరవచ్చును."

పైవిషయం దృష్ట్యా, ఈ విషయంలో తదుపరి చర్య తీసుకొనుటకు గత మూడేళ్ళ కాలానికి మీ వ్యక్తిగత ఆస్తులు/ అసెట్స్ అనగా చరాస్తులు, స్థిరాస్తులు, వాటాలు, మ్యూచువల్ ఫండ్స్, పెట్టుబడులు మరియు బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ప్రమాణం మీద ఏదేని ఇతర పెట్టుబడులతోపాటు ఆదాయ పన్ను రాబడుల గురించి అఫిడవిట్‌పై ప్రకటనను దిగువసంతకందారుకు 27-9-2024 ఉ.10.30 గం.లకు చేయవల్సిందిగా సర్టిఫికెట్ డెటార్స్ 2, 3 మరియు 4 అయిన మీకు ఇందుమూలముగా సూచించడమైనది.
ఈ ట్రిబ్యునల్ ముద్ర మరియు నా చేవ్రాలుతో 30 ఆగస్టు, 2024న ఇవ్వబడినది.

(ఎస్.ఎస్.వి.ఎస్. హరికృష్ణ)
రికవరీ అధికారి

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ – 1, హైదరాబాద్‌వద్ద
ఎస్.ఎస్.వి.ఎస్.హరికృష్ణ, రికవరీ అధికారి సమక్షంలో
తేది: 30 ఆగస్టు 2024
ఒ.ఎ. నెం.121/2018
లోని
ఆర్.పి. నెం.220/2019

దిగువతెలిపిన వారి మధ్య:
జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, (గతంలో జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రై.లి., గా పిలువబడేది) జెఎంఎఫ్ఏఆర్‌సి-యాక్సిస్ బ్యాంక్ యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తున్నది, సిమెంట్ మార్స్, 2015- ట్రస్ట్, 7 వ అంతస్తు, సినర్జీ, అప్పాసాహెబ్ మరాఠి మార్గ్, ప్రభాదేవి, ముంబాయి- 400025 ...సర్టిఫికెట్ హోల్డర్
మరియు
మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్ మరియు ఇతరులు ...సర్టిఫికెట్ డెటార్స్
కు,
1. మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్
2. శ్రీ ఎస్.ఆర్.బి. రమేశ్ చంద్ర, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.949, రోడ్ నెం.47, అంబేడ్కర్ యూనివర్శిటీ సమీపాన, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, తెలంగాణ రాష్ట్రం ...సర్టిఫికెట్ డెటార్ నెం.2
3. శ్రీ ఎస్.చంద్రమోహన్, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.ఎ-58, రోడ్ నెం.13, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, టి.ఎస్.
మరొక చిరునామా: 3-6-67/68, ఫ్లాట్ నెం.19, బి.ఎస్. రెడ్డి కాంప్లెక్స్, స్కైలైన్ థియేటర్ ఎదురుగా, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం - 500029.
మరొక చిరునామా: 8-2-293/82, ప్లాట్ నెం.ఎ58, రోడ్ నెం.13, సాయిబాబా గుడి సమీపాన, ఫిలింనగర్, షేక్‌పేట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033. ...సర్టిఫికెట్ డెటార్ నెం.3
4. శ్రీ ఎస్.కిషోర్ చంద్ర తండ్రి ఎస్. సుబ్బారావు, నివాసం: 29-28/1-35, కోవెలమూరివారి వీధి, సూర్యారావు పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్- 520004.
మరొక చిరునామా: 48-13-3డి, ఫ్లాట్ నం.ఎ1, శ్రీ రామా రెసిడెన్సీ, శ్రీ రామచంద్ర నగర్, ఆయుష్ ఆసుపత్రి ప్రక్కన, విజయవాడ- 520008 ...సర్టిఫికెట్ డెటార్ నెం.4

నోటీసు

సర్టిఫికెట్ డెటార్స్ నుండి సిఐఆర్‌పి (రెజల్యూషన్ ప్లాన్) క్రింద రావల్సిన మొత్తము **రూ. 98,85,92,254.85 పై. (తొంభై ఎనిమిది కోట్ల ఎనభైఐదు లక్షల తొంభైరెండు వేల రెండు వందల యాభైనాలుగు రూపాయల ఎనభైఐదు పైసలు మాత్రమే)** తోపాటు దీనిపై వ్యయాలు మరియు భవిష్యత్ వడ్డీ **(మొత్తము రూ.6,32,27,028/ (ఆరు కోట్ల ముప్పైరెండు లక్షల ఇరవైఏడు వేల ఇరవైఎనమిది రూపాయలు మాత్రమే పోను)**ని రాబట్టుకొనుటకు గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారిచే నెం.220/2019గల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడినది. తదనుగుణంగా రికవరీ అధికారి రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 28(4ఎ) క్రింద రికవరీ ప్రొసీడింగ్స్‌ను చేపట్టారు.

"ఎవరి మీద సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ జారీ చేయబడినదో ఆ వ్యక్తి, కంపెనీ అయిన పక్షంలో దాని అధికార్లను సదరు సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ అమలు యొక్క ఏదేని దశలో తన లేదా దీని అసెట్స్ వివరాల అఫిడవిట్‌ను ప్రకటించవల్సిందిగా ఉత్తర్వు ద్వారా రికవరీ అధికారి కోరవచ్చును."

పైవిషయం దృష్ట్యా, ఈ విషయంలో తదుపరి చర్య తీసుకొనుటకు గత మూడేళ్ళ కాలానికి మీ వ్యక్తిగత ఆస్తులు/ అసెట్స్ అనగా చరాస్తులు, స్థిరాస్తులు, వాటాలు, మ్యూచువల్ ఫండ్స్, పెట్టుబడులు మరియు బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ప్రమాణం మీద ఏదేని ఇతర పెట్టుబడులతోపాటు ఆదాయ పన్ను రాబడుల గురించి అఫిడవిట్‌పై ప్రకటనను దిగువసంతకందారుకు 27-9-2024 ఉ.10.30 గం.లకు చేయవల్సిందిగా సర్టిఫికెట్ డెటార్స్ 2, 3 మరియు 4 అయిన మీకు ఇందుమూలముగా సూచించడమైనది.
ఈ ట్రిబ్యునల్ ముద్ర మరియు నా చేవ్రాలుతో 30 ఆగస్టు, 2024న ఇవ్వబడినది.

(ఎస్.ఎస్.వి.ఎస్. హరికృష్ణ)
రికవరీ అధికారి

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ – 1, హైదరాబాద్‌వద్ద
ఎస్.ఎస్.వి.ఎస్.హరికృష్ణ, రికవరీ అధికారి సమక్షంలో
తేది: 30 ఆగస్టు 2024
ఒ.ఎ.నెం. 62/2018
లోని
ఆర్.పి. నెం. 312/2019

దిగువతెలిపిన వారి మధ్య:
జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, (గతంలో జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రై.లి., గా పిలువబడేది) జెఎంఎఫ్ఏఆర్‌సి-[illegible] యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తున్నది, సిమెంట్ మార్స్, 2015- ట్రస్ట్, 7 వ అంతస్తు, సినర్జీ, అప్పాసాహెబ్ మరాఠి మార్గ్, ప్రభాదేవి, ముంబాయి - 400025. ...సర్టిఫికెట్ హోల్డర్
మరియు
మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్ మరియు ఇతరులు ...సర్టిఫికెట్ డెటార్స్
కు,
1. మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్
2. శ్రీ ఎస్.ఆర్.బి. రమేశ్ చంద్ర, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.949, రోడ్ నెం.47, అంబేడ్కర్ యూనివర్శిటీ సమీపాన, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, తెలంగాణ రాష్ట్రం ...సర్టిఫికెట్ డెటార్ నెం.2
3. శ్రీ ఎస్.చంద్రమోహన్, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.ఎ-58, రోడ్ నెం.13, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, టి.ఎస్.
మరొక చిరునామా: 3-6-67/68, ఫ్లాట్ నెం.19, బి.ఎస్. రెడ్డి కాంప్లెక్స్, స్కైలైన్ థియేటర్ ఎదురుగా, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం - 500029.
మరొక చిరునామా: 8-2-293/82, ప్లాట్ నెం.ఎ58, రోడ్ నెం.13, సాయిబాబా గుడి సమీపాన, ఫిలింనగర్, షేక్‌పేట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500033. ...సర్టిఫికెట్ డెటార్ నెం.3
4. శ్రీ ఎస్.కిషోర్ చంద్ర తండ్రి ఎస్. సుబ్బారావు, నివాసం: 29-28/1-35, కోవెలమూరివారి వీధి, సూర్యారావు పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520004.
మరొక చిరునామా: 48-13-3డి, ఫ్లాట్ నం.ఎ1, శ్రీ రామా రెసిడెన్సీ, శ్రీ రామచంద్ర నగర్, ఆయుష్ ఆసుపత్రి ప్రక్కన, విజయవాడ - 520008 ...సర్టిఫికెట్ డెటార్ నెం.4

నోటీసు

సర్టిఫికెట్ డెటార్స్ నుండి సిఐఆర్‌పి (రెజల్యూషన్ ప్లాన్) క్రింద రావల్సిన మొత్తము **రూ. 25,06,44,760.19 పై.(ఇరవై ఐదు కోట్ల ఆరులక్షల నలభైనాలుగు వేల ఏడువందల అరవై రూపాయల పందొమ్మిది పైసలు మాత్రమే)** తోపాటు దీనిపై వ్యయాలు మరియు భవిష్యత్ వడ్డీ **(మొత్తము రూ.57,55,359/– (యాభై ఏడు లక్షల యాభైఐదు వేల మూడు వందల యాభైతొమ్మిది రూపాయలు మాత్రమే పోను)**ని రాబట్టుకొనుటకు గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారిచే నెం.312/2019గల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడినది. తదనుగుణంగా రికవరీ అధికారి రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 28(4ఎ) క్రింద రికవరీ ప్రొసీడింగ్స్‌ను చేపట్టారు.

"ఎవరి మీద సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ జారీ చేయబడినదో ఆ వ్యక్తి, కంపెనీ అయిన పక్షంలో దాని అధికార్లను సదరు సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ అమలు యొక్క ఏదేని దశలో తన లేదా దీని అసెట్స్ వివరాల అఫిడవిట్‌ను ప్రకటించవల్సిందిగా ఉత్తర్వు ద్వారా రికవరీ అధికారి కోరవచ్చును."

పైవిషయం దృష్ట్యా, ఈ విషయంలో తదుపరి చర్య తీసుకొనుటకు గత మూడేళ్ళ కాలానికి మీ వ్యక్తిగత ఆస్తులు/ అసెట్స్ అనగా చరాస్తులు, స్థిరాస్తులు, వాటాలు, మ్యూచువల్ ఫండ్స్, పెట్టుబడులు మరియు బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ప్రమాణం మీద ఏదేని ఇతర పెట్టుబడులతోపాటు ఆదాయ పన్ను రాబడుల గురించి అఫిడవిట్‌పై ప్రకటనను దిగువసంతకందారుకు 27-9-2024 ఉ.10.30 గం.లకు చేయవల్సిందిగా సర్టిఫికెట్ డెటార్స్ 2, 3 మరియు 4 అయిన మీకు ఇందుమూలముగా సూచించడమైనది.
ఈ ట్రిబ్యునల్ ముద్ర మరియు నా చేవ్రాలుతో 30 ఆగస్టు, 2024న ఇవ్వబడినది.

(ఎస్.ఎస్.వి.ఎస్. హరికృష్ణ)
రికవరీ అధికారి

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ – 1, హైదరాబాద్‌వద్ద
ఎస్.ఎస్.వి.ఎస్.హరికృష్ణ, రికవరీ అధికారి సమక్షంలో
తేది: 30 ఆగస్టు 2024
ఒ.ఎ. నెం.120/2018
లోని
ఆర్.పి. నెం.242/2019

దిగువతెలిపిన వారి మధ్య:
జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, (గతంలో జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రై.లి., గా పిలువబడేది) జెఎంఎఫ్ఏఆర్‌సి-[illegible] యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తున్నది, సిమెంట్ మార్స్, 2015- ట్రస్ట్, 7 వ అంతస్తు, సినర్జీ, అప్పాసాహెబ్ మరాఠి మార్గ్, ప్రభాదేవి, ముంబాయి- 400025 ...సర్టిఫికెట్ హోల్డర్
మరియు
మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్ మరియు ఇతరులు ...సర్టిఫికెట్ డెటార్స్
కు,
1. మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్
2. శ్రీ ఎస్.ఆర్.బి. రమేశ్ చంద్ర, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.949, రోడ్ నెం.47, అంబేడ్కర్ యూనివర్శిటీ సమీపాన, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, తెలంగాణ రాష్ట్రం ...సర్టిఫికెట్ డెటార్ నెం.2
3. శ్రీ ఎస్.చంద్రమోహన్, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.ఎ-58, రోడ్ నెం.13, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, టి.ఎస్.
మరొక చిరునామా: 3-6-67/68, ఫ్లాట్ నెం.19, బి.ఎస్. రెడ్డి కాంప్లెక్స్, స్కైలైన్ థియేటర్ ఎదురుగా, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం- 500029.
మరొక చిరునామా: 8-2-293/82, ప్లాట్ నెం.ఎ58, రోడ్ నెం.13, సాయిబాబా గుడి సమీపాన, ఫిలింనగర్, షేక్‌పేట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033. ...సర్టిఫికెట్ డెటార్ నెం.3
4. శ్రీ ఎస్.కిషోర్ చంద్ర తండ్రి ఎస్. సుబ్బారావు, నివాసం: 29-28/1-35, కోవెలమూరివారి వీధి, సూర్యారావు పేట,విజయవాడ, ఆంధ్రప్రదేశ్- 520004.
మరొక చిరునామా: 48-13-3డి, ఫ్లాట్ నం.ఎ1, శ్రీ రామా రెసిడెన్సీ, శ్రీ రామచంద్ర నగర్, ఆయుష్ ఆసుపత్రి ప్రక్కన, విజయవాడ- 520008 ...సర్టిఫికెట్ డెటార్ నెం.4

నోటీసు

సర్టిఫికెట్ డెటార్స్ నుండి సిఐఆర్‌పి (రెజల్యూషన్ ప్లాన్) క్రింద రావల్సిన మొత్తము **రూ. 98,56,05,012.77 పై.(తొంభై ఎనిమిది కోట్ల యాభైఆరు లక్షల ఐదు వేల పన్నెండు రూపాయల డెబ్బై ఏడు పైసలు మాత్రమే)** తోపాటు దీనిపై వ్యయాలు మరియు భవిష్యత్ వడ్డీ **(మొత్తము రూ.7,04,29,597.76పై. (ఏడు కోట్ల నాలుగు లక్షల ఇరవైతొమ్మిది వేల ఐదువందల తొంభైఏడు రూపాయల డెబ్బైఆరు పైసలు మాత్రమే పోను)**ని రాబట్టుకొనుటకు గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారిచే నెం.242/2019గల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడినది. తదనుగుణంగా రికవరీ అధికారి రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 28(4ఎ) క్రింద రికవరీ ప్రొసీడింగ్స్‌ను చేపట్టారు.

"ఎవరి మీద సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ జారీ చేయబడినదో ఆ వ్యక్తి, కంపెనీ అయిన పక్షంలో దాని అధికార్లను సదరు సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ అమలు యొక్క ఏదేని దశలో తన లేదా దీని అసెట్స్ వివరాల అఫిడవిట్‌ను ప్రకటించవల్సిందిగా ఉత్తర్వు ద్వారా రికవరీ అధికారి కోరవచ్చును."

పైవిషయం దృష్ట్యా, ఈ విషయంలో తదుపరి చర్య తీసుకొనుటకు గత మూడేళ్ళ కాలానికి మీ వ్యక్తిగత ఆస్తులు/ అసెట్స్ అనగా చరాస్తులు, స్థిరాస్తులు, వాటాలు, మ్యూచువల్ ఫండ్స్, పెట్టుబడులు మరియు బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ప్రమాణం మీద ఏదేని ఇతర పెట్టుబడులతోపాటు ఆదాయ పన్ను రాబడుల గురించి అఫిడవిట్‌పై ప్రకటనను దిగువసంతకందారుకు 27-9-2024 ఉ.10.30 గం.లకు చేయవల్సిందిగా సర్టిఫికెట్ డెటార్స్ 2, 3 మరియు 4 అయిన మీకు ఇందుమూలముగా సూచించడమైనది.
ఈ ట్రిబ్యునల్ ముద్ర మరియు నా చేవ్రాలుతో 30 ఆగస్టు, 2024న ఇవ్వబడినది.

(ఎస్.ఎస్.వి.ఎస్. హరికృష్ణ)
రికవరీ అధికారి

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ – 1, హైదరాబాద్‌వద్ద
MS.B ఉమా మహేశ్వరి, రికవరీ అధికారి సమక్షంలో
తేది: 30 ఆగస్టు 2024
ఒ.ఎ. నెం.61/2018
లోని
ఆర్.పి. నెం.311/2019

దిగువతెలిపిన వారి మధ్య:
జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, (గతంలో జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రై.లి., గా పిలువబడేది) జెఎంఎఫ్ఏఆర్‌సి- కర్ణాటక బ్యాంక్ యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తున్నది, సిమెంట్ మార్స్, 2015- ట్రస్ట్, 7 వ అంతస్తు, సినర్జీ, అప్పాసాహెబ్ మరాఠి మార్గ్, ప్రభాదేవి, ముంబాయి - 400025. ...సర్టిఫికెట్ హోల్డర్
మరియు
మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్ మరియు ఇతరులు ...సర్టిఫికెట్ డెటార్స్
కు,
1. మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్
2. శ్రీ ఎస్.ఆర్.బి. రమేశ్ చంద్ర, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.949, రోడ్ నెం.47, అంబేడ్కర్ యూనివర్శిటీ సమీపాన, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, తెలంగాణ రాష్ట్రం ...సర్టిఫికెట్ డెటార్ నెం.2
3. శ్రీ ఎస్.చంద్రమోహన్, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.ఎ-58, రోడ్ నెం.13, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, టి.ఎస్.
మరొక చిరునామా: 3-6-67/68, ఫ్లాట్ నెం.19, బి.ఎస్. రెడ్డి కాంప్లెక్స్, స్కైలైన్ థియేటర్ ఎదురుగా, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం - 500029.
మరొక చిరునామా: 8-2-293/82, ప్లాట్ నెం.ఎ58, రోడ్ నెం.13, సాయిబాబా గుడి సమీపాన, ఫిలింనగర్, షేక్‌పేట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500033. ...సర్టిఫికెట్ డెటార్ నెం.3
4. శ్రీ ఎస్.కిషోర్ చంద్ర తండ్రి ఎస్. సుబ్బారావు, నివాసం: 29-28/1-35, కోవెలమూరివారి వీధి, సూర్యారావు పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520004.
మరొక చిరునామా: 48-13-3డి, ఫ్లాట్ నం.ఎ1, శ్రీ రామా రెసిడెన్సీ, శ్రీ రామచంద్ర నగర్, ఆయుష్ ఆసుపత్రి ప్రక్కన, విజయవాడ- 520008 ...సర్టిఫికెట్ డెటార్ నెం.4

నోటీసు

సర్టిఫికెట్ డెటార్స్ నుండి సిఐఆర్‌పి (రెజల్యూషన్ ప్లాన్) క్రింద రావల్సిన మొత్తము **రూ. 104,46,16,654.84 పై.(ఒక వంద నాలుగు కోట్ల నలభై ఆరు లక్షల పదహారు వేల ఆరు వందల యాభై నాలుగు రూపాయల ఎనభై నాలుగు పైసలు మాత్రమే)** తోపాటు దీనిపై వ్యయాలు మరియు భవిష్యత్ వడ్డీ **(మొత్తము రూ.5,25,88,175.24/– (ఐదు కోట్ల ఇరవై ఐదు లక్షల ఎనభై ఎనిమిది వేల ఒక వంద డెబ్బై ఐదు రూపాయల ఇరవై నాలుగు పైసలు మాత్రమే పోను)**ని రాబట్టుకొనుటకు గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారిచే నెం.311/2019గల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడినది. తదనుగుణంగా రికవరీ అధికారి రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 28(4ఎ) క్రింద రికవరీ ప్రొసీడింగ్స్‌ను చేపట్టారు.

"ఎవరి మీద సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ జారీ చేయబడినదో ఆ వ్యక్తి, కంపెనీ అయిన పక్షంలో దాని అధికార్లను సదరు సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ అమలు యొక్క ఏదేని దశలో తన లేదా దీని అసెట్స్ వివరాల అఫిడవిట్‌ను ప్రకటించవల్సిందిగా ఉత్తర్వు ద్వారా రికవరీ అధికారి కోరవచ్చును."

పైవిషయం దృష్ట్యా, ఈ విషయంలో తదుపరి చర్య తీసుకొనుటకు గత మూడేళ్ళ కాలానికి మీ వ్యక్తిగత ఆస్తులు/ అసెట్స్ అనగా చరాస్తులు, స్థిరాస్తులు, వాటాలు, మ్యూచువల్ ఫండ్స్, పెట్టుబడులు మరియు బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ప్రమాణం మీద ఏదేని ఇతర పెట్టుబడులతోపాటు ఆదాయ పన్ను రాబడుల గురించి అఫిడవిట్‌పై ప్రకటనను దిగువసంతకందారుకు 27-9-2024 ఉ.10.30 గం.లకు చేయవల్సిందిగా సర్టిఫికెట్ డెటార్స్ 2, 3 మరియు 4 అయిన మీకు ఇందుమూలముగా సూచించడమైనది.
ఈ ట్రిబ్యునల్ ముద్ర మరియు నా చేవ్రాలుతో 30 ఆగస్టు, 2024న ఇవ్వబడినది.

(బి. ఉమా మహేశ్వరి)
రికవరీ అధికారి

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ – 1, హైదరాబాద్‌వద్ద
MS.B ఉమా మహేశ్వరి, రికవరీ అధికారి సమక్షంలో
తేది: 30 ఆగస్టు 2024
ఒ.ఎ. నెం. 74/2018
లోని
ఆర్.పి. నెం. 309/2019

దిగువతెలిపిన వారి మధ్య:
జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, (గతంలో జెఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రై.లి., గా పిలువబడేది) జెఎంఎఫ్ఏఆర్‌సి- ICICI బ్యాంక్ యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తున్నది, సిమెంట్ మార్స్, 2015- ట్రస్ట్, 7 వ అంతస్తు, సినర్జీ, అప్పాసాహెబ్ మరాఠి మార్గ్, ప్రభాదేవి, ముంబాయి - 400025 ...సర్టిఫికెట్ హోల్డర్
మరియు
మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్ మరియు ఇతరులు ...సర్టిఫికెట్ డెటార్స్
కు,
1. మెసర్స్ భీమా సిమెంట్స్ లిమిటెడ్
2. శ్రీ ఎస్.ఆర్.బి. రమేశ్ చంద్ర, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.949, రోడ్ నెం.47, అంబేడ్కర్ యూనివర్శిటీ సమీపాన, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, తెలంగాణ రాష్ట్రం ...సర్టిఫికెట్ డెటార్ నెం.2
3. శ్రీ ఎస్.చంద్రమోహన్, తండ్రి ఎస్.సుబ్బారావు, ప్లాట్ నెం.ఎ-58, రోడ్ నెం.13, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033, టి.ఎస్.
మరొక చిరునామా: 3-6-67/68, ఫ్లాట్ నెం.19, బి.ఎస్. రెడ్డి కాంప్లెక్స్, స్కైలైన్ థియేటర్ ఎదురుగా, బషీర్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం- 500029.
మరొక చిరునామా: 8-2-293/82, ప్లాట్ నెం.ఎ58, రోడ్ నెం.13, సాయిబాబా గుడి సమీపాన, ఫిలింనగర్, షేక్‌పేట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్- 500033. ...సర్టిఫికెట్ డెటార్ నెం.3
4. శ్రీ ఎస్.కిషోర్ చంద్ర తండ్రి ఎస్. సుబ్బారావు, నివాసం: 29-28/1-35, కోవెలమూరివారి వీధి, సూర్యారావు పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్- 520004.
మరొక చిరునామా: 48-13-3డి, ఫ్లాట్ నం.ఎ1, శ్రీ రామా రెసిడెన్సీ, శ్రీ రామచంద్ర నగర్, ఆయుష్ ఆసుపత్రి ప్రక్కన, విజయవాడ- 520008 ...సర్టిఫికెట్ డెటార్ నెం.4

నోటీసు

సర్టిఫికెట్ డెటార్స్ నుండి సిఐఆర్‌పి (రెజల్యూషన్ ప్లాన్) క్రింద రావల్సిన మొత్తము **రూ. 64,09,14,120/– (అరవై నాలుగు కోట్ల తొమ్మిది లక్షల పద్నాలుగు వేల ఒక వంద ఇరవై రూపాయలు మాత్రమే)** తోపాటు దీనిపై వ్యయాలు మరియు భవిష్యత్ వడ్డీ **(మొత్తము రూ.4,13,29,130/– (నాలుగు కోట్ల పదమూడు లక్షల ఇరవై తొమ్మిది వేల ఒక వంద ముప్పై రూపాయలు మాత్రమే పోను)**ని రాబట్టుకొనుటకు గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారిచే నెం.309/2019గల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడినది. తదనుగుణంగా రికవరీ అధికారి రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 28(4ఎ) క్రింద రికవరీ ప్రొసీడింగ్స్‌ను చేపట్టారు.

"ఎవరి మీద సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ జారీ చేయబడినదో ఆ వ్యక్తి, కంపెనీ అయిన పక్షంలో దాని అధికార్లను సదరు సర్టిఫికెట్ ఆఫ్ రికవరీ అమలు యొక్క ఏదేని దశలో తన లేదా దీని అసెట్స్ వివరాల అఫిడవిట్‌ను ప్రకటించవల్సిందిగా ఉత్తర్వు ద్వారా రికవరీ అధికారి కోరవచ్చును."

పైవిషయం దృష్ట్యా, ఈ విషయంలో తదుపరి చర్య తీసుకొనుటకు గత మూడేళ్ళ కాలానికి మీ వ్యక్తిగత ఆస్తులు/ అసెట్స్ అనగా చరాస్తులు, స్థిరాస్తులు, వాటాలు, మ్యూచువల్ ఫండ్స్, పెట్టుబడులు మరియు బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ప్రమాణం మీద ఏదేని ఇతర పెట్టుబడులతోపాటు ఆదాయ పన్ను రాబడుల గురించి అఫిడవిట్‌పై ప్రకటనను దిగువసంతకందారుకు 27-09-2024 ఉ.10.30 గం.లకు చేయవల్సిందిగా సర్టిఫికెట్ డెటార్స్ 2, 3 మరియు 4 అయిన మీకు ఇందుమూలముగా సూచించడమైనది.
ఈ ట్రిబ్యునల్ ముద్ర మరియు నా చేవ్రాలుతో 30 ఆగస్టు, 2024న ఇవ్వబడినది.

(బి. ఉమా మహేశ్వరి)
రికవరీ అధికారి

రవాణారంగ సమస్యలు పరిష్కరించండి


మనీష్‌కుమార్ సిన్హాతో ఎంపీ కేశినేని శివనాథ్, ప్రతినిధులు ఈశ్వరరావు, రాజా, సత్యనారాయణ తదితరులు

సూర్యారావుపేట, విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : రవాణా రంగంలోని సమస్యలు పరిష్కరించి లారీ యజమానులను ఆదుకోవాలని విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్.. రవాణాశాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హాను కోరారు. బుధవారం ఆయన కమిషనర్ కార్యాలయానికి వెళ్లి, సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. దీనిపై మనీష్‌కుమార్ సిన్హా స్పందించారు. తమ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఆర్థికపరమైన అంశాలను సంబంధిత శాఖకు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ లారీ యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు, కృష్ణాజిల్లా లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు నాగమోతు రాజా, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీర వెంకట సత్యనారాయణ, కృష్ణాజిల్లా ట్రైలర్స్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సూరపనేని సురేష్, ఫౌండేషన్ కోశాధికారి అనుమకొండ హరి వెంకట సురేష్, సహాయ కార్యదర్శి వత్సవాయి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు 30 శాతం నగదు బయానాగా ఇవ్వాలి

ఈనాడు డిజిటల్, అమరావతి: బుడమేరు ఉప్పొంగడంతో విజయవాడలో వందల మంది చిరువ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. వారిని ఆదుకునేందుకు ఎంఎస్ఎంయూ కార్పొరేషన్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా 30 శాతం నగదు అడ్వాన్స్‌గా ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వరద బాధితులకు సీఎం నష్టపరిహారం విడుదల చేసిన అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడారు. చిరువ్యాపారులను ఆదుకునేందుకు ఇన్సూరెన్స్ కంపెనీలు.. బ్యాంకుల అధికారులతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారని పేర్కొన్నారు. ఈ నెల 30 తేదీలోపు క్లెయిమ్‌లు, రుణాల రీషెడ్యూల్ త్వరగా పూర్తి చేసి.. బాధితులకు న్యాయం చేయాలని అధికారులను సీఎం ఆదేశించినట్లు తెలిపారు. వరద కారణంగా ఆరు వేల టీవీలు మరమ్మతులకు రాగా.. ప్రభుత్వ ఆధ్వర్యంలో 4,500 టీవీలు బాగు చేసినట్లు వివరించారు. మిగిలినవి వారంలోగా బాగు చేస్తామని ఎలక్ట్రానిక్ సంస్థలు తెలిపినట్లు పేర్కొన్నారు. బాధితులను సాధారణ స్థితికి తేవడానికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి ప్రజల తరఫున ఎంపీ చిన్ని కృతజ్ఞతలు చెప్పారు.

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ఆర్థిక సాయం

కృష్ణలంక, న్యూస్‌టుడే : అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందుతుందని.. ఈ నెల 22, 23వ తేదీల్లో వచ్చిన 13 వేల అర్జీలను కూడా ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలించి ఈ నెల 26వ తేదీ సాయంత్రం నాటికి పరిష్కరించి నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు కలెక్టర్ జి.సృజన తెలిపారు. ముంపు ప్రాంతాల్లో కుటుంబాలకు జరిగిన నష్టాన్ని 1500 బృందాలతో అంచనా వేశామన్నారు. ఏపీఎస్ అధికారుల పర్యవేక్షణలో ఎన్యూమరేషన్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరిగిందన్నారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో జిల్లా స్థాయి అధికారులతో పునః పరిశీలన నిర్వహించామన్నారు. ప్రభుత్వం బుధవారం సాయాన్ని లబ్ధిదారుల ఖాతాలకు విడుదల చేసినట్లు తెలిపారు. అయితే ఇంకా ఏ ఒక్క బాధిత కుటుంబం కూడా ఎన్యూమరేట్ కాకుండా మిగిలిపోకూడదనే ఉద్దేశంతో ఆది, సోమవారాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు. ప్రతి అర్జీని పీజీఆర్ఎస్‌లో నమోదు చేశామని, వచ్చిన 13 వేల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలిస్తున్నట్లు ఆమె చెప్పారు. బుధవారం క్షేత్రస్థాయిలో ఏడువేల దరఖాస్తులను పరిశీలించామని, మిగిలినవి గురువారం సాయంత్రం నాటికి పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి నిస్సంకోచంగా సాయమందిస్తామన్నారు. రాని వారికి ఎందుకు రాలేదో చెబుతూ సచివాలయాల్లో జాబితాలు ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ వివరించారు.

జగన్మాత సేవలో కలెక్టర్ కుటుంబం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: విజయవాడలోని కనకదుర్గమ్మను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన కుటుంబ సమేతంగా కలిసి బుధవారం దర్శించుకున్నారు. దేవస్థాన అధికారులు వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. స్థానాచార్య శివప్రసాదశర్మ, ఏఈవో రమేష్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


సృజనకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న స్థానాచార్య శివప్రసాదశర్మ, ఏఈవో రమేష్

ప్రభుత్వ స్ఫూర్తితో వరద ప్రభావం నుంచి బయటపడదాం

మారిన రాజకీయ సమీకరణాలతో తొలి సమావేశం


అధికారులకు సూచనలిస్తున్న ఛైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ఇటీవల వచ్చిన వరదలను సమర్థంగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలిచిన ప్రభుత్వాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. అదే స్ఫూర్తితో జగ్గయ్యపేట పట్టణంలోని వరద ప్రభావం నుంచి బయటపడదామని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆయన అధ్యక్షతన జరిగిన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. 8వ వార్డు సభ్యుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. తుపాను రిలీఫ్ ఫండ్ నిధుల కాకుండా చెరువులోని వాకింగ్ ట్రాక్ నిధులతో చేసి సుందరీకరణ పనులను కొనసాగించాలని సూచించారు. వైస్ ఛైర్మన్ టి.ప్రభాకర్ మాట్లాడుతూ.. అత్యవసర సమావేశపు ఎజెండాల్లో ఎందుకు ఒకే పైపులైన్ల పనిని వివిధ భాగాలుగా చేసి టెండర్లు పిలిచారని ప్రశ్నించారు. ఛైర్మన్ సమాధానమిస్తూ.. త్వరితగతిన పనులు పూర్తి కావడంతో పాటు, అత్యధిక నిధుల అవసరం ఉన్న నేపథ్యంలో ఇలా కేటాయించనట్లు తెలిపారు. కౌన్సిలర్ కె.రామలక్ష్మి మాట్లాడుతూ.. గతంలో లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వరద బాధితులను ఆదుకున్నారన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి గాలిలో తిరిగి పరిశీలిస్తే చంద్రబాబు పది రోజులు పాటు వరదలోనే పనులను పరిశీలించారని కొనియాడారు. కౌన్సిల్లో బలాబలాలు మారిన నేపథ్యంలో కోఆప్షన్ సభ్యుడిని తిరిగి ఎన్నుకోవాలని కౌన్సిలర్ సాంబ లేఖను అందించారు. ఇటీవల ఛైర్మన్ రాఘవేంద్ర సహా ముగ్గురు వైకాపా కౌన్సిలర్లు తెదేపాలో చేరడం, మరో 12 మంది వైకాపా కౌన్సిలర్లు ఉదయభానుతో పాటు వైకాపాకు రాజీనామా చేయడంతో బలాబలాలు పూర్తిగా మారిన అనంతరం జరిగిన తొలి సమావేశం కొత్త వాతావరణంలో జరిగింది.

జనసేనలో ఉదయభాను చేరిక నేడు

జగ్గయ్యపేట: వైకాపాకు రాజీనామా చేసి జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించిన మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను గురువారం లాంఛనంగా ఆ ప్రక్రియను పూర్తి చేయబోతున్నారు. జనసేన కేంద్ర కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటన మేరకు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మంగళగిరిలోని పవన్‌కల్యాణ్ కార్యాలయంలో ఉదయభాను చేరిక జరగనుంది. ఇప్పటికే కుటుంబ సమేతంగా పవన్ కల్యాణ్‌ను కలిసి ఆత్మీయ సత్కారంతో కృతజ్ఞతలు తెలిపిన ఉదయభాను గురువారం ఉదయం 12 గంటలకు తన ఇంటి నుంచి జనసేనలో చేరికకు బయలుదేరి వెళ్తున్నట్లు ప్రకటించారు.

మహారాజశ్రీ విజయవాడ 3వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.259/2023
Between:- (1) పలనాటి అజిత్‌కుమార్ (2) పలనాటి హేమలత (1, 2 వారు తరఫున జి.పి.ఎ. హోల్డరు [illegible]) ...వాదులు
మరియు
ఆట్లూరి వెంకట సత్యవరప్రసాద్, ఎ.పి.యస్.ఆర్.అంజనేయులు, ఫ్లాటు నెం. G1, శ్రీసాయి రామకృష్ణ అపార్టుమెంట్స్, డోర్ నెంబరు 56-6-26/1, మారుతీకాలనీ, పటమట, విజయవాడ, ఎన్.టి.ఆర్.జిల్లా ...ప్రతివాది
పై నెంబరు దావాలో ప్రతివాదియైన మీకు ఈ దావా [illegible] వాదులు దాఖలుచేసిన [illegible] ది. 17-10-2024వ తేదీన వాయిదా వేసినారు. కనుక ప్రతివాది పై కోర్టుకు ది. 17-10-2024వ తేదీన ఉదయం 10-30 గం||లకు హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో ఏకపక్షంగా తీర్మానించబడును.
వాయిదా: 17-10-2024
కె.బి. సుందర్
వాదుల తరఫున అడ్వకేట్
విజయవాడ. సెల్: 97016 96768.

మహా రాజశ్రీ విజయవాడ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO.929 /2021
Between:-
SAKINALA HARENDRANADH - Plaintiff
మరియు
NR'S BRILLIANT JUNIOR COLLEGE & MEDICAL ACADEMY,
Rep. by its Director: Komarabathini Nageswara Rao - Defendants
To
1) NR'S BRILLIANT JUNIOR COLLEGE & MEDICAL ACADEMY,
Rep. by its Director: Komarabathini Nageswara Rao #11-89, Jyothi Plaza, Near Peddapudi Gudi (Sivalayam) Penamaluru Village & Mandal, Vijayawada.
2) KOMARABATHINI NAGESWARA RAO, Director of NR'S BRILLIANT JUNIOR COLLEGE & MEDICAL ACADEMY, R/o. Sivam's K.R.K. Residency, Flat No.504, Near Bridge Down right Side, Tadigadapa, Vijayawada.
పై నెంబరు దావాలో ప్రతివాదులు అయిన మీకు దావా సమస్తు నిమిత్తం ది.04-10-2024వ తేదీన వాయిదా వుంది వున్నది. కనుక ఆ రోజున ఉదయం గం. 10-30 ని॥లకు మీరు స్వయంగా గాని లేక మీ ప్లీడర్ గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలిజేయడమైనది.
వాయిదా తేది.04-10-2024
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఇట్లు: **డి.పి. రామకృష్ణ**
వాదుల తరపు న్యాయవాది

'పాలకుల విధానాలతోనే విద్యుత్తు ఖర్చుల రెట్టింపు'


విద్యుత్తు నియంత్రణ మండలి విచారణలో బాబూరావు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణ ఖర్చు దాదాపుగా రెట్టింపు అవటానికి పాలకుల విధానాలే కారణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్.బాబూరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన కృష్ణపట్నం, ఇబ్రహీంపట్నంలోని థర్మల్ విద్యుత్తు కేంద్రాల అదనపు క్యాపిటల్ వ్యయం, టారిఫ్ అనుమతులపై కర్నూలు నుంచి నిర్వహించిన ఆన్‌లైన్ విచారణకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నూతన ప్లాంట్ల నిర్మాణంలో దశాబ్దంపాటు జాప్యం జరిగిందని విమర్శించారు. దీనివల్ల ఒక్కో మెగావాట్‌కు క్యాపిటల్ వ్యయం రూ.5కోట్ల నుంచి రూ.11 కోట్లకు పెరిగిందన్నారు. ప్రైవేటీకరణ విధానాలతో ప్రభుత్వ విద్యుత్తు ఉత్పత్తి సంస్థలకు నష్టం వచ్చిందన్నారు. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ల నిర్మాణం హర్షణీయమే కానీ.. పాలకుల విధానాలు, కార్పొరేట్ల దోపిడీ, ఉన్నతాధికారుల అవినీతి విద్యుత్తు రంగాన్ని నాశనం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్తు నియంత్రణ మండలి ప్రజలపై భారాలు మోపుతూ అధికారులు చేసే ప్రతిపాదనలను తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. వరద బాధితులకు ఆగస్టు, సెప్టెంబరు నెల బిల్లులను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. వైకాపా ప్రభుత్వం అదానీ కంపెనీతో 7వేల మెగావాట్ల విద్యుత్తు ఒప్పందాలు చేసుకోవటం అన్యాయమని పేర్కొన్నారు. దీర్ఘకాలంలో ప్రజలపై తీరని భారం పడుతుందన్నారు. గతంలో ఈ ఒప్పందాలను వ్యతిరేకించిన తెదేపా.. నేడు మౌనం వహించి వాటిని కొనసాగించటం సరికాదన్నారు. ఏకపక్ష నిర్ణయాలు తగదని బాబూరావు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుల దుర్మరణం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ఎ.కొండూరు అడ్డరోడ్డు సమీప మ్యాంగో యార్డు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానికంగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్న తండ్రీ కుమారులు మామిళ్ల శ్రీనివాసరావు(45), కుమారుడు ప్రసంగి(16) దుర్మరణం చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..వారిద్దరూ రాత్రి 10 గంటల తర్వాత దుకాణం మూసేసి నడుచుకుంటూ ఇంటి వద్దకు చేరుకుంటుండగా వెనుక నుంచి వచ్చిన గ్యాస్ సిలెండర్లు తరలిస్తున్న లారీ వారిని ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే వారిద్దరు ప్రాణాలు విడవగా.. లారీ రోడ్డుపై అదుపు తప్పి పల్టీ కొట్టింది. డ్రైవర్‌కు తీవ్రగాయాలవ్వడంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఒకట్రెండు నిమిషాల్లో ఇంట్లోకి అడుగు పెట్టె సమయంలో వారిని మృత్యువు గ్యాస్ లారీ రూపంలో వెంబడించిందని కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జిల్లా స్థాయి యువజనోత్సవాలకు దరఖాస్తులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : వచ్చే నెల 1వ తేదీన స్థానిక పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించే జిల్లా స్థాయి యువజనోత్సవాలకు 15 నుంచి 29 ఏళ్ల లోపు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన సంక్షేమాధికారి యు.శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో గానీ, వచ్చే నెల ఒకటో తేదీ ఉదయం 9 గంటలకు వేదిక వద్దగానీ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. వివరాలకు ఫోన్ 99495 22694, 90321 15987 నంబర్లపై కార్యాలయ పని వేళల్లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మళ్లింపు రహదారిపై రాకపోకలకు ఆటంకం


పాదచారులు, వాహనదారుల అవస్థలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని వినగడప సమీప కట్లేరు వంతెన వద్ద బుధవారం మధ్యాహ్నం నుంచి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ఎగువున కురిసిన వర్షంతో కట్లేరు వరద వంతెన వద్ద మళ్లింపు రోడ్డుపై ప్రవహిస్తోంది. సాయంత్రం ప్రవాహం అంతే ఉండడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు అతికష్టంపై రాకపోకలు సాగించారు. ప్రమాదాలకు జరగకుండా రాకపోకలు ఆపేసినట్లు ఎస్సై ఎస్.శ్రీను తెలిపారు.

కొండపల్లి కమిషనర్‌గా పి.శ్రీనివాసరావు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలికకు కమిషనర్‌గా పి.శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన ఒంగోలులో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ మేరకు రెండు రోజుల కిందట పురపాలిక శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజయవాడ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా ఉంటూ కొండపల్లి పురపాలిక కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించిన రమ్యకీర్తన తిరిగి ఆమె స్థానంలోనే కొనసాగనున్నారు. కొత్త కమిషనర్‌తో పాటు సహాయక ఇంజినీర్, టీపీవో, అకౌంటెంట్లుగా కొత్తవారు రానున్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఏఈ సాయిగణేష్ తాడిగడప పురపాలికకు, అకౌంటెంట్ నవీన్ గుడివాడకు బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లో కొత్తవారితో పాటు టీపీవో కూడా రానున్నారు.

నులిపురుగుల మాత్రల పంపిణీ


విద్యార్థులకు మందులు వేస్తున్న ఎంపీడీవో బి.వై.విష్ణు ప్రసాద్

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నులిపురుగుల మందులు బుధవారం పంపిణీ చేశారు. రెడ్డిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో బి.వై. విష్ణు ప్రసాద్, పీహెచ్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంభంపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఆరోగ్యశాఖ ఉద్యోగులు విద్యార్థులకు నులిపురుగుల నివారణ బిళ్లలు మింగించారని ఎస్ఎంసీ అధ్యక్షుడు ఎం.ఏలియబాబు తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నేత్ర సంబంధిత పరీక్షలు చేసినట్లు చెప్పారు. తెదేపా గ్రామ శాఖ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక లీలావతి పబ్లిక్ పాఠశాల్లో జాతీయ నులిపురుగులు నిర్మూలన దినోత్సవంలో భాగంగా బుధవారం పాఠశాల్లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసినట్లు పాఠశాల హెచ్ఎం ఉడుతా లక్ష్మీనారాయణ తెలిపారు. చంద్రాల పీహెచ్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం.. ఉపశమనం

ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే

ఈ నెలలో కురిసిన భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన అన్నదాతలకు ప్రభుత్వం అందించనున్న పరిహారం ఉపశమనం కలిగించనుంది. పది రోజులు పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పత్తి, వరి, పెసర, మినుము, మొక్కజొన్న, ఉద్యాన పంటలు ముంపునకు గురై నాశనమయ్యాయి. బుధవారం నుంచి రైతులు ఖాతాలకు పంట నష్ట పరిహారం సొమ్ములు జమ చేస్తోందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. సీఎం చంద్రబాబు కూడా భారీ వర్షాలతో హాలికుల కష్టం నీటి పాలైందని గుర్తించి చెల్లించే పరిహారం సొమ్మును పెంచారు. గత వైకాపా ప్రభుత్వంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నష్టపోయిన రైతులకు పత్తి, మిరపకు హెక్టారుకు రూ.17వేలు చెల్లించడం కూడా గగనమైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హెక్టారుకు పత్తి, మిరపకు రూ.25వేలు, అపరాలకు రూ.15వేలు వరకు మంజూరు చేసి అన్నదాతకు అండగా మేమున్నామని ఆదుకుంటోంది. సీఎం ఆదేశాల మేరకు నష్టపరిహారం రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమకానుంది.


వరద నీటిలో మునిగిన పత్తి మొక్కలు

పంట నష్టపోయిన రైతులు, విస్తీర్ణం, మంజూరు పరిహారం ఇలా

మండలం	రైతులు	విస్తీర్ణం (హెక్టార్లలో)	పరిహారం రూ.లక్షల్లో
గంపలగూడెం	2,741	1,224	3,01,27,753
ఎ.కొండూరు	165	87	17,09,915
తిరువూరు	103	45	10,10,534
విస్సన్నపేట	333	115	26,23,386
మొత్తం	3,342	1,471	3,54,71,588

3,342 మంది రైతులకు రూ.3.54 కోట్లు మంజూరు


ఇటీవల వర్షాలకు నీట మునిగిన వరి

సమస్య ఉంటే సంప్రదించండి

అధిక వర్షాలకు తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో వరి, పత్తి, అపరాలు, ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులకు భారీగా పెట్టుబడి నష్టం జరిగింది. వాగుల్లో వరద నీరు పోటెత్తడం, కాల్వలు, చెరువులకు గండ్లు పడడం, రోజుల తరబడి ముంపులో ఉండడం, మేట వేయడంతో పలు గ్రామాల్లో సాగుదారులకు పంటలు చేతికందకుండా పాడైపోయాయి. అప్పటికే ఎకరాకు రూ.వేలల్లో ఖర్చు చేసిన పెట్టుబడి నష్టం జరిగింది. నియోజకవర్గంలో ఎన్ని హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లింది..ఎంతమంది రైతులు నష్టపోయారు అనే దానిపై సమగ్ర సర్వే చేసిన వ్యవసాయాధికారులు గణన నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. దీంతో బాధిత రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. సదరు రైతులు బ్యాంకు ఖాతాల్లో సరిచూసుకుని ఏదైనా సమస్య ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించవచ్చు.

తెగుళ్ల నివారణపై అవగాహన


రైతులకు సూచనలు చేస్తున్న ఏవో రమేష్

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని రుద్రవరం, కుదప గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వివిధ పంటల్లో వచ్చే తెగుళ్లు, పురుగుల నివారణ చర్యలు గురించి ఏవో రమేష్ అవగాహన కల్పించారు. ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఉద్యానశాఖ సిబ్బంది చెన్నకేశవ, రాజు, రేణుక, సమృత్తి పాల్గొన్నారు.

పత్తికి తడులు అందించాల్సిన తరుణమిదే

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ జి. కెనడీ, ఏవో బి.సాయిశ్రీ పాల్గొని పత్తి పంటలో ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలను సాగుదారులకు వివరించారు. ప్రస్తుతం నీటి తడులు అందించాల్సి ఉందని, పైరులో పిండినల్లి, రసం పీల్చే పురుగులు గుర్తించినట్లు తెలిపారు. నివారణకు పిచికారీ చేయాల్సిన మందులను విశదీకరించారు. తెదేపా మండలాధ్యక్షుడు ఆర్. వీరారెడ్డి, ఎంపీఈవో జి. ప్రతాప్ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గొల్లపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన మరమ్మతుల కారణంగా గొల్లపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం సరఫరాను రెండు గంటల పాటు నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. నల్లగుంట, శాంతినగర్, అశోక్‌నగర్, కల్పతరవు స్థలాలు, రాయనపాడు రైల్వేస్టేషన్‌రోడ్డు, రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల్లో ఉదయం 8 నుంచి 10గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న ఏసీపీ ప్రసాదరావు

తిరువూరు, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానంతో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ వై. ప్రసాదరావు సూచించారు. స్థానిక శ్రీవాహిని ఇంజినీరింగ్ కళాశాలలో 'సైబర్ సిటిజెన్ యాప్'పై బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సామాజిక మాధ్యమాల్లో యాప్‌ల ద్వారా వచ్చిన అనుమానాస్పద లింక్‌లను తెరవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్‌కు స్పందించి బ్యాంకు ఖాతా, ఓటీపీ వంటి వివరాలు వెల్లడించవద్దన్నారు. సీఐ కె.గిరి బాబు, ఎస్సై సత్యనారాయణ, కళాశాల కరస్పాండెంట్ పి.నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. నాగేంద్రబాబు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: మహిళలు పనిచేసే ప్రదేశాల్లో ఆయా యాజమాన్యాలు వారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి సయ్యద్ ఫర్హీన్ సూచించారు. జూపూడి నిమ్రా ఫార్మసీ కళాశాలలో బుధవారం జరిగిన మహిళల భద్రత అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళలపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని..మహిళల పట్ల ప్రతి ఒక్కరి ఆలోచనలో మార్పులు రావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జనార్దన్, ప్రొఫెసర్ రవికుమార్, దీపారమణి, మహిళా అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రేపూడి(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని రేపూడిలో అనారోగ్యంతో బాధపడుతున్న తెదేపా కార్యకర్త వెంకటేశ్వరరావుకు ఏఎంసీ మాజీ అధ్యక్షుడు అలవాల రమేష్‌రెడ్డి బుధవారం రూ.10వేలు, 50కిలోల బియ్యం వితరణగా అందించారు. కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే: కొత్తూరుతాడేపల్లి గ్రామం ఎస్టీకాలనీకి చెందిన పొన్నూరు సుబ్బమ్మ అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబసభ్యులకు రూ.5వేలు ఆర్థిక సాయాన్ని తెదేపా నాయకుడు వేములకొండ నాగరాజు బుధవారం అందజేశారు.

జవివే ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విస్సన్నపేట: స్థానిక శ్రీశ్రీ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం చెకుముకి పరీక్ష నిర్వహించారు. 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వెంకటరాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజానికి పనికి వచ్చే పనులు చేస్తూ ఉన్నతికి బాటలు వేసుకోవాలని సూచించారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం రెడ్డిగూడెం గీతాంజలి పాఠశాల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు చెకుముకి పరీక్ష నిర్వహించారు. 982 మంది పాల్గొన్నట్లు జవివే జిల్లా కమిటీ సభ్యుడు జి.మల్లికార్జునరెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట పాత్రికేయుల ధర్నా

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక, మట్టి, గ్రావెల్, చౌకబియ్యం అక్రమ రవాణాపై వార్తలు రాసిన పాత్రికేయులను దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై తెదేపా అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే, ఏపీఎంపీఏ జిల్లా అధ్యక్షులు యు.వెంకట్రావు, బి.విజయబాబు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలకు నిరసనగా జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బోసుబొమ్మ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటూ పాత్రికేయులకు క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు. సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, బీఎస్పీ, వైకాపా, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి


ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బుధవారం ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేశారు. వాలంటీర్లు ఇళ్ల పరిసరాలు, కళాశాలలు, ఆరోగ్యకేంద్రాలు, పాఠశాలలు, బస్టాండ్‌లు, ప్రజాసంచార ప్రాంతాల్లో పర్యటించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఇళ్ల రవి, వైస్ ప్రిన్సిపల్ పి. రంగారావు, ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి డాక్టర్. వి. ఫణికుమార్, యూత్ రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ మేజర్ మెన్నే స్వామి, అధ్యాపకులు ఎం. శ్రీనివాసరావు, టి. సాంబశివరావు, నారాయణరావు, వెంకటాద్రి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలు..వృద్ధులకు అన్నదానం

గంపలగూడెం, న్యూస్‌టుడే: స్థానిక గ్రామ దేవత ముత్యాలమ్మ గుడిలో పేదలు, వృద్ధులకు బుధవారం దాతలు సీహెచ్.హనుమంతరావు, కిరణ్మయి, కె.మోహన్‌రావు, లక్ష్మీ తదితరులు అందించిన వితరణతో అన్నదానం చేసినట్లు నిర్వాహకురాలు కె.కృష్ణకుమారి తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు వితరణ

మైలవరం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గణపవరం గ్రామానికి చెందిన గుంటక రాకేష్‌రెడ్డి అనారోగ్యంతో సీఎంఆర్ఎఫ్‌కి దరఖాస్తు చేసుకోగా రూ.30వేలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మైలవరం కార్యాలయ ఇన్‌ఛార్జి నాగమల్లేశ్వరరావు, తెదేపా నాయకులు బుధవారం బాధితుడికి చెక్కు అందజేశారు.

దీన్ దయాళ్‌కు నివాళి


మైలవరం: దయాళ్ చిత్రపటానికి భాజపా నాయకుల నివాళి

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక భాజపా కార్యాలయంలో బుధవారం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాజపా మండలాధ్యక్షుడు తోట నాగేశ్వరరావు, నాయకులు పి. వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఎ.నాగరాజు. రామారావు, కోటేశ్వరరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి భాజపా ఆధ్వర్యంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండపల్లి పురపాలిక భాజపా అధ్యక్షుడు చల్లా ఆంజనేయులు, బొర్రా ప్రవీణ్, సత్యవతి, మాధురి, స్వాతి, భవాని తదితరులు పాల్గొని దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చినుకు పడితే చెరువే


వర్షపునీటిలో అవస్థలు పడుతున్న వాహదారులు

ఇబ్రహీంపట్నంలో బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఇబ్రహీంపట్నం -మైలవరం రహదారి పై జంక్షన్ చెరువును తలపించింది. ఈ రోడ్డుకి పక్కన ఏర్పాటు చేసిన డ్రెయినేజీ ఆక్రమణలకు గురవడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. సమస్య మా పరిధి కాదని పురపాలిక అధికారులు మాట దాటేస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఆక్రమదారులకు జాతీయరహదారి సంస్థ నోటీసులు ఇచ్చినా వారినుంచి స్పందన లేదని రహదారుల సంస్థ అధికారులు చెబుతున్నారు. దీనిపై జాతీయరహదారుల సహాయక ఇంజినీర్ చరణ్ మాట్లాడుతూ డ్రెయినేజీ ఆక్రమణకు గురైందని తొలగింపునకు ప్రయత్నిస్తే వారి నుంచి ప్రతిఘటన ఎదురవుతోందన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు వివరించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం(గ్రామీణం,

క్రీడాకారులకు అభినందన

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన మండల స్థాయి 68వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో కవులూరులోని భోగినేని రాజగోపాలరావు పుష్పావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు ఒ.నాగేంద్రరావు, ఉపాధ్యాయ సిబ్బంది క్రీడాకారులను శిక్షకులు శ్రీలతకు అభినందనలు తెలియజేశారు.

సీతారాం ఏచూరికి నివాళి

విస్సన్నపేట: స్థానిక కొత్తపేటలో సీపీఎం శాఖ మహాసభ బుధవారం నిర్వహించారు. మండల కమిటీ సభ్యురాలు కె.ధనలక్ష్మి జెండా ఎగరేసిన అనంతరం పార్టీ నాయకులతో కలిసి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఎం.నాగేంద్రప్రసాద్, వి.నాగరాజు, ఎం.జ్ఞానరత్నం, జి.రామకృష్ణ, బి.కిశోర్, లక్ష్మీ పాల్గొన్నారు.

సంపూర్ణత అభియాన్ కార్యక్రమం

ఇబ్రహీంపట్నం(గ్రామీణం: సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ వైద్య శ్రేయస్సు శిక్షణ వర్కుషాపు, ఆర్థిక సాక్షరత శిబిరాన్ని మూలపాడు, కాచవరం గ్రామాలలో బుధవారం మండల పరిషత్తు అధికారులు మూలపాడు రైతుభరోసా కేంద్రంలో నిర్వహించారు. ఇందులో గర్భిణులకు అందించే ప్రాథమిక వైద్య సేవలపై అవగాహన కల్పించారు.

స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌పై గ్రామసభలు నేడు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో గురువారం 'స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్'పై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ ఎం.శ్రీకృష్ణపరమాత్మ తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించే సభల్లో ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించి ప్రజల అభిప్రాయాలను తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

ద్విచక్ర వాహనాల చోరుడి అరెస్టు

చాట్రాయి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు నూజివీడు గ్రామీణ సీఐ కె.రామకృష్ణ తెలిపారు. చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం పోలవరం గ్రామానికి చెందిన కోట రవి ఇంటి వద్ద పలు ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి తనిఖీ చేశామన్నారు. అక్కడ 12 ద్విచక్ర వాహనాలు, ఒక మేకపోతును గుర్తించామన్నారు. దానిపై రవిని విచారించగా.. ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలో చోరీలు చేసినట్లు తెలిసిందన్నారు. తిరువూరు, ఏలూరు, చాట్రాయి పరిధిలోని వాహనాలుగా వాటిని గుర్తించామన్నారు.


జి.కొండూరు: కట్టుబడిపాలెంలో..


విస్సన్నపేటలో ..


ఇబ్రహీంపట్నం గ్రామీణం : కొటికలపూడిలో..

కూటమి పాలనలో అన్ని రంగాల అభివృద్ధి

రెడ్డిగూడెం, జి.కొండూరు, తిరువూరు, ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే : కూటమిపాలనలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయా పార్టీల నాయకులు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కూటమి నాయకులు బుధవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

వితరణ అందజేత

కొణిజెర్ల(గంపలగూడెం) కొణిజెర్ల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి గ్రామానికి చెందిన తెదేపా నాయకులు నంబూరు హరిప్రసాద్, పద్మావతి దంపతులు రూ.15వేలు వితరణగా అందించారు.

ఎన్‌సీసీలోకి విద్యార్థుల ఎంపిక

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ కేవీఆర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఎన్‌సీసీలో ప్రవేశానికి ఎంపిక పరీక్షలు నిర్వహించారు. ఎన్‌సీసీ 17వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే ఆధ్వర్యంలో పరుగు, రాత పరీక్షలు నిర్వహించి 32 మందిని ఎంపిక చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

? విజయవాడ నుంచి జక్కంపూడికాలనీకి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. పాదచారులు, వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. -ప్రకాష్, అజిత్‌సింగ్‌నగర్

✔ రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్తా - స్వరూపరాణి, పంచాయతీ కార్యదర్శి, గొల్లపూడి - న్యూస్‌టుడే, గొల్లపూడి

మా పంటలు మునుగుతున్నాయ్

వాగు ఆక్రమణలు తొలగించాలని రైతుల వినతి

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని గంగినేని గ్రామంలో తూర్పు వైపు కొండల్లో నుంచి కురువవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ఆ వాగు నీటితో స్థానికంగా ఎర్రచెరువు నిండి దాదాపు 150 ఎకరాల ఆయకట్టు రైతులు లబ్ధి పొందుతున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొందరు రైతులు సహజంగా ప్రవహించే వాగును గత 3 దశాబ్దాలుగా 8 నుంచి 10 ఎకరాల మేర ఆక్రమించుకుని ప్రవాహానికి అడ్డుకట్ట వేశారు. ఫలితంగా ఇటీవల కురిసిన వరదలకు ఈ వాగు ప్రవాహం గతి తప్పి రైతులు పొలాల్లోకి చేరింది. దీంతో ఇసుక మేట వేసిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక తహసీల్దార్‌కు కురువవాగు ఆక్రమణలను తొలగించాలని వినతిపత్రం సమర్పించారు. గతంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆందోళన చెందుతున్నారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా మండలంలో సర్వేయర్ లేకపోవడంతో కొలత వేయడంలో జాప్యం జరుగుతోందని, దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.


గంగినేనిలో కురువవాగు ప్రవాహానికి కొట్టుకుపోయిన తూములు

గ్యాస్ సిలిండర్ల వాహనానికి ప్రమాదం

పామర్రు రూరల్, న్యూస్‌టుడే: గ్యాస్ సిలిండర్లు రవాణా చేసే వాహనం.. ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన ఘటన మంగళవారం అర్ధరాత్రి పామర్రు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి విజయవాడ వైపు నుంచి మచిలీపట్నం పోర్టుకు రాతి బండలు లోడుతో లారీ విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై ప్రయాణిస్తోంది. పామర్రు బైపాస్‌లో గల రాయల్ హోటల్ సమీపానికి వచ్చేసరికి వాహనానికి గేర్ బాక్సు వద్ద సమస్య తలెత్తి నిలిచిపోయింది. అదే రూటులో కొండపల్లి నుంచి గ్యాస్ సిలిండర్ల లోడుతో మచిలీపట్నం వైపు వెళ్తున్న లారీ ముందు నిలిచి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో గ్యాస్ సిలిండర్ల వాహనం ముందుభాగం నుజ్జవగా వాహన డ్రైవర్ జి.దుర్గాప్రసాద్(26) క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పామర్రు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో డ్రైవర్‌ను బయటకు తీశారు. గాయాలైన అతడిని 108లో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా గ్యాస్ సిలెండర్లు గల లారీలో దాదాపు 590 నిండు సిలిండర్లు ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కటీ దెబ్బతినకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.


దెబ్బతిన్న లారీ ముందుభాగం

కళతప్పి.. తుప్పుపట్టి..!



తుప్పు పట్టిన మనిషి బొమ్మ


తలలేని కోడి బొమ్మ

పాడైపోయిన ఇనుప తుక్కుతో అందమైన కళాఖండాలను తీర్చిదిద్దారు. కానీ వాటి నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం గాలికి వదిలేయడంతో రంగులు లేక తుప్పు పట్టి కళావిహీనంగా మారాయి. కోడి బొమ్మకు తలకాయ లేక.. రంగులు మార్చే ఊసరవెల్లి సైతం వెలవెలబోతూ కనిపిస్తోంది. మరోవైపు సిటీ బస్టాండ్ దగ్గర పోలీసు కంట్రోల్ పాయింట్ కూడలిలో ఏర్పాటు చేసిన ఉద్యానవనంలో ఇనుప తుక్కుతో చేసిన కళాఖండాలు రంగులతో ఎంత అందంగా కనిపిస్తున్నాయో చూడండి. కానీ రామవరప్పాడు రింగ్ నుంచి మహానాడు కూడలి వరకూ ఉన్న ఉద్యానవనం మాత్రం వెలవెలబోతోంది.

- ఈనాడు, అమరావతి


రంగులు లేని ఊసరవెల్లి..


పులి ఇలా..


పోలీసు కంట్రోల్ పాయింట్ దగ్గర పార్కులో రంగులతో కళకళలాడుతున్న బొమ్మలు..

శుభాకాంక్షల వెల్లువ


కొనకళ్ల నారాయణకు మొక్క ఇస్తున్న రాష్ట్ర నాయకులు

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: ఏపీఎస్ఆర్టీసీ నూతన ఛైర్మన్‌గా నియమితులైన కొనకళ్ల నారాయణను బుధవారం సచివాలయంలో కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరి, ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు, కోశాధికారి సురేంద్ర మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆర్టీసీ కార్మిక పరిషత్ జిల్లా కార్యదర్శి వై. రమేష్ తెలిపారు.

సీఎం కార్యక్రమం.. ఆకస్మికంగా వైద్యుల రాక

☛ ఎన్టీఆర్ కలెక్టరేట్ వద్ద ఉత్కంఠ


మ్యూజియం రోడ్డులో బైఠాయించిన ప్రభుత్వ వైద్యులు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం.. వరద బాధితులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమయంలో.. ఒక్కసారిగా ప్రభుత్వ వైద్యులు అధిక సంఖ్యలో కలెక్టరేట్ వద్దకు తరలిరావడంతో ఉత్కంఠ నెలకొంది. పోలీసులు కంగుతిన్నారు. బారికేడ్లు అడ్డుపెట్టి వారిని అడ్డుకున్నారు. పీజీ కోర్సుల ప్రవేశాల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి వివరిస్తామని వైద్యులు పేర్కొన్నారు. రోడ్డుపై బైటాయించి ముఖ్యమంత్రి గారు... మా సమస్యలు చూడండి' అనే ప్లకార్డులు ప్రదర్శించారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న తమకు పీజీ కోర్సుల్లో ప్రవేశానికి గతంలో 30 శాతం రిజర్వేషన్ ఉండేదని చెప్పారు. ఇపుడు దీన్ని తగ్గించారని వాపోయారు. 19 రకాల స్పెషలైజేషన్ కోర్సుల ప్రవేశానికి ప్రాధాన్యం ఇచ్చేవారని.. ఇపుడు వాటిని అయిదింటికి కుదించారన్నారు. గతంలో 5 సంవత్సరాలు పాటు ప్రభుత్వ వైద్యశాలల్లో పని చేస్తామని బాండ్ ఇచ్చేవారమని.. ఇపుడు దాన్ని పదేళ్లకు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. బాండ్ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.25లక్షలు పెనాల్టీ కట్టేవారమని, ఇపుడు దాన్ని రూ.50లక్షలకు పెంచారని పేర్కొన్నారు. గతంలో ఉన్న నిబంధనలు మార్చి తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. వీటిని పరిష్కరించాలని నినాదాలు చేశారు. పోలీసులు.. కొంత మంది నిరసనకారులను ముఖ్యమంత్రి వద్దకు తీసుకువెళ్లగా.. సమస్యలను సీఎంకు వివరించారు. వాటిని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని ప్రభుత్వ వైద్యాధికారుల ప్రతినిధులు వెల్లడించారు.

చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యం

విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని


వీరవల్లి యూనిట్‌లో సమావేశమైన పాలకవర్గ సభ్యులు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : విజయ డెయిరీ ఛైర్మన్‌గా తాను కొనసాగాలా, వద్దా అనే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయమే తనకు శిరోధార్యమని డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం కృష్ణా జిల్లా వీరవల్లి యూనిట్‌లో పాలకవర్గ సభ్యుల అత్యవసర సమావేశం జరిగింది. అనంతరం చలసాని విలేకరులతో మాట్లాడారు. తనను రాజీనామా చేయాల్సిందిగా పార్టీ పెద్దల నుంచి సమాచారం వచ్చిన విషయం వాస్తవమేనని చెప్పారు. 2019లో చంద్రబాబు కారణంగానే తనకు ఛైర్మన్ పదవి వచ్చిందని, ఆయనకు వ్యతిరేకంగా ఎప్పుడూ వ్యవహరించలేదన్నారు. తాజా పరిణామాల్లోనూ ఆయన మాటే తనకు శిరోధార్యమని పేర్కొన్నారు. అయిదేళ్ల నాలుగు నెలలు ఛైర్మన్‌గా ఉన్న తాను సంస్థ అభివృద్ధికి శ్రమించానని, ఉమ్మడి జిల్లాలో ఉన్న పాడి రైతులందరికీ ఈ విషయం తెలుసు అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ కొత్త ఫ్యాక్టరీ నిర్మించామని, ఇటీవల వరదల్లో పాత ఫ్యాక్టరీ మునిగిపోతే ఇదే ఆపద్బాంధవిగా నిలిచిందన్నారు. తెదేపా ఆవిర్భావం నుంచి తాను పార్టీలో క్రియాశీలకంగా ఉన్నానన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన ఎవరితోనూ తాను అంట కాగలేదని, రాజకీయాలకతీతంగా విజయ డెయిరీ నడుస్తున్నందునే తాను ప్రత్యక్షంగా తెదేపా తరఫున రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించలేదన్నారు. డైరెక్టర్లంతా చంద్రబాబుని కలిసిన తర్వాతే నిర్ణయం తీసుకుందామని చెప్పారని, ఆ మేరకే తన కార్యాచరణ ఉంటుందని తెలిపారు.

❖ సీఎంతో భేటీకి నిర్ణయం

పార్టీ ఆదేశాల నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం వీరవల్లి యూనిట్‌లో పాలకవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఛైర్మన్‌తో పాటు, మాజీ ఎమ్మెల్యే, డైరెక్టర్లలో ఒకరైన దాసరి బాలవర్ధనరావు, మరో పది మంది డైరెక్టర్లు హాజరయ్యారు. ముగ్గురు మాత్రం పలు కారణాలతో గైర్హాజరయ్యారు. తనను రాజీనామా చేయాల్సిందిగా పార్టీ నుంచి వచ్చిన ఆదేశాలను చలసాని డైరెక్టర్లకు వివరించారు. దీనిపై కొద్దిసేపు చర్చ జరిపారు. ఒక దశలో సమావేశం నుంచి బయటకు వచ్చిన చలసాని తాను రాజీనామా చేసేస్తానని, మీడియాను పిలవాలంటూ భావోద్వేగానికి గురయ్యారు. సముదాయించిన సభ్యులు తొందరపాటు నిర్ణయం వద్దని, అందరం కలిసి సీఎం చంద్రబాబుని కలిసి మాట్లాడి, ఆ తర్వాత నిర్ణయం తీసుకుందామని సర్ది చెప్పారు.

❖ బోనస్ ప్రకటన

దసరా పండగ సందర్భంగా ఏటా మాదిరిగానే ఉద్యోగులు, పాల సంఘాల కార్యదర్శులకు విజయ డెయిరీ తరఫున బోనస్ ప్రకటించారు. ఉద్యోగులకు రూ.5.30 కోట్లు, పాల సంఘాల కార్యదర్శులకు రూ.1.32 కోట్లు చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు ఛైర్మన్ ప్రకటించారు.

ప్రతిష్ఠాత్మకంగా దసరా ఉత్సవాలు


అధికారులతో చర్చిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్

ఇంద్రకీలాద్రి న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సుజనాచౌదరి అన్నారు. తాడిగడపలోని ఎమ్మెల్యే కార్యాలయంలో దసరా ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, గద్దె రామ్మోహన్‌రావులతో కలిసి చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు భక్తుల మదిలో నిలిచే విధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. భక్తులకు తాగునీరు, ప్రసాదాలు, దర్శనం విషయాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది భక్తులు, ప్రముఖులు అమ్మవారి దర్శనానికి వస్తారని తెలిపారు. భద్రత, పారిశుద్ధ్యం, పార్కింగ్ తదితర విషయాల్లో అలసత్వం వద్దని పేర్కొన్నారు. ప్రసాదం తయారీలో పరిశుభ్రత, నాణ్యత ఉండాలని సూచించారు. డీసీపీ హరికృష్ణ, ఏడీసీపీ రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, దుర్గగుడి ఈఈలు కోటేశ్వరరావు రమాదేవి, వైకుంఠరావు పాల్గొన్నారు.

29న టెట్ హిందీ మోడల్ పరీక్ష

సీతారాంపురం, న్యూస్‌టుడే : నగరంలోని హిందీ సేవాసదన్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన ఏపీ టెట్ హిందీ ఆన్‌లైన్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి తెలిపారు. హిందీ సేవాసదన్ యాప్‌లో మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు రాష్ట్ర స్థాయిలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 95813 86150, 95536 77119 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

డీసీపీ క్రైమ్స్‌గా తిరుమలేశ్వరరెడ్డి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా వెయిటింగ్‌లో ఉన్న కె.తిరుమలేశ్వరరెడ్డిని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో డీసీపీ క్రైమ్స్‌గా నియమించారు.

పలు రైళ్లు పాక్షికంగా రద్దు.. దారి మళ్లింపు



విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ డివిజన్‌లో నిర్వహణ పనుల దృష్ట్యా పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతో పాటు దారి మళ్లిస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

❖ పాక్షికంగా రద్దయినవి: (రామవరప్పాడు-విజయవాడ) ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబరు 27 వరకు 07896 మచిలీపట్నం-విజయవాడ, 07769 విజయవాడ-మచిలీపట్నం, 07863 నర్సాపూర్-విజయవాడ, 07866 విజయవాడ-మచిలీపట్నం, 0770 మచిలీపట్నం-విజయవాడ, 07283 విజయవాడ-భీమవరం జంక్షన్, 07870 మచిలీపట్నం-విజయవాడ, 07861 విజయవాడ-నర్సాపూర్.

❖ దారి మళ్లించిన రైళ్లు: (వయా విజయవాడ, గుడివాడ, నిడదవోలు మీదుగా)

22643 ఎర్నాకుళం, పాట్నా (ఈ నెల 30, అక్టోబరు 7, 14, 21 తేదీల్లో), 12756 భావనగర్-కాకినాడ పోర్ట్ (అక్టోబరు 6, 12, 19, 26 తేదీల్లో), 12509 బెంగళూరు-భువనేశ్వర్ (అక్టోబరు 2, 4, 9, 11, 16, 18, 23, 25), 11019 ఛత్రపతి శివాజీ టెర్మినల్-భువనేశ్వర్ (ఈనెల 30, అక్టోబరు 2, 4, 5, 7, 9, 11, 12, 14, 16, 18, 19, 21, 23, 25, 26), 13351 ధన్‌బాద్-అల్లపూజ (ఈ నెల 30 నుంచి అక్టోబరు 27వరకు), 18111 టాటా-యశ్వంత్‌పూర్ (అక్టోబరు 3, 10, 17, 24 తేదీల్లో) దారి మళ్లించినట్లు తెలిపారు.

తిరుమల ప్రక్షాళన అత్యవసరం

❖ రౌండ్ టేబుల్ సమావేశంలో స్వామీజీలు


సమావేశంలో కమలానంద భారతీ స్వామి, శివస్వామి, మాతాజీ శివచైతన్య, హాజరత్తయ్య గుప్తా, భక్తిచైతన్యానంద స్వామి, సీతారామాంజనేయస్వామి, సత్యానందయోగి తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : పవిత్ర తిరుమలను సమూలంగా ప్రక్షాళన చేయాలని స్వామీజీలు డిమాండ్ చేశారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఘటనపై విచారణ జరపాలని కోరారు. బుధవారం హిందూ ఐకాస ఆధ్వర్యంలో విజయవాడలోని ఓ హోటల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి మాట్లాడుతూ.. తితిదే ఆధ్వర్యంలో గోశాల ఏర్పాటు చేసి, స్వచ్ఛమైన నెయ్యిని పవిత్ర లడ్డూ తయారీకి వాడాలని కోరారు. తితిదేతోపాటు ఇతర దేవస్థానాల కమిటీల సభ్యులుగా పరిపూర్ణ హిందువులను మాత్రమే నియమించాలని సూచించారు. సనాతన బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి, తిరుమలలో అన్యమత, ఆక్రమిత కట్టడాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ధర్మపరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో అక్టోబరు 6వ తేదీన హైదరాబాద్‌లో దాదాపు రెండు వేల మందితో సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. విశ్వాంతరాలలోని సర్వజనులు వేంకటేశ్వరస్వామి కృపా కటాక్షానికి.. స్వామి ప్రసాదం అయిన లడ్డూని మహాప్రసాదంగా స్వీకరిస్తున్నారని చెప్పారు. అలాంటి ప్రసాదాన్ని కలుషితం చేయడం క్షమించరాని నేరమన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భువనేశ్వరీ మఠం పీఠాధిపతి కమలానంద భారతీ స్వామి మాట్లాడుతూ.. దేవాలయ ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా కమిటీలను నియంచాలని సూచించారు. ఏ దేవాలయానికి ఎన్ని ఆస్తులు ఉన్నాయి? అవి ఎక్కడెక్కడ ఉన్నాయో.. ఆన్‌లైన్‌లో ప్రజలముందుంచాలని కోరారు. తిరుమల లడ్డూ కల్తీ ఘటనపై సకాలంలో స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లను స్వామీజీలు అభినందించారు. ఈ కార్యక్రమంలో చైతన్య తపోవన్ మాతాజీ శివచైతన్య, సత్యానందయోగి, భక్తి చైతన్యానంద స్వామి, సుందర్ మొంగళ్, లంకా సీతా రామాంజనేయస్వామి, శివాజీ, కె.దిలీప్ కుమార్, పి. మురళీకృష్ణ, రమేష్, త్రిమూర్తులు, ప్రభాకర్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

'డోర్ డెలివరీ పేరుతో నల్ల బజారుకు తరలింపు'


మాట్లాడుతున్న బిశ్వంబర్ బసు. పక్కన సంఘ నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో డోర్ డెలివరీ పేరుతో బ్లాక్ మార్కెట్టుకు రేషన్ తరలించారని రేషన్ డీలర్ల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి బిస్వంబర్ బసు అన్నారు. రేషన్ డీలర్ల సమస్యలపై తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఎండీయూ వాహనాల పేరుతో ప్రజాధనాన్ని గత ప్రభుత్వం రూ.కోట్లలో వృథా చేసిందన్నారు. రేషను డీలర్ల సమస్యలపై తెలంగాణ, దిల్లీ, పశ్చిమ బెంగాల్‌లో తమ సమాఖ్య పోరాటం చేసి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేసిందన్నారు. ఏపీలో సైతం డీలర్ల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని' పేర్కొన్నారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యులు తొండపు జనార్దన్ మాట్లాడుతూ.. పేదలకు పట్టెడు అన్నం పెట్టేందుకు రేషన్ విధానాన్ని తీసుకు వచ్చింది తెదేపా వ్యవస్థాపకులు ఎన్టీఆర్ అని.. ఆయన కలలు సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రేషన్ విధానంలో అనేక సంస్కరణలు తీసుకు వచ్చారన్నారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. రేషన్ డీలర్ల సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. రేషన్ డీలర్ల సమాఖ్య ఆంధ్రా, తెలంగాణ అధ్యక్షులు లీలా మాధవరావు, రాజు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, వెంకటరామిరెడ్డి, నరసింహారావు, నాని పాల్గొన్నారు.

హోరా.. హోరీగా ఫుట్‌బాల్


మ్యాచ్‌లో తలపడుతున్న కర్నూలు, ఎన్టీఆర్ జిల్లాల క్రీడాకారిణులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో పలు జట్లు హోరా.. హోరీగా తలపడ్డాయి. కానూరులోని అనుమోలు ప్రభాకర్ మైదానంలో బుధవారం జరిగిన మ్యాచ్‌ల్లో క్రీడాకారిణులు ఉత్సాహంగా తలపడ్డారు. పూల్ 'ఎ'లో అనంతపురం, పూల్ 'బి'లో శ్రీసత్యసాయి, పూల్ 'సి'లో కడప, పూల్ 'డి'లో కర్నూలు జట్లు విజేతగా నిలిచి సెమీ ఫైనల్స్‌లో ప్రవేశించాయి. మధ్యాహ్నం జరిగిన తొలి సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లో అనంతపురం జట్టు 3-0 గోల్స్ తేడాతో కడప జట్టుపై విజయం సాధించి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. చివరి రోజైన గురువారం రెండో సెమీస్‌లో శ్రీసత్యసాయి, కర్నూలు జట్లు తలపడనున్నాయి. అనంతరం మూడో స్థానం కోసం, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, బి.చక్రవర్తి తెలిపారు.

సర్పంచి భార్య ఆత్మహత్యాయత్నం


బాధితురాలు కవితను విజయవాడ తరలిస్తున్న కుటుంబ సభ్యులు

తిరువూరు, న్యూస్‌టుడే: తన పట్ల ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చేసిన అసభ్యపదజాలం కారణంగానే తన భార్య కవిత నిద్రమాత్రలు మింగిందని మండలంలోని చిట్టేల తెదేపా సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. స్థానిక ఆస్పత్రి వద్ద బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మంగళవారం స్థానిక రాజస్థాన్ సెంటర్‌లోని అడ్డాకూలీ వద్ద భవన నిర్మాణ కార్మికుల సమస్యలు తెలుసుకోవడానికి వచ్చిన ఎమ్మెల్యే పరుషపదజాలంతో హెచ్చరించడంతో ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలు జీర్ణించుకోలేని నా భార్య ఆత్మహత్యకు ప్రయత్నించిందన్నారు. తిరువూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించామని..పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడ తరలించామని వాపోయారు. ఇంతే కాక బెదిరింపులకు పాల్పడ్డారని..బుధవారం 20 మంది రౌడీలతో చిట్టేల వచ్చిన ఆయన యువకుల ముందు దూషించడమే కాకుండా, పొలానికి వెళ్తున్న తనపై దాడికి యత్నించారని ఆరోపించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో [కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236. **అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 555 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలి


మాట్లాడుతున్న ఆంజనేయులు. చిత్రంలో అరసవిల్లి కృష్ణ, శ్రీనివాస్, సుబ్బారావు, సురేష్‌కుమార్ తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : చిలకలూరిపేట బస్సు దహనం కేసులో 32 సంవత్సరాలుగా జైల్లో ఉన్న చలపతి, విజయవర్ధన్‌లను ప్రభుత్వం బేషరతుగా విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.ఆంజనేయులు కోరారు. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. చేసిన తప్పునకు మూడు జీవిత ఖైదీలు అనుభవిస్తున్నారని.. ఇంత శిక్ష అనుభవించినా విడుదల చేయకపోవడం సరికాదన్నారు. వారిద్దరూ దళిత కుటుంబాలకు చెందిన పేదవారని, వారిలో మార్పు వచ్చిందని, విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. 1999లో పరిటాల రవిని లక్ష్యంగా చేసుకొని హైదరాబాద్‌లో మద్దెలచెరువు సూరి ఏర్పాటు చేసిన ల్యాండ్‌మైన్ పేలి 26 మంది చనిపోయారని చెప్పారు. ఆ కేసులోని నిందితులంతా పదేళ్ల జైలు శిక్ష పూర్తి చేసుకొని విడుదలయ్యారని గుర్తు చేశారు. బస్సు దహనం కేసు నిందితులు దళితులు అవ్వడం వల్లే జైల్లో మగ్గిపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వివిధ జైళ్లలో 60ఏళ్లు నిండి, 14 సంవత్సరాల జైలు శిక్ష పూర్తి చేసుకున్న ఖైదీలను విడుదల చేయాలని విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ కోరారు. దీనిపై అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా గుంటూరులో బహిరంగ సభ నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్, దుర్గం సుబ్బారావు, సురేష్‌కుమార్, రోహిత్, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

తెనాలికి చెందిన మహిళామణులు ఆదర్శవంతమైన బాట పట్టారు. ఒకటి కాదు రెండు కాదు.. ఆరుకోట్ల విలువైన ఆస్తిని నిస్వార్థంగా ప్రభుత్వానికి అప్పగించారు. ఆరు దశాబ్దాల కిందట ఏ లక్ష్యంతో అయితే దాన్ని కొన్నారో అదే లక్ష్యంతో కొనసాగించాలని మాత్రమే కోరుతున్నారు ఆ మహిళా మూర్తులు!

శభాష్ తెనాలి నారీమణులు!





సాధారణంగా ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలు, మన ప్రాంతంలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు.. వీటి గురించి ఆలోచిస్తాం. దీనికి భిన్నంగా గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మహిళలు ప్రభుత్వానికి రూ.6 కోట్ల ఆస్తిని ఎదురిచ్చారు. బదులుగా అది మహిళాభ్యున్నతికై ఉపయోగపడాలని వారు కోరుకున్నారు. ఆరు దశాబ్దాల కిందట పట్టణంలోని వైద్యులు, న్యాయవాదులు, అధ్యాపకులు, విద్యావేత్తలు, చైతన్యవంతులైన గృహిణులు సుమారు 100 మంది కలిసి తమందరికీ వేదికగా మహిళా మండలిని ఏర్పాటు చేయాలనుకున్నారు. తలా కొంత మొత్తం వేసుకుని, మరి కొందరు మహిళా దాతల నుంచి విరాళాలు సేకరించి 1967లో తెనాలి నడిబొడ్డున 514 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి 'మహిళా మండలి' పేరుతోనే రిజిస్టర్ చేయించి భవనం నిర్మించుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్ 1969లో ఈ భవనాన్ని ప్రారంభించారు. డాక్టర్ చలసాని ఝాన్సీవాణి, బోయపాటి సుభద్రాదేవి అధ్యక్ష, కార్యదర్శులుగా నాడు మహిళల కోసం మొదలైన కార్యక్రమాలు అర్ధ శతాబ్దానికిపైగా కొనసాగాయి. మహిళలకు ప్రత్యేక గ్రంథాలయం ఏర్పాటుచేయడంతోపాటు ఉచిత వైద్య శిబిరాలు, కుట్టు శిక్షణ కేంద్రాలు, శాస్త్రీయ నృత్య, సంగీత శిక్షణ.. వంటి కార్యక్రమాల్ని నిర్వహిస్తూ వచ్చారు. ప్రతి నెలా సమావేశాలు ఏర్పాటు చేసుకుని... మహిళల్లో చైతన్యం తీసుకువస్తూ, వారికి మేమున్నామనే భరోసా ఇచ్చేవారు. అవగాహన కార్యక్రమాలపై తీర్మానాలు చేసుకుని వాటిని అమలు చేసేవారు.

మరింత మేలు జరగాలని...

మహిళా మండలి ఏర్పాటైన నాటి నుంచి సభ్యురాలిగా ఉన్న డాక్టర్ ముద్దన కస్తూరిబాయి 20 ఏళ్ల క్రితం అధ్యక్షురాలయ్యారు. మహిళలు ముందడుగు వేసేలా అనేక కార్యక్రమాలు చేపట్టారు. సభ్యుల్లో చాలామంది మరణించటం, మిగిలినవారు వయోభారంతో క్రియాశీలకంగా లేకపోవటంతో ఇటీవల కార్యక్రమాలు నెమ్మదించాయి. దాంతో 'మహిళా మండలి' భవనం తమ పర్యవేక్షణలో ఉండే కంటే ప్రభుత్వానికి అందిస్తే మహిళలకు మరింత మేలు జరుగుతుందన్న ఆలోచనను సభ్యుల ముందు ఉంచారు కస్తూరిబాయి. వారందరి సమ్మతితో తీర్మానం ద్వారా తాను హక్కులు పొంది.. మహిళా మండలి వేదికగా బుధవారం స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో పత్రాలపై సంతకాలు చేసి కార్యదర్శి కొసరాజు ఝాన్సీకుమారితో కలిసి మహిళా మండలి భవంతిని ప్రభుత్వానికి అప్పగించారు. ప్రస్తుత ప్రభుత్వ ఆధ్వర్యంలో తమ దానానికి న్యాయం, మహిళలకు మంచి జరుగుతాయన్న నమ్మకంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతారు కస్తూరిబాయి. తమ దాతృత్వంతో దేశం నలుమూలలనుంచీ ప్రశంసలు అందుకుంటున్నారు ఈ తెనాలి మహిళలు.

– షేక్ అబ్దుల్ తాజుద్దీన్, తెనాలి

ఏం తింటే కొలెస్ట్రాల్ తగ్గుతుంది?

ఈ మధ్య రక్తపరీక్షలు చేయించుకుంటే కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉందన్నారు. నా స్నేహితురాలూ అదే సమస్యతో బాధపడుతోంది. అయితే, మేమిద్దరం పూర్తి శాఖాహారులం. ఈ సమస్య మాకెందుకు వచ్చింది? ఆహారం ద్వారా తగ్గించుకునే మార్గం ఉందా? – శ్రీనిధి, కర్నూలు

ఒంట్లో కొలెస్ట్రాల్ మోతాదు పెరగడానికి కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం ఒక్కటే కారణం కాదు. శరీరతత్వం, జన్యువులు, జీవనశైలి వంటివి చాలానే ప్రభావితం చేస్తాయి. అయితే, వాటిని సమతుల్యం చేసుకుంటూ ఆహార నియంత్రణ పాటిస్తే కొలెస్ట్రాల్ తగ్గించుకోవడం సాధ్యమే. కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్, కొవ్వు పదార్థాలు శక్తి జనకాలు. వీటిని రోజువారీ శరీర అవసరాలకు మించి... ఏ రూపంలో తీసుకున్నా కొలెస్ట్రాల్ పెరుగుతుంది. అంటే... నూనెలు ఎక్కువగా ఉండే డీప్‌ఫ్రైలు, పచ్చళ్లు, చిరుతిళ్లు, చికెన్, పనీర్, గుడ్లు, పిండిపదార్థాలు, త్వరగా జీర్ణమయ్యే ప్రాసెస్డ్ ఫుడ్, స్వీట్లు, పళ్ల రసాలు వంటివన్నీ ఇందులోకి వస్తాయి. మరి దీన్ని నియంత్రించుకోవాలంటే... ముందు మన శరీర బరువు, ఎత్తు ఎంత, మనం చేసే పనులకు ఎంత ఎనర్జీ అవసరం... అందుకు ఏయే పదార్థాలను ఆహారంగా తీసుకోవాలి? వంటివన్నీ పరిగణనలోకి తీసుకుని నిపుణులు సూచించే బ్యాలెన్స్‌డ్ డైట్‌ని అనుసరించాలి. అందులో పీచు ఎక్కువగా, నూనె తక్కువగా ఉండే పదార్థాలు, నెమ్మదిగా జీర్ణమయ్యే ఓట్స్ బార్లీ, మొక్కజొన్న, చిరుధాన్యాలు తీసుకోవాలి. కూరగాయలకు ప్రాధాన్యం ఇవ్వాలి. డ్రైఫ్రూట్స్‌కి బదులు చియా, అవిసె గింజలను వినియోగించండి. ఈ మార్పులు చేసుకోవడంతో పాటు శారీరక శ్రమ తగినంతగా ఉండేలా చూసుకోవాలి. ఎత్తుకు తగ్గ బరువున్నారో లేదో చూసుకుని అందులో కనీసం పదిశాతమైనా తగ్గేలా ఏరోబిక్స్, డ్యాన్స్ వంటివి చేయగలిగితే చాలు. కొలెస్ట్రాల్‌ని తగ్గించుకోవచ్చు.

డియర్... వసుంధర



డా. జానకీ శ్రీనాథ్
పోషకాహార నిపుణులు

అప్పుడే... తెల్లజుట్టా?



20... 30ల్లోకి అడుగుపెట్టారో లేదో తెల్లవెంట్రుకలు కనిపించేస్తున్నాయి. దీంతో మిలీనియల్స్, జెన్ జీ తరాలకు ఇదో పెద్ద సమస్యగా మారింది. దాయడం, రంగేయడం సంగతి పక్కనుంచితే ఇంత త్వరగా ఈ 'నెరుపు' ఎందుకు పలకరిస్తున్నట్టు?

తల నెరవడానికి ప్రధాన కారణం వంశపారంపర్యమే అయినా ఆక్సిడేటివ్ స్ట్రెస్, కాలుష్యం, యూవీ రేడియేషన్ వంటి అంశాలూ ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి అంటున్నారు నిపుణులు. ఇక సన్నగా ఉండాలని సరిగా తినకపోవడం, నిద్రావేళలు పాటించకపోవడం, అస్తవ్యస్తమైన జీవనశైలి, ఒత్తిడి వంటివి సరేసరి. జంక్‌ఫుడ్ తినడం కారణంగా పోషకాహార లోపం, ఒబెసిటీ, మెటబాలిజంలో మార్పులు వస్తాయనుకుంటాం కదా... ఇదీ నెరుపు సమస్యకు దారితీస్తుంది! ఇవన్నీ కలిసి ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని పెంచేస్తున్నాయి. ఇదేమో మెలనోసైట్ కణాలపై దుష్ప్రభావం చూపి, వెంట్రుకలు తెల్లబడటానికి కారణమవుతున్నాయి. ఈ ప్రభావం కురుల పెరుగుదలపైనా పడుతుందట. అందుకే పోషకాహారం తీసుకుంటూనే ఒత్తిడిని తగ్గించుకోవడంపై దృష్టిపెట్టాలి. ఐరన్, కాపర్, విటమిన్ బి12 సరిగా అందుతున్నాయా అన్నది గమనించుకోవాలి. ఇంకా వ్యాయామం, సరైన నిద్రకీ ప్రాధాన్యమిస్తే హెయిర్ పిగ్మెంటేషన్‌పై ప్రభావం తగ్గుతుంది. అవసరమైతే నిపుణుల సాయమూ తీసుకోవచ్చు. వీరు ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గించి, మెలనోసైట్స్ పనితీరు మెరుగుపడేలా సూచనలిస్తారు. అయితే తిరిగి కురులు నల్లబడతాయని అనుకోవద్దు. ఇవి నల్లగా మార్చవు కానీ మిగతా వెంట్రుకలు తెల్లబడకుండా ఆపుతాయి. కాబట్టి, చిన్నవయసులో బామ్మలా తయారవొద్దంటే ఆహారం, కాలుష్యం, ఒత్తిడి... వీటన్నింటినీ గమనించుకోవాల్సిందే! చేస్తారా మరి?

హక్కుల నేతకు... ప్రధాని పీఠం!



మానవ హక్కులకోసం పోరాడిన నిప్పు కణిక... స్త్రీ హింసను వ్యతిరేకిస్తూ కదం తొక్కిన ధీర... ఉచిత విద్యకోసం ఎలుగెత్తిన విద్యావేత్త... ఆమే ఇప్పుడు శ్రీలంక దేశ ప్రధాని హరిణి అమర సూర్య. ఆవిడ ప్రత్యేకతలేంటో తెలుసా?

'మహిళలు రాజకీయాల్లోకి వస్తే... దేశం అభివృద్ధి పథంలో నడుస్తుంది. లక్ష్యం కోసం పోరాడాలనుకునే ఆడవారిపై కులం, మతం, కట్టూబొట్టూ, రంగు... ఇలా ఏ రూపంలోనైనా వివక్ష ఎదురుకావొచ్చు. ఇందుకు నేనూ మినహాయింపు కాదు... హరిణి పెళ్లెందుకు చేసుకోలేదు? మగరాయుడిలా తిరుగుతోంది వంటి వ్యాఖ్యలెన్నో విన్నా. ఇవేవీ నా లక్ష్యాల్ని నీరుగార్చలేదు. మరింత పట్టుదలను పెంచాయి' అంటారు హరిణి.

శ్రీలంక దక్షిణ భాగంలో ఉన్న గాలె.. హరిణి స్వస్థలం. ఓ టీ ఎస్టేట్ యజమాని ఇంట్లో ఇద్దరబ్బాయిల తరవాత పుట్టారామె. దేశ రాజకీయాల్లో వస్తోన్న మార్పులన్నీ చూస్తూ పెరిగారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం టీ ఎస్టేట్‌లన్నీ స్వాధీనం చేసుకుంది. దీంతో వీరి కుటుంబం ఉపాధి కోల్పోయి కొలంబోకి వలసెళ్లింది. చిన్నప్పటి నుంచీ హరిణి చురుకైన అమ్మాయి. చదువుల్లో ముందుండేది. స్థానికంగా ఉన్న ఆంగ్లికన్ ప్రైవేట్ బాలికల పాఠశాలలో ఆమెను చేర్చారు. ఎక్కువగా ధనికవర్గాల వారు చదివే మిషనరీ పాఠశాల అది. అయితే, అక్కడి పరిస్థితులు హరిణిలో స్త్రీవాద భావాల్నీ, పోరాడే తత్వాన్నీ నేర్పాయి. నన్స్ నడపడం వల్ల తనలో సేవాభావమూ అలవడిందని చెబుతారామె. ఆ తరవాత స్కూల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో భాగంగా కొన్నాళ్లు అమెరికాలోనూ చదివారు. తిరిగొచ్చేటప్పటికి దేశంలో అంతర్యుద్ధం మొదలైంది. ఆందోళనలు తారస్థాయికి చేరాయి. హింసాత్మక ఘటనలతో విద్యాసంస్థలన్నీ మూతపడ్డాయి. దాంతో హరిణి చదువుకి బ్రేక్ పడింది. దాన్ని తిరిగి కొనసాగించడానికి భారత్ చేరారామె. దిల్లీ విశ్వవిద్యాలయ పరిధిలోని హిందూ కాలేజీలో సోషియాలజీలో డిగ్రీ, యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బర్గ్ నుంచి సోషల్ ఆంత్రపాలజీలో డాక్టరేట్ పట్టా పొందారు. శ్రీలంకకు తిరిగొచ్చాక ఇంటర్నేషనల్ హ్యూమన్ డెవలప్‌మెంట్ రంగంలో పనిచేశారు. తరవాత కొంత విరామం తీసుకుని పీహెచ్‌డీ చేశారు.

మొదటి రోజే...

హరిణి కొన్నాళ్లు స్థానికంగా ఉండే ఓ ఎన్జీవోతో కలిసి కమ్యూనిటీ మెంటల్ హెల్త్ సెంటర్‌లో పనిచేశారు. శ్రీలంక విద్యా వ్యవస్థపై పరిశోధనలు చేశారు. ఈ క్రమంలోనే తమ దేశంలో నిరుద్యోగం, లింగ అసమానతలు, మహిళలు-పిల్లలకు భద్రత లేకపోవడం, స్త్రీల అభ్యున్నతికి అడ్డుపడుతున్న అంశాలు.. వంటివెన్నో గుర్తించారామె. అవే తాను ప్రపంచాన్ని చూసే దృక్కోణాన్ని మార్చేశాయని అంటారు హరిణి. ఎప్పటికైనా వీటిని రూపుమాపడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. కొన్నాళ్లకు శ్రీలంక ఓపెన్ యూనివర్సిటీలో సామాజిక శాస్త్రంలో సీనియర్ లెక్చరర్‌గా చేరారు. ఉద్యోగంలో చేరిన మొదటి రోజే 'యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఫెడరేషన్'లో సభ్యురాలిగా చేరి యువతకు విద్యా హక్కులపై తన గళాన్ని వినిపించారామె. లింగ సమానత్వం, స్వలింగ సంపర్కుల హక్కులకోసం నినదించారు.

రాజకీయాల్లో...

ఉద్యమాలు, సేవ సాగిస్తూనే హరిణి 2019లో నేషనల్ ఇంటలెక్చువల్స్ ఆర్గనైజేషన్‌లో చేరారు. అదే ఏడాది జరిగిన శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి అనుర కుమార దిసనాయకే తరఫున ప్రచారం చేశారు. ఆ మరుసటి ఏడాది జరిగిన పార్లమెంటరీ ఎన్నికల తరవాత ఆ పార్టీ ఎంపీగా ఎన్నికవడంతో తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. తాజాగా ఆమె శ్రీలంక ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. తద్వారా ఎన్‌పీపీ పార్టీ నుంచి ప్రధాని పీఠాన్ని అధిష్ఠించిన తొలి వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. అంతేకాదు, సిరిమావో బండారునాయకే, చంద్రికా కుమారతుంగ తరవాత మూడో మహిళా ప్రధానిగా పగ్గాలందుకున్న ఘనత హరిణిది. అధ్యక్షుడితో కలిసి దేశాన్ని ఆర్థికంగా సుస్థిరపరచడం, ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే తమ లక్ష్యమంటారు హరిణి.

● పేరెంటింగ్

లైట్‌హౌస్ పద్ధతి ప్రయత్నిస్తారా?

నేటి తల్లిదండ్రులకు పిల్లల పెంపకం ఓ పెద్ద సవాలు. కొందరు పిల్లల్ని మరీ కట్టేసినట్టు పెంచితే, ఇంకొందరు ఆడిందే ఆటగా వదిలేస్తారు. మధ్యే మార్గంగా లైట్‌హౌస్ విధానాన్ని సూచిస్తున్నారు నిపుణులు.

పడవలు సురక్షితంగా ఒడ్డుకు చేరుకునేందుకు లైట్‌హౌస్ సాయపడేట్టుగా.. లైట్‌హౌస్ పేరెంటింగ్ విధానంలో పిల్లలకు గమ్యాన్ని నిర్దేశించి దారి వాళ్లే ఎంచుకునే అవకాశం ఇవ్వాలి.



- లైట్‌హౌస్ పేరెంటింగ్ సమతూకంగా ఉంటుంది. దీన్లో పిల్లలు ఉండే పరిసరాలపైన తల్లిదండ్రులకు అవగాహన ఉంటుంది. వారికి కావాల్సిన స్వేచ్ఛ ఇస్తూనే, అవసరమైనప్పుడు మద్దతు అందించడానికి సిద్ధంగా ఉంటారు.
- పరిమితులు చెబుతూనే వారు సొంతంగా నిర్ణయాలు తీసుకునేలా, ఆత్మగౌరవం పెంపొందేలా, ఆలోచనల్ని పంచుకునేలా పెంచడం దీన్లో ముఖ్యం. ఫలితంగా పిల్లల్లో సమస్యలు పరిష్కరించుకునే నైపుణ్యం పెరుగుతుంది. అందుకు కాస్త సమయం పట్టొచ్చు. తల్లిదండ్రులు సహనంతో ఉండాలి.
- పిల్లలు పొరపాట్లు చేయడానికి, నిజాలు మాట్లాడ్డానికి స్వేచ్ఛ ఇవ్వాలి. అదే సమయంలో వారిని ఓ కంట గమనిస్తుండాలి.
- నచ్చింది ఎంపికచేసుకునే స్వేచ్ఛ ఇస్తారు. ఆ ఎంపిక సరైందా కాదా అనేది పిల్లలకు అనుభవ పూర్వకంగా అర్థమవుతుంది.
- పిల్లల ఆలోచనల్నీ, అభిప్రాయాల్నీ తెలుసుకొని గౌరవించడం దీన్లో ప్రధానం. తద్వారా వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
- ఓటమి కూడా విలువైన పాఠమని, ఆ అనుభవాన్ని భవిష్యత్తులో ఉపయోగించుకోవాలని నేర్పాలి.
- షరతుల్లేని ప్రేమని అందిస్తారు. అదే సమయంలో క్రమశిక్షణారాహిత్యాన్ని అంగీకరించరు.
- పిల్లలు కాలంతోపాటు పెరుగుతారు, మారతారనే అంశాన్ని తల్లిదండ్రులు అంగీకరించడం దీన్లో కీలకం. దానికి తగ్గట్టు పెంపకంలోనూ మార్పు రావాలనే అంశంతో ఏకీభవిస్తారు.

బంగారం-వెండి



25న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ.లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	7,060	7,000
వెండి (గ్రా)	101.00	98.00

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం (24క్యా)	77,020	76,360	74,760	74,750	76,500	75,950	76,030	75,900	76,740	75,870
ఆర్నమెంట్	70,600	70,000	70,060	70,000	70,840	70,300	71,130	69,960	70,600	69,800
వెండి (కిలో)	101,000	98,000	93,400	91,200	90,500	89,000	93,000	90,300	91,000	89,000

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.



నిద్రపోయి... రూ.9 లక్షలు గెలిచింది!

ఆకలి రుచి ఎరగదు... నిద్ర సుఖమెరగదు అంటారు కదా! కానీ, ప్రస్తుత జీవనశైలి కారణంగా సుతిమెత్తని పరుపుమీద పడుకున్నప్పటికీ నిద్రలోకి జారుకోవడానికి ఆపసోపాలు పడాల్సివస్తోంది. గంటలు గడిచినా కునుకు రావడానికి ఓ యుద్ధమే చేస్తున్నామనుకోండి. అందుకే, చాలామంది అమ్మాయిలకు మంచినిద్ర అనేది ఓ కలలానే ఉంటోంది. అయితే, బెంగళూరుకి చెందిన శైశ్వరి పాటిల్ మాత్రం వీటన్నింటినీ అధిగమించింది. తనకు ఉన్న నిద్రపోయే అలవాటు ఓ వరంలా మారింది. ఇదే ఆమెను రూ.9లక్షలు గెలుచుకునేలా చేసింది. శైశ్వరి ఓ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్. తాజాగా ఓ స్టార్టప్‌నకు చెందిన స్లీప్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో చేరారామె. ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ, దాన్ని సమన్వయం చేసుకుంటూ ఎంత బాగా నిద్రపోగలరో తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమట. అందుకోసం వాళ్లకు ఓ పోటీనీ నిర్వహిస్తారు. అందులో పాల్గొన్న 12మందిలో శైశ్వరి కూడా ఒకరు. పోటీలో భాగంగా రోజుకి కనీసం 8 నుంచి 9గంటల వరకూ గాఢ నిద్రపోవాల్సి ఉంటుంది. ఆ! అదేం పెద్ద పని. మేం కూడా నెగ్గుతాం అంటారా... కానీ అది అంత సులువేం కాదట. ఎందుకంటే దీన్లో రకరకాల స్లీప్ షెడ్యూళ్లు ఉంటాయట. వీటన్నింటిలో నెగ్గితేనే విజేతగా నిలుస్తారు. శైశ్వరి అందులో విజయం సాధించింది మరి. 'మనం ఏకాగ్రతతో పనిచేయాలన్నా, ఉత్పాదకత పెరగాలన్నా, భావోద్వేగాలు అదుపులో ఉండాలన్నా, శరీరం రిపేర్ అవ్వాలన్నా నిద్ర చాలా అవసరం. ఈతరం వారికి నిద్ర అనేది పెద్ద సమస్య. మొదట్లో బాగా నిద్రపోయినా, కొవిడ్ సమయం నుంచీ నా నిద్ర వేళలు క్రమం తప్పాయి. అయితే, ఈ పోటీలో పాల్గొనడం వల్ల తిరిగి రొటీన్‌లోకి రాగలిగా. ఈ పోటీల్లో మంచి స్కోర్ రావాలంటే మొదట క్రమబద్ధమైన నిద్రవేళలు ఏర్పరచుకోవాలి. రాత్రుళ్లు మొబైల్, టీవీల్లాంటివి చూడడం తగ్గించుకోవాలి' అని సలహాలిస్తోంది శైశ్వరి. మీరూ ప్రయత్నిస్తారా మరి!





ప్రపంచ స్కేట్ గేమ్స్‌లో తొలి పతకం !

భారత మహిళల జట్టు ప్రపంచ స్కేట్‌గేమ్స్‌లో దేశానికి తొలి పతకాన్ని సాధించింది. ఇటలీలో జరిగిన ఈ పోటీలో భారత మహిళల రోలర్ డెర్బీ జట్టు కాంస్యం సాధించి చరిత్ర సృష్టించింది. కెప్టెన్ శృతికా సరోదే నేతృత్వంలో టీమ్ ఇండియా జట్టు చైనాపై ఆధిపత్యం ప్రదర్శించింది. జట్టు సభ్యులందరినీ ఒకే తాటిపై నడిపించి విజయాన్ని కైవసం చేసుకోవడం వెనక శృతికా కృషి ఎంతో ఉంది. ప్రత్యర్థులు చేసిన ప్రతి డిఫెన్స్ లోపాన్ని సద్వినియోగం చేసుకుంటూ భారత మహిళల జట్టు తిరుగులేనిదిగా నిలిచేలా సారథ్యం వహించిందీమె. 'వరల్డ్ గేమ్స్ 2024లో చైనాను ఓడించి కాంస్యపతకాన్ని సాధించడం మహిళాక్రీడాకారులందరికీ గర్వించదగ్గ విషయం. చరిత్ర సృష్టించిన మా జట్టుకు అభినందనలు. ఈ టోర్నీలో భారత్‌కు ఇది తొలి పతకం'అంటున్న శృతికా కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తిచేసి, ఎంబీఏ చదువుతోంది. చిన్నప్పటి నుంచి స్కేటింగ్‌లో ఆసక్తితో హైస్కూల్ స్థాయి నుంచే శిక్షణ తీసుకుంది. చదువుతోపాటు మనసుకు నచ్చిన క్రీడనూ సమన్వయం చేసుకుంటూ, ప్రతిష్ఠాత్మకమైన పోటీల్లోనూ తన సత్తా చాటుతోంది. అలా గత 15 ఏళ్ల నుంచి జాతీయస్థాయి పోటీల్లో వరసగా ఏడు బంగారు పతకాలుసహా 100కుపైగా మెడల్స్, ట్రోఫీలు సాధించింది. ప్రపంచ, ఆసియా ఛాంపియన్‌షిప్ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి జట్టును ముందుకు నడిపించింది. రోలర్ స్కేటింగ్ రంగంలో ఈమె సాధిస్తున్న విజయాలకు గానూ మహారాష్ట్ర ప్రభుత్వం 'శివ ఛత్రపతి' అవార్డుతో సత్కరించి గౌరవించింది.




ఎన్నెన్నో వర్ణాలు.... జినియా అందాలు!

చామంతి, బంతి పూలను పోలినట్లు కనిపించే రంగు రంగుల పూల మొక్క జినియా. దీన్ని ఇంటి ముందు పెంచుకుంటే వర్ణరంజితంగా ఉండటమే కాదు, తుమ్మెదలూ, సీతాకోక చిలుకల సందడి చేస్తూ కొత్తందాన్నీ తెచ్చిపెడతాయి. ఈ మొక్కల్ని ఎలా పెంచాలో తెలుసుకుందామా!









ఇంటి తోట

జినియా మొక్కల్లో వందల రకాలు ఉన్నాయి. పూల రంగూ, ఆకారం, పూసే విధానం... ఇలా వాటి ప్రత్యేకతల్ని బట్టి వాటిని వర్గీకరిస్తారు. ఒకటీ, రెండు వర్ణాల్లోనే కాదు, వివిధ ఛాయల్లోనూ ఇవి కనిపిస్తాయి. దక్షిణ అమెరికాలో పుట్టి అలంకరణకోసం వాడే పూల మొక్కగా ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతున్నాయి. వీటి ఆకులు దళసరిగా ఉంటాయి. తొడిమ లేకుండా నేరుగా కొమ్మకే పూయడం జినియా ప్రత్యేకత. ఇక, ఈ పూలలోని పుప్పొడిని గ్రహించేందుకు వచ్చే తూనీగలూ, సీతాకోక చిలుకలూ చేసే సందడి అంతా ఇంతా కాదు.

ఆకుల్ని తడవనివ్వొద్దు...

జినియా మొక్కలు ఏ రకం నేలలోనైనా సులువుగా పెరుగుతాయి. ఒక్కసారి నాటుకుంటే ఏళ్ల తరబడి పూస్తాయి. సుమారు 15 సెం.మీల నుంచి మీటరు వరకూ ఎదుగుతాయి. వీటికి కనీసం ఐదారు గంటలైనా ఎండ తగిలేలా చూసుకోవడం అవసరం. వీటిని కాలి బాటల పక్కన పెంచాలనుకుంటే వాటి మధ్య కాస్త ఎడం ఉండేలా చూసుకోండి. వీటికి చీడపీడల ప్రమాదం తక్కువే. అయితే, నీళ్లు మరీ ఎక్కువైనా, ఆకులు తరచూ తడుస్తున్నా ఫంగల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు దాడిచేయొచ్చు. అందుకే, వేర్లకు మాత్రమే తడి అందించాలి. పదిహేను రోజులకోసారి వేపనూనె చల్లుకోవాలి. బేకింగ్ సోడా మిశ్రమాన్ని స్ప్రే చేసినా ఫలితం ఉంటుంది. తెలుపు, పసుపు, ఎరుపు, గులాబీ, నారింజ, ఊదా వంటి ఎన్నోరంగుల్లో పూస్తాయి. విత్తనాలు నాటిన తొంభై రోజుల్లోపే ఇవి విరబూస్తాయి. వాడిన, ఎండిన పుష్పాలను ఎప్పటికప్పుడు తుంచేస్తే మొక్క నిండుగా మొగ్గలొస్తాయి. పెంచుకున్న ప్రదేశం కలర్‌ఫుల్‌గా కనిపిస్తుంది.



ఉత్తమ పర్యాటక గ్రామం దేవ్‌మాలీ

అజ్మేర్: రాజస్థాన్‌లోని అజ్మేర్ సమీప బ్యావర్ జిల్లాకు చెందిన దేవ్‌మాలీ భారత్‌లో ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపికైంది. నవంబరు 27న దిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం ఈ గ్రామానికి అవార్డు అందించనుంది. దేవ్‌మాలీ ప్రత్యేకత ఏమిటంటే.. గ్రామానికి చెందిన 3,000 బీఘాల (1,875 ఎకరాల) భూమిని స్థానికంగా కొండపై వెలసిన దేవనారాయణ్ స్వామికి అంకితం చేశారు. ఏళ్లతరబడి గ్రామంలో నివసిస్తున్నా స్థానికులు ఎవరి వద్దా భూయాజమాన్య పత్రాలు ఉండవు. గ్రామస్థులకు శాశ్వత నివాసాలూ లేవు. ఎటుచూసినా గడ్డి కప్పిన మట్టి ఇళ్లే కనిపిస్తాయి. గ్రామంలో మాంసాహారం, మద్యపానం నిషేధం. వంటకు కిరోసిన్, వేప కలప వాడరు. ఇళ్లకు తాళాలు లేకున్నా, దశాబ్దాలుగా దొంగతనాలంటే ఏమిటో ఈ గ్రామస్థులు ఎరుగరు. చూడదగ్గ పర్యాటక ప్రదేశాలు, స్థానిక సంస్కృతిని పరిరక్షించడంలో ఆయా గ్రామాలు పోషిస్తున్న పాత్ర ఆధారంగా ఈ అవార్డులకు ఎంపిక జరిగింది.



ఎదుగుదల దేనిపై ఆధారపడి ఉంటుందంటే..

జీవితంలో ఎదురయ్యే వివిధ పరిస్థితులను మనం ఏ కోణంలో చూస్తాం, వాటికి ఎలా ప్రతిస్పందిస్తాం అనేదానిపైనే మన ఎదుగుదల ఆధారపడి ఉంటుంది. మనసు కలతగా ఉన్నప్పుడు చాలా పరిస్థితులను మనం సమస్యలుగా చూస్తాం. ప్రశాంతంగా ఉన్నప్పుడు.. అవే పరిస్థితులను సవాళ్లుగా భావిస్తాం. మనసు ఉత్తేజభరితంగా ఉంటే.. వాటిని మంచి అవకాశాలుగా పరిగణిస్తాం. కాబట్టి అన్నింటికంటే ముందు మీ మనసు/ఆలోచనలపై పట్టు సాధించండి.

– గౌర్ గోపాల్ దాస్, ఆధ్యాత్మికవేత్త

ఎదురులేని భారత్

- ప్రపంచ పురోగతికి మనమే చుక్కాని
- యువత భాగస్వామ్యానికి ఆహ్వానం
- మేక్ ఇన్ ఇండియా పదో వార్షికోత్సవంపై బ్లాగ్‌లో ప్రధాని మోదీ

దిల్లీ: పదేళ్ల కిందట ప్రారంభించిన మేక్ ఇన్ ఇండియాతో తయారీ రంగానికి గొప్ప ఊతం లభించిందని, దేశం కన్న కల శక్తిమంతమైన ఉద్యమంగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ ముందడుగు ద్వారా భారత్ అన్‌స్టాపబుల్‌గా అవతరించిందని తెలిపారు. మేక్ ఇన్ ఇండియా పదో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం లింక్డ్‌ఇన్‌లో పోస్టు చేసిన బ్లాగ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రక్రియలో పాలుపంచుకున్న వారంతా ఘన విజయాలను సాధించారని పేర్కొన్నారు. తమ అలుపెరుగని ప్రయత్నాలతో వారు అగ్రగాములుగా, విజనరీలుగా, సృష్టికర్తలుగా అవతరించారని వివరించారు. ఫలితంగా భారత్ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించిందని పేర్కొన్నారు.



ప్రపంచ అవసరాలను తీరుద్దాం

'ప్రస్తుత పరిస్థితులు భారత్‌కు అనుకూలంగా ఉన్నాయి. కరోనా మహమ్మారిలాంటి సంక్షోభాలను తట్టుకుని అభివృద్ధి బాటలో భారత్ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం మనం ప్రపంచాభివృద్ధికి చుక్కానిలా మారాం. మేక్ ఇన్ ఇండియాను మరింత ముందుకు తీసుకెళ్లే ప్రక్రియలో భాగస్వాములు కావాలని యువ స్నేహితులను ఆహ్వానిస్తున్నా. మన ప్రాశస్త్యాన్ని చాటేందుకు ప్రయత్నిద్దాం. నాణ్యమైన వాటిని అందించడంలో మన నిబద్ధతను చాటుదాం. సున్నా స్థాయి లోపాలు మన మంత్రం కావాలి. మనమంతా కలిసి ఒక్క మన అవసరాలనే కాకుండా ప్రపంచ అవసరాలను తీర్చేలా దేశాన్ని తీర్చిదిద్దుదాం. తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా మారుద్దాం' అని మోదీ పేర్కొన్నారు.

ఊహించని రంగాల్లోనూ విజయం

మేక్ ఇన్ ఇండియా ద్వారా ఊహించని రంగాల్లోనూ విజయం సాధించామని ప్రధాని తెలిపారు. గతంలో కేవలం రెండు సెల్‌ఫోన్ల తయారీ కేంద్రాలుండగా ఇప్పుడవి 200కు చేరుకోవడమే దీనికి పెద్ద ఉదాహరణని వెల్లడించారు. సెల్‌ఫోన్ల ఎగుమతులు రూ.1,556 కోట్ల నుంచి రూ.1.2 లక్షల కోట్లకు చేరాయని వివరించారు. దేశంలో వాడుతున్న 99శాతం మొబైల్ ఫోన్లు మేడ్ ఇన్ ఇండియావేనని తెలిపారు. స్టీల్, సెమీ కండక్టర్, పునరుత్పాదక ఇంధనం, రక్షణ రంగాల్లో గణనీయ ప్రగతి సాధించామని వెల్లడించారు. ఎగుమతుల్లో 239 శాతం వృద్ధి సాధించామని, దిగుమతులను తగ్గించగలిగామని తెలిపారు.

ఎన్నో విజయాలు..

'వందే భారత్ రైళ్లు, బ్రహ్మోస్ క్షిపణులు, సెల్‌ఫోన్ల తయారీ రంగాలు భారత్ సాధించిన విజయాలకు సూచికలు. ఇవన్నీ మేక్ ఇన్ ఇండియాకు గర్వకారణం. ఎలక్ట్రానిక్స్ నుంచి అంతరిక్షం దాకా భారత్ నాణ్యతను ప్రతిబింబిస్తున్నాయి. పేదలు సంపద సృష్టిస్తారని మేక్ ఇన్ ఇండియా నిరూపించింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం అనేది గేమ్ ఛేంజర్. అది వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు లక్షల ఉద్యోగాలను సృష్టించింది. మనమంతా కలిసి ఆత్మనిర్భర్ భారత్‌ను వికసిత్ భారత్‌ను నిర్మిద్దాం' అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

కశ్మీర్‌లో 56.05% పోలింగ్

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లో బుధవారం జరిగిన రెండో విడత ఎన్నికల్లో 56.05శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల సంఘం అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ ముగిసింది. అయితే 6 జిల్లాల్లోని 26 నియోజకవర్గాల్లో ఈసారి నమోదైన పోలింగ్ 2014 కంటే తక్కువ కావడం గమనార్హం. అప్పట్లో 60శాతం పోలింగ్ నమోదైంది. మరోవైపు మొదటి విడతలో భాగంగా ఈ నెల 18వ తేదీన జరిగిన ఎన్నికల్లో 61.38% పోలింగ్ నమోదైంది. దీనికంటే కూడా రెండో విడతలో పోలింగ్ తగ్గింది. తుది విడత పోలింగ్ అక్టోబరు 1న జరగనుంది.

■ అత్యధికంగా 79.95% పోలింగ్ శ్రీమాతా వైష్ణో దేవి నియోజకవర్గంలో నమోదైంది.

■ సురాన్‌కోట్‌లో 75.11%, గులాబ్‌గఢ్‌లో 73.49%, కంగన్‌లో 71.89% పోలింగ్ నమోదైంది.



బడ్‌గామ్ జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన నూతన వధువు

సాగు చట్టాల అగ్గి రాజేసిన కంగనా

- ఆ మూడు శాసనాలను మళ్లీ తీసుకురావాలంటూ వ్యాఖ్య
- తీవ్ర వివాదానికి దారితీయటంతో ఆ మాటలు వెనక్కి...

శిమ్లా: కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన మూడు సాగు చట్టాలను మళ్లీ తీసుకురావాలంటూ సినీనటి, భాజపా ఎంపీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. అధికార భాజపా వెంటనే స్పందించి ఆ మాటలు కంగనా వ్యక్తిగతమంటూ వివాదానికి దూరం జరిగే యత్నం చేసింది. ఇది కంగనా ద్వారా భాజపా ఆడిస్తున్న నాటకమంటూ విపక్ష కాంగ్రెస్ ధ్వజమెత్తింది. సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమించిన రాష్ట్రాల్లో హరియాణా కూడా ఒకటి. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో అధికార భాజపాకి కంగనా రనౌత్ మాటలు తీవ్ర ఇబ్బందికరంగా మారాయి.

కంగనా ఏమన్నారంటే...

హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీలో ఎంపీ కంగనా రనౌత్ మంగళవారం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ...'వివాదాస్పదమైన మూడు సాగు చట్టాలకు కొన్ని రాష్ట్రాల నుంచే వ్యతిరేకత వచ్చింది. రైతుల ప్రయోజనం కోసం వాటిని మళ్లీ తీసుకురావాలని చేతులెత్తి నమస్కరిస్తూ విజ్ఞప్తి చేస్తున్నా' అని అన్నారు. దీనిపై దుమారం రేగడంతో బుధవారం ఆమె సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా క్షమాపణలు తెలిపారు. 'నా వ్యాఖ్యలు చాలా మందిని అసంతృప్తికి గురిచేశాయి. వ్యక్తిగత అభిప్రాయమైనా సరే పార్టీ వైఖరిని ప్రతిబింబిస్తుందన్న విషయం తెలుసుకున్నా. నా మాటలు ఎవరినైనా బాధించి ఉంటే క్షమాపణలు చెబుతున్నా. సాగు చట్టాలపై వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా. ప్రధాని మోదీ నిర్ణయానికి కట్టుబడి ఉండటం ప్రతి భాజపా సభ్యుడి బాధ్యత' అంటూ వీడియో సందేశంలో పేర్కొన్నారు.



భాజపా రైతు వ్యతిరేకత బహిర్గతం: ఖర్గే

కంగనా రనౌత్ వ్యాఖ్యలు భాజపా రైతు వ్యతిరేక విధానాలను బహిర్గతం చేశాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విరుచుకుపడ్డారు. సాగు చట్టాల వ్యతిరేక ఉద్యమంలో 750 మంది రైతులు బలైన తర్వాత కూడా భాజపా తన ఘోర తప్పిదాన్ని గుర్తించట్లేదన్నారు. కంగనా వ్యాఖ్యలపై మోదీ స్పష్టతనివ్వాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.

టెల్ అవీవ్‌పైకి బాలిస్టిక్ క్షిపణి

- మధ్యలోనే కూల్చివేత

టెల్ అవీవ్: వారం రోజులుగా ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులతో భారీ ఎదురుదెబ్బలు తింటున్న హెజ్‌బొల్లా.. బుధవారం టెల్ అవీవ్‌పై ఖాదర్-1 బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించి ప్రకంపనలు సృష్టించింది. ఇది ఇజ్రాయెల్ ఊహించనది. 11 నెలలుగా జరుగుతున్న గాజా యుద్ధంలో టెల్ అవీవ్ లక్ష్యంగా హెజ్‌బొల్లా క్షిపణిని ప్రయోగించడం ఇదే తొలిసారి. అయితే దీన్ని ఇజ్రాయెల్ అడ్డుకొని గాల్లోనే పేల్చివేసింది. దీంతో టెల్‌అవీవ్‌కు ముప్పు తప్పింది. అదే సమయంలో సీ ఆఫ్ గలీల్ దిశగా తమ భూభాగంలోకి ప్రవేశించిన డ్రోన్లనూ కూల్చివేశామని ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) వెల్లడించింది. ఈ డ్రోన్లను ఇరాక్, సిరియా గగనతలం నుంచి హెజ్‌బొల్లా ప్రయోగించినట్లు పేర్కొంది. ఖాదర్-1 క్షిపణి గగనతలంలో ఉండగా.. టెల్ అవీవ్, సెంట్రల్ ఇజ్రాయెల్‌లో సైరన్లు మోగాయి. ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఎలాంటి ఆస్తినష్టం సంభవించలేదని, ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. తమ కమాండర్ల హత్యలకు ప్రతీకారంగా మొస్సాద్ కేంద్ర కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకొని ఈ క్షిపణిని ప్రయోగించామని హెజ్‌బొల్లా ఒక ప్రకటనలో పేర్కొంది. పలు ఇజ్రాయెల్ సైనిక స్థావరాలపై దాడి చేశామని, ఒక ఆయుధ డిపోపై బాంబుల వర్షం కురిపించామని తెలిపింది. ఇరాక్ నుంచి ప్రయోగించినట్లు భావిస్తున్న ఒక డ్రోన్ బుధవారం ఇజ్రాయెల్‌లోని ఐలాత్ ఓడరేవును దెబ్బతీసింది. మరో డ్రోన్‌ను సైన్యం అడ్డుకుంది.

■ బాలిస్టిక్ క్షిపణి దాడికి తమ స్పందన తీవ్రంగా ఉంటుందని ఇజ్రాయెల్ పేర్కొంది. ఇక శత్రువు భూభాగంలోకి ప్రవేశిస్తామని, హెజ్‌బొల్లాపై భూతల దాడికి తమ సైన్యం సిద్ధమయిందని ఇజ్రాయెల్ సైన్యాధిపతి లెఫ్టినెంట్ జనరల్ హెర్జి హెలావి ప్రకటించారు.



సైనికులతో భేటీలో ఇజ్రాయెల్ సైన్యాధిపతి హెర్జి హెలావి

రష్యాపై పోరుకు సహకరిస్తే

మీరూ మాపై దాడిచేసినట్లే భావిస్తాం

అణు దేశాలకు పుతిన్ హెచ్చరిక

మాస్కో: రష్యాపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్న ఒక దేశానికి అణుశక్తి కలిగిన మరో దేశం సహకారం అందిస్తుండటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని అధ్యక్షుడు పుతిన్ స్పష్టంచేశారు. అణ్వస్త్రాలు లేని దేశం చేసే దాడికి మద్దతిస్తే రెండు దేశాలు కలిసి చేసినట్లుగానే భావిస్తామని హెచ్చరించారు. బుధవారం రష్యా భద్రతా మండలి సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడారు. అయితే ఈ దాడులకు అణ్వాయుధాలతో సమాధానం ఇస్తారా లేదా అనే విషయాన్ని పుతిన్ స్పష్టం చేయలేదు.. ఇకపై నాటో అందించిన దీర్ఘ శ్రేణి ఆయుధాలను ఉక్రెయిన్ ప్రయోగిస్తే అది రష్యా-నాటో యుద్ధంగానే పరిగణిస్తామని పుతిన్ అంటున్నారు. రష్యా అణు ముసాయిదాలో తాజా మార్పుల ప్రకారం.. ప్రత్యర్థులు విమానాల ద్వారా భారీ దాడులు చేయడం, క్రూజ్ క్షిపణులను, డ్రోన్లను ప్రయోగించినప్పుడు అణ్వస్త్రాలను వినియోగించేందుకు రష్యా నిర్ణయం తీసుకుంటుంది.

చైనా ఖండాంతర క్షిపణి పరీక్ష విజయవంతం



బీజింగ్: ఒక్కసారే దాదాపు 10 అణ్వాయుధ వార్‌హెడ్‌లను మోసుకెళ్లే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి(ఐసీబీఎం)ని బుధవారం చైనా విజయవంతంగా పరీక్షించింది. హైనన్ ద్వీపం నుంచి ఉదయం 8.44 గంటలకు ప్రయోగించిన ఈ క్షిపణి సుమారు 12 వేల కిలోమీటర్లు ప్రయాణించి పసిఫిక్ మహాసముద్రంలోని అంతర్జాతీయ జలాల్లోకి పడినట్లు తెలుస్తోంది. ఇది డీఎఫ్-31 లేదా డీఎఫ్-41 రకానికి చెందినది కావొచ్చని భావిస్తున్నారు. దీనికి 12 వేల నుంచి 15 వేల కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యం ఉంది. ప్రస్తుత క్షిపణి.. అమెరికాలోని ప్రధాన నగరాలను సునాయాసంగా ఢీకొట్టగలదు.

కశ్మీర్ ఎన్నికలపై ప్రశంసలు

- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన విదేశీ దౌత్యవేత్తలు

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రజాస్వామ్యయుతంగా, ఆరోగ్యకర వాతావరణంలో జరుగుతోందని విదేశీ దౌత్యవేత్తలు ప్రశంసించారు. పోలింగ్ తీరుపట్ల వారు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. తమ దేశంలో జరిగినట్లే స్వేచ్ఛగా జరుగుతున్నాయని కొంత మంది వ్యాఖ్యానించారు. బుధవారం రెండో విడత పోలింగ్ నేపథ్యంలో 16 దేశాల దౌత్యవేత్తలను కేంద్ర ఎన్నికల సంఘం జమ్మూ కశ్మీర్‌కు ఆహ్వానించింది. ఇందులో అమెరికా, నార్వే, సింగపూర్, దక్షిణ కొరియా, మెక్సికో, గయానా, సోమాలియా, పనామా, నైజీరియా, స్పెయిన్, దక్షిణాఫ్రికా, టాంజానియా, రువాండా, అల్జీరియా, ఫిలిప్పీన్స్ దేశాల దౌత్యవేత్తలున్నారు. వారు బడ్‌గామ్ జిల్లాలోని ఓంపోరా, అమీరా కదల్, ఎస్పీ కళాశాల, చినార్ బాగ్‌లలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎస్పీ కళాశాలలో ఏర్పాటు చేసిన పింక్ పోలింగ్ కేంద్రాన్ని చూసి ప్రశంసించారు. మరోవైపు విదేశీ దౌత్యవేత్తలను ఎన్నికల పరిశీలనకు ఆహ్వానించడాన్ని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా తప్పుబట్టారు. మన దేశ ఎన్నికలతో వారికేం సంబంధమని నిలదీశారు.

■ పోలింగ్ ప్రక్రియ ఆరోగ్యకర వాతావరణంలో, ప్రజాస్వామ్యయుతంగా జరుగుతోందని దిల్లీలోని అమెరికా కాన్సులేట్ డిప్యూటీ చీఫ్ జోర్గాన్ కె ఆండ్రూస్ ప్రశంసించారు. పదేళ్ల తర్వాత కశ్మీర్‌లో ఎన్నికలు జరగడం సంతోషకరమని వ్యాఖ్యానించారు. అంతా మహిళా అధికారులే నిర్వహించే పింక్ పోలింగ్ స్టేషన్ల ఆలోచనను దక్షిణ కొరియా దౌత్యవేత్త శాంగ్ వూ లిమ్ మెచ్చుకున్నారు. తొలిసారిగా కశ్మీర్‌కు వచ్చానని, ఈ ప్రాంతం ఎంతో సుందరంగా ఉందని, ప్రజలు ఎంతో మంచివారని వ్యాఖ్యానించారు.

■ తమ దేశంలో నిర్వహించే విధంగానే ఎన్నికల తీరు ఉందని దిల్లీలోని సింగపూర్ దౌత్య కార్యాలయ డిప్యూటీ చీఫ్ వీ వీ అలిస్ పేర్కొన్నారు.

చరిత్ర సృష్టిస్తున్నాయి

సీఈసీ రాజీవ్ కుమార్ వెల్లడి

దిల్లీ: జమ్మూ కశ్మీర్ ఎన్నికలు చరిత్ర సృష్టించబోతున్నాయని, ఓటేసేందుకు ప్రజలు పోలింగ్ కేంద్రాలవద్ద బారులు తీరారని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. 100 శాతం సీసీ కెమెరాల పర్యవేక్షణలో పోలింగ్ జరిగిందని తెలిపారు. కశ్మీర్‌లో రెండో విడత పోలింగ్ సందర్భంగా బుధవారం ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడారు. యువత, మహిళలు, సీనియర్ సిటిజన్లు ఓపికగా క్యూలలో నిల్చున్నారని తెలిపారు. దీనిని ప్రజలు ప్రజాస్వామ్య పండగలా భావిస్తున్నారని అభిప్రాయపడ్డారు.

ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా కాల్పుల విరమణకు అమెరికా ప్రతిపాదన

న్యూయార్క్: ఇజ్రాయెల్- హెజ్‌బొల్లా మధ్య తాత్కాలిక కాల్పుల విరమణకు అమెరికా ఒక ప్రతిపాదన చేస్తోంది. ఉత్తర ఇజ్రాయెల్‌లో, దక్షిణ లెబనాన్‌లో వేలసంఖ్యలో ప్రజలు తమ ఇళ్లను విడిచి వెళ్లాల్సి రావడంతో ఉద్రిక్తతలను చల్లార్చడానికి బైడెన్ యంత్రాంగం చొరవ చూపిస్తోంది. న్యూయార్క్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఐరాస సర్వప్రతినిధి సభ సమావేశాలకు హాజరైన ప్రపంచ దేశాధినేతలతో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, అధికారులు ఈ దిశగా మంతనాలు జరిపారు.

హారిస్ ప్రచార కార్యాలయంపై మరోసారి కాల్పులు

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షురాలు, డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ పార్టీ ప్రచార కార్యాలయంపై మరోసారి కాల్పులు జరిగాయి. అరిజోనాలోని పార్టీ సమన్వయ ప్రచార కార్యాలయంపై సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపినట్లు పోలీసులు ప్రకటించారు. కాల్పుల సమయంలో కార్యాలయం లోపల ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పిందని తెలిపారు. కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా ఈ నెల 16న సైతం ఇదే తరహాలో అరిజోనా కార్యాలయంపై గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరపడం గమనార్హం.

భారత భూభాగాన్ని

పాకిస్థాన్‌తో పోల్చడం సరికాదు

- మహిళా ద్వేషి అనే భావన కలగకుండా న్యాయస్థానాలు అప్రమత్తత పాటించాలి
- కర్ణాటక హైకోర్టు జడ్జిపై సుమోటో విచారణ ముగిస్తూ సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యలు

దిల్లీ: మన దేశంలోని ఏ ప్రాంతాన్నీ పాకిస్థాన్‌తో పోల్చడం సరికాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ మందలించారు. అది భారత ప్రాదేశిక సమగ్రతకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. మహిళా విద్వేషి, ఒక వర్గ ప్రజల పక్షపాతి అనే అపవాదు రాకుండా కూడా న్యాయస్థానాలు అప్రమత్తంగా వ్యవహరించాలని హితబోధ చేశారు. కర్ణాటక హైకోర్టు జడ్జి అభ్యంతరకర వ్యాఖ్యలపై సుమోటోగా చేపట్టిన కేసు విచారణను బుధవారం ముగిస్తూ సీజేఐ ఈ విషయాలను నొక్కి చెప్పారు. ఈ నెల 21న హైకోర్టు న్యాయమూర్తి బహిరంగ క్షమాపణ చెప్పడంతో సుమోటో కేసును విరమిస్తున్నట్లు తెలిపారు. న్యాయవ్యవస్థ గౌరవాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హృషికేశ్ రాయ్ సభ్యులుగా ఉన్నారు. కోర్టులో విచారణ సందర్భంగా కేసుతో సంబంధంలేని అంశాలను జడ్జీలు ప్రస్తావనకు తీసుకురావడం తగదని, వాటిని పరిహరించాలని ధర్మాసనం సూచించింది. అసందర్భ వ్యాఖ్యలు, పక్షపాతంతో కూడిన వ్యక్తిగత అభిప్రాయాలు న్యాయవ్యవస్థపై ప్రతికూల ప్రభావానికి కారణమవుతాయని స్పష్టం చేసింది.



ఇటీవల ఓ భూవ్యవహారానికి సంబంధించిన కేసుపై విచారణ జరుపుతున్న సందర్భంలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీశానంద ఆ ప్రాంతాన్ని పాకిస్థాన్‌తో పోలుస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా ఈ కేసును వాదించిన మహిళా న్యాయవాదిపైనా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారమంతా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సుప్రీంకోర్టు దృష్టికి వెళ్లింది. కోర్టుల్లో న్యాయమూర్తులు చేసే వ్యాఖ్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాల్సిన అవసరం ఉందని జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం అభిప్రాయపడిన సంగతి తెలిసిందే.

భూగమనాన్ని ప్రభావితం చేస్తున్న

చైనా త్రీగోర్జెస్ డ్యామ్!

ఇంటర్నెట్‌డెస్క్: ప్రపంచంలోనే అతి పెద్ద జల విద్యుత్ ఆనకట్ట అయిన త్రీగోర్జెస్ డ్యామ్ వల్ల భూగమనంలో మార్పులు సంభవించే ముప్పు ఉందని ఐఎఫ్ఎల్ సైన్స్ వెబ్‌సైట్ పేర్కొంది. చైనాలోని యాంగ్జీ నదిపై నిర్మించిన ఈ డ్యామ్‌లో సుమారు 10 లక్షల కోట్ల గ్యాలన్ల నీరు నిల్వ ఉంటోందని, ఒకే చోటకు అంత భారీ మొత్తంలో నీరు చేరడం వల్ల భూభ్రమణంపై ప్రభావం పడే పరిస్థితి ఉంటుందని తెలిపింది. భూమిపై భారీ స్థాయిలో మార్పులు చోటుచేసుకున్నప్పుడు దాని ప్రభావం భూగమనంపై పడుతుంది. 2004లో హిందూ మహాసముద్రంలో భూకంపం సంభవించి సునామీ వచ్చినప్పుడూ అదే పరిస్థితి తలెత్తినట్లు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' అప్పట్లో వెల్లడించింది. దాని ప్రభావంతో రోజు నిడివి సుమారు 2.68 మైక్రోసెకన్లు తగ్గిపోయినట్లు పేర్కొంది. అదే తరహాలో త్రీ గోర్జెస్ డ్యామ్ వల్ల భూభ్రమణ వేగం 0.06 మైక్రో సెకన్లు తగ్గొచ్చని, సూర్యుడి నుంచి భూమి దూరం 2 సెంటీమీటర్ల మేర పెరగొచ్చని ఐఎఫ్ఎల్ సైన్స్ వెబ్‌సైట్ వివరించింది.



ఆరెస్సెస్‌కు ఆప్ పాంచ్ పటాకా

భాజపా రాజకీయాలపై 5 ప్రశ్నలతో మోహన్ భాగవత్‌కు కేజ్రీవాల్ లేఖ

దిల్లీ: భాజపా రాజకీయాలు, ప్రధాని మోదీ చర్యలపై సమాధానాలు కోరుతూ ఆప్ కన్వీనర్, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బుధవారం అయిదు ప్రశ్నలు సంధించారు. ఈ మేరకు ఆయన ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్‌కు లేఖ రాశారు. భాజపా నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం నడుస్తున్న తీరు, నెరపుతున్న రాజకీయాలు మన దేశానికి హానికరమని కేజ్రీవాల్ ఆందోళన వ్యక్తం చేశారు. విపక్ష రాజకీయ పార్టీలను చీల్చడానికి, వాటి ప్రభుత్వాలను కూల్చటానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్న భాజపా రాజకీయాలను ఆరెస్సెస్ సమర్థిస్తుందా? అని ప్రశ్నించారు. అవినీతిపరులైన నేతలను భాజపాలో చేర్చుకోవడం సమంజసమేనా? ఆరెస్సెస్-భాజపా నిర్దేశించుకున్న నేతల రాజకీయ విరమణ వయస్సు ప్రధాని మోదీకి వర్తించదా? కమలం పార్టీకి సైద్ధాంతిక మార్గదర్శి అయిన ఆరెస్సెస్ అవసరం లేదన్న భాజపా అధ్యక్షుడు జె.పి.నడ్డా వ్యాఖ్యలపై మీ అభిప్రాయం ఏమిటి? అన్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని భాగవత్‌ను కేజ్రీవాల్ కోరారు.

బాలికపై అఘాయిత్యం..

కీచక టీచర్‌కు గ్రామస్థుల దేహశుద్ధి

సీతాపుర్ (యూపీ): విద్యాబుద్ధులు నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురువే కీచకుడిలా మారాడు. 11 ఏళ్ల బాలికను నిర్బంధించి అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ దారుణం ఉత్తర్‌ప్రదేశ్‌లోని సీతాపుర్ జిల్లా మహమూదాబాద్‌లో జరిగింది. మంగళవారం పాఠశాలకు వెళ్లిన బాలిక సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో.. కుటుంబసభ్యులు వెదకడం ప్రారంభించారు. స్థానికులకు అనుమానం వచ్చి ఉపాధ్యాయుడు సంజయ్‌గుప్తా ఇంటి తలుపులు పగలగొట్టి.. బాలికను రక్షించారు. అనంతరం అతడిని చితకబాదారు. పోలీసులు సంజయ్‌గుప్తాను అరెస్టు చేశారు. స్థానికుల దాడిలో తీవ్రంగా గాయాలపాలై పరిస్థితి విషమంగా ఉండటంతో నిందితుడిని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు మహమూదాబాద్ పోలీస్ అధికారి దినేశ్ శుక్లా వెల్లడించారు. బాలికపై లైంగికదాడికి పాల్పడిన గుప్తా తన కోర్కె తీర్చకపోతే కొడతానని, స్కూలులో ఫెయిల్ చేస్తానని బెదిరించినట్లు తెలిపారు. నిందితుడిపై పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

అంతర్గత కుమ్ములాటల్లో

ఆరితేరిన కాంగ్రెస్

- హరియాణాలో అధికారమిచ్చినా అంతే..
- తెలంగాణ, కర్ణాటకల్లోనూ అదే జరుగుతోంది..
- ప్రధాని మోదీ వ్యాఖ్యలు

సోనీపత్: అంతర్గత కుమ్ములాటలకు కాంగ్రెస్ పెట్టింది పేరని, ఎక్కడ అధికారంలో ఉన్నా అదే తీరని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. పొరపాటున హరియాణాలో అధికారంలోకి వచ్చినా అదే పరిస్థితి నెలకొంటుందని పేర్కొన్నారు. అంతర్గత కుమ్ములాటలతో స్థిరత్వం, అభివృద్ధి కుంటుపడతాయని అభిప్రాయపడ్డారు. హరియాణాలోని గోహానాలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు అస్థిరత్వానికి ప్రతీకలని వ్యాఖ్యానించారు. 'గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ ఎక్కడ ప్రభుత్వాలను ఏర్పాటు చేసినా ముఖ్యమంత్రులు, మంత్రుల మధ్య అంతర్గత కుమ్ములాటలు చోటుచేసుకుంటున్నాయి. ప్రజల బాధలను, సమస్యలను పరిష్కరించడానికి వారు ఏమీ చేయరు. ఇందుకు ఉదాహరణగా కాంగ్రెస్ పాలిస్తున్న కర్ణాటకనే తీసుకోండి. అక్కడ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఘర్షణ పడుతుంటారు. తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లలోనే అదే కథ. గతంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో అధికారంలో ఉన్నప్పుడూ అదే తంతు' అని ప్రధాని ఎద్దేవా చేశారు. అందుకే హరియాణా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏలోనే రిజర్వేషన్ల వ్యతిరేకత ఉందని విమర్శించారు. అందుకే రిజర్వేషన్లను ఎత్తేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. జమ్మూ కశ్మీర్‌లో శాంతి నెలకొనడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదని, ఆర్టికల్ 370ని మళ్లీ తేవాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.



సోనీపత్ ఎన్నికల సభలో ప్రధాని మోదీకి గదను అందజేస్తున్న హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ

రాష్ట్ర హోదా ఇవ్వకపోతే రోడ్డెక్కుతాం

- కశ్మీర్‌పై రాహుల్ హెచ్చరిక

జమ్మూ: జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ప్రజల హక్కని, ఎన్నికల తర్వాత ఆ హోదాను పునరుద్ధరించకపోతే రోడ్డెక్కి ఆందోళన చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. 2019లో రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టడం ప్రజలకు జరిగిన తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి రాలేదని వ్యాఖ్యానించారు. జమ్మూ జిల్లాలో బుధవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. అంతకుముందు స్థానిక వృత్తి నిపుణులతో ఆయన భేటీ అయ్యారు. బయటి వారిని స్థానికులుగా చూపేందుకు ప్రస్తుత అధికారులు పని చేస్తున్నారని ర్యాలీలో రాహుల్ విమర్శించారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఉన్నంతకాలం స్థానికులకు న్యాయం జరగదని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు కొంత మంది వ్యాపారులకే ప్రయోజనం కలిగిస్తున్నాయని విమర్శించారు. స్మార్ట్ విద్యుత్ మీటర్లను తొలగిస్తామని, పంజాబీని అధికార భాషగా గుర్తిస్తామని హామీ ఇచ్చారు.

మేక్ ఇన్ ఇండియా ఉత్తదే

కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్న మేక్ ఇన్ ఇండియా ఉత్తదేనని, కాంట్రాక్టులు అదానీకి ఇస్తే ఆయన ఇజ్రాయెల్ నుంచి ఆయుధాలను తయారు చేయించి తీసుకొస్తున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. జమ్మూలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. విమానాశ్రయాలు, పోర్టులు, రోడ్లు, రక్షణ సామగ్రితోపాటు కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ యాపిల్ పండ్లనూ అదానీ నియంత్రిస్తున్నారని ధ్వజమెత్తారు. మనం విమానాశ్రయాల్లో అదానీ ట్యాక్స్, సెల్ ఫోన్లపై అంబానీ ట్యాక్స్ కడుతున్నామని వ్యాఖ్యానించారు. 25 మంది వ్యాపారవేత్తలకు చెందిన రూ.16 లక్షల కోట్ల రుణాలను కేంద్రం మాఫీ చేసిందని, అటువంటి ఉపశమనాన్ని కశ్మీర్‌లో చిరు వ్యాపారులకు ఇవ్వలేదని విమర్శించారు.



జమ్మూలో బుధవారం వృత్తినిపుణులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ






ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళం అందజేస్తున్న ఎల్ అండ్ టీ బోర్డు డైరెక్టర్ ఎంవీ సతీశ్ ★ రామ్‌కో గ్రూప్ ఛైర్మన్ పీఆర్ వెంకట్రామరాజు, తదితరులు ★ ఏపీ కో ఆపరేటివ్ బ్యాంక్స్ ఫెడరేషన్ ప్రతినిధి చిట్టూరి రవీంద్ర, తదితరులు ★ ఖాదర్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అఫ్జల్ ఖాదర్. చిత్రంలో మంత్రి రామానాయుడు

వరద బాధితులకు భరోసాగా దాతలు

ఈనాడు డిజిటల్, అమరావతి: సీఎం చంద్రబాబు పిలుపు మేరకు వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు, పలువురు వ్యక్తులు వరద బాధితుల్ని ఆదుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్)కి విరాళాలు ఇస్తున్నారు. వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు బుధవారం విరాళాల చెక్కుల్ని పలువురు అందజేశారు. ఎల్ అండ్ టీ సంస్థ రూ.3.5 కోట్ల విరాళం ప్రకటించి, సంస్థ తరపున బోర్డు డైరెక్టర్ ఎంవీ సతీశ్ చంద్రబాబుకు చెక్కు అందజేశారు. రామ్‌కో సిమెంట్స్ తరపున ఆ సంస్థ ప్రతినిధి పీఆర్ వెంకటరామరాజు రూ.2 కోట్ల చెక్కును సీఎంకు అందించారు.



◆ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థల ఆధ్వర్యంలో రూ.1.02 కోట్ల చెక్కు విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు చంద్రబాబుకు ఇచ్చారు. విద్యాసంస్థల ఉద్యోగుల వేతనం నుంచి రూ.25.49 లక్షలు, విద్యార్థుల నుంచి రూ.76.50 లక్షలు విరాళంగా సేకరించినట్లు తిరుమలరావు తెలిపారు.

◆ ఏపీ కో ఆపరేటివ్ బ్యాంక్స్ తరపున చిట్టూరి రవీంద్ర రూ.కోటి, ఖాదర్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అఫ్జల్ ఖాదర్ రూ.కోటి, కేఎంవీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ తరపున ఆ సంస్థ ఛైర్మన్ కేఎంవీ ప్రసాదరావు, డైరెక్టర్ కె.పృథ్వీరామ్ రూ.కోటి, కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ రూ.కోటి, పళని అప్పన్ రూ.కోటి చెక్కులను చంద్రబాబుకు వేర్వేరుగా అందజేశారు.

◆ సీబీఆర్ ప్రసాద్ రూ.54 లక్షలు, ది ఇండియన్ టొబాకో అసోసియేషన్ ప్రతినిధి పి.శ్యామ్‌సుందర్ రూ.50 లక్షల చెక్కుల్ని అందజేశారు.

సుప్రీం కోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా రూ.40 లక్షలను డీడీ రూపంలో సీఎంఆర్ఎఫ్‌కు పంపారు.

సంస్థ/వ్యక్తి	సాయం (రూ.లలో)
◆ ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, ఫిల్మ్‌నగర్ క్లబ్	25 లక్షలు
◆ బొండాడ రాఘవేంద్రరావు, ఛైర్మన్, బొండాడ గ్రూప్	25 లక్షలు
◆ బోడె ప్రసాద్, పెనమలూరు నియోజకవర్గ నేతలు	22 లక్షలు
◆ సెంథిల్‌కుమార్	10 లక్షలు
◆ సత్య ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్	10 లక్షలు
◆ విజయ్‌ప్రకాశ్, శ్రీ ప్రకాశ్ విద్యా సంస్థలు	10 లక్షలు


ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళం అందిస్తున్న కేఎంవీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఛైర్మన్ కేఎంవీ ప్రసాదరావు, డెరెక్టర్ కె.పృథ్వీరామ్ ★ ది ఇండియన్ టొబాకో అసోసియేషన్ ప్రతినిధులు ★ తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు, విద్యార్థులు, తదితరులు

సుప్రీం కోర్టు తెలుగు న్యాయవాదుల విరాళం రూ.15 లక్షలు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ వరద బాధితులను ఆదుకునేందుకోసం సుప్రీంకోర్టులో సేవలందిస్తున్న తెలుగు న్యాయవాదులు ముఖ్యమంత్రి సహాయనిధికి సుమారు రూ.15 లక్షల విరాళం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన చెక్కును న్యాయవాదులు బుధవారం ఇక్కడ ఏపీ భవన్ రెసిడెంట్ కమిషన్ లవ్‌అగర్వాల్‌కు అందించారు. ఇందులో సీనియర్ న్యాయవాదులు చల్లా కోదండరాం రూ.5 లక్షలు, వై.రాజగోపాల్‌రావు రూ.2 లక్షలు, దామా శేషాద్రినాయుడు రూ.లక్ష, ఆర్.ఆనంద్‌పద్మనాభన్ రూ.75 వేలు, అల్లంకి రమేశ్ రూ.50 వేలు, ఉదయ్‌కుమార్ సాగర్‌శెట్టి రూ.50 వేలు, మిగిలిన మొత్తాన్ని ఇతరులు ఇచ్చారు.



రూ.15 లక్షల చెక్కును రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్‌కు అందిస్తున్న సుప్రీంకోర్టు న్యాయవాదులు

ఇద్దరు సీఐలు, మరో ఇద్దరు ఎస్సైలపై వేటు

తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో నిర్లక్ష్యం ఫలితం



దేవేంద్రకుమార్ సీఐ | అబ్బన్న సీఐ | నాగేంద్రబాబు ఎస్ఐ | సుమతి ఎస్ఐ

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో వైకాపాకు విధేయంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై వేటుపడింది. సిట్ బృందంలోని అప్పటి నెల్లూరు ఎస్పీ ఇచ్చిన నివేదిక మేరకు ఇద్దరు సీఐలు.. మరో ఇద్దరు ఎస్సైలను సస్పెండ్ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇదే ఘటనలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇద్దరు సీఐలు, ఓ ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.

ప్రతిపక్షాలు దొంగ ఓటర్లను పట్టిచ్చినా..

2021లో జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో తిరుపతి జగన్మాత పాఠశాలలో దొంగ ఓటరు స్లిప్పులతో వచ్చిన వ్యక్తిని భాజపా నాయకురాలు శాంతారెడ్డి పట్టుకుని అప్పటి అలిపిరి సీఐ దేవేంద్రకుమార్‌కు అప్పగించారు. మరికొన్ని ఘటనలపైనా 217, 218, 219 నంబర్లతో కేసులు నమోదైనా ఏడాదిపాటు వదిలేశారు. తర్వాత బాధ్యతలు చేపట్టిన సీఐ అబ్బన్న దర్యాప్తులో నిర్లక్ష్యం చూపారు. కొంతకాలం తర్వాత మూసేశారు. దీంతో వీరిద్దరినీ సస్పెండ్ చేశారు.

వీడియోలు ఇచ్చినా గుర్తించలేదు

దొంగ ఓటర్లు గుంపులుగా పోలింగ్ బూత్‌లోకి వచ్చారని తెదేపా ఎంపీ అభ్యర్థి పనబాక లక్ష్మి ఓ వీడియో ఆధారంతో తిరుపతి తూర్పు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై నాగేంద్రబాబు కేసు నమోదుచేసినా గుర్తుతెలియని వ్యక్తులుగా తేల్చి కేసు మూసేశారు. చిత్తూరు నుంచి తిరుపతికి బస్సులో వస్తున్న మహిళా దొంగ ఓటర్ల వీడియోను తెదేపా నాయకులు ఎస్వీయూ పోలీసులకు ఇచ్చారు. దీనిపై ఎస్సై సుమతి కేసు నమోదుచేసి వారు గుర్తుతెలియని మహిళలుగా పేర్కొంటూ కేసు మూసివేశారు. దీంతో ఇద్దరు ఎస్సైలను సస్పెండ్ చేశారు.

మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ కన్నుమూత

నేడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



ఈనాడు, నెల్లూరు: మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ (77) బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను మూడు రోజుల కిందట పరిస్థితి విషమించడంతో చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూసిన ఆమె పార్థివదేహాన్ని బుధవారం మధ్యాహ్నం నెల్లూరులోని స్వగృహానికి తీసుకొచ్చారు. అభిమానుల సందర్శనార్థం గురువారం మధ్యాహ్నం వరకు ఉంచి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు. పార్వతమ్మకు 1967లో కాంగ్రెస్ నేత మాగుంట సుబ్బరామిరెడ్డితో పెళ్లయింది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఒంగోలు ఎంపీగా ఉన్న సుబ్బరామిరెడ్డిని 1995లో మావోయిస్టులు కాల్చి చంపారు. తర్వాత 1996లో పార్వతమ్మ రాజకీయాల్లోకి వచ్చారు. తొలిసారి ఒంగోలు ఎంపీగా పోటీ చేసి గెలిచారు. 2004లో కావలి ఎమ్మెల్యేగానూ విజయం సాధించారు. ఇటీవల ఆమె కుమారుడు విజయ్‌బాబు కన్నుమూశారు. నాటినుంచి ఈమె ఆరోగ్యం మరింత క్షీణించింది. పార్వతమ్మ మరణం తమ కుటుంబానికి తీరని లోటని ఆమె మరిది, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. భౌతికకాయం వద్ద ఆయన నివాళులర్పించారు. పార్వతమ్మ సేవలను ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. 'ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల రాజకీయాల్లో మాగుంట కుటుంబానికి ప్రత్యేక గుర్తింపుంది. పార్వతమ్మ భర్త సుబ్బరామిరెడ్డిది సుదీర్ఘ ప్రజా జీవితం. పార్వతమ్మ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా' అని ప్రకటనలో పేర్కొన్నారు.

పలువురి ఘన నివాళులు

పార్వతమ్మ మృతి సమాచారం తెలుసుకున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, నెల్లూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసులరెడ్డి తదితరులు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ సంతాపం తెలిపారు.



మార్పును స్వాగతించండి

మార్పును మీరు ఎంతగా తప్పించుకుంటే.. అంత ఎక్కువగా ఎదుగుదలకు దూరమవుతారు. రిస్క్ తీసుకునేందుకు ఎంత విముఖంగా ఉంటే.. అంతగా నష్టపోతారు. అవకాశాలన్నింటినీ చేజార్చుకొని ఉన్నచోటే ఉండిపోతారు. మళ్లీ ఎంతగా ప్రయత్నించినా ఇతరులను అందుకోలేనంత స్థాయిలో వెనుకబడతారు. కాబట్టి మార్పును స్వాగతిస్తూ ముందుకు సాగండి.

– ఫెడాన్, పర్ఫార్మెన్స్ కోచ్

ప్రభుత్వ విధానాలపై జనంలోకి వెళదాం

- జిల్లా నేతలతో భేటీల్లో వైకాపా అధ్యక్షుడు జగన్



ఈనాడు, అమరావతి: 'తిరుమల వ్యవహారంలో ప్రభుత్వ పెద్దలు అనవసరంగా మనపై బురద జల్లుతున్నారు. లడ్డూలో కల్తీ నెయ్యి అంటూ అబద్ధపు ప్రచారంతో తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్నారు. వారి చర్యలను తిప్పికొట్టేందుకు ఈ నెల 28న రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు చేపడదాం. పార్టీ శ్రేణులంతా ఇందులో పాల్గొనేలా సమన్వయం చేయాలి' అని వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆ పార్టీ నేతలకు సూచించారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నేతలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ఇకపై ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలను అందరూ నిశితంగా పరిశీలించాలి. జిల్లాల అంశాలైతే అక్కడికక్కడే ఎదుర్కోవాలి. ప్రభుత్వానికి సమయం ఇద్దామని అనుకున్నాం. కానీ, ప్రజావ్యతిరేక కార్యక్రమాలు చేస్తూ, ఇస్తామన్న హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తూ.. మరోవైపు తిరుమల ప్రసాదంలో కల్తీ అంటూ మనపై విషప్రచారం చేస్తున్నారు. వీటన్నింటినీ తిప్పికొట్టాలి. నిరసన కార్యక్రమాలపై త్వరలోనే కార్యాచరణ ఖరారు చేసుకుందాం. జిల్లాల కమిటీల నియామకం పూర్తవగానే, రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించి ప్రభుత్వ విధానాలపై ప్రజాపోరాట కార్యక్రమాల ప్రణాళికను ఖరారు చేస్తాం' అని చెప్పినట్లు తెలిసింది.

జిల్లా అధ్యక్షుల మార్పు

ఈ సమావేశాల సందర్భంగా వివిధ జిల్లాల అధ్యక్షులను ఖరారు చేశారు. కృష్ణా జిల్లాకు ప్రస్తుత అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నానినే కొనసాగించాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాస్ తాను సమయం వెచ్చించలేకపోతున్నట్లు చెప్పడంతో.. ఆయన స్థానంలో దేవినేని అవినాష్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించారు. గుంటూరు జిల్లా అధ్యక్ష బాధ్యతను మాజీ మంత్రి అంబటి రాంబాబుకు, మంగళగిరి నియోజకవర్గ పార్టీ బాధ్యతను దొంతిరెడ్డి వేమారెడ్డికి అప్పగించారు.

27న తిరుమలకు జగన్

శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ తిరుమలకు వెళ్లనున్నారు. ఈ నెల 27న రాత్రి ఆయన తిరుమలకు చేరుకోనున్నారు. 28న ఉదయం స్వామివారిని దర్శించుకోనున్నారు. మెట్లమార్గంలో కొండపైకి వెళతారని ప్రచారం ఉన్నా.. దానిపై జగన్ కార్యాలయం, వైకాపా నుంచి ఎలాంటి అధికారిక సమాచారమూ రాలేదు. మరోవైపు అదేరోజు (28న) రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో దేవాలయాల్లో పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని వైకాపా శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

జనసేనలోకి బొత్స సోదరుడు

దసరా తర్వాత చేరిక



ఈనాడు, విజయనగరం: విజయనగరం జిల్లాలో వైకాపాకు మరో దెబ్బ తగలనుంది. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ సోదరుడు లక్ష్మణరావు త్వరలో జనసేన పార్టీలో చేరడం దాదాపు ఖాయమైంది. వ్యాపార రంగంలో ఉన్న లక్ష్మణరావు ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి రావాలని పదేళ్ల నుంచి ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో సామాజికంగా అనుకూలత ఉన్న ఏ స్థానం నుంచైనా పోటీ చేయాలని అనుకున్నా అవకాశం రాలేదు. మొన్నటి ఎన్నికల్లో నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన బడ్డుకొండ అప్పలనాయుడుకు వ్యతిరేకంగా పనిచేసినట్లు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరిగింది. తన అనుచరులుగా ఉన్న ఏడుగురు సర్పంచులను జనసేనలోకి పంపి, తద్వారా కూటమి విజయానికి పరోక్షంగా కృషి చేశారని సమాచారం. ఈ ఎన్నికల్లో వైకాపా ఘోర పరాజయం చవిచూసిన తర్వాత ఆ పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. దసరా తర్వాత ముహూర్తం చూసుకుని జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరనున్నారు. ఇదే విషయాన్ని బొత్స లక్ష్మణరావు వద్ద 'ఈనాడు' ప్రస్తావించగా.. పార్టీ మార్పు పక్కా అని, పార్టీలో చేరే ముందు అన్ని విషయాలూ వెల్లడిస్తానని ఆయన పేర్కొన్నారు.

వైకాపాకు మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహ్మాన్ రాజీనామా



విశాఖపట్నం(అల్లిపురం), న్యూస్‌టుడే: వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి, పార్టీ క్రియాశీల సభ్యత్వానికి మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహ్మాన్ రాజీనామా చేశారు. విశాఖలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం ముస్లింల ప్రయోజనాలను, వక్ఫ్ ఆస్తులను రక్షించలేకపోయిందని ఆరోపించారు. ముస్లింల సమస్యలను పలుమార్లు వైకాపా ముఖ్య నేతలకు నివేదించినా ఫలితం లేకపోయిందన్నారు. అందుకే ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు హజ్ యాత్రికులకు రూ.లక్ష సాయం, నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటుకు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

బీసీ ఉద్యమం బలోపేతానికే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా


నల్లకుంట, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీల న్యాయమైన హక్కులు సాధించడమే లక్ష్యంగా.. బీసీ సంఘాలతోపాటు రాజకీయాలకతీతంగా కలిసొచ్చేవారితో ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. సొంతంగా రాజకీయ పార్టీ పెట్టాలనే ఆలోచన ప్రస్తుతానికిలేదన్నారు. బుధవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన మాట్లాడారు. ఆర్.కృష్ణయ్యను కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, సీనియర్ నేత వి.హనుమంతరావులు విద్యానగర్‌లోని ఆయన నివాసంలో వేర్వేరుగా భేటీ అయ్యారు.

కొత్త సచ్చిదానందమూర్తి గొప్ప తత్వవేత్త

- ఏఎన్‌యూలో ఘనంగా శత జయంతి వేడుకలు
- పోస్టల్ కవర్ ఆవిష్కరించిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



సచ్చిదానందమూర్తి చిత్రంతో పోస్టల్ కవర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, పోస్టుమాస్టర్ జనరల్ మూర్తి తదితరులు



పోస్టల్ కవర్‌పై సచ్చిదానందమూర్తి చిత్రం

పెదకాకాని, న్యూస్‌టుడే: కొత్త సచ్చిదానందమూర్తి పద్నాలుగేళ్లకే భగవద్గీతపై తొలి పుస్తకం రాసి పలువురికి ఆదర్శంగా నిలిచారని నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు కొనియాడారు. తత్వవేత్త, పద్మవిభూషణ్ సచ్చిదానందమూర్తి శత జయంతి వేడుకలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొత్త సచ్చిదానందమూర్తి చిత్రపటంతో ఉన్న పోస్టల్ కవర్‌ను వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, విజయవాడ పోస్టుమాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... కొత్త సచ్చిదానందమూర్తి రాసిన వేదాంత పుస్తకాలు, సందేశాలు విప్లవాత్మకంగా ఉంటాయన్నారు. అలాంటి వ్యక్తి తనకు బంధువు కావడం చాలా సంతోషదాయకమని, ఆయన శతజయంతి వేడుకల్లో పాల్గొనడం మరువలేనన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ కంటే సచ్చిదానందమూర్తి ఎక్కువగా ఆలోచించి రచనలు చేశారని, కానీ ప్రచారం చేసుకోలేదన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో తత్వశాస్త్రం కోర్సు ఉండటం అభినందనీయమన్నారు. వీసీ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ... కొత్త సచ్చిదానందమూర్తి తెనాలి సమీపంలోని సంగంజాగర్లమూడి గ్రామంలో జన్మించి గొప్ప తత్వవేత్తగా పేరుతెచ్చుకొని, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఏర్పాటులో కీలక పాత్ర వహించినట్లు చెప్పారు. అద్వైతం, తాత్వికతపై ఆయన చేసిన పరిశోధనలు దేశంలో కీలకంగా మారినట్లు తెలిపారు. జైన సంప్రదాయం పాటించి ఆహార పానీయాలు తీసుకోకుండా ఆయన ప్రపంచం నుంచి దూరమయ్యారని గుర్తుచేశారు. తొలుత సచ్చిదానందమూర్తి చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సింహాచలం, రెక్టార్ కె.రత్నషీలమణి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఖోఖో అండర్-19 విజేతలు అకార్డ్, శ్రీప్రకాశ్ పాఠశాలలు

హైదరాబాద్ బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్ 7వ ఖోఖో టోర్నమెంట్ పోటీలు బుధవారం ముగిశాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 200 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి 5,500 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహించారు. అండర్-19 బాలికల విభాగంలో తిరుపతి అకార్డ్ పాఠశాల, బాలుర విభాగంలో అనకాపల్లి శ్రీ ప్రకాశ్ స్కూల్ విజేతలుగా నిలిచాయి. వీరితోపాటు ఆయా విభాగాల్లో విజయం సాధించిన జట్లకు బహుమతులు అందజేశారు. అండర్-17 బాలికల విభాగం విజేత బాచుపల్లి వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాల ట్రస్టీ సభ్యురాలు రమణశ్రీ, డైరెక్టర్ విజయారాణి, ప్రిన్సిపాళ్లు రవికుమార్, గీతను చిత్రంలో చూడవచ్చు.

– న్యూస్‌టుడే, హైదరాబాద్

వరద నీటిలో తిరిగితే.. కండరాలు తినేసిన బ్యాక్టీరియా!

- 12 ఏళ్ల బాలుడికి అరుదైన నెక్రోటైజింగ్ ఫాసియైటిస్ వ్యాధి
- తొడ వరకు కుడికాలు తొలగింపు
- మరోకాలికి 30% కండరం క్షీణత



ఈనాడు, అమరావతి: అత్యంత అరుదుగా వచ్చే.. 'నెక్రోటైజింగ్ ఫాసియైటిస్' వ్యాధితో 12 ఏళ్ల భవదీప్ బాధపడుతుండటంతో ఆ చిన్నారి కుటుంబం తల్లడిల్లిపోతోంది. సాధారణంగా మధుమేహ రోగుల్లో ఎక్కువగా కనిపించే ఈ వ్యాధి చిన్నపిల్లల్లోనూ కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. శరీరంపై ఎటువంటి గాయాలు లేకుండానే.. భవదీప్ శరీరంలోకి ప్రమాదకరమైన బ్యాక్టీరియా ప్రవేశించడం వైద్యులనూ విస్మయానికి గురిచేస్తోంది. భవదీప్ శరీరంలోకి ప్రమాదకర బ్యాక్టీరియా చొచ్చుకుపోయి తినేయడంవల్ల కుడి కాలును తొడ భాగం వరకు తొలగించారు. ఎడమ మోకాలి కింద భాగంలో 30శాతం మేర కండను కూడా సూక్ష్మక్రిములు తినేశాయి. నెక్రోటైజింగ్ ఫాసియైటిస్ జబ్బుకు మరో పేరు ఫ్లెష్ ఈటింగ్ డిసీజ్. విజయవాడలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న భవదీప్‌కు అందించే వైద్యానికి అవసరమైన ఖర్చు కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షలు మంజూరుచేసింది.

వణుకు..జ్వరంతో..

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన భవదీప్ కుటుంబం ఉండే ఇంట్లోకి ఈ నెల తొలి వారంలో వరదనీరు వచ్చింది. మరుసటిరోజు నీరు తగ్గే వరకు ఆ బాలుడు నీటిలోనే ఉన్నాడు. చిన్నచిన్న పనులు కూడా..చేశాడు. అదేరోజు రాత్రి నుంచి వణుకు, చలి, జ్వరం వచ్చింది. స్థానికంగా చికిత్స చేయించుకున్నాడు. అయినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో స్థానిక ఆసుపత్రిలో చేర్చారు. డెంగీ బారినపడినట్లు గుర్తించారు. తొడల నుంచి అరికాళ్ల వరకు వాపులు వచ్చాయి. దీంతో విజయవాడలోని కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కాళ్ల కండరాలను సూక్ష్మక్రిములు తినేశాయని గుర్తించిన వైద్యులు.. ఈ నెల 17న శస్త్రచికిత్స చేసి కుడికాలును తొడ వరకు తొలగించారు.

ప్రమాదజాతుల సూక్ష్మక్రిములతో..

శరీరంలోకి సూక్ష్మ క్రిములు ఎలా ప్రవేశించాయి? అంత వేగంగా కాళ్ల కండరాలను ఎలా తినేశాయన్నదానిపై వైద్యులు కూడా కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. బాలుడికి చికిత్స అందిస్తోన్న.. అంకుర ఆసుపత్రి చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వరుణ్, డాక్టర్ రవి మాట్లాడుతూ 'బాలుడి శరీరంలో కుళ్లిన భాగాల నుంచి తీసిన నమూనాలను పరీక్షలు చేయించడంతో శరీరంలోకి ఈ-కోలి, క్లెబిసెల్లా సూక్ష్మక్రిములు వెళ్లినట్లు తేలింది. ఈ క్రిముల్లోనూ ప్రమాదకర జాతులు ఉంటాయి. అవి శరీరంలోకి వెళ్లడంవల్లే..కాళ్లు బాగా వాచాయి. వరదనీటిలో మురుగునీరు కలుస్తుంటుంది. అప్పుడు బ్యాక్టీరియా వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో బ్యాక్టీరియా శరీరంలోకి చేరి ఉండొచ్చు. జ్వరంతో ఉన్న సమయంలో భవదీప్‌ను తల్లిదండ్రులు స్థానిక ఆర్ఎంపీకి చూపించారు. అక్కడ యాంటీబయాటిక్, స్టెరాయిడ్ ఇంజక్షన్లను కండ (పిరుదు)కు ఇచ్చారు. ఇలా చేయకూడదు. కాళ్ల వాపులు గమనించిన వెంటనే అప్రమత్తం కావాలి. ప్రస్తుతం ఐసీయూలో భవదీప్ ఎడమ కాలి భాగం ఇప్పుడిప్పుడే నయమవుతోంది. పూర్తిగా కోలుకునేందుకు రెండు, మూడు నెలల వరకు సమయం పడుతుంది' అని తెలిపారు.

సూపర్-6 పథకాల అమలు ఎప్పటి నుంచి?

ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



విజయవాడ ధర్నా చౌక్‌లో పళ్లెం మోగిస్తూ నిరసన తెలుపుతున్న వై.ఎస్.షర్మిల, నరసింహారావు తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సూపర్-6 పథకాలను ఎప్పటినుంచి అమలుచేస్తుందో చెప్పాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. వందరోజుల ప్రణాళికలో యువతకు ఒక్క ఉద్యోగం ఊసు కూడా లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వినాలనే ఉద్దేశంతోనే పళ్లెం, గరిటెతో నిరసన చేపట్టినట్లు తెలిపారు. బుధవారం విజయవాడ ధర్నాచౌక్‌లో నిర్వహించిన ధర్నాలో ఆమె మాట్లాడారు. 'అన్నదాత సుఖీభవ'ను ఈ ఏడాది ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఇటీవల వర్షాలతో 7 లక్షల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లితే.. ముఖ్యమంత్రి రెండు లక్షల ఎకరాలకే పరిహారం ఇస్తామనడం సరికాదన్నారు. వరదలో సర్వం కోల్పోతే 4 లక్షల మందికే పరిహారం ఇస్తామని చెప్పడం అన్యాయమన్నారు. రైల్వేశాఖ ఏటా రూ.6వేల కోట్ల ఆదాయం తీసుకుంటూ.. కనీసం రైల్‌నీర్ కూడా వరద బాధితులకు పంపిణీ చేయలేదని మండిపడ్డారు. తల్లికి వందనం పథకం ఇప్పటికీ అమలు కావట్లేదని దుయ్యబట్టారు. ఎంతమంది ఉన్నా రూ.15వేలు ఇస్తామని చెప్పి.. నేడు ఒక్కరికీ ఇవ్వలేదని విమర్శించారు. కోటిమంది మహిళలకు మహాశక్తి పథకాన్ని ఎప్పుడు ఇస్తారని ఆమె ప్రశ్నించారు. మనది రాజధాని లేని రాష్ట్రమే కాదు.. బడ్జెట్ కూడా లేని రాష్ట్రమని ఎద్దేవా చేశారు. మంచి ప్రభుత్వమే అయితే.. వెంటనే సూపర్-6 పథకాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరహరిశెట్టి నరసింహారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖలో పెద్ద ఎత్తున బదిలీలు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో ఏర్పాటైన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను రద్దు చేసి దానికి కేటాయించిన 70 శాతం మంది ఎక్సైజ్ సిబ్బందిని తిరిగి మాతృశాఖలోకి తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ విభాగంలో పెద్ద ఎత్తున బదిలీలు చేపట్టింది. 14 మంది ఉపకమిషనర్లు (డీసీ), 21 మంది సహాయ కమిషనర్లు (ఏసీ), 45 మంది ఎక్సైజ్ సూపరింటెండెంట్లను (ఈఎస్) బదిలీ చేస్తూ మంగళవారం అర్ధరాత్రి ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా ఉత్తర్వులిచ్చారు. ఎక్సైజ్ శాఖ పునర్‌వ్యవస్థీకరణ తర్వాత ఇంత పెద్దఎత్తున బదిలీలు కావడం ఇదే తొలిసారి. ఒక్కో ఉమ్మడి జిల్లాకు ఒక్కో డీసీని నియమించారు. శ్రీకాకుళం విజిలెన్స్ విభాగం ఏసీ బి.శ్రీనివాసులు, కాకినాడ డిస్టలరీస్ విభాగం ఏసీ ఎం.మనోహర్‌కు ఎక్కడా పోస్టింగును ఇవ్వలేదు. ప్రధాన కార్యాయలంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

ఈనాడు ప్రతిభ


pratibha.eenadu.net/eenadupratibha.net

ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

✦ స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) నూతన ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా ఎవరు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు?

జ: మనోజ్ మిట్టల్



✦ 2024 జులైలో 'క్వాడ్' దేశాల విదేశాంగ మంత్రుల సమావేశాన్ని ఎక్కడ నిర్వహించారు? (భారత్, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికాలు 'క్వాడ్' కూటమిలో సభ్య దేశాలుగా ఉన్నాయి. ఈ దేశాలకు చెందిన విదేశాంగ మంత్రులు సుబ్రహ్మణ్యం జైశంకర్, పెన్నీ వాంగ్,

మాదిరి ప్రశ్నలు

యోకో కమికావా, ఆంటోని బ్లింకెన్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్ (క్యూఎస్‌డీ) అనే పూర్తి పేరు కలిగిన 'క్వాడ్'ను 2007లో అప్పటి జపాన్ ప్రధానమంత్రి షింజో అబే అప్పటి భారత ప్రధాని మన్మోహన్‌సింగ్, అప్పటి ఆస్ట్రేలియన్ ప్రధాని జాన్ హోవర్డ్, అప్పటి అమెరికా ఉపాధ్యక్షుడు డిక్ చెనీల సహకారంతో ప్రారంభించారు.)

జ: టోక్యో

మరింత సమాచారం

✦ 328వ రష్యన్ నేవీ డే వేడుకల్లో పాల్గొన్న భారత యుద్ధ నౌక ఏది? (వెస్ట్రన్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో ముంబయిలో ఉన్న ఇండియన్ నేవీ వెస్ట్రన్ ఫ్లీట్‌లో ఈ యుద్ధనౌక భాగంగా ఉంది. భారత్ పాటించే 'వసుధైక కుటుంబం' విధానానికి అనుగుణంగా రెండు నౌకాదళాల మధ్య సముద్ర సహకారాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ యుద్ధనౌక ఈ కార్యక్రమంలో పాల్గొంది. ఈ యుద్ధనౌకకు కెప్టెన్ ఎమ్.ఆర్.హరీశ్. ఏటా జులై చివరి ఆదివారం రోజున రష్యా నౌకాదళ దినోత్సవాన్ని నిర్వహిస్తారు.)

జ: ఐఎన్ఎస్ తబర్

ఏపీపీఎస్సీ
జనరల్ సైన్స్
బయాలజీ
నాడీ వ్యవస్థ

డీఎస్సీ/ టెట్ - 2024
గణితం కంటెంట్

help@eenadupratibha.net

అలల క్రమక్షయంతో శిలల్లో గుహలు!

జనరల్ స్టడీస్
ప్రపంచ భూగోళ శాస్త్రం

భూమిపై ఉన్న మైదానాలు, పర్వతాలు, ఎడారులు మొదలైన భౌగోళిక స్వరూపాలతో పాటు జలపాతాలు, గుహలు, బీచ్‌లు లాంటి సహజ భౌతిక ఆకృతులన్నీ రకరకాల ప్రకృతికారక చర్యల స్వరూపాలే. ఇందులో పవనాలు ఏర్పరిచే వాటిలో ముఖ్యమైనవి ఎడారులు. దాంతోపాటు శిలాస్వరూపాలు, వనరులను కూడా అవే సృష్టిస్తాయి. పవనాల వల్ల రూపుదాల్చే ఎడారులు, వాటి వర్గీకరణ, ప్రపంచంలోని ముఖ్యమైన ఎడారులు, వాటి విశేషాల గురించి పరీక్షార్థులు తెలుసుకోవాలి. అదే విధంగా అంతర్భూజల ప్రవాహాలతో ఏర్పడే గుహలు, అందులోని సుందర ఆకృతులు; సముద్ర తరంగాల ద్వారా రూపొందే బీచ్‌లు, తీరప్రాంత శిలల్లో ఆకారాలు, నదీ ముఖద్వారాల వద్ద మేటవేసే ఇసుక దిబ్బలు తదితరాల ఆవిర్భావ ప్రక్రియలపై అవగాహన కలిగి ఉండాలి.



పుట్టగొడుగు ఆకారపు శిల

పవన స్వరూపాలు

భూ ఉపరితలంపై దాదాపు 30 శాతం ఎడారులు ఉన్నాయి. రోజువారీ ఉష్ణోగ్రత వ్యత్యాసాలు ఎక్కువగా ఉండటం వల్ల ఈ ప్రాంతాల్లో యాంత్రిక శిలాశైథిల్యం అధికంగా జరుగుతుంది. ఇక్కడ వర్షపాతం అత్యల్పం కావడంతో పవనాలు భూస్వరూపాలను ఏర్పరిచే ప్రక్రియను నిర్వహిస్తాయి. పవనాలు.. క్రమక్షయాన్ని ఎగురవేత (Deflation), అపఘర్షణ (Abrasion), రాపిడి (Attrition) పద్ధతుల ద్వారా నిర్వహిస్తాయి.

పవన క్రమక్షయ స్వరూపాలు:

1) **పుట్టగొడుగు ఆకారపు శిలలు:** పవనాలు ఎడారిలోని శిలలను పుట్టగొడుగు ఆకారంలో క్రమక్షయం చేస్తాయి. శిలల అడుగు భాగాన అధికంగా, ఉపరితలాన తక్కువగా క్రమక్షయం చేస్తాయి. ఈ భేదక క్రమక్షయానికి కారణం పవనాలు వీస్తున్నప్పుడు వాటిలోని ఇసుక రేణువులు పైకి వెళ్లేకొద్దీ తక్కువగా ఉండటం.

2) **ఏకాంతర కొండ:** ఇవి ఎడారి పరిసర ప్రాంతాలన్నీ క్రమక్షయం కావడంతో అక్కడక్కడా మిగిలిపోయిన కఠిన శిలాస్వరూపాలు. **ఉదా:** ఆస్ట్రేలియాలోని అయర్స్ రాక్.

3) **యార్డాంగ్స్, జ్యూగెన్స్:** భేదక క్రమక్షయం వల్ల ఏర్పడే పవన క్రమక్షయ స్వరూపాలు యార్డాంగ్స్, జ్యూగెన్స్.

4) **ఎగురవేత గుంతలు:** ఎడారిలో అప్పుడప్పుడు ఏర్పడే గాలి దుమారాల వల్ల టన్నుల కొద్దీ ఇసుక మొత్తం ఎగిరిపోతుంది. దాంతో చాలా చోట్ల గుంతలు ఏర్పడతాయి. వాటినే ఎగురవేత గుంతలు (డిఫ్లేషన్ బేసిన్) అంటారు. ఇవి వర్షపు నీటితో నిండినప్పుడు ఒయాసిస్సులు ఏర్పడతాయి.

5) **ఎగురవేత ఆర్మర్:** ఎగురవేత వల్ల ఇసుక మొత్తం కొట్టుకుపోవడంతో మిగిలిన గులకరాళ్లతో కూడిన సముదాయం.

6) **కోణీయ శిలలు, తేనెపట్టు ఆకారపు శిలలు:** పవన క్రమక్షయం వల్ల ఏర్పడే విభిన్న ఆకారాల్లో ఉండే శిలాస్వరూపాలు.

పవన నిక్షేపణ స్వరూపాలు:

1) **లోయస్ మైదానాలు:** ఎడారి సరిహద్దుల్లో పవన వేగం తగ్గిపోయి సన్నని రేణుయుతమైన పదార్థాలతో నిక్షేపితమైన మైదానాలు.

2) **ఇసుక దిబ్బలు:** ఇవి ఎడారుల్లోని ఇసుక నిక్షేపాలు. వీటి ఆకారాన్ని చూసి పవన దిశను గుర్తించవచ్చు. అర్ధ చంద్రాకారం, కత్తి మొన, నక్షత్ర, లీనియర్ ఆకారాల్లో ఇసుక దిబ్బలు ఎడారుల్లో కనిపిస్తాయి.

ఎడారుల వర్గీకరణ: ఎడారులను వాటి శుష్క పరిస్థితుల ఆధారంగా 5 రకాలుగా విభజిస్తారు.

1) **ఉప అయనరేఖ ఎడారులు:** 15 నుంచి 30 డిగ్రీల మధ్య ఉప అయనరేఖ అధిక పీడన మండలం వద్ద, గాలులు కిందకు దిగే ప్రాంతంలో ఏర్పడిన ఎడారులు. **ఉదా:** సహారా, కలహరి, ఉత్తర ఆస్ట్రేలియా తానామి ఎడారులు.

2) **తీర ప్రాంత ఎడారులు:** తీరాల వద్ద శీతల సముద్ర ప్రవాహాల వల్ల ఏర్పడే ఎడారులు. **ఉదా:** అటకామ ఎడారి- చిలీ (ఇది ప్రపంచంలో అత్యంత పురాతన, శుష్క ఎడారి).

3) **పర్వత వర్షచ్ఛాయ ఎడారులు:** పవనాభిముఖ ప్రాంతాల్లో గాలులు కిందకు దిగడం వల్ల ఏర్పడే ఎడారులు. అమెరికాలోని సియెర్రా నెవడా పర్వతాల వర్షచ్ఛాయ ప్రాంతంలో డెత్ వ్యాలీ లోయ ఉంది.

4) **ఖండాంతర్గత ఎడారులు:** ఖండం మధ్య భాగంలో శుష్క పవనాల వల్ల ఏర్పడే ఎడారులు. వీటిని సమశీతోష్ణ ఎడారులు అంటారు. **ఉదా:** గోబీ ఎడారి, టక్లమకాన్ ఎడారి.

5) **ధ్రువ ఎడారులు:** ఆర్కిటిక్, అంటార్కిటికాలను ఎడారులుగానే పరిగణిస్తారు. అయితే అవి శీతల ఎడారులు.

ప్రపంచంలోని ముఖ్యమైన ఎడారులు

ఎడారి పేరు	ఉన్న ప్రదేశం	విశేషం
గోబీ ఎడారి	మంగోలియా, చైనా	దీన్ని 'షామో ఎడారి' అని కూడా అంటారు.
టక్లమకాన్	చైనా	టైయిన్ షియాన్, కున్‌లున్ పర్వతాల మధ్య ఉన్న ఎడారి.
కారాకుం ఎడారి	తుర్క్‌మెనిస్థాన్	తుర్క్‌మెనిస్థాన్ సమీపంలోని అరల్ సముద్రం దగ్గరున్న ఎడారి.
సిరియన్ ఎడారి	సౌదీ అరేబియా, సిరియా	దీని పశ్చిమ భాగాన్ని ఆల్ హమడ్ అని పిలుస్తారు.
దస్త్-ఈ-కవీర్	ఇరాన్	దీన్ని గ్రేట్ సాల్ట్ ఎడారి అని కూడా అంటారు.
రబ్ ఆల్ ఖలి	సౌదీ అరేబియా, యెమెన్	ప్రపంచంలోనే అతిపెద్ద సముద్రపు ఇసుక ఎడారి.
అరేబియా	ఈజిప్ట్	దీన్ని తూర్పు ఎడారి అని కూడా అంటారు. ఈజిప్ట్ దేశంలో, ఎర్ర సముద్ర సమీపంలో ఉన్న ఎడారి.
కిజిల్కుం	ఉజ్బెకిస్థాన్	–
సహారా	ఆఫ్రికా ఉత్తర భాగం	ప్రపంచంలోనే అతిపెద్ద సహజ ఎడారి, పరిమాణంలో భారతదేశం కంటే 3 రెట్లు పెద్దది.
కలహరి	బోట్స్‌వానా, దక్షిణాఫ్రికా	–
నమీబ్	నమీబియా	ఆఫ్రికా ఖండ నైరుతి భాగంలోని ఎడారి.
నుబియన్	సూడాన్ ఈశాన్య భాగం	సహారా ఎడారిలో భాగం.
కాలిఫోర్నియా	అమెరికా	ఉత్తర అమెరికా పశ్చిమ తీరాన కాలిఫోర్నియా రాష్ట్రంలోని ఎడారి
మెక్సికో	మెక్సికో	దీన్ని సొనోరన్ ఎడారి అని కూడా పిలుస్తారు.
అటకామా	చిలీ, పెరూ	–
పెటగోనియా	అర్జెంటీనా	–

సముద్ర భూస్వరూపాలు

సముద్ర తరంగాలు అయిదు రకాల పద్ధతుల్లో క్రమక్షయం చేస్తాయి. అవి అపఘర్షణ, ఘర్షణ, రాపిడి, జలోత్పాదక చర్య (హైడ్రాలిక్ యాక్షన్), తరంగ తాకిడి (వేవ్ షాక్).

సముద్ర క్రమక్షయ స్వరూపాలు

1) **సముద్ర భృగువు:** సముద్రపు తీరం నుంచి నిటారుగా నిలిచిన రాతి శిఖరం.

2) **అగ్రం:** భృగువు ఇంకా క్రమక్షయానికి గురైతే సముద్ర అగ్రం ఏర్పడుతుంది.

3) **సముద్ర గుహలు:** సముద్రపు అలల నిరంతర క్రమక్షయం వల్ల తీరప్రాంత శిలలో ఏర్పడే గుహలు.

4) **సముద్రపు తోరణాలు:** సముద్రపు గుహలు మరింత పెద్దవై తోరణం మాదిరిగా ఉండే భూస్వరూపం.

5) **పేర్పుడు స్తంభాలు:** సముద్రపు నీటిలో ఇంకా క్రమక్షయం కాకుండా అక్కడక్కడ మిగిలి ఉన్న రాతి నిర్మాణాలు.

సముద్ర నిక్షేపణ స్వరూపాలు

1) **బీచ్:** సముద్ర తీరాన ఉన్న ఇసుక దిబ్బలు.

2) **బార్:** సముద్ర తీరానికి సమాంతరంగా నాలుక లాగా ఏర్పడిన నిక్షేపణ స్వరూపం. ఇవి లాగూన్స్ ఏర్పడటానికి కారణమవుతాయి.

3) **షోల్స్:** నదీ ముఖద్వారాల వద్ద ఏర్పడిన పెద్ద ఇసుక దిబ్బలు. ఇవి నౌకాయానానికి అవరోధం కలిగిస్తాయి.

అంతర్భూజల భూ స్వరూపాలు

అంతర్భూజలానికి వర్షపు నీటిలో కరిగిన కార్బానిక్ ఆమ్లం తోడైనప్పుడు సున్నపురాయి నిక్షేపాలున్న ప్రాంతంలో తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది. సున్నపురాయిపై అంతర్భూజలం మూడు రకాల చర్యలు జరుపుతుంది. అవి ద్రావణం, నిక్షేపణం, పాషాణీకరణం. ఆంధ్రప్రదేశ్‌లో నంద్యాల జిల్లాలోని బెలూం గుహలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని బొర్రా గుహలు, మేఘాలయలోని సిజు గుహలు, క్రేమ్ లియత్ ప్రాంక్ గుహలు, డైంగ్ జెమీ గుహలు, నొంగ్రి గుహల్లో ఈ రకమైన భూస్వరూపాలున్నాయి.

అంతర్భూజల క్రమక్షయ స్వరూపాలు

1) **సింక్ హోల్స్:** అంతర్భూభాగంలో సున్నపురాయి కరిగి ఏర్పడిన పల్లపు ప్రదేశం.

2) **యువలా:** పరిమాణంలో పెద్దవిగా, గరాటు ఆకారంలోని సింక్ హోల్స్‌ను 'యువలా' అంటారు.

3) **కందకాలు:** క్రమక్షయం వల్ల ఏర్పడిన గుహ లాంటి స్వరూపాలు.

విక్షేపణ స్వరూపాలు

1) **స్టాలగ్ టైట్:** సున్నపు రాయి గుహ పైభాగం నుంచి అభివృద్ధి చెందిన నిక్షేపణ స్వరూపం.

2) **స్టాలగ్ మైట్:** గుహ అడుగు భాగం నుంచి అభివృద్ధి చెందుతున్న నిక్షేపణ స్వరూపం.

3) **స్తంభాలు:** స్టాలగ్మైట్, స్టాలక్టైట్ కలిసి పోవడంతో ఏర్పడిన స్వరూపం.

యుగోస్లేవియా ప్రాంతంలోని ఎడ్రియాటిక్ సముద్రతీర ప్రాంతంలో 70 కి.మీ. మేర ఈ సున్నపురాతి స్వరూపాలున్నాయి. ఈ ప్రాంతానికి 'కార్స్ట్' అని పేరు. అందువల్ల ఇలాంటి భూస్వరూపాలను సాధారణంగా కార్స్ట్ భూస్వరూపాలు అని కూడా పిలుస్తారు.

ఎడారిలోని భూస్వరూపాలు:

✦ **ఒయాసిస్సులు:** ఎడారిలోని మంచినీటి సరస్సులు. ✦ **పెడిమెంట్స్:** పర్వత పాదాల వద్ద ఉన్న రాతి మైదానాలు. ✦ **వాడీలు:** తాత్కాలిక లోయలు ✦ **రెగ్ లేదా హమడా:** రాతి ఎడారులు ✦ **ఎర్గ్:** ఇసుక ఎడారులు.



రచయిత: సక్కరి జయకర్

దేవర సినిమా టికెట్ల ధర పెంపు పది రోజులకే పరిమితం కావాలి

రాష్ట్ర ప్రభుత్వం, నిర్మాతకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా టికెట్ల ధర పెంపు పది రోజులకే పరిమితం కావాలని ప్రభుత్వానికి, నిర్మాతకు హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీఓ 13ను పరిశీలిస్తే సినిమా విడుదలైన నాటి నుంచి పది రోజులు మాత్రమే టికెట్ల ధర పెంచుకునేందుకు అవకాశం ఉందని గుర్తుచేసింది. దేవర సినిమా విషయంలో చిత్ర నిర్మాత ఎన్నిరోజులు ధర పెంచుకోవచ్చో ప్రభుత్వం జారీ చేసిన మెమోలో స్పష్టత లేదని తెలిపింది. మెమోపై స్పష్టత ఇస్తూ, దేవర సినిమా ఏపీలో ఎంతశాతం షూటింగ్‌ను పూర్తి చేసుకుంది తదితర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి, చిత్ర నిర్మాతకు నోటీసులు జారీ చేసింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. ఈ నెల 27న విడుదల కానున్న దేవర సినిమాకు టికెట్ ధరలను పెంచుకునేందుకు చిత్ర నిర్మాతకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని సవాలు చేస్తూ నెల్లూరుకు చెందిన పి.శివకుమార్‌రెడ్డి హైకోర్టులో పిల్ వేశారు.

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి హైకోర్టులో ఊరట

ఆయనపై నమోదైన అత్యాచారం కేసు కొట్టివేత

ఈనాడు, అమరావతి: అత్యాచారం కేసులో సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి ఊరట లభించింది. తిరుపతి తూర్పు ఠాణా పోలీసులు ఆయనపై నమోదు చేసిన కేసును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే.కృపాసాగర్ కొట్టివేస్తూ బుధవారం తీర్పు ఇచ్చారు. తనను బెదిరించి అత్యాచారం చేశారని తిరుపతి జిల్లా కేవీబీ పురం మండలానికి చెందిన బాధితురాలు ఫిర్యాదు చేయగా.. ఆదిమూలంపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసును కొట్టేయాలంటూ ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించారు. వ్యాజ్యం విచారణలో ఇటీవల బాధితురాలు హైకోర్టుకు హాజరై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలన్నీ అవాస్తమని తెలిపారు. నోటరీ చేసిన అఫిడవిట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు. అది తప్పుడు కేసు అని, దాన్ని కొట్టేయాలని న్యాయమూర్తికి విన్నవించారు. ఈ వివరాలను నమోదు చేసిన న్యాయమూర్తి.. బుధవారం కేసును కొట్టేశారు.

ఏపీ భవన్ ఓఎస్‌డీగా సౌరభ్‌గౌర్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న సౌరభ్‌గౌర్‌ను దిల్లీలోని ఏపీ భవన్‌కు ప్రత్యేకాధికారి (ఓఎస్‌డీ)గానూ నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఉన్నత విద్యా శాఖ కార్యదర్శిగా ఉంటూనే, ఏపీ భవన్ ఓఎస్‌డీ పోస్టుని కూడా నిర్వర్తిస్తారని తెలిపింది.

పోలవరంలో కీలక వర్కుషాపు అక్టోబరు 20న

- విదేశీ నిపుణుల బృందం ప్రతిపాదన మేరకు ఏర్పాటు
- సాంకేతిక అంశాలపై తుది నిర్ణయాలు అక్కడే
- హాజరుకానున్న పోలవరం అథారిటీ, కేంద్ర జలసంఘం సభ్యులు

ఈనాడు, అమరావతి: విదేశీ నిపుణుల బృందం ప్రతిపాదించిన కీలక సాంకేతిక వర్కుషాపును అక్టోబరు 20న నిర్వహించాలని పోలవరం అధికారులు నిర్ణయించారు. కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, విదేశీ నిపుణుల బృందానికి ఈ విషయాన్ని తెలిపారు. వర్కుషాపును ఎన్నిరోజులు నిర్వహించేదీ ఎజెండాలోని అంశాలపై ఆధారపడి ఉంది. పోలవరం ప్రాజెక్టు డిజైనర్.. ఆఫ్రి ఆకృతుల సంస్థ, ప్రాజెక్టులో పని చేసే ఇంజినీర్ల బృందం, విదేశీ నిపుణుల బృందం, పోలవరం అథారిటీ సభ్యులు, కేంద్ర జలసంఘం సభ్యులు, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారు. పోలవరం ప్రాజెక్టులో సాంకేతిక సవాళ్లన్నీ కొలిక్కి వచ్చాయి. అమెరికా, కెనడాలకు చెందిన ఇంజినీరింగ్ నిపుణులు జులై మొదటి వారంలో ప్రాజెక్టును సందర్శించారు. కాఫర్ డ్యాంల సీపేజీ, డయాఫ్రం వాల్ ధ్వంసం, ప్రధాన డ్యాం ప్రాంతంలో అగాథాలు తదితరాల్ని పరిశీలించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలను కొనసాగిస్తూ కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలని ఆ బృందం సిఫారసు చేసింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల సీపేజీ నీటిని ఎత్తిపోస్తూ, వాటికి కొన్ని రక్షణ పనులు చేపట్టాలని, ఫిల్టర్లను అమర్చాలని ప్రతిపాదించింది. ఆయా నిర్మాణాల డిజైన్లను, పనుల షెడ్యూలును కొలిక్కి తెచ్చేందుకు వర్కుషాపు వేదిక కానుంది.

నవంబరులో కొత్త డయాఫ్రం వాల్..

కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని నవంబరులో ప్రారంభించాలని భావిస్తున్నారు. 2025 జూన్ నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. ఈ వ్యవధిలో డయాఫ్రం వాల్ పూర్తికి మూడు సెట్ల యంత్ర సామగ్రి అవసరమని అధికారుల అంచనా. మేఘా సంస్థ... బావర్ కంపెనీ సాయంతో ఈ పనులు చేపట్టబోతోంది. పోలవరంలో గతంలో డయాఫ్రం వాల్ నిర్మించిన అనుభవం బావర్ కంపెనీకి ఉంది. ఒకవేళ డయాఫ్రం వాల్‌ను రెండు సీజన్లలో నిర్మించాల్సి వచ్చినా అందుకు తగ్గట్టుగా డిజైన్లను రూపొందించవచ్చని విదేశీ నిపుణుల బృందం భరోసా ఇచ్చింది.

నిధులపై దృష్టి

కేంద్రం మంజూరు చేసిన నిధుల్ని రప్పించడంపై పోలవరం అధికారులు దృష్టి సారించారు. కేంద్ర ప్రభుత్వం తాజా డీపీఆర్‌ను ఆమోదించడంతో ప్రాజెక్టుకు కొత్తగా రూ.12,157 కోట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ నిధులను రీయింబర్సు విధానంలో కాకుండా అడ్వాన్సుగా రాష్ట్రానికి ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.6,000 కోట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.6,157 కోట్లను కేంద్రం ఇవ్వనుంది. 2027 ప్రారంభానికల్లా పనులన్నీ పూర్తి చేయాలని కేంద్రం షరతు విధించింది. ఈ నేపథ్యంలో పనుల వేగం పెంచాలని అధికారులు భావిస్తున్నారు.

ఈ-రిక్షాలు 'చెత్త'మయం

స్వచ్ఛభారత్ స్ఫూర్తితో గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో వచ్చిన ఈ-రిక్షాలు కర్నూలు ఎస్సీ కార్పొరేషన్ ఆవరణలో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఈ వాహనాలను అందించేందుకు 220 మందిని గుర్తించినా వారికి ఇవ్వలేదు.

తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేయడంతో అవి తుప్పు పట్టి, టైర్లు ఊడిపోయి శిథిలావస్థకు చేరుతున్నాయి. యంత్రాల బ్యాటరీలూ పని చేయడం లేదు. కూటమి ప్రభుత్వం చొరవ చూపి వాటిని బాగు చేయించి లబ్ధిదారులకు అందించేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

– ఈనాడు, కర్నూలు



కర్నూలు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం వెనుక శిథిలమవుతున్న ఈ-రిక్షాలు

రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయండి

- హైకోర్టులో కుక్కల విద్యాసాగర్ పిటిషన్

ఈనాడు, అమరావతి: ముంబయి సినీనటి కాదంబరీ జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో విజయవాడ కోర్టు తనను రిమాండ్‌కు పంపుతూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ నిందితుడు కుక్కల విద్యాసాగర్ బుధవారం హైకోర్టులో అత్యవసరంగా వ్యాజ్యం వేశారు. సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అరెస్టుకు గల కారణాలను పోలీసులు అందజేయలేదన్నారు. విద్యాసాగర్‌ను పోలీసు కస్టడీకి ఇచ్చే వ్యవహారంపై గురువారం విజయవాడ కోర్టు నిర్ణయం వెల్లడించనుందన్నారు. ఆ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసేలా కింది కోర్టును ఆదేశించాలని కోరారు. ఏపీపీ వాదనలు వినిపిస్తూ.. పూర్తి వివరాలు సమర్పించేందుకు విచారణను గురువారానికి వాయిదా వేయాలని కోరారు. దీంతో విచారణను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి వెల్లడించారు.

విచారణకు సహకరించండి..

జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిలు ఇవ్వాలని కోరుతూ ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ దాఖలు చేసిన వ్యాజ్యంపై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. అక్టోబరు ఒకటికి వాయిదా వేస్తూ అప్పటి వరకు గున్నీని అరెస్టు చేయొద్దని, తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. కేసు విచారణకు సహకరించాలని గున్నీకి స్పష్టం చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే.కృపాసాగర్ బుధవారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు.



ఆత్మబోధ ప్రకారం నడుచుకోండి

మీ ఆత్మబోధను మీరు వినడం సులభమే. దాని ప్రకారం నడుచుకోవడమే కష్టం. చాలా మంది తమ సౌఖ్యం కోసం ఆత్మప్రబోధాన్ని పెడచెవిన పెడుతుంటారు. కానీ ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న సుఖాలన్నింటినీ పక్కనపెట్టాల్సి వచ్చినా.. అంతరాత్మ చెప్పే మెరుగైన సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసినప్పుడే జీవితానికి అసలైన అర్థం.

– చార్లీ స్వేన్‌పాయెల్, డిజిటల్ మార్కెటింగ్ ప్రొఫెషనల్



ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్‌ను గజమాలతో సత్కరిస్తున్న కార్యక్రమ నిర్వాహకులు

ఏజీ, ఏఏజీ, డీఎస్‌జీ, పీపీలకు ఘన సన్మానం

ఈనాడు, అమరావతి: ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ (ఏఏజీ) ఇవన సాంబశివప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) పసల పొన్నారావు, రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ హైకోర్టు న్యాయవాదుల సంఘం తన వద్దకు తీసుకొచ్చే ఏ సమస్యనైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చిదంబరం నేతృత్వంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్‌ను గజమాలతో సత్కరించారు.

క్యూఎస్ ర్యాంకింగ్స్ టాప్-100లో.. హైదరాబాద్ బిజినెస్ స్కూలు

3 భారత ఐఐఎంలకూ చోటు

దిల్లీ: ఎంబీఏ కోర్సుల నిర్వహణ ప్రమాణాల్లో ప్రపంచస్థాయి అగ్రశ్రేణి 100 విద్యాసంస్థల్లో భారత్‌కు చెందిన మూడు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లకు, హైదరాబాదులోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)కు స్థానం లభించింది. బుధవారం విడుదలైన లండన్‌కు చెందిన ప్రముఖ ఉన్నతవిద్యా విశ్లేషణ సంస్థ 'క్యూఎస్' ర్యాంకింగులు ఈ వివరాలు వెల్లడించాయి. బెంగళూరు, అహ్మదాబాద్, కోల్‌కతా నగరాల్లోని ఐఐఎంలు ఇందులో చోటు సాధించాయి. అలాగే ఉపాధి కల్పనకు సంబంధించి టాప్ 50లో మూడు బిజినెస్ స్కూళ్లు స్థానం పొందాయి. మూడు కొత్త ఎంట్రీలతోపాటు పద్నాలుగు భారతీయ పూర్తికాల ఎంబీఏ ప్రోగ్రాంలు క్యూఎస్ గ్లోబల్ లిస్ట్ - 2025లో స్థానం సంపాదించాయి. బిజినెస్ స్కూళ్లలో అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వరుసగా అయిదో ఏడాది అగ్రభాగాన నిలిచింది. రెండు, మూడు స్థానాలను సైతం అమెరికాకు చెందిన వార్టన్, హార్వర్డ్ బిజినెస్ స్కూళ్లు ఆక్రమించాయి.

★ ప్రపంచంలోని 58 దేశాలు, భూభాగాల్లో అత్యుత్తమంగా ఉన్న విద్యాసంస్థల 340 ఎంబీఏ, బిజినెస్ కోర్సుల ప్రమాణాలను విశ్లేషించి క్యూఎస్ గ్లోబల్-2025 ర్యాంకులను ప్రకటించారు. భారత్‌లోని ఏడు ఐఐఎంలతోపాటు మొత్తం 14 విద్యాసంస్థలు ఈ ర్యాంకులకు దరఖాస్తు చేశాయి. "నేటి సంక్లిష్టమైన శరవేగంతో కూడిన వ్యాపారరంగ వాతావరణంలో మార్గం చూపగలిగే నాయకులను భారతీయ విద్యాసంస్థలు ఎక్కువగా అందిస్తున్నాయి. అయితే.. అంతర్జాతీయీకరణ, లింగ వైవిధ్యానికి సంబంధించిన సవాళ్లనూ అధిగమించాలి" అని క్యూఎస్ సీఈవో జెస్సికా టర్నర్ తెలిపారు.

అమెరికా పర్యటనకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు సాంస్కృతిక సంఘం నిర్వహించనున్న గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొనేందుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు అమెరికా వెళ్లనున్నారు. ఆ సంఘం ఆహ్వానం మేరకు గురువారం ఆయన బయలుదేరనున్నారు. వాషింగ్టన్ డీసీ (మెట్రో)లోని లీస్‌బర్గ్ (వీఏ) నగరంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న వేడుకల్లో ఆయన గౌరవ అతిథిగా పాల్గొంటారు. అక్టోబరు 8న రాష్ట్రానికి చేరుకుంటారు.

కల్తీ నెయ్యి వ్యవహారంలో..

ఏఆర్ డెయిరీ ఫుడ్స్‌పై కేసు

ఈనాడు, తిరుపతి; న్యూస్‌టుడే, తిరుపతి (నేర విభాగం): శ్రీవారి ప్రసాదాల తయారీకి జంతువులు, పంది కొవ్వుతో కల్తీ చేసిన నెయ్యిని సరఫరా చేసిందంటూ తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై తితిదే ప్రొక్యూర్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్ పి.మురళీకృష్ణ బుధవారం తిరుపతి తూర్పు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ సంస్థ సరఫరా చేసిన నెయ్యిలో పంది, జంతు కొవ్వులు కలిసినట్టుగా గుజరాత్‌లోని ఆనంద్‌లో ఉన్న నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్‌డీడీబీ) కాఫ్ ల్యాబ్ నిర్ధారించిందని తెలిపారు. వివిధ గుత్తేదారు సంస్థలు తితిదేకి సరఫరా చేస్తున్న నెయ్యిలో నాణ్యత లోపిస్తోందని గుర్తించి వాటిని ముందే హెచ్చరించామన్నారు. మిగతా గుత్తేదారు సంస్థలు తీరు మార్చుకుని నాణ్యత మెరుగుపరిచాయని.. కానీ, ఎన్ని హెచ్చరికలు చేసినా ఏఆర్ డెయిరీ ఫుడ్స్‌లో మాత్రం మార్పు రాలేదని తెలిపారు. ‘‘నెయ్యిలో కల్తీని నిర్ధారించే పరీక్షల కోసం తితిదే గతంలో ఎప్పుడూ బయటి ల్యాబ్‌లకు నమూనాలు పంపలేదు. ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సంస్థ ఈ ఏడాది జూన్ 12, 20, 25, జులై నాలుగో తేదీల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 4 ట్యాంకర్ల నెయ్యి సరఫరా చేసింది. ఆ నెయ్యిని వాడేశాం. ఆ నెయ్యి నాణ్యతపై అనుమానాలు వచ్చి సంస్థను హెచ్చరించాం. ఆ తర్వాత కూడా సదరు సంస్థ జులై 6న రెండు, జులై 12న రెండు చొప్పున మొత్తం 4 ట్యాంకర్ల నెయ్యి సరఫరా చేసింది. అప్పటికే ఆ సంస్థ నెయ్యి నాణ్యతపై అనుమానాలుండటంతో, ఆ ట్యాంకర్ల నుంచి నమూనాలు తీసి, ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపాం. జులై 16, 23 తేదీల్లో ల్యాబ్ నివేదికలు వచ్చాయి’’ అని వెల్లడించారు. తితిదే మొదటిసారి ఎన్‌డీడీబీ వంటి బయటి ల్యాబ్‌లకు నమూనాల్ని పంపిందని ఆయన మురళీకృష్ణ తెలిపారు.



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తితిదే ప్రొక్యూర్‌మెంట్ జీఎం మురళీకృష్ణ

కోట్ల మంది శ్రీవారి భక్తుల్ని మోసగించింది

తితిదేని, కోట్ల మంది శ్రీవారి భక్తుల్ని ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సంస్థ ఘోరంగా మోసగించిందని ఆ ఫిర్యాదులో మురళీకృష్ణ పేర్కొన్నారు. కల్తీ నెయ్యి సరఫరా చేయడాన్ని తీవ్రమైన నేరపూరిత కుట్రగా అభిప్రాయపడ్డారు. కొందరు స్వార్థపరశక్తులతో కలిసి ఈ కుట్రకు తెరతీసిందన్నారు. సమగ్ర దర్యాప్తు చేసి దోషుల్ని బయటపెట్టాలని కోరారు. ‘నెయ్యి సరఫరాకు తితిదే టెండర్లు పిలిచినప్పుడు... తక్కువ ధరకు కోట్ చేయడం ద్వారా 10 లక్షల కిలోల నెయ్యికి ఆర్డర్ ఇచ్చేలా తితిదేని ఆ సంస్థ ప్రేరేపించింది. తితిదేతో కుదుర్చుకున్న ఒప్పందంలోని నిబంధనల్ని, షరతుల్ని ఉల్లంఘించింది. లడ్డూ ప్రసాదాల తయారీకి ఆ సంస్థ కల్తీ నెయ్యి సరఫరా చేసిందన్న వార్తతో భక్తులు ఆందోళన చెందారు’’ అని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చర్యతో ఆ సంస్థ ఆహార భద్రతా, ప్రమాణాల చట్టంలోని 51, 59 సెక్షన్లను ఉల్లంఘించిందని, అది శిక్షార్హమైన నేరమని పేర్కొన్నారు. తితిదే ఫిర్యాదు మేరకు ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సంస్థపై పోలీసులు ఆహార భద్రతా చట్టంలోని 51, 59 సెక్షన్లతోపాటు భారతీయ న్యాయ సంహిత చట్టంలోని 3(5), 274, 275, 316(3), 318(3), 318(4), 61(2), 299 ఆర్ డబ్ల్యూ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఏ సెక్షన్ ఏం చెబుతోంది..

సెక్షన్ 274: ఆహారాన్ని, పానీయాన్ని కల్తీ చేయడం.
సెక్షన్ 275: కల్తీ/హానికరమైన ఆహారాన్ని, పానీయాన్ని విక్రయించడం.
సెక్షన్ 318(3): తెలిసి ఇతరులను మోసం చేయడం. ఎదుటి వ్యక్తికి నష్టం జరిగేలా చేయడం.
సెక్షన్ 318(4): మోసపూరితమని తెలిసీ విక్రయించడం.
సెక్షన్ 299ఆర్‌డబ్ల్యూ: ఉద్దేశపూర్వకంగా ఏ మార్గం ద్వారానైనా మతపరమైన మనోభావాలు దెబ్బతీయడం.
61(2): మోసపూరితంగా నేరాన్ని, తప్పును ప్రోత్సహించడం.
3(5): అందరికీ నేరం ఆపాదించడం.

అంత తక్కువ ధరకు ఎలా సాధ్యం..?!

శ్రీవారి లడ్డూ నాణ్యతపై భక్తుల నుంచి అనేక ఫిర్యాదులు రావడంతో దానికి కారణమేంటో పరిశీలించామని మురళీకృష్ణ పేర్కొన్నారు. ‘‘తిరుమలకు 1,500 కి.మీ.ల పరిధిలో ఉన్న సంస్థల నుంచి 10 లక్షల కిలోల నెయ్యి సరఫరాకి 2024 మార్చి 12న టెండర్లు పిలిచాం. కిలోకి రూ.319.80 ధర కోట్ చేసిన ఏఆర్ ఫుడ్స్ సంస్థకు 2024 మే 8న టెండర్ ఖరారైంది. మే 15న సప్లై ఆర్డర్ ఇచ్చాం. ఆ ధరకు నెయ్యి సరఫరా చేయడం గిట్టుబాటు కాదు. అయినా ఆ సంస్థ ముందుకొచ్చింది’’ అని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

నివేదిక చూసి తీవ్రంగా కలత చెందాం..!

ఎన్‌డీడీబీకి పంపిన అన్ని నమూనాల్లోనూ పంది, గొడ్డు కొవ్వు కలిసిందని, తీవ్రస్థాయిలో కల్తీ జరిగిందని తేలింది. అది చూసి తీవ్రంగా కలత చెందాం. ‘‘దిట్టం అనుసరించి చేసే స్వామివారి లడ్డూ ప్రసాదాల తయారీలో నెయ్యి కీలకం. అది నాణ్యంగా లేకపోతే కోట్ల మంది భక్తుల ఆరోగ్యంతోపాటు, మతపరమైన మనోభావాలు, విశ్వాసాలపై ప్రభావం చూపుతుంది. ఏఆర్ ఫుడ్స్ సంస్థ నాణ్యత నిబంధనల్ని అనుసరించి మంచి నెయ్యి సరఫరా చేస్తుందని మేం విశ్వసించాం. కానీ, దానికి భిన్నంగా వ్యవహరిస్తోందని నమూనా పరీక్షల్లో తేలింది’’ అని పేర్కొన్నారు. కల్తీ నెయ్యి సరఫరా చేసిందని తేలడంతో ఏఆర్ డెయిరీ ఫుడ్స్‌కి జులై 22, 23, 27 తేదీల్లో నోటీసులు జారీ చేశామని, 28న రిజాయిండర్ నోటీసు పంపించామని తెలిపారు. దీనిపై ఆ సంస్థ జులై 28, సెప్టెంబరు 4న వివరణ ఇస్తూ.. ‘తాము ఎలాంటి కల్తీ నెయ్యి సరఫరా చేయలేదు’ అని తెలిపిందన్నారు.

చేయి చేయి కలిపారు.. వెన్నంటి నిలుస్తున్నారు

ఊరూ ఏరూ ఏకమై..
ఎటు చూసినా నీరే.
కనీవినీ ఎరుగని రీతిలో
ముంచెత్తిన వరద..
వేల మందిని
బాధితులుగా మిగిల్చింది.
ఇటు బుడమేరు,
అటు మున్నేరు
మహోగ్ర రూపం దాల్చి..
వారి బతుకుచక్రాన్ని
పదేళ్లు వెనక్కి లాగేశాయి.



త్రిపురనేని నవ కృష్ణ చౌదరి, నాగరాణి, హైదరాబాద్
విరాళం: రూ.1,50,000

ఈ ఉపద్రవాన్ని తట్టుకొని నిలబడేలా.. దాతలు చేయందిస్తున్నారు
తలాకొంత సాయం చేస్తూ చేదోడువాదోడుగా నిలుస్తున్నారు

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన ‘ఈనాడు సహాయనిధి’కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
నాగభైరవ చలపతిరావు, హైదరాబాద్	1,00,000
ఎర్నేని రంగారావు, విజయవాడ	25,000
కృష్ణసాయి గ్రానైట్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్, చీమకుర్తి	25,000
పి.తిరుమలరావు, విశాఖపట్నం	21,000
కొల్లి అనూజశ్రీ, హైదరాబాద్	20,000
ఎర్రా వెంకట కిశోర్‌బాబు, విశాఖపట్నం	15,000
వింజం రాఘవేంద్రప్రసాద్, విశాఖపట్నం	10,516
గోపరాజు సుబ్బలక్ష్మి, హైదరాబాద్	10,000
జ్యోస్యుల విశ్వమోహనరావు, హైదరాబాద్	10,000
ఎం.చిరంజీవి, విశాఖపట్నం	10,000
రావుల ముత్యాలరావు, సత్యవతి, కాకినాడ	10,000
ఆదిరాజు రామకృష్ణ, హైదరాబాద్	5,116
కొప్పాడ భాస్కర ప్రసాద్, విశాఖపట్నం	5,001
కె.రమేశ్ వర్మ, విశాఖపట్నం	5,001
అదుర్తి శివాజీ, హైదరాబాద్	5,000
కటిపల్లి ఆనంద్‌రెడ్డి, ఆదిలాబాద్	5,000
ఆర్.ఎ.శాస్త్రి, విశాఖపట్నం	5,000
జయంతి బాబు, తిరుపతి	5,000
మరివాడ మురళీమోహన్ రావు, కాకినాడ	5,000
ఎ.వెంకట నర్సయ్య, లక్సెట్టిపేట	5,000
పావులూరి రాణి శ్రీనివాసబాబు, అద్దంకి	5,000
రమణి విట్టల, హైదరాబాద్	5,000
గండె శంకరరావు, వరంగల్	5,000
చిలమచర్ల వెంకటేశ్వర్లు, నజీమా, విజయవాడ	5,000

మీ ఉదారతే.. బాధితులకు భరోసా

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
● ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు
ఈనాడు రిలీఫ్ ఫండ్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

ఏపీలో పెట్టుబడులతో మెరుగైన ఆదాయం

న్యూయార్క్‌లో వివిధ సంస్థల ప్రతినిధులతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



బ్రిటీష్ బిలియనీర్ హెడ్జ్ ఫండ్ మేనేజర్, యాక్టివిస్ట్ ఇన్వెస్టర్ క్రిస్టోఫర్ ఆంథోనీతో సమావేశమైన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తోందని.. ఈ దశలో పెట్టుబడులు పెట్టడం ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చని సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. పది రోజుల అమెరికా పర్యటనలో భాగంగా మంగళవారం న్యూయార్క్‌లోని వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. జనరల్ అట్లాంటిక్ ఫౌండేషన్ ప్రతినిధి కారా బార్నెట్, ములగో ఫౌండేషన్స్ సీఈవో కెవిన్ స్టర్, బియాండ్ నెట్ జీరో ఛైర్మన్ లార్డ్ జాన్ బ్రౌన్ తదితరులతో భేటీ అయ్యారు. వివిధ రంగాల్లో పెట్టుబడి అవకాశాలు, రైతుల సంక్షేమం కోసం చేపట్టాల్సిన కార్యాచరణ గురించి ప్రధానంగా చర్చించారు. అనంతరం నిరుపేద మహిళలకు సాధికారత కల్పించే లక్ష్యంతో రాష్ట్రంలో కర్బన ఉద్గారాల నియంత్రణలో భాగంగా ఏర్పాటు చేయబోయే ప్రాజెక్టుకు సహకారం అందించే విషయమై బ్రిటీష్ బిలియనీర్ హెడ్జ్ ఫండ్ మేనేజర్, యాక్టివిస్ట్ ఇన్వెస్టర్ క్రిస్టోఫర్ ఆంథోనీతోనూ మంత్రి కొండపల్లి చర్చలు జరిపారు. దీనికి క్రిస్టోఫర్ ఆంథోనీ అంగీకారం తెలిపినట్లు మంత్రి కార్యాలయం పేర్కొంది.

ప్రభుత్వ పాఠశాలలో స్లాబ్ కూలి విద్యార్థి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- శ్రీకాకుళం జిల్లా పాతరపల్లిలో ఘటన

ఎచ్చెర్ల (రణస్థలం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పాతరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో కిటికీ స్లాబ్ కూలి ఒక విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. మరొక విద్యార్థి తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యాడు. పోలీసులు తెలిపిన ప్రకారం... పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పాతర్లపల్లి గ్రామానికి చెందిన వసుం కృష్ణంరాజు(15) బుధవారం మధ్యాహ్నం విరామ సమయంలో పాఠశాల ఆవరణలో తిరగడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రాంగణంలో అసంపూర్తిగా ఉన్న భవనంపైకి స్నేహితుడు కోరాడ శ్రీరామ్‌తో కలిసి ఎక్కాడు. అక్కడ ఇద్దరూ కిటికీ స్లాబ్ మీద నిలబడి ఆడుతుండగా.. ఎలాంటి ఆధారం లేకపోవడంతో అది ఓ వైపు ఒరిగిపోయింది. ఇద్దరూ కింద పడిపోగా స్లాబ్ కుప్పకూలి వారిపై పడింది. ఘటనలో కృష్ణంరాజు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీరామ్‌కు రెండు కాళ్లూ విరిగిపోవడంతో ఉపాధ్యాయులు అతడిని శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





వసుం కృష్ణంరాజు ◆ విగతజీవిగా కృష్ణంరాజు

నాసి రకం ‘నాడు-నేడు’ పనులే కారణం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే

ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. గత ప్రభుత్వం నాడు-నేడు ద్వారా చేపట్టిన నాసిరకం పనుల కారణంగానే ఘటన జరిగిందని ఆరోపించారు. దీనిపై కమిటీ వేసి బాధ్యులను చట్టపరంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించిందని తెలిపారు. విద్యార్థి మృతిపై మంత్రి లోకేశ్ ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

విభజన హామీల కింద పదేళ్లలో రూ.35,491 కోట్లు విడుదల

ఆర్టీఐ కింద కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద ఆంధ్రప్రదేశ్‌కు 2014-24 మధ్య పదేళ్లలో రూ.35,491.57 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కార్యకర్త ఇనగంటి రవికుమార్ అడిగిన మేరకు కేంద్రం ఈ మేరకు బదులిచ్చింది. సెక్షన్ 46(2) కింద ఆర్థిక లోటు భర్తీ కోసం రూ.16,078.76 కోట్లు, సెక్షన్ 46(2), (3), సెక్షన్ 94(2) కింద ఏడు వెనకబడిన జిల్లాల అభివృద్ధికి రూ.1,750 కోట్లు, సెక్షన్ 6, 94 (3, 4) కింద రాజధాని నగరంలో ముఖ్యమైన మౌలిక వసతుల అభివృద్ధికి రూ.2,500 కోట్లు, సెక్షన్ 90(1) కింద పోలవరం ప్రాజెక్టుకు రూ.15,147.00 కోట్లు, 2015-16 నుంచి 2019-20 మధ్య కాలంలో సంతకాలు చేసిన విదేశీ ఆర్థిక సాయంతో చేపట్టే ప్రాజెక్టులపై తీసుకున్న రుణాలకు వడ్డీ చెల్లింపునకు రూ.15.81 కోట్లు విడుదల చేసినట్లు తెలిపింది. ఆర్థికలోటు భర్తీ కింద 2023-24 ఒక్క సంవత్సరంలోనే రూ.10,460.87 కోట్లు ఇచ్చినట్లు వెల్లడించింది.

ఒక్కరే వచ్చి చేరండి!

మాజీ మంత్రి బాలినేనికి జనసేన కబురు

ఒంగోలు, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం జనసేన పార్టీలో చేరనున్నారు. అనుచరగణంతో బలప్రదర్శనగా చేరాలని ఆయన భావించినా... ఒక్కరే రావాలని జనసేన అధిష్ఠానం స్పష్టం చేసింది. ఆయన చేరికను కూటమి పార్టీల నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పార్టీ మారినా గత పాపాల నుంచి తప్పించుకోలేరని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అందుకు బాలినేని ప్రతిస్పందించడంతో జిల్లా రాజకీయం వేడెక్కింది. ఈ నేపథ్యంలో బలప్రదర్శనలు, ర్యాలీలు వద్దని, ఒక్కరే వచ్చి చేరాలని జనసేన పెద్దలు బాలినేనికి సమాచారం పంపారు. మరోవైపు... నగరంలో బాలినేని ఫ్లెక్సీలను కొందరు చించేశారు. దీనిపై ఆయన జిల్లా ఎస్పీ దామోదర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

అన్న క్యాంటీన్ల రాయితీ ఖర్చు ఏటా రూ.166 కోట్లు

ఈనాడు, అమరావతి: అన్న క్యాంటీన్లలో పేదలకు అందిస్తున్న అల్పాహారం, భోజనానికి సంబంధించి రాయితీ (సబ్సిడీ) కింద ఏటా రూ.166.25 కోట్ల ఖర్చుకు ప్రభుత్వం బుధవారం పరిపాలన అనుమతులిచ్చింది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి ఒక్కొక్కరిపై రూ.75 చొప్పున ప్రభుత్వం రాయితీ భరించనుంది. 203 క్యాంటీన్లలో అందించే ఆహారంపై రాయితీ కింద ఏటా చేసే ఖర్చుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది.

కుంగిన అవుకు జలాశయం రాతికట్ట

ఈనాడు, అమరావతి-అవుకు, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా అవుకు జలాశయం రాతికట్ట మూడు మీటర్ల మేర కుంగింది. ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాదమూ లేదని అధికారులు చెప్పారు. అవుకు సమీపంలోని పాలేరు, గొల్లలేరు, తిమ్మరాజు చెరువులను కలుపుతూ జలాశయాన్ని నిర్మించారు. ఇందులో అంతర్భాగమైన తిమ్మరాజు చెరువు పాత తూము వద్ద కట్ట కుంగడాన్ని స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారమిచ్చారు. ఎస్సార్బీసీ సిబ్బంది, పోలీసులు జలాశయం వద్దకు చేరుకొని కుంగిన చోటును పరిశీలించారు. జలాశయం పూర్తి నిల్వ సామర్థ్యం 4.14 టీఎంసీలు కాగా బుధవారం నాలుగు టీఎంసీలు నిల్వ చేశారు. జలాశయాన్ని నిర్మించాక పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయడం ఇది రెండోసారి. ఒక్కసారిగా నీటి నిల్వలు పెరగడంతో పాత తూము ప్రాంతంలో కట్ట కుంగినట్లు భావిస్తున్నారు. ప్రస్తుతానికి కట్టకు వచ్చిన ప్రమాదమేమీ లేదని జలాశయం ఈఈ సురేష్‌బాబు తెలిపారు. కట్ట కుంగిన చోట గతంలో తూము ఉండేదని, దాని వల్లే సమస్య తలెత్తినట్లు అనుమానం వ్యక్తంచేశారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కుంగిన ప్రాంతాన్ని నల్లమట్టితో నింపి, పూడ్చినట్లు తెలిపారు.



అవుకు జలాశయం వద్ద కుంగిన రాతి కట్ట

మరమ్మతులు చేపట్టండి

మంత్రి రామానాయుడు ఆదేశం

రాతికట్ట కుంగడంపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులతో మాట్లాడారు. తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం అవుకులో 4 టీఎంసీలకు పైగా ఉన్న నీటిని గండికోట జలాశయానికి పంపాలని సూచించారు. జలాశయాల కనీస నిర్వహణ పనుల్ని వైకాపా ప్రభుత్వంలో చేపట్టక పోవడంతో ఇప్పుడు శాపంగా మారుతోందని మంత్రి అన్నారు.

కల్తీ నెయ్యిలో కాదు.. ఆవులోనే

మాజీ స్పీకర్ తమ్మినేని వివాదాస్పద వ్యాఖ్యలు



ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీపై మాజీ స్పీకర్, వైకాపా శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు తమ్మినేని సీతారాం మంగళవారం విలేకరుల సమావేశంలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ‘పోషకాహార లోపంతో ఉన్న ఆవుల నుంచి వచ్చే పాలతో తయారు చేసే నెయ్యి.. ఆవాలు, అవిశలు, పామాయిల్ వంటి వ్యర్థాలను ఆహారంగా తీసుకొనే ఆవుల పాల నుంచి తయారు చేసే నెయ్యి కావొచ్చు. కూటమి నేతలు ఆరోపిస్తున్నట్లుగా లడ్డూలో ఇతర పదార్థాలు కలిస్తే అలాంటివి లోపలికి అనుమతించింది మీరే అవుతారు. మాపై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారు? పరీక్షలో కచ్చితత్వం లోపించే అవకాశం లేకపోలేదని ఎస్‌డీబీబీ తన నివేదికలో స్పష్టం చేసింది. ఉన్న లోపాలేంటి, జరిగిందేంటి అనేది తెలుసుకోవాలి. ఎంతో భద్రతగా చేయాల్సిన పనిని అల్లరి చేస్తే మన దేవుడి విలువను మనమే తగ్గించుకోవడం అవుతుంది. చంద్రబాబు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుండటంతో హిందువుల మనోభావాలు దెబ్బతినే దుస్థితి వచ్చింది’ అని తమ్మినేని సీతారాం విమర్శించారు.



డబ్బు వేటలో విలువలను మరవకండి

మనిషికి డబ్బు అవసరం. కాబట్టి ఉద్యోగం చేయాలి. ఎక్కువ ధనం కావాలనుకుంటే వ్యాపారం చేయొచ్చు. అదీ మంచిదే. సంపాదనను ఇంకా పెంచుకునేందుకు ఇతర సన్మార్గాలను అనుసరించడం కూడా తప్పు కాదు. కానీ- కేవలం ధనం కోసమే వెంపర్లాడుతూ.. మానవత్వ విలువలను మరచిపోకూడదు. అలా చేస్తే బ్యాంకులో లాకరు నిండినా.. మీ మనసు మాత్రం శూన్యంగానే మిగిలిపోతుంది.
– డాన్ కో, రచయిత

బెంగళూరులో ‘మెడికవర్’ ప్రారంభం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: దేశంలోని ఆరోగ్య రంగంలో భారీ మార్పులకు కర్ణాటక నాంది పలుకుతుందని ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లో రూ.120 కోట్ల పెట్టుబడితో నిర్మించిన 300 పడకల అత్యాధునిక సదుపాయాలున్న ‘మెడికవర్’ ఆసుపత్రిని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు, ఎమ్మెల్యే ఎన్ఏ హ్యారిస్‌తో కలిసి ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. బెంగళూరును ఆరోగ్య రాజధానిగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలూ ప్రభుత్వం తీసుకుంటోందని చెప్పారు. సామాన్యులకు అందుబాటు ధరలో చికిత్సలను అందించేందుకు ప్రైవేటు ఆసుపత్రులు ముందుకు రావాలని సూచించారు. ఆసుపత్రిలో ఓపీడీకి 45 గదులు, ఐసీయూలో వంద పడకలు ఉన్నాయని మెడికవర్ గ్రూపు ఆసుపత్రుల అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కృష్ణ తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలలో ఉన్న తమ ఆసుపత్రి ఇప్పుడు కొత్తగా కర్ణాటకలోనూ ప్రవేశించి నాలుగో రాష్ట్రంలో సేవలు అందించేందుకు సిద్ధమైందని చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న తమ 24 ఆసుపత్రుల్లో 14వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని వివరించారు. కార్డియాక్ సైన్సెస్, ఆర్థోపెడిక్స్, న్యూరోసైన్సెస్, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో సైన్సెస్, అవయవ మార్పిడి తదితర చికిత్సలకు నిపుణులైన వైద్యులు నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇక్కడ అత్యాధునిక క్యాథ్ ల్యాబ్, 3టి ఎంఆర్ఐ, సీటీ స్కాన్ లాంటి పరికరాలు ఉన్నాయన్నారు. కృత్రిమ మేధ సహకారంతో అందించే చికిత్సలూ ఇక్కడ పొందవచ్చని వివరించారు. రానున్న నాలుగేళ్లలో నగరంలో మరో నాలుగైదు ఆసుపత్రులను ఏర్పాటుచేస్తామని ప్రకటించారు.



ఆసుపత్రి భవనం ◆ ప్రారంభిస్తున్న శివకుమార్, దినేశ్ గుండూరావు తదితరులు



ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా డాక్టర్ అనిల్ కృష్ణ, దినేశ్ గుండూరావు, శివకుమార్ తదితరులు

తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి చేసిన వారికి డబ్బులు

- అప్పిరెడ్డి, అవినాష్ ఇచ్చినట్టు పోలీసుల గుర్తింపు
- బ్యాంకు ఖాతాల వివరాలు ఇచ్చేందుకు నిరాకరించిన లేళ్ల

ఈనాడు, అమరావతి: తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసిన వ్యక్తుల్లో గుంటూరు నుంచి వచ్చిన వారికి వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, విజయవాడ నుంచి వచ్చిన వారికి విజయవాడ తూర్పు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త దేవినేని అవినాష్ డబ్బులిచ్చారని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఇంతవరకు జరిపిన దర్యాప్తులో పలువురు నిందితులు ఈ విషయాన్ని అంగీకరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బుధవారం లేళ్ల అప్పిరెడ్డిని పోలీసులు ప్రశ్నించారు. ఆధారాలను ముందుపెట్టి విచారించినా సహకరించలేదని, పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని విచారణాధికారి, మంగళగిరి గ్రామీణ సీఐ శ్రీనివాసరావు విలేకరులకు చెప్పారు. ఘటన జరిగిన రోజు అంశాలకు.. విచారణలో చెబుతున్న వివరాలకు పొంతన లేదన్నారు. ఈ కేసు విచారణలో భాగంగా బుధవారం వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, న్యాయవాది ఒగ్గు గవాస్కర్‌ను పోలీసులు పిలిచారు. గవాస్కర్ ఉదయం 11 గంటలకు వచ్చి గంటన్నర తరువాత వెళ్లిపోయారు. అప్పిరెడ్డి సాయంత్రం 4 గంటలకు విచారణ సమయం ముగుస్తుండగా.. 3.45 గంటలకు హాజరయ్యారు. గంటన్నరపాటు ఆయన్ను విచారించి 14 ప్రశ్నలు అడిగారు. బ్యాంకు ఖాతా వివరాలు అడిగితే మీకెందుకంటూ పోలీసులను ఎదురు ప్రశ్నించారు. అన్నింటికీ సంబంధం లేని సమాధానాలిచ్చారని సీఐ శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. దాడిలో పాల్గొన్న కొంత మంది వైకాపా కార్యకర్తలకు డబ్బులిచ్చిన అంశంపై ప్రత్యేకంగా ప్రశ్నించినా సమాధానం చెప్పలేదని సీఐ అన్నారు.

సొంత భూముల విక్రయానికి అనుమతిస్తాం

విశాఖ ఉక్కుప్లాంట్ ఏర్పాటుకు సేకరించిన భూములపై ‘స్టేటస్ కో’ ఉంటుందన్న హైకోర్టు

ఈనాడు, అమరావతి: సొంత నిధులతో ఏపీఐఐసీ, హౌసింగ్ బోర్డు నుంచి కొనుగోలు చేసిన 24.99 ఎకరాల భూమిని విక్రయించుకునేందుకు విశాఖ ఉక్కు పరిశ్రమ యాజమాన్యానికి అనుమతిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ప్లాంట్ ఏర్పాటు కోసం సేకరించిన భూముల విషయంలో గతంలో ఇచ్చిన యథాతథ స్థితి (స్టేటస్ కో) ఉత్తర్వులు అమల్లోనే ఉంటాయని పేర్కొంది. మరింత స్పష్టతతో తగిన ఉత్తర్వులు జారీ చేసేందుకు విచారణను వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

- విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కోసం కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ, సువర్ణరాజు తదితరులు హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశారు. బుధవారం జరిగిన విచారణలో కేఏ పాల్ నేరుగా వాదనలు వినిపించారు. వేల ఎకరాల స్టీల్ ప్లాంట్ భూములను ఇప్పటికే విక్రయించారన్నారు. ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరారు.
- స్టీల్ ప్లాంట్ యాజమాన్యం తరఫు సీనియర్ న్యాయవాది డబ్ల్యూబీ శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. విశాఖ ఉక్కు పరిశ్రమ సొంత నిధులతో ఏపీఐఐసీ, హౌసింగ్ బోర్డు నుంచి భూములు కొనుగోలు చేసిందన్నారు. స్టీల్ ప్లాంట్ కోసం కేంద్ర ప్రభుత్వం భూసేకరణ కింద తీసుకున్న భూముల జోలికి తాము పోవడం లేదన్నారు. కర్మాగారం నిధులతో కొనుగోలు చేసిన 24.99 ఎకరాలను విక్రయించేందుకు ఇప్పటికే ప్రక్రియ ప్రారంభించామన్నారు. అందులో భాగంగా భూ కొనుగోలుదారులు రూ.45 కోట్లు జమచేశారన్నారు. ఇంకా రూ.243 కోట్లు రావాల్సి ఉందన్నారు. గతంలో హైకోర్టు ఇచ్చిన స్టేటస్ కో ఉత్తర్వులతో ఆ నిధులు నిలిచిపోయాయని.. వాటిని సవరించాలని కోరారు.
- కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ బి.నరసింహశర్మ వాదనలు వినిపిస్తూ.. పెట్టుబడులను ఉపసంహరిస్తున్నాం తప్ప, ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదన్నారు. ఉక్కు పరిశ్రమ నిధులతో కొనుగోలు చేసిన భూములను విక్రయించుకోవడంపై అభ్యంతరం లేదన్నారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం సొంత భూముల విక్రయానికి విశాఖ ఉక్కు యాజమాన్యానికి అనుమతిస్తామని మౌఖికంగా తెలిపింది. తగిన ఉత్తర్వులు జారీ చేసేందుకు విచారణను వాయిదా వేసింది.

EENADU Vol: 51, Iss: 47 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao


నమస్తే విజయవాడ!
హైదరాబాద్ ఫ్యాషన్ ప్రియులను ఉర్రూతలూగిస్తున్న
సరికొత్త ఫ్యాషన్ ప్రపంచం
ఇప్పుడు మన విజయవాడ లో
ప్రముఖ సినీతార కుమారి శ్రీలీల చేతులమీదుగా
సెప్టెంబర్ 28న
గొప్ప ప్రారంభం
కేవలం ₹99 నుండి ప్రారంభ ధరలు
సంప్రదాయ వస్త్రాలైనా
అత్యాధునిక ఫ్యాషన్లైనా, పిల్లలకైనా పెద్దలకైనా
అదరహో అనిపించే వస్త్రాలు
ది చెన్నయ్ షాపింగ్ మాల్
ఎం.జి. రోడ్, విజయవాడ


JAWA YEZDI
MOTORCYCLES
JAWA 42
THE ANSWER
42
42 BOBBER
బుక్ యువర్ రైడ్ టుడే
అండ్ ఎవైల్ ఎక్సైటింగ్ ఆఫర్స్!
వారంటీ పొడిగింపు 2+2 సంవత్సరాలు లేదా 50,000 కి.మీలు*
4 సంవత్సరాలు కూలి రహిత పీరియాడిక్ సర్వీస్*
అన్ని మోడల్స్ పైన్న ₹10,000/- వరకు ఎక్స్ఛేంజ్ బోనస్*
₹2999/- అతితక్కువ డౌన్ పేమెంట్*
నేషన్‌వైడ్ నెట్‌వర్క్ 500+ సేల్స్ అండ్ సర్వీస్ టచ్‌పాయింట్స్*
ప్రారంభధర ₹ 1 75 942/-*
(*ఎక్స్-షోరూమ్ ప్రైస్ ఆంధ్రప్రదేశ్)
SCAN TO BOOK
Vishakhapatnam: The Andhra Motors: 7625060606 | Vijayawada: Savyasachi Motors: 9143992222 | Anantapur: Sreenivasa Motors: 8309331506 | Bhimavaram: Sakshi Motors: 9640656406 | Guntur: Tejonidha Automotives: 7997997419 | Kadapa: MDH Power Gears: 9959681191 | Kakinada: Medapati Motors Pvt Ltd: 9000006001 | Nellore: Sanvi Industries: 8886780002 | Rajahmundry: Badri Motors: 7297944567 | Tirupati: Josh Moto: 8096696650 | Hyderabad: Attapur: Moto Cult: 9281042923 | Banjara Hills: Moto Cult: 9100741828 | Eragadda: Bright Automotive: 7337555739 | Gachibowli: Cult Classic: 9100751828 | Himayatnagar: Gautam Motorcycles India LLP: 9281029681 | Kukatpally: Bright Automotive: 7337555737 | Malakpet: Gautam Motorcycles: 7993799397 | Uppal: SV Autotech Private Limited: 9985705555 | Karimnagar: Elite Automobiles: 7331122434 | Khammam: GK Automotives: 8977903916 | Mahabubnagar: Classic Automotives: 8886957770 | Nalgonda: DMLR Engineers: 8121215192 | Nizamabad: Bairu Motorrad: 8977904245 | Warangal: Elite Motors: 7337555387
To become a Dealer, contact us at: dealer.enquiry@classiclegends.com or +91 8135846461 | Accessories shown in the image may not be a part of standard equipment | *T&C Apply

ఆసియా పవర్ ఇండెక్స్‌లో భారత్‌కు మూడో స్థానం

• జపాన్‌ను వెనక్కి నెట్టి ముందుకు

దిల్లీ: ఆస్ట్రేలియాకు చెందిన లోవీ సంస్థ విడుదల చేసిన ఆసియా పవర్ ఇండెక్స్ వార్షిక జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని దేశాలు ప్రభావిత చేసే సామర్థ్యమున్న 27 దేశాలు, ప్రాంతాలతో ఈ సూచీని రూపొందించింది. అమెరికా 81.7 స్కోరుతో తొలి స్థానంలో నిలవగా, చైనా(72.7), భారత్(39.1) తదుపరి స్థానాల్లో నిలిచాయి. జపాన్(38.9) నాలుగో స్థానం, ఆస్ట్రేలియా(31.9) ఐదో స్థానం, రష్యా(31.1) ఆరో స్థానం దక్కించుకున్నాయి. ఈ సారి జపాన్‌ను వెనక్కి నెట్టి భారత్ తన ర్యాంకును మెరుగుపర్చుకోవడం గమనార్హం. ఆర్థిక వృద్ధి, భవిష్యత్ సామర్థ్యం, దౌత్యపరమైన ప్రభావం భారత్ ఎదుగుదలకు కీలకమైన అంశాలుగా లోవీ సంస్థ పేర్కొంది. 'కొవిడ్ మహమ్మారి తర్వాత భారత్ అద్భుతంగా పుంజుకుంది. దేశ ఆర్థిక సామర్థ్యం 4.2 పాయింట్ల మేర పెరిగింది. బలమైన జీడీపీ వృద్ధి, అధిక జనాభా వంటి అంశాలు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ స్థానాన్ని బలపరుస్తాయి' అని లోవీ పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని, క్వాడ్‌లో భారత్ నాయకత్వం ప్రాంతీయ భద్రతపై కీలక పాత్రను పోషించేందుకు తోడ్పడిందని సంస్థ అభిప్రాయపడింది.

పుతిన్‌ది అంతర్జాతీయ నేరం

• రష్యాకు బుద్ధిచెప్పేలా ఒత్తిడి తీసుకురండి
• ఐరాస వేదికపై ప్రపంచానికి జెలెన్‌స్కీ పిలుపు



ఐరాస: రష్యాతో శాంతిచర్చలు ఒక భ్రమేనని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తోసిపుచ్చారు. దీనిబదులు రష్యా దిగివచ్చేలా ప్రపంచదేశాలు ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. తమ దేశం విషయంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేస్తున్నది అక్షరాలా అంతర్జాతీయ నేరమని, అనేక నిబంధనల్ని ఉల్లంఘించిన ఆయన తనంతట తానుగా వెనక్కి తగ్గబోరని చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఐరాస భద్రతామండలిలో జెలెన్‌స్కీ పెద్దఎత్తున విరుచుకుపడ్డారు. రెండున్నరేళ్లుగా కొనసాగుతున్న యుద్ధంపై చర్చించడానికి నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశానికి మండలిలోని 15 దేశాలకు గాను 14 దేశాల మంత్రులు హాజరయ్యారు. రష్యా తరఫున రాయబారిని పంపించి సరిపెట్టింది. 'పుతిన్ అనేక నేరాలకు పాల్పడుతున్నందువల్ల ఈ యుద్ధం అంత సులభంగా ముగిసిపోదు. చర్చల ద్వారా ఇది చల్లారేది కాదు. శాంతిదారికి దిగివచ్చేలా రష్యాపై పెద్దఎత్తున ఒత్తిడి తీసుకురావాలి. ఇప్పుడు కావాల్సింది అదే. దురాక్రమణదారులను నిలువరించాలి. ఐరాస నిబంధనలన్నింటినీ ఆ దేశం తుంగలో తొక్కింది' అని జెలెన్‌స్కీ మండిపడ్డారు. పుతిన్‌తో మాట్లాడేందుకు కొన్ని దేశాలు సిద్ధంగా ఉన్నా ఆయన తన తప్పేమీ లేదని చెప్పుకొనేందుకే ఎంతసేపూ ప్రయత్నిస్తారని తమకు తెలుసునని చెప్పారు.

రష్యా అభ్యంతరం

ఐరాసలో రష్యా శాశ్వత ప్రతినిధి వాసిలీ నెబెంజియా జోక్యం చేసుకుంటూ తీవ్ర నిరసన తెలిపారు. జెలెన్‌స్కీకి మరోసారి ఐరాస వేదిక కల్పించిన, భద్రతామండలి అధ్యక్ష బాధ్యతలు చూస్తున్న స్లోవేనియా కూడా ఆయనకు మాట్లాడే అవకాశమివ్వడం పాశ్చాత్యదేశాలతోడని మండిపడ్డారు. మండలిలో సభ్యత్వం లేకపోయినా రష్యాపై బురద జల్లుతుంటే ఐరోపా సమాఖ్యలోని 10 దేశాలు, నాటో సభ్యదేశాలు వేడుక చూస్తున్నాయని నిందించారు. అరువు తెచ్చుకున్న మాటల్ని పదేపదే వల్లిస్తుంటే సమయం వెచ్చించడానికి తాము సిద్ధంగా లేమన్నారు.

ఉక్రెయిన్ సార్వభౌమత్వానికి మా అండ: గుటెరస్



ఉక్రెయిన్ సార్వభౌమత్వానికి, ప్రాదేశిక సమగ్రతకు ఐరాస బలమైన అండగా నిలుస్తుందని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ చెప్పారు. క్రిమియాను, సెవస్టోపోల్‌ను దశాబ్దం క్రితం ఆక్రమించుకోవడంతో పాటు 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి దురాక్రమణకు రష్యా పాల్పడడం కచ్చితంగా ఐరాస నిబంధనల ఉల్లంఘనేనని స్పష్టంచేశారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య చర్చలు జరగాలని, విధ్వంసానికి అడ్డుకట్టవేయాలని చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ అభిప్రాయపడ్డారు. అన్ని దేశాల ప్రాదేశిక సమగ్రతను కాపాడాలనేదే తమ అధ్యక్షుడు జిన్‌పింగ్ విశ్వాసమని చెప్పారు. ఉక్రెయిన్ విషయంలో చైనాపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదన్నారు. రష్యాకు డ్రోన్లను, బాలిస్టిక్ క్షిపణుల్ని ఇరాన్ సరఫరా చేస్తోందని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఈ సమావేశంలో చేసిన ఆరోపణలను ఇరాన్ నూతనాధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఖండించారు. ఉత్తర కొరియాపైనా బ్లింకెన్ ఆరోపణలు చేశారు. రష్యాను చొరబాటుదారుగా, ఉక్రెయిన్‌ను బాధితురాలిగా అభివర్ణించారు.



ఝార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావుతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్. చిత్రంలో జేఎంఎం ఎంపీ మహువా మాఝీ

ఝార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు ప్రమాణం

రాంచీ: ఝార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాంచీలోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ఆయనతో ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, అసెంబ్లీ స్పీకర్ రబీంద్రనాథ్ మహతో, రాష్ట్ర మంత్రులు, పలువురు న్యాయమూర్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు ఇప్పటి వరకు హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధి భవన్స్ న్యూ సైన్స్ కళాశాల నుంచి గణితం ఆనర్స్‌లో పట్టభద్రుడైన ఎం.ఎస్.రామచంద్రరావు...ఆ తర్వాత న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. ఎల్ఎల్.బీలో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి సీవీఎస్ఎస్ ఆచార్యులు గోల్డ్ మెడల్‌ను పొందారు. బ్రిటన్‌లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అదనపు జడ్జీగా 2012 జూన్ 29న నియమితులయ్యారు. 2021లో జడ్జీగా పంజాబ్, హరియాణా హైకోర్టుకు బదిలీ అయ్యారు. అక్కడి నుంచి పదోన్నతిపై హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టుకు వెళ్లారు.

నలువైపుల నుంచి రక్షణకు తేలికపాటి బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు

దిల్లీ: నలువైపుల నుంచి రక్షణ కల్పించేలా తేలికపాటి తూటా రక్షక కవచాలను (బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను) ఐఐటీ-దిల్లీతో కలిసి 'రక్షణ పరిశోధన- అభివృద్ధి సంస్థ' (డీఆర్‌డీవో) తీర్చిదిద్దింది. 360 డిగ్రీల కోణంలో ఎటు నుంచి ముప్పు ఎదురైనా ఇది అడ్డుకుంటుందని రక్షణ మంత్రిత్వశాఖ బుధవారం వెల్లడించింది. ఈ సాంకేతికతను మన దేశంలోని కొన్ని పరిశ్రమలకు బదలాయిస్తారు. వీటికి 'అభేద్' (అడ్వాన్స్‌డ్ బాలిస్టిక్స్ ఫర్ హై ఎనర్జీ డిఫీట్) అని పేరు పెట్టారు. వివిధ బీఐఎస్ ప్రమాణాల మేరకు వీటిని 8.2 కేజీలు, 9.5 కేజీల కనీస బరువుతో రూపొందించారు. పాలిమర్లు, దేశీయ బోరాన్ కార్బైడ్ సిరామిక్ పదార్థాలు ఉపయోగించి ఈ జాకెట్లను తయారు చేశారు.

కారు, ట్రక్కు ఢీ.. గుజరాత్‌లో ఏడుగురి మృతి

సాబర్‌కంతా: గుజరాత్‌లోని సాబర్‌కాంతా జిల్లా హిమ్మత్‌నగర్ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ట్రక్కును కారు ఢీకొనడంతో ఏడుగురు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అతివేగంతో ప్రయాణిస్తున్న కారు ట్రక్కును వెనక నుంచి ఢీకొనడంతో ప్రమాదం సంభవించిందని పోలీసులు వెల్లడించారు. మృతులంతా కారులోని వారే.

ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర!

• మాజీ అధ్యక్షుడిని హెచ్చరించిన నిఘా వర్గాలు



వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర పన్నుతోందని ఆయన ప్రచార బృందం ప్రకటించింది. ఈ విషయమై జాతీయ నిఘా వర్గాలు ట్రంప్‌ను హెచ్చరించినట్లు పేర్కొంది. 'అమెరికాలో అస్థిరత, గందరగోళాన్ని సృష్టించాలని ఇరాన్ ప్రయత్నిస్తోంది. మాజీ అధ్యక్షుడు ట్రంప్‌నకు ముప్పు పొంచి ఉందని ఇంటెలిజెన్స్ కార్యాలయం హెచ్చరించింది' అని ట్రంప్ ప్రచార బృందం తెలిపింది. కొన్ని నెలలుగా ఇరాన్ బెదిరింపులు పెరిగిపోయాయని అధికారులు గుర్తించినట్లు తెలిపింది. ట్రంప్‌ను రక్షించడంతో పాటు ఎన్నికలపై ప్రభావం పడకుండా అధికారులు కృషి చేస్తున్నారని వెల్లడించింది. ఈ హెచ్చరికలపై ట్రంప్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'నా హత్యకు ఇరాన్ ఇప్పటికే చాలా ప్రయత్నాలు చేసింది. అవి ఫలించకపోవడంతో మళ్లీ ప్రయత్నాలు కొనసాగిస్తోంది. ఎటువంటి వ్యతిరేకత లేకుండా సీక్రెట్ సర్వీసెస్‌కు ఎక్కువ నిధులు కేటాయించినందుకు కాంగ్రెస్‌కు కృతజ్ఞతలు. రిపబ్లికన్లు, డెమోక్రాట్లు ఈ విషయంలో కలిసిరావడం ఆనందంగా ఉంది. ఓ మాజీ అధ్యక్షుడిపై హత్యాయత్నం అంటే నిందితుడికి మరణమే!' అని ట్రంప్ పేర్కొన్నారు.

కమలా హారిస్‌పై నోరు పారేసుకున్న ట్రంప్

విషయ గ్రహణలో, అవగాహనలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (81) కన్నా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ (59) కే ఎక్కువ లోపాలు, సమస్యలు ఉన్నాయని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (78) జార్జియా ఎన్నికల ప్రచార సభలో పేర్కొన్నారు. ట్రంప్‌తో టీవీ చర్చలో తడబడిన బైడెన్ ఆ తరవాత పోటీ నుంచి తప్పుకోవడంతో పాలక డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా కమల ముందుకొచ్చారు. నవంబరు 5న జరిగే అధ్యక్ష ఎన్నికలో కమలా హ్యారిస్ తనపై గెలుస్తుందని ఎవరూ అనుకోవడం లేదనీ, అందుకే ఆమెను చూసి ప్రపంచమంతా నవ్వుతోందని ట్రంప్ చెప్పుకొచ్చారు. ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిలో లేకపోవడం వల్లనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం జరుగుతున్నాయని హంగరీ అధ్యక్షుడు విక్టోర్ ఓర్బన్ చెప్పారని ఆయన తెలిపారు.

కొత్త హెచ్ఐవీ కేసుల్లో 44 శాతం తగ్గుదల

• కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్

దిల్లీ: దేశంలో 2010 నుంచి కొత్త హెచ్ఐవీ కేసులు 44శాతం తగ్గాయని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ బుధవారం ప్రకటించారు. ఇది ప్రపంచ తగ్గింపు రేటు 39శాతం కంటే అధికమని తెలిపారు. ఎయిడ్స్ నివారణకు ఐరాసలో ఏర్పాటు చేసిన ఓ ఉన్నత స్థాయి కార్యక్రమంలో పాల్గొన్న ఆమె అందుకు సంబంధించిన వివరాలను ఓ ప్రకటనలో తెలియజేశారు. 2030 నాటికి హెచ్ఐవీని అంతం చేయాలన్న ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యానికి భారత్ కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఇందుకోసం చేపట్టిన జాతీయ ఎయిడ్స్, ఎస్టీడీ నియంత్రణ కార్యక్రమం 5వ దశ (2021-2026)కు భారత ప్రభుత్వం పూర్తిగా నిధులు కేటాయించినటు చెప్పారు. ఎయిడ్స్ నివారణలో భారత పురోగతిని, వ్యూహాలను ఐరాసకు వివరించారు. '2023 హెచ్ఐవీ అంచనా నివేదిక ప్రకారం దేశంలో 25లక్షల మందికి పైగా ప్రజలు ఎయిడ్స్‌తో బాధపడుతున్నారు. హెచ్ఐవీ ప్రాబల్యం 0.2 శాతం ఉండగా వార్షికంగా 66,400 కేసులు నమోదవుతున్నట్లు అంచనా' అని ఆమె చెప్పారు. ఏటా 3కోట్ల మంది గర్భిణులకు ఉచితంగా ఎయిడ్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫీజు కట్టలేక ఐఐటీ సీటు కోల్పోయిన దళిత విద్యార్థి..

సాయానికి సుప్రీంకోర్టు హామీ

దిల్లీ: ఐఐటీ ధన్‌బాద్‌లో సీటు సాధించినా గడువులోపు రూ.17,500 ఫీజు కట్టలేక దాన్ని కోల్పోయిన పేద దళిత విద్యార్థికి సాయం అందేలా చూస్తామని సుప్రీంకోర్టు హామీ ఇచ్చింది. 'మేము చేయగలిగినంత సాయం చేస్తాం.. కానీ జూన్ 24న ఫీజు కట్టేందుకు గడువు ముగియగా మూడు నెలల నుంచి ఏం చేస్తున్నారు' అంటూ విద్యార్థి తరఫు న్యాయవాదిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా టిటోరా గ్రామానికి చెందిన అతుల్‌కుమార్ రెండో, చివరి అవకాశంలో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ చాటి ఐఐటీ ధన్‌బాద్‌లో సీటు సాధించాడు. సీటు ఖరారు చేసేందుకు జూన్ 24 లోపు రూ.17,500 ఫీజు కట్టాల్సి ఉండగా, దినసరి కూలీలైన అతడి తల్లిదండ్రులు గడువులోగా ఫీజు కట్టలేకపోయారు. సాయం కోసం విద్యార్థి జాతీయ ఎస్సీ కమిషన్‌ను, జేఈఈ పరీక్ష ఝార్ఖండ్‌లో రాసినందున అక్కడి లీగల్ సర్వీసెస్ అథారిటీని ఆశ్రయించాడు. జాతీయ ఎస్సీ కమిషన్ చేతులెత్తేయగా ఝార్ఖండ్ లీగల్ సర్వీస్ అథారిటీ ఈ ఏడాది ఐఐటీ మద్రాస్ ఈ పరీక్ష నిర్వహించినందువల్ల మద్రాస్ హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. మద్రాస్ హైకోర్టుకు వెళ్లగా సుప్రీంకోర్టుకు వెళ్లమని చెప్పింది. ఈ కేసు మంగళవారం సుప్రీంకోర్టు ముందుకు రాగా విద్యార్థి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ సీటు కేటాయించిన తర్వాత ఫీజు చెల్లించేందుకు కేవలం నాలుగు రోజులే గడువు ఇవ్వడంతో అతడి తల్లిదండ్రులు చెల్లించలేకపోయారన్నారు. సర్వోన్నత న్యాయస్థానం విద్యార్థికి సాయం చేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం ఐఐటీ మద్రాస్‌కు నోటీసులు జారీ చేసింది.

ఛార్జిషీట్ వేయకుండా నిందితులను ఎన్ని రోజులు కస్టడీలో ఉంచుకుంటారు?

• ఈడీని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

దిల్లీ: ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై ఛార్జిషీట్ నమోదు చేయకుండా, ఎన్ని రోజులు కస్టడీలో ఉంచుతారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. బొగ్గు పన్ను కుంభకోణంలో నిందితురాలిగా ఉన్న ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ సహాయ కార్యదర్శి సౌమ్యా చౌరాసియా బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరుపుతూ.. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి 21 నెలలుగా కస్టడీలోనే ఉన్నారని.. అయినా ఆమెపై ఇంకా విచారణ ప్రక్రియ మొదలు కాలేదని వ్యాఖ్యానించింది. ఈడీ తరఫున ఏఎస్‌జీ ఎస్.వి.రాజు వాదనలు వినిపిస్తూ చౌరాసియా చాలా శక్తిమంతమైన సివిల్ అధికారి అని, ఆమెను విడుదల చేస్తే దర్యాప్తు నీరుగారే ప్రమాదముందని కోర్టుకు నివేదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. నేరారోపణ రుజువైతే ఏడేళ్ల కంటే తక్కువ శిక్ష అనుభవించాల్సిన వ్యక్తిని ఈడీ ఎన్ని రోజులని కస్టడీలో ఉంచుకోగలదని ప్రశ్నించింది. అంతే కాకుండా పిటిషన్‌దారుపై ఇప్పటి వరకు అభియోగపత్రం నమోదు కాలేదని గుర్తుచేస్తూ మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే చౌరాసియాను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సర్వీసులో చేర్చుకోవద్దని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది.

బాబ్బాబూ!.. మీ పాండాలు

మాకొద్దు అంటున్న ఫిన్లాండ్



ఇంటర్నెట్ డెస్క్: చైనా నుంచి తీసుకొచ్చిన రెండు పాండాల నిర్వహణకు అవుతున్న రూ.కోట్ల ఖర్చు భరించలేకపోతున్న ఫిన్లాండ్ వాటిని వెనక్కు ఇచ్చేయాలని నిర్ణయించుకొంది. అరుదైన ఈ జీవజాతిని తమ జాతీయ సంపదగా భావించే చైనా ఇతర దేశాలకు వాటిని బహూకరిస్తూ ఉంటుంది. 2018లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఫిన్లాండ్‌లో పర్యటించిన సందర్భంగా లూమీ, పిరీ అనే రెండు పాండాలను ఫిన్లాండ్‌లోని ఓ ప్రైవేటు కంపెనీ 'జూ'కు అప్పగించారు. 15 ఏళ్లపాటు పాండాలను ఆ జూలో ఉంచేందుకు ఒప్పందం కుదిరింది. జూలో పాండాల నివాసానికి అనుకూలమైన వాతావరణం, ఇతరత్రా సౌకర్యాలు కల్పించేందుకు ఆ కంపెనీ ఏకంగా 8 మిలియన్ యూరోలను (దాదాపు రూ.75 కోట్లు) వెచ్చించింది. దీంతోపాటు ఏటా వాటి సంరక్షణ కోసం మరో 1.5 మిలియన్ యూరోలను (రూ.14 కోట్లు) ఖర్చుచేయాల్సి వస్తోంది. పర్యాటకులను ఆకట్టుకునేందుకు వీటిని తీసుకురాగా, కొవిడ్‌తో జూకు కోలుకోలేని దెబ్బ తగిలింది. అప్పులు పెరిగి, పాండాల నిర్వహణ భారంగా మారింది. ఫిన్లాండ్ ప్రభుత్వం నుంచి కూడా ఆర్థికంగా ఎలాంటి సహకారం అందకపోవడంతో పాండాలను తిరిగి ఇచ్చేయాలని జూ కంపెనీ నిర్ణయించుకొంది. గత మూడేళ్లుగా దీనిపై చైనాతో చర్చలు జరపగా.. చివరకు ఇరుపక్షాల మధ్య అంగీకారం కుదిరింది. మరికొద్ది రోజుల్లో పాండాలను చైనాకు తిరిగి అప్పగించనున్నారు.

అమెరికా విద్యార్థులతో

చైనా అధ్యక్షుడి సతీమణి కరచాలనం



బీజింగ్: అగ్రదేశాలు అమెరికా, చైనా తమ మధ్య ఉన్న విభేదాల పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నాయా?.. ఇటీవలి పరిణామాలు కొన్ని నిజమే అంటున్నాయి. అమెరికా నుంచి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందాన్ని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సతీమణి పెంగ్‌లియువాన్ కలిసి ముచ్చటించారు. వారితో చేయి కలిపి సరదాగా మాట్లాడారు. ఈ చిత్రాలను స్థానిక మీడియా ప్రచురించింది. రెండు దేశాలకు చెందిన ద్వైపాక్షిక సంబంధాలకు వీరు సానుకూల శక్తిని జత చేస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారని పేర్కొంది. గతేడాది జిన్‌పింగ్, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భేటీ ఉద్దేశమే తాజా సమావేశంలోనూ ప్రతిబింబించింది. రెండు దేశాల మధ్య సంబంధాలను సుస్థిరం చేయడంలో సహాయపడేందుకు రానున్న అయిదేళ్లలో 50 వేల మంది అమెరికన్ విద్యార్థులను చైనాకు ఆహ్వానిస్తామని ఆ సందర్భంగా జిన్‌పింగ్ హామీ ఇచ్చారు. గతేడాది ప్రారంభంలో తమ గగనతలంలోకి వచ్చిన చైనా బెలూన్‌ను గూఢచార చర్యగా భావించి అమెరికా కూల్చివేశాక ఇరు దేశాల సంబంధాలు మరింత దిగజారిన విషయం తెలిసిందే. వాతావరణ పరిశోధనకు ఉద్దేశించిన బెలూన్‌ను ధ్వంసం చేసి అమెరికా అతి చేసిందని అప్పట్లో చైనా విమర్శించింది.

కిమ్ 'చెత్త' చెలగాటం..

విమానాలకు సంకటం!



ఇంటర్నెట్ డెస్క్: ఉత్తర కొరియాలోని కిమ్ జోంగ్ ఉన్ సర్కారు గగనతలంలోకి తరచూ చెత్త బెలూన్లు పంపి, దక్షిణ కొరియా విమానాలతో చెలగాటం ఆడుతోంది. మొదట్లో దీన్ని చిన్నసమస్యే అనుకొన్నా, రానురాను దక్షిణ కొరియా వైమానికరంగానికి ఇది సంకటంగా మారింది. జూన్ 1 నుంచి ఇచియాన్, గింపో విమానాశ్రయాల్లో పలు రన్‌వేలను దాదాపు 20 రోజులు మూసివేయాల్సి వచ్చిందని దక్షిణ కొరియా డెమోక్రటిక్ పార్టీ సభ్యుడు యంగ్ బూ నామ్ తెలిపారు. ఆ సమయంలో టేకాఫ్‌లు, ల్యాండింగులు సమస్యాత్మకంగా మారి.. విమానాలు అత్యధిక ఇంధనాన్ని వెంట తీసుకువెళ్లాల్సి వస్తోంది. మే చివరివారం నుంచి ఉత్తర కొరియా వేలసంఖ్యలో బెలూన్లను దక్షిణ కొరియా గగనతలంలోకి వదులుతోంది. వీటి సంఖ్య ఇప్పటికే 5,500 దాటినట్లు అంచనా. ఈ బెలూన్లలో ప్రచార కరపత్రాలు, వాడిన ప్లాస్టిక్ బాటిళ్లు, పాడైన బ్యాటరీలు, షూలు, కాగితాలతో కూడిన చెత్త ఉంటున్నాయి. కొన్ని బెలూన్లలో మురుగుమట్టి, జంతు విసర్జితాలు కూడా ఉండటం గమనార్హం. 2016లోనూ కిమ్ సర్కారు ఇలాగే బెలూన్లను పంపింది.

వితంతువు మేకప్ సామాన్లపై వ్యాఖ్యలు.. పట్నా హైకోర్టును తప్పుబట్టిన సుప్రీంకోర్టు

• సున్నితంగా, తటస్థంగా ఉండాలని హితవు

దిల్లీ: ఒక వితంతువుకు, ఆమె అలంకరణ సామగ్రికి సంబంధించి పట్నా హైకోర్టు చేసిన వ్యాఖ్యల్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఉన్నత న్యాయస్థానాలు తటస్థంగా, సున్నితంగా వ్యవహరించాలని ఆశిస్తామని.. ఆ వ్యాఖ్యలు మాత్రం దానికి అనుగుణంగా లేవని ఆక్షేపించింది. 1985లో ఒక మహిళను అపహరించి హత్య చేసిన కేసులో జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మల ధర్మాసనం బుధవారం ఈ వ్యాఖ్య చేసింది. మృతురాలి తండ్రికి చెందిన ఆస్తిని స్వాధీనం చేసుకునేందుకే ఈ హత్య చేశారనే ఆరోపణ వచ్చింది. కేసులో ఐదుగురు దోషులకు శిక్షను హైకోర్టు సమర్థించింది. మరో ఇద్దరు నిందితుల్ని నిర్దోషులుగా విడిచిపెట్టడాన్ని రద్దుచేసి, యావజ్జీవ శిక్షలు విధించింది. అపహరణకు గురైనట్లు చెబుతున్న నివాసంలో హతురాలు నివాసం ఉంటున్నారా లేదా అనేది హైకోర్టు పరిశీలించింది. ఆ ఇంట్లో ప్రత్యక్షంగా ఆమె వస్తువులేవీ దొరక్కపోయినా, కొన్ని మేకప్ వస్తువులు మాత్రం ఉన్నాయని, అక్కడ ఆమె నివాసం ఉండేదని చెప్పడానికిది నిదర్శనమని దర్యాప్తు అధికారి తేల్చారు. అదే ఇంట్లో మరో మహిళ కూడా ఉంటున్నట్లు గుర్తించారు. అయితే ఆమె వితంతువు అయినందున అలంకరణ సామగ్రి ఆమెది కాకపోవచ్చని, మేకప్ అవసరం ఆమెకు లేదని హైకోర్టు పేర్కొంది. ఈ వ్యాఖ్య తీవ్ర అభ్యంతరకరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇది సాక్ష్యాధారాలపై చేసిన వ్యాఖ్య కూడా కాదంది. కేవలం మేకప్ సామాన్ల ఆధారంగా ఆ ఇంట్లో మహిళ నివాసం ఉండేదని తేల్చలేమని స్పష్టంచేసింది. హతురాలి వస్త్రాలు, జోళ్లు వంటివేవీ ఆ ఇంట్లో ఎక్కడా లేవని ప్రస్తావించింది. ఏడుగురు నిందితుల్ని నిర్దోషులుగా ప్రకటిస్తూ, వారు కస్టడీలో ఉంటే విడిచిపెట్టాలని ఆదేశించింది.

గాంధీ, మోదీ నృత్యం చేస్తున్నట్లు వీడియోలు

• గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు

బలియా: మహాత్మాగాంధీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లకు సంబంధించిన అభ్యంతరకరమైన వీడియోలను సామాజిక మాధ్యమంలో పోస్టు చేసిన గుర్తుతెలియని వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. గాంధీ, ప్రధాని మోదీ, యోగి ఆదిత్యనాథ్‌లు నృత్యం చేస్తున్నట్లుగా రూపొందించిన వీడియోలను మంగళవారం అధికారుల దృష్టికి ఓ మహిళ తీసుకువెళ్లారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఐటీ చట్టం కింద గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

ఆటలకు దూరం... తెరకు దగ్గర

• మధ్య, తక్కువ ఆదాయ దేశాల్లో చిన్నారుల పరిస్థితి ఇదీ
• ఫలితంగా ప్రతి ముగ్గురు పిల్లలు, టీనేజర్లలో ఒకరికి దృష్టిలోపం

దిల్లీ: ఆసియా, ఆఫ్రికా ఖండాలు సహా ప్రపంచవ్యాప్తంగా పలు మధ్య, తక్కువ ఆదాయ దేశాల్లో పిల్లలు శారీరక శ్రమను కలిగించే క్రీడలకు దూరంగా జరుగుతున్నారని, అదే సమయంలో ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతున్నారని ఓ సర్వేలో తేలింది. ఫలితంగా ప్రతి ముగ్గురు పిల్లలు, టీనేజర్లలో ఒకరు దృష్టిలోపంతో బాధపడుతున్నారని, వీరి సంఖ్య 2050కల్లా 74 కోట్లకు చేరుతుందని వెల్లడించింది. దూరపు వస్తువులను స్పష్టంగా చూడలేకపోవడమనే సమస్యను హ్రస్వదృష్టి/మయోపియాగా పిలుస్తారు. ఈ సమస్యపై 50 దేశాల్లో 5-19 ఏళ్ల వయసున్న 54 లక్షల మంది పిల్లలు, 19 లక్షల దృష్టిలోప బాధితులను సర్వే చేశారు. దీనికి సంబంధించిన మొత్తం 276 అధ్యయనాలను చైనాకు చెందిన సన్‌యట్ సేన్ యూనివర్సిటీ పరిశోధించింది. హ్రస్వదృష్టి కేసులు 1990-2000 మధ్య 24% ఉండగా, 2001-10 వరకు 25 శాతానికి పెరిగాయి. ఇవి 2011-19 మధ్య 30%, 2020-23 మధ్య ఏకంగా 36 శాతంగా నమోదయ్యాయి.

నేరుగా తలపై ఎందుకు కాల్చారు?

• ముందుగా నిందితుడిని నిరాయుధుడిని చేయాలి కదా!
• పిస్తోలుతో కాల్చడం అంత సులభం కాదు • బద్లాపుర్ కాల్పులపై బాంబే హైకోర్టు వ్యాఖ్యలు

ముంబయి: మహారాష్ట్రలోని బద్లాపుర్ పాఠశాలలో చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందితుడు అక్షయ్ శిందే పోలీసు ఎన్‌కౌంటర్లో ప్రాణాలు కోల్పోయిన తీరుపై బాంబే హైకోర్టు అనేక సందేహాలు లేవనెత్తింది. శిందే తమ నుంచి పిస్తోలును లాక్కొని కాల్పులు జరపడానికి ప్రయత్నించగా తాము స్పందించాల్సి వచ్చిందని పోలీసులు చేసిన వాదనపై గుచ్చిగుచ్చి ప్రశ్నించింది. జరిగిన ఘటన నకిలీ ఎన్‌కౌంటర్ అంటూ నిందితుడి తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ రేవతీ మొహితె డెరె, జస్టిస్ పృథ్వీరాజ్ చవాన్‌ల ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. నిష్పాక్షికంగా, నిజాయతీగా దర్యాప్తు చేపట్టాలని ఆదేశించి, తదుపరి విచారణను అక్టోబరు మూడోతేదీకి వాయిదా వేసింది. పోలీసుల నిజాయితీని తాము శంకించట్లేదని, దర్యాప్తుపై స్పష్టత తమకు ముఖ్యమని తెలిపింది. దర్యాప్తు సరిగా జరగట్లేదని గుర్తించినట్లయితే దానికి తగ్గ ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. కాల్పుల ఘటనకు సంబంధించిన దస్త్రాలన్నీ మహారాష్ట్ర సీఐడీ విభాగానికి తక్షణమే బదలాయించాలని ఆదేశించింది. ఏమాత్రం ఆలస్యం జరిగినా అనుమానాలు తలెత్తుతాయంది. కాల్పులు జరిపేముందు నిందితుడిని బంధించే ప్రయత్నం జరిగిఉంటే అతడు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చి ఉండేది కాదంది.

..నమ్మశక్యంగా లేదు

"..ఇది నమ్మశక్యంగా లేదు. తగిన శిక్షణ లేకుండా, తుపాకీని అన్‌లాక్ చేసి, కాల్పులు జరపడం సాధ్యం కాదు. అతడు కాల్చిన మూడు బుల్లెట్లలో ఒకటి పోలీసు అధికారిని తాకింది. మిగతా రెండింటి సంగతేంటి..? అయినా ముందుగా నిందితుడి మోకాలి కింద భాగాన, లేదా చేతులపై పోలీసులు కాల్చి ఉండాల్సింది కదా..?" అంటూ కోర్టు పలు ప్రశ్నలు వేసింది. ఆలోచించే సమయం పోలీసులకు లేకపోయిందని ప్రభుత్వ న్యాయవాది ఇచ్చిన సమాధానంపై కోర్టు ఘాటుగా స్పందించింది. తాను కూడా పలుమార్లు పిస్తోలు వాడానని, అది చాలా కష్టమైన పని అని జస్టిస్ చవాన్ గుర్తుచేసుకున్నారు. రివాల్వర్‌నైతే ఎవరైనా వాడగలరని, పిస్తోలు అంత సులభం కాదని చెప్పారు. 'నలుగురు పోలీసు అధికారులు కలిసి ఒక్కడిని అదుపు చేయలేకపోయారా? ఎలా నమ్మమంటారు? నిందితుడేమీ బలాఢ్యుడు కాడు' అని ధర్మాసనం పేర్కొంది. నిందితుడిని తరలించిన మార్గంలో సీసీటీవీ కెమెరాల దృశ్యాలను, పోలీసుల కాల్‌డేటాను భద్రపరచాలని ఆదేశించింది.

అత్యాచార కేసులో మలయాళ నటుడు ఇడవేల బాబు అరెస్ట్

• అనంతరం బెయిల్‌పై విడుదల

కొచ్చిన్: మలయాళ నటుడు, 'అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ)' మాజీ ప్రధాన కార్యదర్శి ఇడవేల బాబును అత్యాచారం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) బుధవారం అరెస్టు చేసింది. అయితే న్యాయస్థానం ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంతో వైద్య పరీక్షల అనంతరం విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆగస్టు 28న ఎర్నాకుళం టౌన్ నార్త్ పోలీసు స్టేషన్‌లో ఇడవేల బాబుపై ఓ నటి అత్యాచారం కేసు పెట్టారు. బాబు 'అమ్మ' ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో తాను సభ్యత్వం కోసం సంప్రదించగా, తన నివాసానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మలయాళ చిత్ర పరిశ్రమలో వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ నివేదిక బయటకు వచ్చిన తర్వాత సిట్ చేసిన రెండో అరెస్టు ఇది.

విధుల్లో కుప్పకూలి..

బ్యాంకు ఉద్యోగిని మృతి



ఇంటర్నెట్ డెస్క్: ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని నగరం లఖ్‌నవూలో ఓ బ్యాంకు ఉద్యోగిని విధుల్లోనే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. గోమతినగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో అదనపు డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహిస్తున్న **సదాఫ్ ఫాతిమా** (45) ఎప్పటిలా మంగళవారం విధులకు హాజరయ్యారు. ఉన్నట్టుండి కుర్చీలోనే కుప్పకూలిన ఆమెను తోటి ఉద్యోగులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఫాతిమా మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పని ఒత్తిడి కారణంగానే ఇలా జరిగిందని సహోద్యోగులు చెబుతున్నారు. ఫాతిమా మరణంపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ 'ఎక్స్' వేదికగా విచారం వ్యక్తం చేశారు. "దేశంలో ప్రస్తుత కార్పొరేట్ విధానాలు, ఒత్తిళ్లు ఎలా ఉన్నాయో చెప్పేందుకు ఈ ఘటనే నిదర్శనం. దీని గురించి ప్రభుత్వాలు, కంపెనీలు తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది" అన్నారు. 'యర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్‌లో పనిచేస్తున్న కేరళ యువతి అన్నా సెబాస్టియన్ (26) సైతం ఇటీవల పుణెలోని సంస్థ కార్యాలయంలో ఇలాగే మృతిచెందిన విషయం తెలిసిందే. తీవ్ర చర్చనీయాంశమైన సెబాస్టియన్ మృతిపై విచారణ జరుపుతామని కేంద్రం హామీ ఇచ్చింది.

భారత్ - అమెరికా బంధం మరింత బలపడుతోంది: శ్వేతసౌధం

న్యూయార్క్: భారత్‌తో తమ బంధం బలంగా ఉందని, అది నానాటికి మరింత బలపడుతోందని అమెరికా పేర్కొంది. ఆ విషయంలో అధ్యక్షుడు బైడెన్ గర్వపడతారని వ్యాఖ్యానించింది. శ్వేతసౌధం జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారు జాన్ కిర్బీ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.



జర్మనీలోని కొలోజెన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్‌యూఎన్ఏ కేంద్రంలో శిక్షణ పొందుతున్న అంతరిక్ష యాత్రికులు థామస్ పెస్క్వెట్ (ఫ్రాన్స్), మథియాస్ మౌరెర్ (జర్మనీ)

అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ అమ్మకాలు షురూ

హైదరాబాద్: అమెజాన్ ఇండియా గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్ అమ్మకాలు తన ప్రైమ్ సభ్యులకు బుధవారం అర్ధరాత్రి ప్రారంభమయ్యాయి. గురువారం అర్ధరాత్రి నుంచి అందరికీ ఈ సేల్ అందుబాటులో ఉంటుంది. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లతో పాటు ఎలక్ట్రానిక్ గృహోపకరణాలతో పాటు దాదాపు అన్ని రకాల ఉత్పత్తులపై ఆఫర్లు లభిస్తాయని సంస్థ ప్రకటించింది. ఐఫోన్ 13, వన్‌ప్లస్ నార్డ్ సీఈ4, శామ్‌సంగ్ గెలాక్సీ ఎస్ 24తో పాటు వివో, ఒపో, రియల్‌మి వంటి స్మార్ట్‌ఫోన్లపై, మ్యాక్‌బుక్ ఎయిర్ ఎం1, ఎం2 ల్యాప్‌టాప్‌లపై భారీ ఆఫర్లున్నట్లు తెలిపింది. ఎస్‌బీఐ కార్డులతో కొనుగోలు చేసేవారికి 10% అదనపు రాయితీ ఇస్తామంది.

యూలర్ రవాణా ట్రక్కులు

ధరల శ్రేణి రూ.8.99-12.99 లక్షలు



దిల్లీ: విద్యుత్ త్రిచక్ర వాహనాలను విక్రయిస్తున్న యూలర్ మోటార్స్, బహుళ అవసరాలకు ఉపయోగపడే రెండు విద్యుత్ రవాణా వాహనాలను బుధవారం పరిచయం చేసింది. వీటిని హైదరాబాద్, దిల్లీ, చెన్నై, ముంబై వంటి 7 ప్రధాన నగరాల్లో మొదట ప్రవేశపెట్టి, తర్వాత ఇతర నగరాలకు పరిచయం చేస్తామని కంపెనీ సీఈఓ సౌరవ్ కుమార్ తెలిపారు. స్టామ్ ఈవీ టి1250 ఎక్స్-షోరూమ్ ధర రూ. 8.99 లక్షలు. ఒక్కసారి ఛార్జింగ్‌తో దాదాపు 140 కిలోమీటర్లు ప్రయాణించొచ్చు. స్టామ్ ఈవీ లాంగ్ రేంజ్ 200 ధర రూ.12.99 లక్షలు. పేలోడ్ కెపాసిటీ 1,250 కిలోలుగా ఉన్నప్పటికీ, ఒకసారి ఛార్జింగ్‌తో ఇది 200 కి.మీ. ప్రయాణిస్తుందని సంస్థ వివరించింది.


రూ.35,000 కోట్ల ఐపీఓలు వస్తున్నాయ్

- హ్యుందాయ్ మోటార్ ఇండియా రూ.25,000 కోట్లు
- స్విగ్గీ రూ.10,000 కోట్లు



దిల్లీ: దేశీయంగా రెండు భారీ పబ్లిక్ ఇష్యూలకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతులు ఇచ్చింది. దక్షిణ కొరియాకు చెందిన వాహన దిగ్గజ సంస్థ హ్యుందాయ్ మోటార్ అనుబంధ హ్యుందాయ్ మోటార్ ఇండియా దాదాపు రూ. 25,000 కోట్లు సమీకరించేందుకు, ఆహార-నిత్యావసరాల డెలివరీ దిగ్గజ సంస్థ స్విగ్గీ రూ. 10,000 కోట్లకు పైగా సమీకరణ కోసం తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వచ్చేందుకు చేసుకున్న దరఖాస్తులను సెబీ ఆమోదించింది. 2022 మేలో రూ. 21,008 కోట్లు సమీకరించిన ఎల్ఐసీ ఐపీఓ ఇప్పటివరకు అతిపెద్దదిగా ఉండగా, అనుకున్నట్లు జరిగితే హ్యుందాయ్ ఇష్యూ దానిని అధిగమించనుంది.

హ్యుందాయ్




2003లో జపాన్‌కు చెందిన మారుతీ సుజుకీ దేశీయ స్టాక్‌మార్కెట్లలో నమోదయ్యాక, కార్ల విక్రయాల్లో దేశంలో రెండో స్థానంలో ఉన్న హ్యుందాయ్ ఐపీఓకు రానుంది. గత జూన్‌లో సెబీకి అందించిన దరఖాస్తులోని వివరాల ప్రకారం. . హ్యుందాయ్ మోటార్ ఇండియా ప్రమోటరైన హ్యుందాయ్ మోటార్, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద 14,21,94,700 షేర్లను విక్రయించనుంది. ఇందుకోసం సంస్థ విలువను 18-20 బిలియన్ డాలర్లుగా పరిగణిస్తున్నట్లు సమాచారం. 1996లో మనదేశంలో కార్యకలాపాలు ప్రారంభించిన హ్యుందాయ్, వివిధ విభాగాల్లో 13 మోడళ్లను విక్రయిస్తోంది.

✦ హ్యుందాయ్ చెన్నై ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 8.24 లక్షల వాహనాలు కాగా, సంస్థ స్వాధీనం చేసుకున్న తెలిగావ్ ప్లాంటు వార్షిక సామర్థ్యం 1.70 లక్షలు.

✦ గత నెలలోనే విద్యుత్తు ద్విచక్ర వాహన సంస్థ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఐపీఓ ద్వారా రూ. 6,145 కోట్లు సమీకరించిన సంగతి విదితమే.

స్విగ్గీ



ఐపీఓ కోసం గత ఏప్రిల్‌లో సెబీ అనుమతి కోరిన స్విగ్గీ, తన దరఖాస్తులో వివరాలు బయటకు రాకుండా గోప్యంగా ఉంచే పద్ధతిని అనుసరించింది. తాజా షేర్ల జారీ, ఓఎఫ్ఎస్ పద్ధతిలో రూ. 10,414 కోట్ల విలువైన షేర్లు విక్రయించేందుకు సంస్థ వాటాదార్లు అనుమతించినట్లు సమాచారం. తాజా షేర్ల జారీ ద్వారా రూ. 3,750 కోట్లు, ఓఎఫ్ఎస్ రూపంలో రూ. 6,664 కోట్ల విలువైన షేర్ల విక్రయంతో పాటు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి మరికొంత సమీకరించే ఆలోచనలో సంస్థ ఉంది.

✦ 2014లో కార్యకలాపాలు ప్రారంభించిన స్విగ్గీ విలువ గత ఏప్రిల్‌లో 13 బిలియన్ డాలర్లుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 9000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. మొత్తం 4,700 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.



ఎయిర్‌టెల్‌లో స్పామ్ కాల్స్ హెచ్చరికలు

దిల్లీ: భారతీ ఎయిర్‌టెల్ తన నెట్‌వర్క్‌లో స్పామ్ కాల్స్, మెసేజీలపై వినియోగదారులను అప్రమత్తం చేసే కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత సాంకేతికతను ప్రవేశ పెడుతున్నట్లు కంపెనీ ఎండీ, సీఈఓ గోపాల్ విత్తల్ వెల్లడించారు. సెప్టెంబరు 26 అర్ధరాత్రి నుంచి ఈ సాంకేతికత తమ నెట్‌వర్క్‌లో అందుబాటులోకి వస్తున్నట్లు తెలిపారు. 'గుర్తు తెలియని నంబరు నుంచి వచ్చే కాల్‌ను 2 మిల్లీ సెకన్లలోనే విశ్లేషించే ఏఐ ఆధారిత స్పామ్ డిటెక్షన్‌ను మేం అభివృద్ధి చేశాం. ఇది డయలర్‌లో వినియోగదార్లను హెచ్చరిస్తుంది. ఎయిర్‌టెల్ స్మార్ట్‌ఫోన్ వినియోగదార్లందరికీ దీనిని ఉచితంగానే అందిస్తున్నామ'ని ఆయన తెలిపారు. 'రోజూ 150 కోట్ల మెసేజ్‌లు, 250 కోట్ల కాల్స్‌ను ఇది ప్రాసెస్ చేస్తుంది. తద్వారా రోజుకు 10 కోట్ల స్పామ్ కాల్స్, 30 లక్షల స్పామ్‌లను గుర్తించగలద'ని వివరించారు. ఈ సాంకేతికత ఆ కాల్స్‌ను బ్లాక్ చేయదని, వినియోగదార్లే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఒక్కో సారి 'ఫాల్స్ పాజిటివ్స్'.. అంటే సరైన కాల్ కూడా స్పామ్ కాల్‌గా కనిపించే అవకాశం ఉందని అన్నారు. వాట్సప్ వంటి ఓటీటీ యాప్‌లపై వచ్చే కాల్స్‌పై ఇది పనిచేయదన్నారు.

ఏడాదికి 100 బి.డాలర్ల ఎఫ్‌డీఐ!

డీపీఐఐటీ కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా



దిల్లీ: ప్రస్తుతం మనదేశంలోకి ఏటా 70-80 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వస్తుండగా, వచ్చే కొన్నేళ్లలో దీన్ని 100 బి.డాలర్లకు చేర్చాలనుకుంటున్నట్లు పరిశ్రమ ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా బుధవారం వెల్లడించారు. ఎఫ్‌డీఐ దరఖాస్తుల ఆమోద ప్రక్రియను డీపీఐఐటీ క్రమబద్ధీకరిస్తోందని తెలిపారు. దేశంలోకి పెట్టుబడులను మరింతగా ఆహ్వానించేందుకు రక్షణ, రైల్వేలు, బీమా, టెలికాం వంటి రంగాల్లో నిబంధనలను సడలించినట్లు గుర్తు చేశారు. చాలా రంగాల్లో ఎఫ్‌డీఐలు ఆటోమేటిక్ మార్గంలో అనుమతిస్తున్నామని తెలిపారు.

✦ 2014-24 మధ్య విదేశీ పెట్టుబడులు 667.4 బి.డాలర్లుగా నమోదయ్యాయని, 2004-14లో ఇవి 304.1 బి.డాలర్లుగా ఉన్నాయని వివరించారు. గత పదేళ్లలో (2014-24) తయారీ రంగాల్లోకి 165.1 బి.డాలర్ల ఎఫ్‌డీఐ తరలివచ్చిందని, అంతకు ముందు పదేళ్లలో (2004-14) అందుకున్న 97.7 బి.డాలర్లతో పోలిస్తే ఇవి 69% అధికమని వెల్లడించారు.

✦ **అత్యధిక ఎఫ్‌డీఐ పొందిన రంగాలు:** వాహన, టెలికాం, ఔషధ రంగాలు

✦ 2024-25 ఏప్రిల్-జూన్‌లో భారత్ 22.49 బి.డాలర్ల ఎఫ్‌డీఐని ఆకర్షించిందని డీపీఐఐటీ అదనపు కార్యదర్శి హిమానీ పాండే వెల్లడించారు. 2023-24 ఇదే కాలంలో మన దేశం ఆకర్షించిన ఎఫ్‌డీఐ 17.56 బి.డాలర్లు మాత్రమే.

✦ డీపీఐఐటీ ప్రకారం.. టాటా, ఎల్ అండ్ టీ, భారత్ ఫోర్జ్ వంటి భారతీయ కంపెనీలకు వందల కోట్ల డాలర్ల విలువైన రక్షణ ఒప్పందాలు లభించాయి. ఉపాధి కల్పన, ఎస్ఎంఈ వృద్ధి వంటి రంగాల్లో సవాళ్లు ఉన్నప్పటికీ, మేకిన్ ఇండియా చొరవ.. గత దశాబ్దంలో మన దేశ పారిశ్రామిక సామర్థ్యాన్ని, ఎగుమతి పోటీతత్వాన్ని గణనీయంగా పెంచిందని డీపీఐఐటీ తెలిపింది.

కోడి గుడ్లు

26న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	525
వరంగల్	527
విజయవాడ	555
గోదావరి	550
విశాఖపట్నం	555
చిత్తూరు	543

దేశీయంగా స్మార్ట్‌ఫోన్ డిస్‌ప్లే మాడ్యూల్ తయారీ

- రూ.8400 కోట్లతో ఫాక్స్‌కాన్ కొత్త ప్లాంటు!



తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఫాక్స్‌కాన్, తమిళనాడులో 1 బిలియన్ డాలర్ల(దాదాపు రూ. 8400 కోట్ల) పెట్టుబడులతో స్మార్ట్‌ఫోన్ డిస్‌ప్లే మాడ్యూల్ అసెంబ్లీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం చెన్నైకి సమీపంలోని ఈఎస్ఆర్ ఒరగడమ్ ఇండస్ట్రియల్ అండ్ లాజిస్టిక్స్ పార్క్ వద్ద 5 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని ఫాక్స్‌కాన్ కొనుగోలు చేసిందని ఆంగ్లపత్రికలు పేర్కొన్నాయి. ఫాక్స్‌కాన్ స్మార్ట్‌ఫోన్ అసెంబ్లింగ్ ప్లాంటు పక్కనే ఈ స్థలం ఉందని సమాచారం. మన దేశంలో ఈ తరహా ప్లాంటును ఫాక్స్‌కాన్ ఏర్పాటు చేయడం ఇప్పుడే. యాపిల్ ఐఫోన్లకు అమర్చేందుకు ఈ డిస్‌ప్లేలను వినియోగించనున్నారని సమాచారం. ఐఫోన్లను దేశీయంగా అసెంబ్లింగ్ చేస్తున్న పెగాట్రాన్, టాటా ఎలక్ట్రానిక్స్. వంటి సంస్థలు కూడా చైనా నుంచి డిస్‌ప్లే మాడ్యూళ్లను దిగుమతి చేసుకోవడానికి బదులుగా స్థానికంగానే సమీకరించే వీలు ఏర్పడుతుంది.



ఏపీ సహా 5 రాష్ట్రాల్లో ఓడల తయారీ క్లస్టర్లు

కేంద్ర మంత్రి సోనోవాల్

దిల్లీ: ఆంధ్రప్రదేశ్ సహా ఐదు రాష్ట్రాల్లో ఓడల అభివృద్ధి, మరమ్మతు క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక తొలి 100 రోజుల్లో తన మంత్రిత్వ శాఖ సాధించిన కీలక విజయాలను వివరిస్తూ పై విషయాన్ని మంత్రి వెల్లడించారు. 'ఓడల తయారీ, మరమ్మతుకు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, ఒడిశా, గుజరాత్‌లలో వీటి కోసం ప్రత్యేక క్లస్టర్లను మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేస్తోంద'ని ఆయన వివరించారు. వచ్చే అయిదేళ్లలో కంటెయినర్ హ్యాండ్లింగ్ 40 మిలియన్ టీఈయూలకు చేరొచ్చని, దేశంలో 20 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తుందని తమ మంత్రిత్వ శాఖ అంచనా వేస్తున్నట్లు తెలిపారు. హైడ్రోజన్ తయారీ హబ్‌ల ఏర్పాటు నిమిత్తం దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీ (డీపీఏ), వి.ఒ.చిదంబరనర్ పోర్ట్ ట్రస్ట్‌లో 3,900 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు. వచ్చే కొన్నేళ్లలో ఈ హబ్‌లు రూ.5 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షిస్తాయని తెలిపారు.

రూ.లక్ష కోట్ల వార్షిక లాభమే లక్ష్యం

ఎస్‌బీఐ ఛైర్మన్ సి. శ్రీనివాసులు శెట్టి



దిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వార్షిక నికర లాభాన్ని రూ. లక్ష కోట్లకు చేర్చాలనే లక్ష్యంతో ఉన్నామని బ్యాంక్ ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. ఈ ఘనతను 3-5 ఏళ్లలో అందుకోవాలనుకుంటున్నామని తెలిపారు. 2023-24లో ఎస్‌బీఐ రూ. 61,077 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2022-23 నికర లాభంతో పోలిస్తే ఇది 21.59% అధికం. 'రూ. లక్ష కోట్ల వార్షిక నికర లాభాన్ని ఆర్జించిన తొలి ఆర్థిక సేవల కంపెనీగా ఎస్‌బీఐని 3-5 ఏళ్లలో నిలుపుతామ'ని శెట్టి విశ్వాసం వ్యక్తం చేశారు. కార్పొరేట్ రుణాలకు గిరాకీ బాగుందని, బ్యాంక్ వద్ద ఇప్పటికే రూ. 4 లక్షల కోట్ల రుణాలకు దరఖాస్తులు సిద్ధంగా ఉన్నాయన్నారు.

సెనెగల్ కంపెనీలో కోరమాండల్‌కు మరింత వాటా

ఈనాడు, హైదరాబాద్: కోరమాండల్ ఇంటర్నేషనల్ ఆఫ్రికాలోని సెనెగల్ దేశానికి చెందిన బోబాబ్ మైనింగ్ అండ్ కెమికల్స్ కార్పొరేషన్ (బీఎంసీసీ) అనే కంపెనీలో తన వాటా పెంచుకుంది. ఈ సంస్థలో కోరమాండల్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ కోరమాండల్ కెమికల్స్ లిమిటెడ్ (సీసీఎల్)కు 45% వాటా ఉంది. దీనికి అదనంగా మరో 8.82% వాటాను సీసీఎల్ ద్వారా కొనేందుకు 3.84 మిలియన్ డాలర్ల (రూ.32 కోట్లు) పెట్టుబడి పెట్టింది. 3-6 నెలల వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తయితే బీఎంసీసీలో కోరమాండల్ వాటా 53.8 శాతానికి చేరుతుంది. బీఎంసీసీకి 6.5 మిలియన్ డాలర్ల రుణ సదుపాయం, వర్కింగ్ కేపిటల్ మద్దతును కూడా కోరమాండల్ అందివ్వనుంది. ఫాస్ఫారిక్ యాసిడ్ తయారీలో వాడే రాక్ ఫాస్ఫేట్‌ను బీఎంసీసీ ఉత్పత్తి చేస్తోంది. కాంప్లెక్స్ ఎరువుల తయారీకి ఫాస్ఫారిక్ యాసిడ్ ఎంతో అవసరం. బీఎంసీసీలో మెజార్టీ వాటా తన చేతికి వస్తున్నందున భవిష్యత్తులో రాక్ ఫాస్ఫేట్ సరఫరా తమకు స్థిరంగా లభిస్తుందని కోరమాండల్ పేర్కొంది.

2030కి రూ.16,600 కోట్ల స్థాయికి పిరమాల్ ఫార్మా!



దిల్లీ: 2030 కల్లా పిరమాల్ ఫార్మాను 2 బిలియన్ డాలర్ల (రూ.16,600 కోట్లు) విలువున్న అంతర్జాతీయ ఔషధ, ఆరోగ్య, సంరక్షణ సంస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ ఛైర్‌పర్సన్ నందిని పిరమాల్ తెలిపారు. వచ్చే అయిదేళ్లలో కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ - తయారీ (సీడీఎంఓ) విభాగాన్ని 1.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.10,000 కోట్లు) సంస్థగా; 2030 కల్లా క్రిటికల్ కేర్ విభాగాన్ని 60 కోట్ల డాలర్ల (సుమారు రూ.5,000 కోట్లు) సంస్థగా; ఆరోగ్య సంరక్షణ విభాగాన్ని 20 కోట్ల డాలర్ల (సుమారు రూ. 1,650 కోట్లు) సంస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉన్నామని చెప్పారు.

భారత్‌లో బీపీ బోర్డు సమావేశం

దిల్లీ: భారత విపణికి తాము ఇస్తున్న ప్రాధాన్యం, ఇక్కడి అవకాశాలపై తమకున్న ఆశావహ దృక్పథానికి నిదర్శనంగా ఇక్కడే బోర్డు సమావేశం నిర్వహిస్తున్నట్లు బ్రిటన్‌కు చెందిన ఇంధన సంస్థ బీపీ పీఎల్‌సీ తెలిపింది. సంస్థ డైరెక్టర్ల 5 రోజుల పర్యటన సెప్టెంబరు 23న ప్రారంభమైంది. భారత్‌లో బీపీ బోర్డు సమావేశం జరగడం ఇది రెండోసారి. ఇంధన మంత్రి హర్దీప్‌సింగ్ పురితో సమావేశం కావడంతో పాటు, ఆంధ్రప్రదేశ్ కృష్ణా గోదావరి బేసిన్‌లోని గడిమొగలో గ్యాస్ క్షేత్రాన్ని సందర్శించారు. తమ భాగస్వామి అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అధికారులతో ముంబయిలో సమావేశమయ్యారు.

పాడి పరిశ్రమలో సుంకం రాయితీలివ్వం

మంత్రి పీయూష్ గోయల్



దిల్లీ: దేశీయంగా పాడి పరిశ్రమపై ఎంతో మంది చిన్న రైతులు ఆధారపడి ఉన్నందున.. ఆ రంగంలో స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కింద విదేశీ సంస్థలకు సుంకం రాయితీలు లాంటివి ఇచ్చే ఆలోచన ప్రభుత్వానికి లేదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. మార్చిలో స్విట్జర్లాండ్, నార్వేతో కుదుర్చుకున్న ఈఎఫ్‌టీఏ (యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్) కింద కూడా పాడి పరిశ్రమలో రాయితీలు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఆస్ట్రేలియాతో ఈ అంశంపై చర్చ జరిగినప్పటికీ.. భారత్‌లో పాడి పరిశ్రమ ఎంత సున్నితమైనదో వివరించి, ఒప్పించామని తెలిపారు. 'భారత్‌తో పోలిస్తే ఆస్ట్రేలియా వ్యవసాయ, పాడి పరిశ్రమలు చాలా పెద్దవి. అందువల్ల ఉమ్మడి వేదికపై ఈ పెద్ద, చిన్న పరిశ్రమలు పరస్పరం పోటీపడటం దాదాపుగా అసాధ్యమ'ని గోయల్ చెప్పారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు, పెట్టుబడుల ఆకర్షణ నిమిత్తం ద్వైపాక్షిక చర్చలు జరిపేందుకు మంత్రి గోయల్ ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారు.

ఎన్ఎస్ఈ కోలొకేషన్ డేటా కేంద్రం విస్తరణ

దిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) వచ్చే మూడేళ్లలో తన కోలొకేషన్ డేటా సెంటర్‌ను విస్తరించాలని యోచిస్తోంది. ముంబయిలోని ర్యాక్‌ల సంఖ్యను దాదాపు మూడు రెట్లు పెంచి 4,000 మందికి పైగా ట్రేడింగ్ సభ్యులకు అందుబాటులోకి తీసుకురావాలనుకుంటోందని సమాచారం. బాంద్రా కుర్లా వద్ద ఎన్ఎస్ఈ ప్రస్తుత భవనంలోనే ఈ విస్తరణ జరుగుతుందని తెలుస్తోంది. కార్యకలాపాల సౌలభ్యాన్ని మెరుగుపర్చడం, ట్రేడింగ్ సభ్యుల కోసం ర్యాక్‌ల లభ్యతను పెంచడం ఎన్ఎస్ఈ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఎన్ఎస్ఈ 1,400 ర్యాక్‌లను ట్రేడింగ్ సభ్యులకు అందుబాటులో ఉంచింది. వచ్చే మూడేళ్లలో వీటిని 4,000కు పైగా పెంచాలని భావిస్తోంది. స్టాక్ బ్రోకర్లు తమ సర్వర్లను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఉంచడానికి అనుమతించేదే కోలొకేషన్ సదుపాయం. ఇతర సభ్యుల కంటే సెకనులో కొంత భాగం ముందుగా వీరికి షేర్ల ధరలను యాక్సెస్ చేసేందుకు అవకాశం లభిస్తుంది.

భారత్ పని తీరు దృఢంగా ఉంది!

డబ్ల్యూఈఎఫ్ సర్వేలో ముఖ్య ఆర్థికవేత్తలు

దిల్లీ: భారత్ ఆర్థిక వ్యవస్థ దృఢంగా ఉండటంతో, ప్రపంచంలో దక్షిణాసియా రాణించేందుకు ఉపకరిస్తోందని ఎక్కువ మంది ముఖ్య ఆర్థిక వేత్తలు పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై జాగ్రత్తతో కూడిన ఆశావాదాన్ని వారు వెలిబుచ్చారు. తగ్గుముఖం పట్టిన ద్రవ్యోల్బణం, ప్రపంచ వాణిజ్య రికవరీ నేపథ్యంలో.. జాగ్రత్తతో కూడిన ఆశావాద దృక్పథాన్ని వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన, వర్ధమాన ఆర్థిక వ్యవస్థల్లో పెరిగిన రుణ స్థాయిలు ఆందోళనలకు దారి తీస్తున్నాయ'ని వరల్డ్ ఎకనమిక్ ఫోరం (ప్రపంచ ఆర్థిక వేదిక) తాజా చీఫ్ ఎకనమిస్ట్స్ అవుట్‌లుక్‌లో వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దిగ్గజ ముఖ్య ఆర్థిక వేత్తల అభిప్రాయాలతో ప్రపంచ ఆర్థిక వేదిక ఈ నివేదికను రూపొందించింది.

✦ రుణ స్థాయిలు, ఆర్థిక సవాళ్లు ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలపై ఒత్తిడి పెంచుతాయని వారు పేర్కొన్నారు. రుణ స్థాయిలు పెరిగిపోతే, అత్యవసర రంగాలైన మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వాలు పెట్టుబడులు తగ్గిస్తాయని ఆందోళన వెలిబుచ్చారు. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో వచ్చే ఏడాదిలో రుణ ఎగవేతలు పెరుగుతాయని 39 శాతం మంది ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు.

అమెరికాలో బలమైన వృద్ధి: అమెరికాలో 2024, 2025 సంవత్సరాల్లో బలమైన వృద్ధి నమోదయ్యే అవకాశం ఉందని సుమారు 90% మంది ముఖ్య ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు. కఠిన పరపతి విధాన సమీక్ష ఇందుకు దోహదం చేస్తుందన్నారు. అమెరికాలో ఎన్నికలు కూడా అంతర్జాతీయ ఆర్థిక విధానాలపై గణనీయ ప్రభావం చూపుతాయని 80% మంది ఆర్థిక వేత్తలు పేర్కొన్నారు.



✦ ఐరోపాలో ఈ ఏడాది మిగిలిన 3 నెలల్లో బలహీన వృద్ధి నమోదయ్యే అవకాశం ఉందని 75% మంది వెల్లడించారు. చైనాలో 2024, 2025 సంవత్సరాల్లో బలహీన/అతి బలహీన వృద్ధి నమోదు కావొచ్చని 40% మంది పేర్కొన్నారు.

✦ దక్షిణాసియాలో బలమైన/అతి బలమైన వృద్ధి నమోదు కావొచ్చని, దీనికి భారత వృద్ధి సహకారం అందిస్తుందని 70% మంది ముఖ్య ఆర్థిక వేత్తలు అంచనా వేశారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ఇటీవల భారత జీడీపీ వృద్ధి అంచనాను 6.8% నుంచి 7 శాతానికి పెంచిన విషయాన్ని డబ్ల్యూఈఎఫ్ గుర్తు చేసింది.

మేకిన్ ఇండియాతో బలోపేతమైన ఆర్థికం

10 ఏళ్ల ఫలితాలివీ

దిల్లీ: మోదీ ప్రభుత్వం 10 ఏళ్ల కిందట తీసుకొచ్చిన 'భారత్‌లో తయారీ'(మేకిన్ ఇండియా)తో దేశం నుంచి ఎగుమతులు పెరిగాయి. పెట్టుబడులకు ఊతం లభించింది. 2014 సెప్టెంబరు 25న ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా చేపట్టిన పలు చర్యల వల్ల స్థానిక తయారీకి ఊతం లభించింది. 14 రంగాల కోసం ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకాలను అమలు చేయడంతో పాటు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనల సరళీకరణ, వ్యాపార నిబంధనల సడలింపు, ఏక గవాక్ష అనుమతులు, జాతీయ లాజిస్టిక్స్ విధాన ఆవిష్కరణలనూ చేపట్టారు. ఈ నేపథ్యంలో 'వివిధ రంగాల్లో ఎగుమతులు పెరిగాయి. ఆర్థిక వ్యవస్థ బలోపేతమైంది. అవకాశం ఉన్న అన్ని మార్గాల ద్వారా భారత్‌లో తయారీని ప్రోత్సహించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ సంస్కరణల సరళిని భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామ'ని ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ పేర్కొన్నారు.

దేశీయ అంకురాల్లో జెప్టోదే అగ్రస్థానం

లింక్డ్ఇన్ 2024 జాబితా


దిల్లీ: క్విక్ కామర్స్ ప్లాట్‌ఫాం అయిన జెప్టో వరుసగా రెండో ఏడాదీ 'లింక్డ్ఇన్ టాప్ స్టార్టప్స్ ఇండియా లిస్ట్ 2024'లో అగ్రస్థానంలో నిలిచింది. వృత్తినిపుణులు పనిచేసేందుకు ఎక్కువ ఇష్టపడే కంపెనీల జాబితాను లింక్డ్ఇన్ బుధవారం విడుదల చేసింది. అంతర్జాతీయంగా 100 కోట్ల మందికి పైగా ఉన్న లింక్డ్ఇన్ సభ్యుల అభిప్రాయాల ఆధారంగా రూపొందించిన ఈ జాబితా ప్రకారం.. అత్యధిక అంకురాలున్న నగరంగా బెంగళూరు కొనసాగింది. ఈ ఏడాది జాబితాలోని 20 అంకురాల్లో 14 కొత్తగా చేరినవే.

టాప్-20 అంకురాలు

1 జెప్టో 2 స్ప్రింటో 3 లుసిడిటీ 4 గ్రోత్‌ఎక్స్ 5 జార్ 6 వింగీ 7 సోర్స్ బే 8 బయోఫ్యూయల్ సర్కిల్ 9 సూపర్‌సోర్సింగ్ 10 బ్యాటరీ స్మార్ట్ 11 క్రట్ ఆటోమేషన్ 12 మైండ్‌పీర్స్ 13 ఒబెన్ ఎలక్ట్రిక్ 14 కాన్విన్ 15 గివా 16 ట్రాన్స్‌క్లాన్ 17 బిజాక్ 18 గోక్విక్ 19 రిఫైన్ ఇండియా 20 ప్లమ్

జోడు సూచీల హవా

సెన్సెక్స్ ▲256 85170 | **నిఫ్టీ ▲64 26004**



- తొలిసారి 26000 ఎగువన ముగిసిన నిఫ్టీ
- సెన్సెక్స్ 85000కి పైన
- బ్యాంకింగ్, విద్యుత్ షేర్ల రాణింపు

సమీక్ష

జంట సూచీల జోరు కొనసాగింది. సెన్సెక్స్ తొలిసారి 85000 పాయింట్ల ఎగువన, నిఫ్టీ 26000 పాయింట్ల ఎగువన బుధవారం ముగిశాయి. ట్రేడింగ్ ఆరంభంలో సూచీలు నష్టాల్లో కదలాడినా, ఆఖర్లో బ్యాంకింగ్, విద్యుత్ రంగ షేర్ల రాణింపుతో లాభాల్లో ముగిశాయి. విలువలు అధిక స్థాయులకు చేరాయనే భావనతో చిన్న, మధ్యతరహా కంపెనీల షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 5 పైసలు పెరిగి 83.58 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 1.34% నష్టంతో 74.16 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో చైనా, హాంకాంగ్ సూచీలు లాభాల్లో; దక్షిణ కొరియా, టోక్యో సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు కూడా నష్టాల్లోనే ఆరంభమయ్యాయి.

నష్టాలతో ఆరంభమై..

ఉదయం సెన్సెక్స్ 84,836.45 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,914 పాయింట్ల) నష్టాల్లోనే ఆరంభమైంది. ఆ తర్వాత కాసేపు లాభాల్లోకి వచ్చినా.. మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. మధ్యాహ్నం తర్వాత బలంగా పుంజుకుని 85,247.42 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 255.83 పాయింట్ల లాభంతో 85,169.87 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 85,000 ఎగువన ముగియడం ఇది తొలిసారి. నిఫ్టీ కూడా తొలిసారి 26000 ఎగువన ముగిసింది. చివరకు 63.75 పాయింట్ల లాభంతో 26,004.15 వద్ద స్థిరపడింది.

19 రాణించాయ్

సెన్సెక్స్ 30 షేర్లలో 19 రాణించగా.. 11 డీలాపడ్డాయి. పవర్‌గ్రిడ్ 3.91%, యాక్సిస్ బ్యాంక్ 2.27%, ఎన్‌టీపీసీ 1.94%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.10%, బజాజ్ ఫైనాన్స్ 0.91%, టాటా స్టీల్ 0.65% షేర్లు లాభపడిన వాటిల్లో ఉన్నాయి. టెక్ మహీంద్రా 2.21%, టాటా మోటార్స్ 1.39%, టైటాన్ 1.18%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.92%, ఎస్‌బీఐ 0.68%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 0.67% నష్టపోయాయి.

నిఫ్టీ మైలురాళ్లు

పాయింట్లు	తేదీ
1000	1996 ఏప్రిల్ 16
5000	2007 సెప్టెంబరు 27
10000	2017 జులై 25
15000	2021 ఫిబ్రవరి 5
20000	2023 సెప్టెంబరు 11
22000	2024 జనవరి 15
23000	2024 మే 24
24000	2024 జూన్ 27
25000	2024 ఆగస్టు 1
26000	2024 సెప్టెంబరు 25

✦ సెమీ కండక్టర్ సంస్థ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి దరఖాస్తు సమర్పించినట్లు **జోహో కార్ప్** సీఈఓ, సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేసే ప్రాంతం సహా ఇతర వివరాలను ఇప్పుడే చెప్పలేమని అన్నారు.

✦ **కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజరేషన్** తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రారంభమైన కొన్ని నిమిషాల్లోనే పూర్తి స్థాయిలో స్పందన లభించింది. తొలి రోజు ముగిసేసరికి ఇష్యూకు 23.73 రెట్ల అధిక స్పందన లభించింది. 1,09,93,000 షేర్లను సంస్థ ఆఫర్ చేయగా.. 26,08,36,486 షేర్లకు బిడ్‌లు వచ్చాయి.

✦ **మాంబా ఫైనాన్స్** ఐపీఓ ముగిసేసరికి 223.12 రెట్ల స్పందన లభించింది. 87,99,000 షేర్లను సంస్థ జారీ చేయనుండగా.. 1,96,32,02,000 షేర్లకు బిడ్‌లు వచ్చాయి. చిన్న మదుపర్ల విభాగంలో 142.40 రెట్ల అధిక స్పందన వచ్చింది.

✦ బహిరంగ విపణి లావాదేవీ ద్వారా **హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్**‌లో రూ. 543 కోట్ల విలువైన షేర్లను స్విట్జర్లాండ్‌కు చెందిన ఆర్థిక సేవల కంపెనీ యూబీఎస్ గ్రూపు కొనుగోలు చేసింది. 30.72 లక్షల షేర్లను ఒక్కోటి రూ. 1,768.05 సగటు ధరకు కొనుగోలు చేసినట్లు బీఎస్ఈ వద్ద లభ్యమవుతున్న సమాచారం ఆధారంగా తెలుస్తోంది.

వృద్ధిరేటు అంచనా 7%: ఏడీబీ


ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత వృద్ధి రేటు అంచనాను 7 శాతంగా కొనసాగిస్తున్నట్లు **ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్** (ఏడీబీ) తెలిపింది. వ్యవసాయ దిగుబడులు మెరుగ్గా ఉండటం, అధిక ప్రభుత్వ వ్యయాలు లాంటివి ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దన్నుగా నిలుస్తాయని తెలిపింది.

బొంబాడియర్ సీఈఓతో అదానీ చర్చలు

కెనడా కేంద్రంగా బిజినెస్ జెట్ విమానాలు తయారు చేసే **బొంబాడియర్** ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎరిక్ మార్టెల్‌తో అదానీ గ్రూపు ఛైర్మన్ **గౌతమ్ అదానీ** సమావేశమై విమాన సేవలు, రక్షణ రంగంలో భాగస్వామ్యాలపై చర్చించారు.

ఈనాడు సినిమా

పూజ ముగించింది


పూజా హెగ్డే

గతేడాది 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' సినిమాతోనే సరిపెట్టుకున్న అందాల తార పూజా హెగ్డే.. ఈ ఏడాది సినిమాల ఎంపికలో జోరు ప్రదర్శిస్తుంది. తమిళ అగ్రకథానాయకుడు సూర్య నటిస్తున్న చిత్రం 'సూర్య44'(వర్కింగ్ టైటిల్). కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుంది. లవ్ అండ్ వార్ నేపథ్యంలో పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. తాజాగా ఈ చిత్రంలో పూజ తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేసినట్లు సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది. ఇందులో సూర్య.. గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నట్లు తెలుస్తోంది. జోజూ జార్జ్, జయరామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం పూజ జాబితాలో 'దేవా', 'కాంచన' లాంటి చిత్రాలున్నాయి.

తెలుగులో పలువురు స్టార్ హీరోలు కొత్త ప్రయాణాలు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే కథలు.. కలయికలు కుదిరినా ఆ తారలతో ఆడిపాడే సరిజోడీ ఎవరన్నది ఇంకా సందిగ్ధంలోనే ఉంది. ప్రచారంలో పలువురు భామల పేర్లు వినిపిస్తూ ఊరిస్తున్నా.. ఇంత వరకు దేనిపైనా స్పష్టత రావడం లేదు. దీంతో ఇప్పుడా కథానాయకుల సరసన నిలిచే సొగసరి ఎవరన్నది సినీప్రియుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.


ప్రభాస్


మహేశ్ బాబు

సోగ్గాడి సరసన సొగసరి ఎవరో?


ఎన్టీఆర్

అగ్ర తారల చిత్రాలకు కథానాయికల ఎంపికనేది ఎప్పుడూ కత్తి మీద సాము లాంటి వ్యవహారమే. పాన్ ఇండియా ట్రెండ్ ఊపందుకున్నాక ఇది మరింత జటిలమైంది. కొత్తదనం కనిపించాలి.. హీరోకి తగిన జోడీ అనిపించుకోవాలి.. వెనుక విజయాలు.. ప్రేక్షకుల్ని అలరించే గ్లామర్ ఉన్నాయో లేదో చూసుకోవాలి.. వీటన్నింటికీ తోడు పాన్ ఇండియా మార్కెట్‌కు ఏమేర కలిసొస్తుందో లెక్కలేసుకోవాలి. అందుకే ఇప్పుడు స్టార్ హీరోల చిత్రాలకు నాయికను వెతికి పట్టుకోవడం అంత త్వరగా తేలడం లేదు. ఇప్పుడిలాంటి పరిస్థితినే పలు భారీ ప్రాజెక్టులు ఎదుర్కొంటున్నాయి.

● కథానాయకుడు ఎన్టీఆర్ తన 31వ చిత్రం కోసం ప్రశాంత్ నీల్‌తో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. 'కేజీఎఫ్ 2', 'సలార్' విజయాల తర్వాత ప్రశాంత్ నుంచి రానున్న సినిమా ఇది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రం అక్టోబరు నెలాఖరు నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది. తారక్ జనవరి నుంచి రంగంలోకి దిగనున్నారు. అయితే ఇందులో ఆయనకు జోడీగా కనిపించే నాయిక ఎవరన్నది స్పష్టత రాలేదు. ఇప్పటికైతే రష్మికతో పాటు పలువురు బాలీవుడ్ భామల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. కానీ, వేటిపైనా చిత్ర వర్గాల నుంచి స్పష్టత రాలేదు.

జనవరిలో తారక్ సెట్లోకి వచ్చే నాటికి నాయికను ప్రకటించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే 'సరిపోదా శనివారం'తో ఓ చక్కటి విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు కథానాయకుడు నాని. ప్రస్తుతం ఆయన చేతిలో 'హిట్ 3'తో పాటు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రాజెక్ట్ ఒకటుంది. ఈ రెండింటినీ సమాంతరంగా పూర్తి చేసేందుకు నాని సన్నాహాలు చేసుకుంటున్నారు. దీనికి తగ్గట్లుగా ఇప్పటికే 'హిట్ 3' చిత్రీకరణ ప్రారంభించగా.. శ్రీకాంత్ ఓదెల సినిమా పూర్వ నిర్మాణ పనుల్లో ఉంది. కానీ, ఇప్పటికీ వీటిలో కనిపించే భామలెవరన్నది తెలియరాలేదు. నాని - శ్రీకాంత్ కలయికలో రూపొందనున్న సినిమా కోసం జాన్వీ కపూర్‌ను తీసుకోనున్నట్లు ఇది వరకు ప్రచారం జరిగింది. కానీ, ఇప్పుడు బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకుని మీడియం రేంజ్ కథానాయిక కోసం వేట మొదలెట్టినట్లు తెలుస్తోంది. ఇక 'హిట్ 3' కోసం నివేదా థామస్‌తో పాటు మరి కొందరి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం ఊపందుకుంది. మరి చివరికి ఎవరు ఖరారవుతారో వేచి చూడాలి. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో సినీప్రియుల్ని నవ్వించారు దర్శకుడు మహేశ్‌బాబు. ఇప్పుడాయన హీరో రామ్‌తో ఓ సినిమా చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనుంది. ఇందులో రామ్ సరసన నటించే నాయిక కోసం ప్రస్తుతం వేట కొనసాగుతోంది. ఈ చిత్రంలో ఓ సీనియర్ హీరో కూడా కనిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న రామ్ తిరిగి రాగానే ఈ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు ప్రణాళిక రచిస్తున్నారు. ఈలోపు ఈ మిగతా తారాగణంపై స్పష్టత ఇచ్చే అవకాశాలున్నాయి.


నాని


రామ్

అందాల వేటలో ప్రభాస్, మహేశ్

ప్రస్తుతం సినీప్రియులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాల్లో 'ఎస్ఎస్ఎంబీ29' (వర్కింగ్ టైటిల్) ఒకటి. 'ఆర్ఆర్ఆర్' విజయం తర్వాత రాజమౌళి తెరకెక్కించనున్న సినిమా ఇది. మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో అంతర్జాతీయ స్థాయిలో ముస్తాబు చేయనున్న ఈ చిత్రం ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉంది. కానీ, ఇంత వరకు మహేశ్ సరసన నటించే నాయిక ఎవరన్నది తేలలేదు. హాలీవుడ్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని దీని కోసం ఓ ప్రముఖ విదేశీ భామను రంగంలోకి దించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఇండోనేషియా తార చెల్సియా ఎలిజబెత్‌తో పాటు మరో ఇద్దరు విదేశీ అందాల తారల పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ, దేనిపైనా పూర్తిగా స్పష్టత రాలేదు. ఈ సినిమాపై వచ్చే నెలలో ఓ ప్రకటన వెలువడే అవకాశమున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కథానాయకుడు ప్రభాస్ చేస్తున్న సినిమాల్లో హను రాఘవపూడి చిత్రమొకటి ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇప్పటికే లాంఛనంగా మొదలైన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం మధురై పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. అయితే ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ లేరు. ఆయన ఈ సినిమాలో రెండు కోణాల్లో సాగే పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీనికి తగ్గట్లుగా ఇందులో ఇద్దరు నాయికలకు అవకాశమున్నట్లు సమాచారం. వాటిలో ఓ పాత్ర కోసం కొత్తమ్మాయి ఇమాన్విని ఇప్పటికే ఖరారు చేసింది చిత్ర బృందం. కానీ, ఆ రెండో నాయికగా ఎవరు కనిపిస్తారన్నది ఇంకా తేలలేదు. త్వరలోనే దీనిపైనా స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది.

ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్!


రజనీ కాంత్

వేట్టయన్: ద హంటర్‌తో ప్రేక్షకుల్ని అలరించనున్నారు రజనీకాంత్. ఆయన కథానాయకుడిగా నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని టి.జె.జ్ఞానవేల్ తెరకెక్కించారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. అమితాబ్ బచ్చన్, రానా, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా అక్టోబరు 10న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే చిత్ర బృందం 'వేట్టయన్ ప్రివ్యూ' పేరుతో తెలుగు టీజర్ విడుదల చేసింది. "ఈ దేశంలో లక్షలాది మంది పోలీసు అధికారులున్నారు. కానీ, వీళ్లని మాత్రమే చూడగానే గుర్తుపడుతున్నారంటే అదెలా సాధ్యమవుతుంది" అంటూ అమితాబ్ బచ్చన్ ప్రశ్నతో మొదలైన టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇందులో రజనీ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనున్నట్లు ఈ ప్రచార చిత్రాన్ని బట్టి అర్థమవుతోంది. టీజర్‌లో రజనీ తనదైన స్టైల్, స్వాగ్‌తో యాక్షన్ కోణంలో ఆసక్తి రేకెత్తించేలా కనిపించారు. ఆఖర్లో "ఎన్‌కౌంటర్ పేరుతో ఓ మనిషిని హత్య చేయడం అదొక హీరోయిజమా" అని అమితాబ్ ప్రశ్నించగా.. "ఎన్‌కౌంటర్ అనేది నేరం చేసిన వాళ్లకు విధించే శిక్ష మాత్రమే కాదు. ఇక మీదట ఇలాంటి నేరం మళ్లీ జరగకూడదని తీసుకునే ముందు జాగ్రత్త చర్య" అంటూ రజనీ బదులివ్వడం టీజర్‌కు ఆకర్షణగా నిలిచింది. ఇందులో రితికా సింగ్, దుషారా విజయన్, కిశోర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతమందించారు.

కొత్త చిత్రంలో విలన్ మమ్ముట్టేనా?


మమ్ముట్టి

వయసుతో సంబంధం లేకుండా ప్రయోగాత్మక కథలతో ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా పెట్టుకునే కథానాయకుల్లో మమ్ముట్టి ఒకరు. ఇటీవలే 'టర్బో'తో తెరపైకి వచ్చిన ఈయన.. ఇప్పుడు మరో కొత్త ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపారు. ఆయన ప్రధాన పాత్రలో జితిన్ కే జోస్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ విషయాన్ని బుధవారం అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఫొటోల్ని పంచుకుంది చిత్రబృందం. మమ్ముట్టి ప్రొడక్షన్ హౌస్‌లో రూపొందుతున్న ఏడో చిత్రమిది. 'జైలర్'లో విలన్ పాత్రలో మెప్పించిన వినాయకన్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో మమ్ముట్టి విలన్ పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం 'బజూక' చిత్రంతో బిజీగా ఉన్నారాయన.

థ్రిల్ చేసే కలి


ప్రిన్స్

ప్రిన్స్, నరేశ్ అగస్త్య ప్రధాన పాత్రల్లో శివ శేషు తెరకెక్కించిన చిత్రం 'కలి'. లీలా గౌతమ్ వర్మ నిర్మిస్తున్నారు. నేహా కృష్ణన్, గౌతంరాజు తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఇది అక్టోబరు 4న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే దర్శకుడు ప్రశాంత్ వర్మ బుధవారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ట్రైలర్ ఆసక్తి రేకెత్తించేలా ఉంది. మంచి సైకలాజికల్ థ్రిల్లర్ సినిమా చూడబోతున్నట్లు అర్థమవుతోంది" అన్నారు. "జీవితంలోని కష్టాలను తట్టుకోలేక శివరామ్ అనే వ్యక్తి ఆత్మహత్యకు సిద్ధపడతాడు. అదే టైమ్‌లో ఓ అపరిచిత వ్యక్తి అతని ఇంటికి వస్తాడు. మరి తనెవరు? తనొచ్చాక శివరామ్ జీవితంలో చోటు చేసుకున్న అనూహ్య ఘటనలు ఏంటి? అన్నది ఆసక్తికరం. ఇది ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే థియేట్రికల్ సినిమా" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

ఏఐ మాయలో అనన్య


అనన్య పాండే


"నేను నా బాయ్‌ఫ్రెండ్‌ను నా జీవితం నుంచి తీసేయాలనుకుంటున్నాను. ఆ పనిని నువ్వు చేయగలవా" అని ఏఐతో సంభాషిస్తుంది అనన్య పాండే. మరి ఈ కృత్రిమ మేధ మాయలో పడి తను ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొందో తెలియాలంటే 'కంట్రోల్' సినిమా చూడాల్సిందే. అనన్య ప్రధాన పాత్రలో విక్రమాదిత్య మోత్వానే తెరకెక్కిస్తున్న చిత్రమిది. విహాన్ సమత్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఏఐ, సోషల్ మీడియా తదితర అంశాలతో సైబర్ థ్రిల్లర్‌గా దీన్ని తీర్చిదిద్దారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది చిత్ర బృందం. "మీ జీవితం మీ కంట్రోల్‌లో ఉందో లేదో తెలుసుకోండి" అనే వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో అవస్థి పాత్రలో కనిపించనుంది అనన్య. మన జీవితాలు ఈ డిజిటల్ ప్రపంచం నియంత్రణలో ఉన్నాయా..? లేదా మనమే వాటిని నియంత్రిస్తున్నామా..? అనే ప్రశ్నను లేవనెత్తేలా ఆసక్తికరంగా సాగుతుంది ఈ ట్రైలర్. ఇందులో ఏఐతో పరిచయం పెంచుకున్న అవస్థికి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయనేది చూపించనున్నారు. నిఖిల్ ద్వివేది నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే నెల 4న విడుదల కానుంది.

క.. పూర్తి


కిరణ్

కిరణ్ అబ్బవరం హీరోగా సుజీత్, సందీప్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న బహుభాషా చిత్రం 'క'. చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మిస్తున్నారు. నయన్ సారిక, తన్వీ రామ్ కథానాయికలు. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకులు సుజీత్, సందీప్ మాట్లాడుతూ. "గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ థ్రిల్లర్ ఇది. చిత్ర బృందమంతా ఓ ఫ్యామిలీలా కష్టపడి ఈ సినిమా చేశాం. ఇది మాకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవాల్ని ఇచ్చింది. ఈ చిత్రం అందించే విజయం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం" అన్నారు. ఈ సినిమాకి సంగీతం: సామ్ సిఎస్, ఛాయాగ్రహణం: విశ్వాస్ డానియేల్, సతీష్ రెడ్డి మాసం.

దీపావళికి తెరుచుకోనున్న తలుపులు


కార్తిక్ ఆర్యన్

బాలీవుడ్ కథానాయకుడు కార్తిక్ ఆర్యన్, త్రిప్తి దిమ్రీ జంటగా నటిస్తోన్న చిత్రం 'భూల్ భులయ్యా 3'. దీనిని అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్నారు. హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రమిది. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంటూ 'ఈ దీపావళికి తలుపులు తెరుచుకోనున్నాయి' అనే వ్యాఖ్యను జోడించింది చిత్రబృందం. ఇందులో రూహ్ బాబాగా కనిపించనున్నారు కార్తిక్. విద్యాబాలన్, మాధురీ దీక్షిత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భూషణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం నవంబరు 1న విడుదల కానుంది.

న్యాయ ప్రపంచంలోకి అదా శర్మ




అదాశర్మ

'ది కేరళ స్టోరీ', 'బస్తర్' లాంటి భిన్నమైన కథలతో ప్రయాణం చేస్తుంది కథానాయిక అదా శర్మ. ఇప్పుడామె తన రాబోయే ప్రాజెక్టు కోసం లాయర్ అవతారమెత్తింది. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న వెబ్‌సిరీస్ 'రీతా సన్యాల్'. తాజాగా ఈ సిరీస్‌ను అధికారికంగా ప్రకటిస్తూ.. ఇన్‌స్టా వేదికగా ఓ వీడియోను పంచుకుంది అదా. "న్యాయ ప్రపంచంలో హల్‌చల్ చేయడానికి వస్తోంది రీతా సన్యాల్" అనే వ్యాఖ్యను జోడించింది. ఇందులో ఆమె న్యాయవాది పాత్రలో కనిపించనుంది. అభిరూప్ ఘోష్ దీన్ని రూపొందిస్తున్నారు. ఈ సందర్భంగా అదా మాట్లాడుతూ.. "లాయర్, డిటెక్టివ్‌గా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్న ఓ అమ్మాయి ఎదుర్కొనే సవాళ్ల ఆధారంగా ఈ సిరీస్ రూపొందుతుంది. నేను ఎప్పటినుంచో రీతా సన్యాల్ లాంటి పాత్రను పోషించాలనుకుంటున్నాను. నటిగా నన్ను నేను నిరూపించుకోవాలంటే.. భిన్నమైన ప్రాజెక్టులు చేయాలి. ఇందులో 10విభిన్న పాత్రల్లో కనిపిస్తాను. యాక్షన్, కామెడీ, థ్రిల్, క్రైమ్ ఇలా అన్నీ అంశాలు ఇందులో ఉన్నాయి. రీటా సన్యాల్ కామిక్ పుస్తకం చదివినట్లు.. ఉత్కంఠభరితంగా సాగుతూనే నవ్వులు పంచుతుంద"ని చెప్పుకొచ్చింది. ఇందులో రాహుల్‌దేవ్, అంకుర్ రాఠీ, మాణిక్ పాప్నేజా తదితరులు నటిస్తున్నారు. రాజేశ్వర్ నాయర్ నిర్మిస్తున్న ఈ సిరీస్ వచ్చే నెల 14న విడుదల కానుంది.

రుచిలేని పప్పు

ఉప్పులేని పప్పు చప్పగా ఉన్నట్టుగానే సద్గుణాలు లేని వారు శోభించలేరు. తిన్న ఆహారం కొద్దిసేపట్లో ఎటూ జీర్ణమైపోతుంది కదా- అనుకుని ఉప్పు లేని పప్పును తినలేం. అది నోటికి సహించదు కనుక హితవుగా ఉండే లవణాన్ని జోడిస్తాం. అత్యల్ప విషయమైన పప్పు గురించే శ్రద్ధ చూపిస్తున్నప్పుడు.. కొన్ని దశాబ్దాలు గడపాల్సిన జీవితాన్ని ఇంకెంతో గొప్పగా మలచుకోవాలి. మనలో మంచి గుణాలు లేకుంటే తోటివారు హర్షించరు. ఆత్మీయులు సైతం దూరమౌతారు. అప్పుడిక జీవితం నిస్సారంగా ఉంటుంది. అందుకే సద్గుణాలు అలవరచుకోవడంలో అలక్ష్యం తగదు. అలానే చెడు లక్షణాలు ఏర్పడకుండా అప్రమత్తంగా కూడా ఉండాలి. గుణహీనులను ఇతరులు గుర్తించరు, గౌరవించరు. మొహమాటంతోనో, భయంతోనో మన్నించినా.. అది క్షణికమని గ్రహించాలి. ప్రేమ, దయ, కరుణ, పారమార్థిక చింతన, పరోపకార బుద్ధి- అనే సద్గుణాలతో ముందుకు సాగినప్పుడు కీర్తి, సంపదలు వరిస్తాయి. ఇది విద్యాప్రకాశానంద స్వామి ఉద్బోధ.


– ఉమాబాల



పూలపండుగలో పారమార్థిక పరిమళాలు!

(అక్టోబరు 2 బతుకమ్మ పండుగ ప్రారంభం)

పూలనే పరదైవంగా పూజించే ప్రత్యేక పండుగ బతుకమ్మ. మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి ప్రకృతితో అనుబంధాన్ని ప్రస్ఫుటం చేస్తుంది. అతివల అస్తిత్వానికి అద్దంపడుతూ వారి సృజనాత్మక శక్తిని ప్రకటిస్తుంది. పూల అమరిక నుంచి పాటల ఆలాపన వరకు ప్రతిదీ మనోహరంగా ఆవిష్కృతమవుతుంది.



మహిళలకు మహా ఇష్టమైన పండుగ బతుకమ్మ వేడుక. ఆదిపరాశక్తిని అరవిరిసిన సుమాల్లో దర్శిస్తూ, పాటలతో ప్రస్తుతిస్తూ పరవశించిపోతారు. తొమ్మిది రోజుల ఈ వేడుకల్లో తంగేడు, జిల్లేడు, గునుగు, బంతి, చేమంతి... ఇలా ఎన్నెన్నో కుసుమాలు ఈ పండుగ కోసమే పూశాయా అనిపిస్తాయి. బతుకమ్మ పండుగను ఆధ్యాత్మిక సాధకులు సామూహిక 'శక్తి ఉపాసన'గా, ఆత్మచైతన్యానికి మేల్కొలుపుగా భావిస్తారు.

ఎనలేని భక్తిప్రపత్తులతో..

'బతికించే అమ్మ' అన్న ఆరాధనా భావంతో అమ్మవారికి నీరాజనాలు అర్పించటం బతుకమ్మ పండుగలో అంతరార్థం. ఆరోగ్యకర జీవనం, ఆధ్యాత్మిక ఉన్నతి కోసం అమ్మను వేడుకోవటం ఆనవాయితీ. శరత్కాల నవరాత్రుల్లో సకల జనావళి జగన్మాతను పూజించి తరించాలని దేవీపురాణం ఉద్ఘాటిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రాంతంలో శరన్నవ రాత్రులకు ఒకరోజు ముందే అంటే భాద్రపద బహుళ అమావాస్య నుంచి ఆశ్వయుజ శుక్ల అష్టమి వరకూ బతుకమ్మపండుగ చేస్తారు. బతుకమ్మను లక్ష్మీదేవి, పార్వతీదేవిల అంశగానే కాదు, శ్రీచక్రశోభితగా, ప్రకృతికి ప్రతిరూపంగా, తమ ఇంటి ముత్తయిదువగా భావిస్తారు. ఆ సంగతులన్నీ పాటలుగా ఆలపిస్తారు. 'శ్రీలక్ష్మీదేవియు ఉయ్యాలో.. సృష్టి బతుకమ్మయె ఉయ్యాలో..', 'నూరునోములు నోచి ఉయ్యాలో.. నూరుమందిని గాంచె ఉయ్యాలో..' 'జగతిపై బతుకమ్మ ఉయ్యాలో.. శాశ్వతంబుగ వెలసె ఉయ్యాలో..' అంటూ స్తుతిస్తారు, కీర్తిస్తారు. ఇలా గీతాలతో అమ్మవారిని ఆరాధించటమే కాదు, మదిలోని కష్ట సుఖాలను, పురాణ కథలు, చారిత్రక ఘట్టాలను ఆవిష్కరిస్తారు.

లలితాదేవి ఆరాధన

బతుకమ్మకు సమర్పించే నైవేద్యాల్లో అమ్మవారి ఇష్టాలకు తగ్గట్టుగా పులిహోర, పులగం, పెరుగన్నం, బెల్లపు అన్నం, పాయసాన్నం, నెయ్యి కలిపిన అన్నం నివేదిస్తారు. బతుకమ్మ పండుగలో లలితాదేవి ఆరాధన దాగి ఉందని ఈ నైవేద్యాల వల్ల అర్థమవుతుంది.

నవరాత్రులు.. నవమాసాలు..

తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ మాతృత్వంలోని నవ మాసాలకు ప్రతీక. ఈ కారణంగానే ఈ పండుగను సంతాన సాఫల్యతకు సంబంధించిన వేడుక అని కూడా అంటారు. ఈ నవరాత్రుల బతుకమ్మ పాటల్లో, గర్భిణుల ఆరోగ్యం, ఆహార అలవాట్లకు సంబంధించిన సూచనలున్నాయి. ఈ తొమ్మిది రోజులూ బతుకమ్మను పూజిస్తూ, దానధర్మాలు చేస్తే అమ్మవారి అనుగ్రహంతో సత్సంతానం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు.

ఇవీ బతుకమ్మ పండుగను పోలినవే!

కాకతీయుల కాలంలోనూ బతుకమ్మ పండుగ వైభవంగా జరిగేదని తెలుస్తోంది. తెలంగాణలో ప్రసిద్ధమైన బతుకమ్మ పండుగను పోలిన వేడుకలు.. ఓనం, అట్లతద్దె, కోలాటం, దాండియా, గొబ్బెమ్మ- ఇలా నామ, రూప భేదాలతో దేశమంతా కనిపిస్తాయి. భక్తి సామ్రాజ్యానికి బతుకమ్మ పండుగ పెట్టని కోట లాంటిది అంటే అతిశయోక్తి కాదు.

ఎన్నో సుమాలు.. మరెన్నో నైవేద్యాలు..


బతుకమ్మను వివిధ రకాల పూలతో అలంకరిస్తారు, అనేక నైవేద్యాలను సమర్పిస్తారు. పూలను పేర్చటం ఓ సృజనాత్మక ప్రక్రియ. తంగేడు, బంతి, గునుగు, గుమ్మడి, తీగమల్లె, మంకెన, పోకబంతి, కనకాంబరం, గన్నేరు తదితర పూలు బతుకమ్మలో కొలువదీరతాయి. పైన పసుపుతో చేసిన గౌరమ్మను పెట్టి, చుట్టూ దీపాలతో తీర్చిదిద్దటం సంప్రదాయం. కొందరు ఈ గౌరమ్మను బొడ్డెమ్మ అని పిలిస్తే... ఇంకొందరు బతుకమ్మనే బొడ్డెమ్మగా వ్యవహరిస్తారు. తల్లి గర్భంలో పెరుగుతున్న శిశువుకు ఆహారం బొడ్డుతాడు ద్వారా అందుతుంది. ఆ బొడ్డుతాడుకు దివ్యత్వాన్ని జోడించిన స్వరూపమే బొడ్డెమ్మగా అవతరించిందని భక్తుల విశ్వాసం. ఎవరికి వారు మొదట ఇంట్లో బతుకమ్మను పూజించి, తర్వాత తమ వీధిలో విశాల ప్రాంగణంలోకి చేరుస్తారు. అందరూ బతుకమ్మల చుట్టూ వలయాకారంలో తిరుగుతూ పాటలు పాడతారు. చివరకు సమీప చెరువులో నిమజ్జనం చేస్తారు.

ఒక్కో రోజు ఒక్కో పేరుతో..

తొలిరోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మ అంటారు. ముందురోజు కోసిన పూలను నీళ్లలో వేసి మరునాడు అలంకరణకు వాడటం వల్ల అలా పిలుస్తారు. రెండోరోజు అటుకుల బతుకమ్మ, మూడోరోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగోరోజు నానబియ్యం బతుకమ్మ, అయిదోరోజు అట్ల బతుకమ్మ అని వ్యవహరించగా.. ఆరోరోజు అలిగిన బతుకమ్మ అంటారు. ఆ రోజు అమ్మవారు అలకలో ఉంటుందని నమ్మి, బతుకమ్మఆట ఆడరు. ఏడోరోజు వేపకాయల బతుకమ్మగా ప్రసిద్ధి. సకినాల పిండిని వేపకాయల్లా చేసి నైవేద్యంగా పెట్టటం వల్ల ఆ పేరు వచ్చింది. ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ అని పిలుస్తారు. దేవేరికి వెన్నతో తయారు చేసిన నువ్వుండలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఇలా అమ్మవారికి సమర్పించే నైవేద్యాన్ని బట్టి ఆ రోజు బతుకమ్మను పిలవటం అలవాటు. తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ అంటారు. ఈ తొమ్మిది రోజులూ ముగిశాక.. 'పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా.. మల్లొచ్చె యాడాది తిరిగి రావమ్మా..' అని వీడ్కోలు పలుకుతారు.

– మనోజ్ఞ

ఆదిగురువు వ్యాసుడేనా?!



యోగ సంప్రదాయంలో పరమశివుడే ఆదిగురువు. ఆయన తాండవం చేసే సమయంలో చేతిలో ఉన్న డమరుకం నుంచి నాదం, ఆ నాదం నుంచి వేదం ఆవిర్భవించాయి. ఈ వేదాన్ని శ్రీమహావిష్ణువు బ్రహ్మదేవుడికి, బ్రహ్మ తన కుమారుడైన వశిష్ఠమహర్షికి, ఆయన తన పుత్రుడు శక్తిమహర్షికి, ఆయన తన పుత్రుడు పరాశరమహర్షికి, ఆయన తన కుమారుడు వ్యాసమహర్షికి ఉపదేశించారు. ఈ మధ్యలో అనేక యుగాలు గడిచాయి. కానీ వేదం గ్రంథస్థం కాలేదు. గురువు చెబితే విని మాత్రమే నేర్చుకునేవారు. శ్రుతి అంటే వినడం. అందుకే వేదాన్ని 'శ్రుతి' అన్నారు. అప్పటి వరకూ మౌఖికంగా ఒకరి నుంచి ఒకరికి సాగిన వేదజ్ఞానాన్ని వ్యాసుడు సమీకరించాడు. ఒకటిగా ఉన్నదాన్ని నాలుగు విభాగాలు చేశాడు. సకల విద్యా పారంగతుడు, సర్వకళా కోవిదుడు అయిన వ్యాసుడు ఆది గురువుగా విఖ్యాతుడయ్యాడు. వేదాన్ని గ్రంథస్థం చేయడమే కాదు.. భారత, భాగవతాలు, అష్టాదశ పురాణాలు రచించాడు. ఉపనిషత్తులు, భగవద్గీత, విష్ణు సహస్రనామాలు ఆయన లిఖించినవే. ఆయన లోకానికి ఉపకారం చేయడానికై భగవత్ప్రేరణతో జన్మించాడు.

– రమా శ్రీనివాస్

కృతజ్ఞతలు తెలియజేయరా?!

ఇస్లాం సందేశం




ఒక వృద్ధ పండితుడికి కంటిచూపు మందగించింది. కాళ్లుచేతులూ చచ్చుబడ్డాయి. దానికి తోడు చర్మవ్యాధి సోకింది. అంత బాధలోనూ నిత్యం దైవనామస్మరణ చేసేవారు. అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలియజేసేవారు. ఒకసారి ఆయనను పరామర్శించేందుకు వచ్చిన మిత్రుడు- 'ఇంత జబ్బుచేసి మంచానికే పరిమితయ్యావు. అల్లాహ్ నీకేమిచ్చాడని ఆయనకు కృతజ్ఞతలు చెబుతున్నావు?' అనడిగాడు. 'దేవుడు నాకు జన్మనిచ్చాడు. మాట్లాడేందుకు నాలుక ఇచ్చాడు. కృతజ్ఞతలు తెలిపేందుకు హృదయమిచ్చాడు. ఎన్ని రోగాలొచ్చినా తట్టుకునే శక్తి, సహనాలను ఇచ్చాడు' అని బదులిచ్చే సరికి అతడు ఆశ్చర్యంగా చూశాడు. సిరిసంపదలు ఇస్తేనే అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపాలన్నది చాలామంది అపోహ. దైవ కారుణ్యానికి డబ్బే కొలమానం కాదు. చూడటానికి కళ్లు, మాట్లాడటానికి నాలుక, నడవటానికి కాళ్లు, పనులు చేయడానికి చేతులు ఇవన్నీ అల్లాహ్ వరప్రసాదాలే. అవి లేని వారిని చూసి కనువిప్పు పొందాలి. మనకు అల్లాహ్ ప్రసాదించినవాటికి కృతజ్ఞతలు తెలపాలంటే జీవితకాలం సరిపోదు. మన ఆయువుకు, మనం పీల్చే ప్రాణవాయువుకు ఎంత వెలకట్టాలి? పైసా ఖర్చు లేకుండానే శరీర అవయవాలన్నీ తమ పని తాము చేసుకుంటున్నాయి. వాటన్నింటినీ లెక్కకట్టి చెల్లించగలమా? అందువల్లే '..కానీ మీరు చాలా తక్కువగా కృతజ్ఞతలు చెబుతారు' (67:23) అంటోంది ఖురాన్.

– ఖైరున్నీసాబేగం

ఆరొందల అరవయ్యారు ముద్ర వద్దు

క్రీస్తువాణి



బైబిల్‌లో తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అనే ముగ్గురున్నట్లు సాతాను, అంత్యక్రీస్తు, అబద్ధ ప్రవక్తలు కూడా ఉన్నారు. దైవ సన్నిధిలో ఉన్న లూసిఫర్ అనే ప్రధాన దూతకు తాను దేవుని కంటే ఉన్నత స్థితిలో ఉండాలనే దురాలోచన కలిగింది. అది గ్రహించిన దేవుడు- ఆ దూతను కిందికి తోసేశాడు. అదే సాతానుగా కొనసాగుతోంది. దేవుడు సృష్టించిన ఆదామును తన కుయుక్తితో పాపంలో పడతోసింది. ఎందరెందరినో దేవునికి వ్యతిరేకంగా పాపం అనే చట్రంలో బంధించింది. సాతాను ప్రతినిధిగా అంత్యక్రీస్తు వస్తాడు. అతనితోపాటు వచ్చే అబద్ధ ప్రవక్త అంత్యక్రీస్తు గురించి మనకు ఉద్బోధిస్తాడు. అంత్యక్రీస్తు తన స్వచిత్తం ప్రకారం నడచుకునే రాజని, సముద్రంలోంచి పైకి వచ్చే మృగమని చెబుతారు. ఈ మృగం పారశీక, గ్రీకు తదితర సామ్రాజ్యాలను పడదోసిన ఉదంతాలున్నాయి. ఏసుక్రీసు మాత్రం అన్ని విషయాల్లో తండ్రి అయిన దేవుడి చిత్తాన్నే నెరవేర్చాడు. అంత్యక్రీస్తు తన సంఖ్య అయిన ఆరొందల అరవయ్యారు అనే ముద్రను మనం వేసుకునేట్లు చేస్తాడు. రాజకీయాలు, ఆర్థికవ్యవస్థ మొదలైన వాటిని తన అధీనంలోకి తీసుకుంటాడు. అంత్యక్రీస్తు అవతరించిన ప్రమాదకర పరిస్థితుల్లో మనం అప్రమత్తంగా ఉండాలి. అతడికి లోబడక, 666 ముద్ర వేసుకొనక, పరిశుద్ధ జీవితం కొనసాగించాలి. దేవుని నివాస స్థలమైన సీయోనులో ప్రవేశించటానికి సిద్ధంగా ఉండాలి.

– మర్రి ఎ.బాబ్జి


సీత జాడ చెప్పిన సంపాతి

సీతాపహరణ సమయంలో రావణుని ఎదిరించి మరణించింది జటాయువు. ఆ పక్షి అన్న సంపాతి. అంగదుడు, హనుమంతుడితో కూడిన వానరసేన సీతమ్మను అన్వేషిస్తూ.. వింధ్య పర్వతం చేరారు. అక్కడ సంపాతిని కలిసి.. 'సీతాదేవిని చూశావా? వివరం ఏమైనా తెలిస్తే చెప్పు' అనడిగాడు అంగదుడు. 'నాకు దివ్య దృష్టి ఉంది. సీతమ్మను అపహరించిన రావణుని చూశాను. అతడు ఇక్కడికి వంద యోజనాల దూరంలో ఉన్న లంకలో ఉంటాడు. రావణుని అధీనంలో రాక్షస స్త్రీల మధ్య బందీగా ఉంది జానకి. సముద్రం మీద నూరు యోజనాలు దాటగలవారే లంకకి వెళ్లగలరు' అని చెబుతూ.. పక్షులు ఎగిరే ఏడు ఆకాశ మార్గాలను వారికి వివరించాడు సంపాతి. 'పావురాలు, ధాన్యం గింజలు తిని జీవించే పక్షులు భూమికి కొద్ది దూరంలోనే ఎగురుతాయి. అది మొదటి మార్గం. చెట్ల పండ్లు తినే పక్షులు మరికొంత ఎత్తులో ఎగురుతాయి. అది రెండో మార్గం. నీటి కాకులు, క్రౌంచ పక్షులు, లకుముకి పిట్టలు అంతకంటే ఎత్తులో మూడో మార్గంలో సంచరిస్తాయి. అంతకు పైనున్న నాలుగో మార్గంలో డేగలు, ఆ పైనున్న ఐదో మార్గంలో గద్దలు ఎగురుతాయి. బలపరాక్రమాలు, చక్కని రూపం, యవ్వనంలో ఉండే హంసలు ఇంకా పైనున్న ఆరో మార్గంలో పయనిస్తాయి. వినత పుత్రులైన గరుత్మంతుడు, అరుణుడు (సూర్యుడి సారథి) అంత కంటే ఎత్తులో ఏడో మార్గంలో సంచరిస్తారు. మేమంతా వైనతేయ సంతానమే. అందువల్ల ఇక్కడి నుంచి రావణుని, జానకిని స్పష్టంగా చూస్తున్నాను. గరుడుడికి ఉన్నట్టే దివ్య దృష్టి, బలం నాకూ ఉన్నాయి' అంటూ తెలియజేశాడు. అలా సీతమ్మ జాడ తెలిసి సంతోషించారు వానరులు.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు



సాధువు పూజ్యనీయుడు



గోస్వామి తులసీదాసు గొప్ప రామ భక్తుడు. 'రామచరిత మానస్'లో సర్వజనులకూ ఆరాధ్యనీయుడైన శ్రీరాముని జీవన ఘట్టాలతో పాటు సమాజాన్ని సన్మార్గంలో నడిపించే త్యాగధనులను గురించి కూడా ప్రస్తావించారు. మనం అనుసరించాల్సిన నీతినియమాలను సందర్భానుసారం తెలియజేస్తూ.. ధర్మపరిరక్షణ ఎంత ముఖ్యమో తెలియజేశారు. సాధువు ఔన్నత్యాన్ని తులసీదాసు దూదితో పోల్చారు.. 'సాధువుల వ్యక్తిత్వం దూదిలా ఎంతో శుభప్రదమైంది. పక్వానికి వచ్చిన పత్తి కాయ నిర్మలంగా, స్వచ్ఛంగా ఉంటుంది. సాధువు కూడా ఎలాంటి విషయాసక్తులూ లేకుండా నిర్మలంగా ఉంటాడు. పాపాలకు సంకేతమైన అంధకారం అణుమాత్రమైనా ఉండదు. అతడి ఆలోచన, మాటతీరు దూదిలా స్వచ్ఛంగా ఉంటుంది. సద్గుణాలతో నిండి ఉంటుంది. పత్తికాయల నుంచి దూదిని తీసేటప్పుడు, వడికేటప్పుడు, నేసేటప్పుడు.. అది అనేక బాధలు అనుభవించి.. తర్వాత వస్త్రంగా మారుతుంది. అందరికీ రక్షణ ఇస్తుంది. దూది దారంగా మారి, చిరిగిన వస్త్రాలను సరిచేయడంలోనూ తోడ్పడుతుంది. అలాగే సాధువు కూడా తానెన్నో కష్టాలు సహించి.. ఇతరులకు మేలుచేస్తాడు. వారి లోపాలను తొలగిస్తాడు. అందుకే సాధువు కీర్తిని పొందుతాడు, పూజలు అందుకుంటాడు.

– డా.నరసింహారావు కల్యాణి

సమః

వందే విష్ణుం!




విష్ణుసహస్రనామావళిలో 109వది. 'సమః' అంటే అన్నింటిలో సమభావం కలిగినవాడని అర్థం. ఆ స్వామి మార్పు అనేది లేకుండా ఎప్పుడూ సమంగా ఒకే తీరున ఉంటాడు కనుక ఈ నామంతో కీర్తిస్తున్నాం. వికార రహితుడై, ద్వంద్వాలకు అతీతుడై, అందరి పట్లా సమ భావం కలిగిన వాడు ఆ దేవ దేవుడు. 'మార్పు లేకుండా సమంగా ఉండే వాడు' అంటూ ఆది శంకరాచార్యుల వారు కూడా 'సమ' అనే అర్థాన్నే అన్వయించారు.

– వై.తన్వి

కొండెక్కింది..

బుద్ధం శరణం



బౌద్ధంలో మౌనానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. 'మౌనం మనసును ప్రశాంతంగా ఉంచుతుంది. అంతర్ దృష్టికి దారి తీస్తుంది. తన గురించీ, తన చుట్టూ ఉన్నవాటి గురించీ అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది' అంటూ ఆవేళ గురువు చెప్పిన మాటలు ఆశ్రమంలో కొత్తగా చేరిన నలుగురు సన్యాసులను ప్రభావితం చేశాయి. రెండు వారాల పాటు మౌనం పాటిస్తూ ధ్యానం చేయాలని నిర్ణయించుకున్నారు. ఒక పెద్ద దీపం వెలిగించి, మెడిటేషన్ ఆరంభించారు. వాళ్ల దృష్టి ధ్యానం మీద కంటే దీపం మీదే నిలిచింది. కొంతసేపటికి ఆ ప్రమిద రెపరెపలాడి.. ఆరిపోయింది. ఒక సన్యాసి 'అయ్యో.. ఇది కాస్తా పోయిందే' అన్నాడు. 'మనం మాట్లాడకూడదు, మర్చిపోయావా?!' అని రెండో అతనంటే.. మూడో వ్యక్తి 'మీరిద్దరూ మౌనానికి భంగం కలిగించి ఎందుకు మాట్లాడుతున్నారు?' అన్నాడు. నాలుగో అతను నవ్వుతూ 'మీరు ముగ్గురూ నియమం తప్పారు. నేనే మౌనం పాటించాను' అన్నాడు. తమ భావాన్ని వ్యక్తం చేయడానికి ఎవరి కారణాలు వాళ్లకి ఉండొచ్చు గాక.. మొత్తానికి నలుగురు యువ సన్యాసులూ నియమాన్ని ఉల్లంఘించారు. దీపం కొండెక్కటం అనే అతి చిన్న విషయం వాళ్లకి పెద్ద అంతరాయం కలిగించింది. ఒక్కరు కూడా మనసును ధ్యానం మీద కేంద్రీకరించి నిశ్శబ్దంగా ఉండలేకపోయారు.

– నాగరత్న

స్మరించినంతలో పుణ్యం



వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ

మహాకవి కాళిదాసు రఘువంశ కావ్యంలో రాసిన శ్లోకమిది. వాక్కుకు, అర్థానికి అవినాభావ సంబంధం ఉన్నట్టే ఈ జగత్తుకు తల్లిదండ్రులైన పార్వతీ పరమేశ్వరుల మధ్య విడదీయరాని అనుబంధముందని అర్థం. ఇది అర్ధనారీశ్వర తత్త్వాన్నీ, వైభవాన్నీ ప్రకటిస్తోంది. చావు పుట్టుకలు ఎవరికీ తప్పవన్న విషయం తెలిసిందే. పుట్టుకకు కారణం కామం. చావుకు కారణం కాలుడు. కామం కారణంగా కలిగిన దేహం.. కాలం తీరాక నశిస్తోంది. ఈ రెండింటినీ జయించాలంటే పరమేశ్వరుణ్ణి శరణు వేడటం తప్ప మరో మార్గం లేదు. మూడో కన్ను తెరిచి మన్మథుణ్ణి మసి చేసినవాడికి, కాలుణ్ణి కాలితో తన్నిన కాలకాలుడికి ఉత్పత్తి, వినాశనం లేనేలేవు. ఆయన కాలం, జన్మలు, కర్మలకు అతీతుడు. జగత్తుకు సర్వం ప్రసాదించేవాడు ఆ దేవదేవుడే. ఆయన అనుగ్రహం ఉంటే జనన మరణ చక్రం నుంచి విముక్తి కలుగుతుంది.

'ఈశ్వరుడు అర్ధనారీశ్వరుడైనప్పుడు అందులో సగపాలు ఆ తల్లిదే కదా! కామనిగ్రహానికి, కాలుడిపై విజయానికి ఆదిదంపతులైన ఇద్దరినీ సేవించుకోవాలి' అన్నారు చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి. సతి పార్వతీదేవికి తనలో సగభాగమిచ్చి అర్ధనారీశ్వరుడయ్యాడు పరమశివుడు. దీనికి వివరణ శివపురాణంలో కనిపిస్తుంది. వీరిరువురి శక్తివల్ల బ్రహ్మదేవుడి సృష్టికి అతీతంగా జన్మించారు విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యేశ్వరుడు. అంటే ఆది దంపతులు సమస్త సృష్టినీ శాసించగలరని స్పష్టమవుతుంది కదా!

'పార్వతి, ఈశ్వరుడు కూడా శక్తితో కూడినప్పుడే జగాలను సృష్టించగలరు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో కూడా పరిచర్యలు పొందే నిన్ను నావంటి పుణ్యహీనుడు స్తుతించడం ఎలా సాధ్యమౌతుంది?' అంటూ ఆదిశంకరులు సౌందర్య లహరిలో అమ్మవారి ఔన్నత్యాన్నీ, అయ్యవారి ఔదార్యాన్నీ ప్రశంసించారు. ఆ ఆదిదంపతులను స్మరించినంత మాత్రానే పుణ్యం ప్రాప్తిస్తుంది. ఇక ఆరాధించిన వారి జీవితాలు నిత్యకల్యాణం పచ్చతోరణమే.

– నూతి శివానందం

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

ఎంటీపీఎఫ్‌లో టెక్నీషియన్ పోస్టులు

ఆర్మర్డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్‌కు చెందిన మహారాష్ట్ర థానే జిల్లా అంబర్‌నాథ్‌లోని మెషిన్ టూల్ ప్రొటోటైప్ ఫ్యాక్టరీ (ఎంటీపీఎఫ్).. ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన 81 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

▼ జూనియర్ మేనేజర్: 26 ▼ డిప్లొమా టెక్నీషియన్: 34

▼ అసిస్టెంట్: 02 ▼ జూనియర్ టెక్నీషియన్: 19

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, మార్కెటింగ్ అండ్ ఎక్స్‌పోర్ట్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్, సీఎన్‌సీ ఆపరేటర్, టూల్ డిజైన్, గ్రైండర్, ఎలక్ట్రీషియన్.

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంజినీరింగ్ డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.

వేతనం: జూనియర్ మేనేజర్ పోస్టులకు నెలకు రూ.47,610; జూనియర్ టెక్నీషియన్ పోస్టులకు రూ.34,227; మిగతా పోస్టులకు రూ.37,201.

వయసు: 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: స్క్రీనింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ఆర్మర్డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్, మెషిన్ టూల్ ప్రోటోటైప్ ఫ్యాక్టరీ, ఆర్డినెన్స్ ఎస్టేట్, అంబర్‌నాథ్, థానే, మహారాష్ట్ర' చిరునామాకు పంపాలి.

దరఖాస్తు చివరి తేదీ: 11-10-2024.

వెబ్‌సైట్: https://avnl.co.in/

రాష్ట్రీయ రక్ష వర్సిటీలో టీచింగ్ ఖాళీలు

గుజరాత్ రాష్ట్రం, గాంధీనగర్‌లోని రాష్ట్రీయ రక్ష యూనివర్సిటీ .. ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

▮ అసోసియేట్ ప్రొఫెసర్ ▮ అసిస్టెంట్ ప్రొఫెసర్

▮ అసిస్టెంట్ ప్రొఫెసర్ (రిసెర్చ్) ▮ టీచింగ్ కమ్ రిసెర్చ్ ఆఫీసర్

▮ రిసెర్చ్ ఆఫీసర్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, నెట్/ స్లెట్/ సెట్‌తో పాటు బోధనానుభవం.

వేతనం: నెలకు అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.2,00,000-రూ.2,50,000; టీచింగ్ కమ్ రిసెర్చ్ ఆఫీసర్ పోస్టుకు రూ.74,000-రూ.92,000; రిసెర్చ్ ఆఫీసర్ పోస్టుకు రూ.55,000-రూ.70,000; మిగతా పోస్టులకు రూ.90,000-రూ.1,15,000.

ఎంపిక: విద్యార్హత, పని అనుభవం, ఇంటర్వ్యూల ఆధారంగా.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ది అసిస్టెంట్ రిజిస్ట్రార్, హ్యూమన్ రిసోర్స్ సెక్షన్, రాష్ట్రీయ రక్ష యూనివర్సిటీ, దహెగామ్, గాంధీనగర్, గుజరాత్‌కు పంపాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 09-10-2024.

వెబ్‌సైట్: https://rru.ac.in/

విస్తరాకు నుంచి విమానం వరకూ మనం ఉపయోగించే ప్రతి వస్తువూ ఆకర్షణీయంగా, సౌకర్యవంతంగా రూపొందుతున్నాయి. వీటి తయారీలో డిజైన్ నిపుణుల సృజనాత్మకతే కీలకం. దుస్తులు, ఆభరణాలు, కుర్చీలు, సోఫాలు, యంత్రాలు, వాహనాలు, ఆన్‌లైన్ గేమ్‌లు.. ఇలా ప్రతీదీ వీరు సృష్టించినవే. ఆసక్తి, సృజన ఉన్నవారు మేటి సంస్థల్లో కోరుకున్న స్పెషలైజేషన్‌తో డిజైన్ కోర్సులు పూర్తిచేసుకుంటే.. ఆకాశమే హద్దుగా దూసుకుపోవచ్చు!



ఉజ్వల భవితను డిజైన్ చేసుకుంటారా!

అన్ని రంగాలూ ఆకృతి (డిజైన్)తోనే ముడిపడి ఉన్నాయి. అందుకే ఈ విభాగానికి ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ కోర్సుల్లో చేరడానికి విద్యార్థులూ ఆసక్తి చూపుతున్నారు. దేశంలో 2000కు పైగా కళాశాలలు/సంస్థలు ఏదో ఒక డిజైన్ కోర్సు అందిస్తున్నాయి. సాంకేతికత విస్తరించడంతో డిజైన్ మరింత నాణ్యంగా రూపొందించడానికి వీలవుతోంది. ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ కారణంగా గేమ్ డిజైనర్ల ప్రాధాన్యం పెరుగుతోంది. వీరికి వేతనాలూ పెద్ద మొత్తంలో దక్కుతున్నాయి. సృజన, వినూత్న దృక్పథం, ఊహాశక్తి, భావవ్యక్తీకరణ నైపుణ్యం ఉన్నవారు డిజైనర్లుగా రాణించగలరు.

డిజైన్ చదువులు యూజీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయిలో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి ఎన్నో పరీక్షలు ఉన్నాయి. వాటిలో జాతీయ స్థాయిలో నిర్వహించే.. యూసీడ్, డాట్, గాట్ ముఖ్యమైనవి. ఈ పరీక్షల స్కోరుతో ప్రముఖ సంస్థల్లో చదువుకోవచ్చు. ఇతర విద్యా సంస్థలకూ దరఖాస్తు చేసుకోవచ్చు. సీయూఈటీ యూజీతోనూ పలు సంస్థలు అవకాశమిస్తున్నాయి.

ప్రవేశ మార్గాలు

యూసీడ్: ఐఐటీ బాంబే నిర్వహించే అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్ (యూసీడ్)తో ఐఐటీ-బాంబే, గువాహటి, హైదరాబాద్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ - జబల్‌పూర్‌ల్లో ప్రవేశం లభిస్తుంది. ఇంటర్ అన్ని గ్రూపుల విద్యార్థులూ ఈ పరీక్షను రాసుకోవచ్చు. ఎంపికైతే బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (బి.డిస్) కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. దేశవ్యాప్తంగా పలు ఇతర సంస్థలూ ఈ స్కోరుతో ప్రవేశం కల్పిస్తున్నాయి.

డాట్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (నిడ్)లో బ్యాచిలర్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్టు (డాట్) నిర్వహిస్తున్నారు. నిడ్ ప్రధాన క్యాంపస్ అహ్మదాబాద్‌లో ఉంది. ఇక్కడ బీడిజైన్ కోర్సు నడుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ (విజయవాడ), హర్యానా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌ల్లో నాలుగేళ్ల వ్యవధితో గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ డిజైన్ (జీడీపీడీ) కోర్సు అందిస్తున్నారు.

గాట్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్)ల్లో ఫ్యాషన్ టెక్నాలజీతో పాటు డిజైన్ కోర్సులున్నాయి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్టు(గాట్) ద్వారా ప్రవేశం లభిస్తుంది. ఇంటర్, డిప్లొమా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలతో ప్రవేశాలు లభిస్తాయి. పలు ఇతర సంస్థలూ ఈ స్కోరుకు ప్రాధాన్యమిస్తున్నాయి.

స్పెషలైజేషన్లు...

వెబ్ డిజైన్, ఫ్యాషన్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్, ఇండస్ట్రియల్ డిజైన్, అపారెల్ డిజైన్, ఫుట్‌వేర్ డిజైన్, యూఐ/యూఎక్స్ డిజైన్, డిజిటల్ గేమ్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, వీఎల్ఎస్ఐ డిజైన్, జ్యూయలరీ డిజైన్, కమ్యూనికేషన్ డిజైన్, యానిమేషన్ అండ్ ఫిల్మ్ డిజైన్, సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, ఫర్నిచర్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, రిటైల్ ఎక్స్‌పీరియన్స్ డిజైన్, ఇన్ఫర్మేషన్ డిజైన్, ఇంటరాక్షన్ డిజైన్, లైఫ్‌స్టైల్ యాక్సెసరీస్ డిజైన్, న్యూ మీడియా డిజైన్, ఫొటోగ్రఫీ డిజైన్, స్ట్రాటజిక్ డిజైన్ మేనేజ్‌మెంట్, టాయ్ అండ్ గేమ్ డిజైన్, ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ ఆటోమొబైల్ డిజైన్, యూనివర్సల్ డిజైన్ కోర్సులను పలు సంస్థలు యూజీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయిలో అందిస్తున్నాయి. వీటిలో కొన్ని ఇంటర్మీడియట్ ఏ గ్రూపు విద్యార్థులైనా ఎంచుకోవచ్చు. మరికొన్నింటికి ఎంపీసీ నేపథ్యం ఉండాలి.



అవకాశాలిలా...

ఇండస్ట్రియల్ డిజైన్: ఈ కోర్సులు పూర్తిచేసుకున్నవారు తయారీ సంస్థల్లో వస్తువు, ఉత్పత్తిని డిజైన్ చేస్తారు. ఫర్నిచర్, ఇంటీరియర్, ఇంజినీరింగ్ ప్రొడక్టులు, సిస్టమ్స్, కన్జ్యూమర్ గూడ్స్, క్రాఫ్ట్ బేస్డ్ ప్రొడక్ట్స్ యాక్సెసరీస్, పర్సనల్ యూజర్ ప్రొడక్ట్స్ కిచెన్ టూల్స్ అండ్ అప్లయన్సెస్, కొత్త తరం ఎలక్ట్రానిక్స్, ఐటీ, తదితర సంస్థల్లో పనిచేయవచ్చు. ఇండస్ట్రియల్ డిజైన్‌లో.. ప్రొడక్ట్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్ స్పెషలైజేషన్లు ఎంచుకోవచ్చు.

టెక్స్‌టైల్ డిజైన్: దుస్తులతో ప్రత్యేకంగా కనిపించాలనే ఆసక్తి ఎక్కువమందిలో పెరుగుతోంది. వీరి అభిరుచులకు తగ్గట్టుగా టెక్స్‌టైల్ డిజైనర్లు వస్త్రాలను రూపొందిస్తారు. సౌకర్యవంతంగా ఉంటూనే, ఆకర్షణీయంగా ఉండేలా వాటిని తీర్చిదిద్దుతారు. వీరికి టెక్స్‌టైల్ పరిశ్రమలు, రెడీమేడ్ దుస్తుల కంపెనీలు, రిటైల్ సంస్థల్లో అవకాశాలు లభిస్తాయి.

గ్రాఫిక్ డిజైన్: ఈ కోర్సు పూర్తిచేసుకున్నవారు గ్రాఫిక్ డిజైనర్లుగా, బ్రాండ్ ఐడెంటిటీ డెవలపర్లు, లోగో డిజైనర్లు, విజువల్ ఇమేజ్ డెవలపర్లు, మల్టీమీడియా డెవలపర్లు, పబ్లికేషన్ డిజైనర్లుగా పనిచేయవచ్చు. బహుళజాతి కంపెనీలు, అడ్వర్టైజింగ్, ఆన్‌లైన్ మీడియా, టీవీ, వినోద పరిశ్రమల్లో వీరికి ఉద్యోగాలుంటాయి.

యూజర్ ఎక్స్‌పీరియన్స్ డిజైన్: ఈ కోర్సులు పూర్తిచేసుకున్నవారు సాఫ్ట్‌వేర్, ఆన్‌లైన్ మీడియా సంస్థల్లో కొలువులు పొందగలరు.

యానిమేషన్ ఫిల్మ్ డిజైన్: అడ్వర్టైజింగ్, ఎక్స్‌పరిమెంటల్ యానిమేషన్, వీఎఫ్ఎక్స్, 2డీ, 3డీ యానిమేషన్, ప్రీ ప్రొడక్షన్, బుల్లితెర, వెండితెర, మార్కెటింగ్, ఈ- కంటెంట్ డెవలప్‌మెంట్ సంస్థల్లో పని చేయవచ్చు.

వీడియో ఫిల్మ్ డిజైన్: ఫిల్మ్, టెలివిజన్, అడ్వర్టైజింగ్ పరిశ్రమల్లో ప్రొడ్యూసర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, డైరెక్టర్లు, సినిమాటోగ్రాఫర్, ఎడిటర్లుగా పనిచేయవచ్చు. సొంతగా వీడియో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. పెళ్లిళ్లు, పుట్టినరోజు, గృహ ప్రవేశాలు...ఇలా ప్రతి సందర్భంలోనూ వీడియో షూట్ తప్పనిసరిగా మారింది. నైపుణ్యం ఉన్నవారు చేతినిండా అవకాశాలు అందుకోవచ్చు.

ఫ్యాషన్ డిజైన్: ఈ కోర్సులు చదివినవారికి దుస్తులు తయారుచేసే కంపెనీల్లో మేటి అవకాశాలు లభిస్తాయి. అవుట్‌లెట్ ఏర్పాటు చేసుకోవచ్చు. కొంత అనుభవంతో.. డిజైన్ కన్సల్టెంట్, స్టైలిస్ట్, కస్టమర్ డిజైనర్, ఫ్యాషన్ ఫోర్ కాస్టర్, ఇలస్ట్రేటర్, ఆంత్రప్రెన్యూర్, అకడమీషియన్, ఫ్యాషన్ మర్చండైజర్, బయ్యర్లగా కొనసాగవచ్చు.

కమ్యూనికేషన్ డిజైన్: యానిమేషన్ అండ్ ఫిల్మ్ డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్ ఇందులో భాగంగా ఉంటాయి. ప్రకటన, ఆన్‌లైన్ మీడియా, వినోద పరిశ్రమల్లో అవకాశాలు లభిస్తాయి.

లెదర్ డిజైన్: పాదరక్షలు, బెల్టులు, బ్యాగులకు.. ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉంది. ఈ విభాగాల్లో దేశీయ సంస్థలతోపాటు బహుళ జాతి సంస్థలెన్నో ఉత్పత్తులు తయారు చేస్తున్నాయి. అందువల్ల అవకాశాలు విస్తృతం.

ప్రొడక్ట్ డిజైన్: పరిశ్రమ అవసరాలు, దైనందిన జీవితంలో ఉపయోగపడే వస్తువులు, ఇంట్లో, కార్యాలయాల్లో ఉపయోగించే పరికరాలు, ఆసుపత్రుల్లో వినియోగించేవి.. ఇలా మనం ఉపయోగిస్తున్న వస్తువులన్నీ ప్రొడక్ట్ డిజైన్ విభాగంలోకి వస్తాయి. ప్రొడక్ట్ డిజైనర్లు పరిశ్రమలు, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు రూపొందిస్తారు. మరింత సులువుగా ఉపయోగించేలా, మన్నిక ఎక్కువగా ఉండేలా, నిర్వహణ భారం లేకుండా, తక్కువ పరిమాణంలో ఉండేలా, కొద్ది మొత్తంతోనే ఆ ఉత్పత్తి రూపొందుతుంది. వీరికి అన్ని రకాల వస్తు తయారీ పరిశ్రమల్లోనూ అవకాశాలు లభిస్తాయి.

డిజైన్ విభాగంలో ఏ స్పెషలైజేషన్ తీసుకున్నప్పటికీ అవకాశాలకు ఢోకాలేదు. మేటి సంస్థల్లో చదువుకున్నవారిని పలు బహుళజాతి కంపెనీలు, దేశీయ సంస్థలు క్యాంపస్ నియామకాల ద్వారా అధిక వేతనంతో ఉద్యోగాలిస్తున్నాయి.

కొన్ని సంస్థలు: శ్రేష్ఠ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్, డిజైన్ అండ్ టెక్నాలజీ; పెర్ల్ అకాడెమీ, యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్, సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, విట్ యూనివర్సిటీ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, రాంచీ యూనివర్సిటీ, అమిటీ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ, గాల్గోటియా యూనివర్సిటీ.

ఐటీఐ తర్వాత డిప్లొమా?

మా అబ్బాయి ఐటీఐ ఎలక్ట్రికల్ చదివి ప్రస్తుతం అప్రెంటిస్‌గా చేస్తున్నాడు. ఇది మూడు నెలల్లో పూర్తవుతుంది. తర్వాత డిప్లొమా చేయిస్తే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగావకాశాలు బాగుంటాయా? – టి.శ్రీనుబాబు, విశాఖపట్నం



■ అప్రెంటిస్‌షిప్ పూర్తయిన తరువాత మీ అబ్బాయిని ఐటీఐ విద్యార్హతతో ఏదైనా ఉద్యోగం కొంతకాలం పాటు చేయించండి. ఈ క్రమంలో ఉద్యోగానుభవంతో పాటు వృత్తి నైపుణ్యాలు కూడా మెరుగవుతాయి. ఆ తరువాత డిప్లొమా, ఇంజినీరింగ్ చదివించే ప్రయత్నం చేయండి. ఉన్నత విద్య చదవడం వల్ల ఉపయోగమే కానీ నష్టం ఉండదు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా చేసినవారికి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు ఉంటాయి. ఎలక్ట్రికల్ డిప్లొమా చేసినవారు జూనియర్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్, మెయింటెనెన్స్ టెక్నీషియన్, డిజైన్ ఇంజినీర్, పవర్ ప్లాంట్ ఆపరేటర్, టెక్నికల్ సపోర్ట్ ఇంజినీర్, ఆటోమేషన్ టెక్నీషియన్ లాంటి ఉద్యోగాలకోసం ప్రయత్నించవచ్చు. సాధారణంగా ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిప్లొమా చదివినవారికి ప్రభుత్వ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, మున్సిపల్ కార్పొరేషన్, రైల్వేస్, ప్రభుత్వ రంగ సంస్థలు, డిఫెన్స్, ఇస్రో, డీఆర్‌డీఓ, ఎయిర్‌పోర్టుల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఇవే కాకుండా వివిధ ప్రైవేటు మాన్యుఫాక్చరింగ్ సంస్థల్లో, సిమెంట్ కంపెనీల్లో, భవన నిర్మాణ సంస్థల్లో, ట్రాన్స్‌ఫార్మర్ తయారీ, సోలార్ పవర్, ఆటోమొబైల్ కంపెనీల్లో కూడా కొలువులుంటాయి. స్వయం ఉపాధిపై ఆసక్తి ఉంటే సొంతంగా కాంట్రాక్టులూ చేయవచ్చు. డిగ్రీలు, సర్టిఫికెట్లతో పాటు, నైపుణ్యాలు కూడా ఉంటేనే మెరుగైన ఉద్యోగాలు పొందే అవకాశాలు ఉంటాయని గుర్తుంచుకోవాలి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఐఓసీలో లా ఆఫీసర్లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) 12 లా ఆఫీసర్ (గ్రేడ్-ఏ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.



విద్యార్హతలు: ఏదైనా డిగ్రీ, ఎల్ఎల్‌బీ పూర్తిచేయాలి. లేదా ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ డిగ్రీ. గ్రాడ్యుయేషన్, ఎల్ఎల్‌బీ జనరల్/ ఈడబ్ల్యూఎస్/ ఓబీసీ (ఎన్‌సీఎల్) అభ్యర్థులు 60 శాతం మార్కులతో, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు 55 శాతం మార్కులు సరిపోతాయి.

జూన్ 30, 2024 నాటికి అభ్యర్థుల వయసు 30 సంవత్సరాలు మించకూడదు. గరిష్ఠ వయసులో ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

కోర్టులు, ట్రైబ్యునళ్లలో న్యాయవాదిగా పనిచేసిన అనుభవం ఉండాలి. ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న వాళ్లు.. 'ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్'ను ధ్రువపత్రాల పరిశీలన సమయంలో సమర్పించాలి.

◗ ఇంటర్న్‌షిప్, బోధన, పార్ట్‌టైమ్ వర్క్‌ను పని అనుభవంగా పరిగణించరు.

◗ అమల్లో ఉన్న చట్టాలు, నియమ నిబంధనల గురించి అవగాహన,

రాత, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, ఆయిల్, గ్యాస్/పెట్రోకెమికల్ పరిశ్రమలో పనిచేసిన అనుభవం, క్లిష్టమైన లీగల్ డాక్యుమెంట్లను రాయడంలో నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు.

ఎంపిక

పీజీ క్లాట్ 2024 పీజీ పరీక్షలో సంపాదించిన మార్కులు, గ్రూప్ డిస్కషన్ (జీడీ), గ్రూప్ టాస్క్ (జీటీ), పర్సనల్ ఇంటర్వ్యూ (పీఐ) ఆధారంగా ఎంపిక చేస్తారు.

● పీజీ క్లాట్-2024లో సాధించిన మార్కుల ఆధారంగా గ్రూప్ డిస్కషన్, గ్రూప్ టాస్క్, ఇంటర్వ్యూలకు కేటగిరీలవారీగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

● విద్యార్హతలు, అనుభవానికి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను గ్రూప్ డిస్కషన్, గ్రూప్ టాస్క్, ఇంటర్వ్యూల సమయంలో సిద్ధంగా ఉంచుకోవాలి.

● పీజీ క్లాట్ 2024లో సాధించిన మార్కులకు 85 శాతం, గ్రూప్ డిస్కషన్, గ్రూప్ టాస్క్‌లకు 5 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 10 శాతం వెయిటేజీ ఇస్తారు.

● ఎంపికైనవారి వేతన శ్రేణి నెలకు రూ.50,000 నుంచి 1,60,000 వరకూ ఉంటుంది. పనిచేసే ప్రదేశం, ఉద్యోగి పనితీరు ఆధారంగా వేతనం పెరిగే అవకాశం ఉంటుంది. వేతనంతోపాటు డీఏ, హెచ్ఆర్ఏ/ వసతి, వైద్య సదుపాయం, గ్రాట్యుటీ, సీపీఎఫ్, ఈపీఎస్, ఇన్సూరెన్స్, ఎల్‌టీసీ.. ఇతర సదుపాయాలూ ఉంటాయి.

గమనించాల్సినవి:

▲ దరఖాస్తు ఫీజు లేదు.

▲ విద్యార్హతలు, అనుభవం ఆధారంగా తయారుచేసిన షార్ట్‌లిస్టులోని అభ్యర్థులకు.. జీడీ, జీటీ, పీఐ వివరాలను తెలియజేస్తారు.

▲ గ్రూప్ డిస్కషన్ సమయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 08.10.2024

వెబ్‌సైట్: https://iocl.com/

డీఆర్‌డీఓ రిసెర్చి సెంటర్లో..

హైదరాబాద్‌లోని డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ)కు చెందిన రిసెర్చ్ సెంటర్ ఇమారత్ .. ఏడాది అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను కోరుతోంది.

◗ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 40

◗ టెక్నీషియన్ అప్రెంటిస్: 40

◗ ట్రేడ్ అప్రెంటిస్: 120

మొత్తం ఖాళీలు: 200

విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, కెమికల్, కమర్షియల్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ/ బీటెక్‌తో పాటు పని అనుభవం.

వయసు: 01.08.2024 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ప్రకటన వెలువడిన తేదీ (25.9.2024) నుంచి 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: https://www.drdo.gov.in/



తాజా ఇంటర్న్‌షిప్‌లు

సికింద్రాబాద్, హైదరాబాద్‌లలో

బ్యాంకింగ్ ప్రీ–సేల్స్

సంస్థ: వియ్‌మేక్‌స్కాలర్స్
నైపుణ్యం: బ్యాంకింగ్ ప్రీ-సేల్స్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 10
☛ internshala.com/i/5b0ecf

హైదరాబాద్‌లో

వ్లాగింగ్ అండ్ కంటెంట్ క్రియేటర్

సంస్థ: మట్కా ఫుడ్స్ ఎంటర్‌ప్రైజ్
నైపుణ్యాలు: కంటెంట్ మార్కెటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ స్టైపెండ్: రూ.18,000
☛ internshala.com/i/22d1bf

అఫాక్ క్లినిక్స్‌లో..

1. హోటల్ మేనేజ్‌మెంట్

నైపుణ్యం: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్
స్టైపెండ్: రూ.7,000-10,000
☛ internshala.com/i/7ae477

2. ఆపరేషన్స్

నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫైనాన్షియల్ లిటరసీ, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 9
☛ internshala.com/i/eb35c5

ఇన్సూరెన్స్ ఆడిటర్ – డెంటల్ క్లినిక్

సంస్థ: టుడేస్ డెంటల్ సర్వీసెస్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.15,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 14
☛ internshala.com/i/b0c04e

ఆపరేషన్స్

సంస్థ: టీ-హబ్ ఫౌండేషన్
నైపుణ్యాలు: బిజినెస్ రిసెర్చ్, ఆపరేషన్స్, పెర్ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/0cb48b

వెండర్ ఎంగేజ్‌మెంట్

సంస్థ: జీగ్లర్ ఏరోస్పేస్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫైనాన్షియల్ లిటరసీ, ఎంఎస్- ఎక్సెల్
స్టైపెండ్: రూ.8,000
☛ internshala.com/i/c01f73

జూనియర్ మోషన్ డిజైనర్

సంస్థ: మైండ్‌మ్యాప్ కన్సల్టింగ్
నైపుణ్యం: జూనియర్ మోషన్ డిజైనర్ స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/096374

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: సోషియం
నైపుణ్యాలు: డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/d5fc1c

8వ్యూస్ సంస్థలో

1. కంటెంట్ రైటర్

నైపుణ్యాలు: బ్లాగింగ్, కంటెంట్ రైటింగ్, కాపీరైటింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.8,000-10,000
☛ internshala.com/i/e78685

2. పెర్ఫార్మెన్స్ మార్కెటింగ్ (యాడ్స్)

నైపుణ్యాలు: డిజిటల్ అడ్వర్‌టైజింగ్, డిజిటల్ మార్కెటింగ్, ఫేస్‌బుక్ యాడ్స్, గూగుల్ యాడ్‌వర్డ్స్, లీడ్ జనరేన్, యూట్యూబ్ యాడ్స్
స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 12
☛ internshala.com/i/29f9ba

ప్రొబేషనరీ ఆఫీసరు అవుతారా?

ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. 40 ప్రొబేషనరీ ఆఫీసరు పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారు.

మొత్తం ఉద్యోగాల్లో అన్‌రిజర్వ్‌డ్‌కు 16, ఈడబ్ల్యూఎస్‌లకు 3, ఓబీసీలకు 11, ఎస్సీలకు 6, ఎస్టీలకు 4 కేటాయించారు. ఏదైనా డిగ్రీ పాసై వయసు 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. గరిష్ఠ వయసులో.. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్లు, మాజీ సైనికోద్యోగులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది. దరఖాస్తు ఫీజు రూ.900. ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీలకు రూ.175.

ఎంపిక

ఆన్‌పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్‌లో 200 మార్కులకు మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. రెండోది డిస్క్రిప్టివ్ పేపర్. దీనికి 40 మార్కులు.

◆ రీజనింగ్ ఎబిలిటీ 50 ప్రశ్నలు (50 మార్కులు), వ్యవధి 40 నిమిషాలు; ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు (40 మార్కులు), వ్యవధి 30 నిమిషాలు; కంప్యూటర్ నాలెడ్జ్ 20 ప్రశ్నలు (20 మార్కులు), వ్యవధి 10 నిమిషాలు; జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు (40 మార్కులు), వ్యవధి 20 నిమిషాలు; క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు (50 మార్కులు), వ్యవధి 40 నిమిషాలు. ప్రశ్నపత్రం మొత్తం 200 మార్కులకు ఉంటుంది. వ్యవధి 140 నిమిషాలు.

◆ డిస్క్రిప్టివ్ పేపర్ (ఇంగ్లిష్ లాంగ్వేజ్ పరీక్ష)లో రెండు ప్రశ్నలకు 40 మార్కులు, వ్యవధి 40 నిమిషాలు.

◆ ఎస్సే రైటింగ్‌కు 20 మార్కులు, ప్రెసీ రైటింగ్‌కు 20 మార్కులు. రెండు ప్రశ్నలకూ రెండు ఆప్షన్లు ఇస్తారు. ఒకదాన్ని ఎంచుకుని రాయాలి.

◆ ఆబ్జెక్టివ్ పరీక్షలో పాసైనవారికి మాత్రమే డిస్క్రిప్టివ్ నిర్వహిస్తారు.

◆ ఆబ్జెక్టివ్ టెస్ట్‌లో తప్పు సమాధానాలకు పావు మార్కు తగ్గిస్తారు.

◆ ఆన్‌లైన్ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

◆ ఇంటర్వ్యూలో జనరల్ అభ్యర్థులు 40 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ/ పీడబ్ల్యూబీడీలు 35 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.

◆ ఆన్‌లైన పరీక్ష, ఇంటర్వ్యూలకు 80:20 నిష్పత్తిలో వెయిటేజీ ఇస్తారు.

సన్నద్ధత ఎలా?

ప్రశ్నపత్రం మొత్తానికి ఒక సమయం కాకుండా.. ప్రతి సెక్షన్‌కూ ప్రత్యేక సమయాన్ని నిర్దేశించారు. కాబట్టి వేగంగా సమాధానాలను గుర్తించడం సాధన చేయాలి.

● బ్యాంకు, రైల్వే పోటీ పరీక్షల పాత ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. దీంతోపాటుగా ఏ సెక్షన్‌కు ఎంత సమయం తీసుకుంటున్నారో చూసుకోవాలి. అదనపు సమయం అవసరమైనవాటిని మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

● నెగటివ్ మార్కులు ఉన్నాయి కాబట్టి తెలిసిన వాటి మాత్రమే సమాధానాలు రాయాలి.


● మాక్ టెస్టులు ఎక్కువగా రాయడం వల్ల ప్రయోజనం ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: 13.10.2024 **ఆన్‌లైన్ రాత పరీక్ష:** 16.11.2024

ప్రీ ఎగ్జామినేషన్ ట్రెయినింగ్: 28.10.2024

పరీక్ష కేంద్రాలు: దేశవ్యాప్తంగా 23 కేంద్రాల్లో.. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, వైజాగ్‌లలో పరీక్ష నిర్వహిస్తారు. **వెబ్‌సైట్:** www.ecgc.in

శరీర, బాహ్య వాతావరణం మధ్య ఆక్సిజన్, కార్బన్ డైఆక్సైడ్ మార్పిడికి శ్వాసకోశ వ్యవస్థ బాధ్యత వహిస్తుంది. ఈ వ్యవస్థ వాయువుల మార్పిడిలో కీలకపాత్ర పోషిస్తుంది. ఇది కణ శ్వాసక్రియకు, మొత్తం జీవక్రియకు చాలా ముఖ్యమైంది. ఇది శరీరంలోకి ఆక్సిజన్ కదలికకు తోడ్పడుతుంది. అలాగే జీవక్రియల్లో వ్యర్థ ఉత్పత్తి అయిన కార్బన్ డైఆక్సైడ్‌ను తొలగిస్తుంది. శ్వాసక్రియగా పిలిచే ఈ ప్రక్రియలో అనేక సంక్లిష్ట శారీరక విధానాలు ఉంటాయి.



శ్వాసకోశ రుగ్మతలు

అనేక శ్వాసకోశ రుగ్మతలు శ్వాసకోశ వ్యవస్థ పనితీరును ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు..

- ఆస్తమా: శ్వాసనాళాల వాపు, సంకుచితం లాంటి దీర్ఘకాలిక పరిస్థితి.
- క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (COPD): గాలి ప్రవాహానికి ఆటంకం కలిగించే వ్యాధి.
- న్యుమోనియా: తరచుగా ఇన్ఫెక్షన్ వల్ల ఊపిరితిత్తుల వాపు వస్తుంది
- ఊపిరితిత్తుల క్యాన్సర్: ఊపిరితిత్తుల కణజాలానికి ప్రాణాంతక కణితి.

ఊపిరితిత్తుల్లో వాయువుల మార్పిడికి ఏ నిర్మాణం బాధ్యత వహిస్తుంది?

ఏపీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

బయాలజీ

శ్వాసకోశ వ్యవస్థ

శ్వాసకోశ వ్యవస్థ - శరీర నిర్మాణాలు

శ్వాసకోశ వ్యవస్థలో కింద పేర్కొన శరీర నిర్మాణాలు కీలకమైనవి.

నాసికా కుహరం, అస్య కుహరం: ఇవి శ్వాసకోశ వ్యవస్థలోకి గాలి వెళ్లేందుకు ప్రవేశ బిందువులు.

ఫారింక్స్: గాలి, ఆహారం రెండింటికీ మార్గంగా పనిచేసే కండరాల గొట్టం.

స్వరపేటిక: ఇందులో స్వర తంతువులు ఉంటాయి.

శ్వాసనాళం: స్వరపేటిక నుంచి శ్వాసనాళికకు గాలిని తీసుకువెళ్లే గొట్టం. ఇది రెండుగా విభజితమై ఉంటుంది. ఒక్కొక్కటి ఒక్కో ఊపిరితిత్తికి దారితీస్తుంది.

బ్రాంకియోల్స్: శ్వాసనాళం బ్రాంకియోల్స్‌గా పిలిచే చిన్నచిన్న గొట్టాలుగా విభజితమైంది.

అల్వియోలీ: బ్రాంకియోల్స్ చివరన ఉండే చిన్న గాలి సంచులు. ఇక్కడ వాయు మార్పిడి జరుగుతుంది.

ఊపిరితిత్తులు: శ్వాసక్రియలో ఇవి ప్రాథమిక అవయవాలు. బ్రాంకియోల్స్, అల్వియోలీలను కలిగి ఉంటాయి.

డయాఫ్రమ్: శ్వాస తీసుకోవడంలో కీలకపాత్ర పోషించే గోపురం ఆకారంలో ఉండే కండరం.

వాయు మార్పిడి

అల్వియోలీ స్థాయిలో వాయు మార్పిడి జరుగుతుంది. ఆక్సిజన్ అల్వియోలీ నుంచి రక్తంలోకి వ్యాపిస్తుంది. అయితే కార్బన్ డైఆక్సైడ్ రక్తం నుంచి అల్వియోలీలోకి వ్యాపిస్తుంది. వాయు మార్పిడి రేటును అనేక కారకాలు ప్రభావితం చేస్తాయి. వీటిలో ముఖ్యమైనవి...

పాక్షిక పీడనం: వాయువు కంటైనర్‌కి చెందిన మొత్తం వాల్యూమ్‌ను ఆక్రమించినట్లయితే అది కలిగించే పీడనమే వాయువు పాక్షిక పీడనం. ఆక్సిజన్ రక్తంలో కంటే అల్వియోలీలో అధిక పాక్షిక పీడనాన్ని కలిగి ఉంటుంది. అయితే కార్బన్ డైఆక్సైడ్ అల్వియోలీలో కంటే రక్తంలో ఎక్కువ పాక్షిక పీడనం కలిగి ఉంటుంది.

వ్యాప్తి ప్రవణతలు: వాయు వ్యాప్తి రేటు పొర రెండు వైపుల పాక్షిక పీడనాల వ్యత్యాసానికి అనులోమానుపాతంలో ఉంటుంది.

ఉపరితల వైశాల్యం: అల్వియోలీ మొత్తం ఉపరితల వైశాల్యం విస్తారంగా ఉంటుంది. ఇది వాయు మార్పిడిని సులభతరం చేస్తుంది.

అల్వియోలార్ - క్యాపిల్లరీ త్వచ మందం: పొర చాలా సన్నగా ఉంటుంది. ఇది సమర్థవంతమైన వ్యాప్తిని అనుమతిస్తుంది.

శ్వాసక్రియ యాంత్రికం

శ్వాస అనేది మెదడులోని శ్వాసకోశ కేంద్రాలతో నియంత్రితమయ్యే ఒక లయ ప్రక్రియ. ఇందులో రెండు ప్రధాన దశలు ఉంటాయి.

ఉచ్ఛ్వాసం: ఉచ్ఛ్వాసం వల్ల డయాఫ్రమ్ సంకోచిస్తుంది. కింది భాగం చదును అవుతుంది.

- పక్కటెముకల మధ్య కండరాలు కుదింపునకు గురవుతాయి. థొరాసిక్ కుహరం విస్తరిస్తుంది.
- ఇది ఊపిరితిత్తుల్లో ప్రతికూల ఒత్తిడిని సృష్టిస్తుంది. దీనివల్ల ముక్కు లేదా నోటి ద్వారా గాలి ప్రవహిస్తుంది.

నిశ్వాసం: ఇందులో డయాఫ్రమ్ రిలాక్స్ అవుతుంది. అది దాని గోపురం ఆకారానికి తిరిగి వస్తుంది.

- ఇంటర్‌కాస్టల్ కండరాలు కూడా రిలాక్స్ అవుతాయి.
- ఇది ఊపిరితిత్తుల్లో ఒత్తిడిని పెంచుతుంది. గాలిని బలవంతంగా బయటకు పంపుతుంది.

శ్వాసక్రియ నియంత్రణ

మెదడులోని శ్వాసకోశ కేంద్రాలు మెడుల్లా అబ్లాంగేటా, పోన్స్‌లో ఉంటాయి. ఇవి శ్వాస రేటు, లోతును నియంత్రిస్తాయి. ఈ కేంద్రాలు వివిధ ఉద్దీపనలకు ప్రతిస్పందిస్తాయి.

- రక్త వాయువు స్థాయిలు: రక్తంలో ఆక్సిజన్, కార్బన్ డైఆక్సైడ్ పాక్షిక పీడనాల్లో వచ్చే మార్పులు శ్వాస రేటును ప్రేరేపిస్తాయి.
- pH: రక్తంలో pH తగ్గుదల (అసిడోసిస్) కార్బన్ డైఆక్సైడ్‌ను తొలగించడానికి శ్వాసను ప్రేరేపిస్తుంది.
- ప్రొప్రియోసెప్టర్లు: కండరాలు, కీళ్లలోని ఇంద్రియ గ్రాహకాలు శరీర కదలిక, భంగిమ గురించి శ్వాసకోశ కేంద్రాలకు సూచిస్తాయి.
- భావోద్వేగ స్థితి: ఒత్తిడి, ఆందోళన ఇతర భావోద్వేగ కారకాలు శ్వాస విధానాలను ప్రభావితం చేస్తాయి.

శ్వాసకోశ వాయువుల రవాణా

- ఆక్సిజన్ రవాణా: 98.5% ఆక్సిజన్ ఎర్ర రక్తకణాల్లో హిమోగ్లోబిన్ సహాయంతో రక్తంలోకి వెళుతుంది. హిమోగ్లోబిన్ నాలుగు ఆక్సిజన్ అణువులను మోయగలదు. ఆక్సిజన్‌ను హిమోగ్లోబిన్‌తో బంధించి ఉంచడం అనేది ఆక్సిజన్, pH, ఉష్ణోగ్రత, కార్బన్ డైఆక్సైడ్ స్థాయుల పాక్షిక పీడనం ద్వారా ప్రభావితమవుతుంది. మిగిలిన 1.5% ఆక్సిజన్ నేరుగా ప్లాస్మాలో కరిగిపోతుంది.
- కార్బన్ డైఆక్సైడ్ రవాణా: రక్తంలో CO_2 రవాణా మూడు రూపాల్లో జరుగుతుంది.
- కరిగిన CO_2: దాదాపు 7-10% CO_2 ప్లాస్మాలో కరిగిపోతుంది.
- కార్బమినోహిమోగ్లోబిన్: దాదాపు 20-30% CO_2 హిమోగ్లోబిన్‌లో కరుగుతుంది.
- బైకార్బోనేట్ అయాన్ (HCO_3^-): CO_2లో ఎక్కువ భాగం (60-70%) రక్తంలో బైకార్బోనేట్ అయాన్‌లుగా మారుతుంది. కార్బోనిక్ అన్‌హైడ్రేస్ అనే ఎంజైమ్ ఉత్ప్రేరక చర్య ద్వారా CO_2, నీటిని కార్బోనిక్ యాసిడ్ (H_2CO_3)గా మారుస్తుంది. కార్బోనిక్ యాసిడ్ హైడ్రోజన్ అయాన్లు (H^+), బైకార్బోనేట్ అయాన్లుగా విడిపోతుంది.

వివిధ జీవుల్లో శ్వాసకోశ అవయవాలు

వివిధ జీవుల్లో వాటి పరిసరాలకు, జీవనశైలికి అనుగుణంగా శ్వాసకోశ అవయవాలు విస్తృతంగా ఉంటాయి.

- ఊపిరితిత్తులు: క్షీరదాల్లో ఊపిరితిత్తులు ఉంటాయి. ఇవి అల్వియోలీ ద్వారా వాయు మార్పిడిని సులభతరం చేస్తాయి. ఇక్కడ ఆక్సిజన్, కార్బన్ డైఆక్సైడ్ రక్తంతో మార్పిడికి గురవుతాయి.
- చాలా సరీసృపాలు క్షీరదాల మాదిరిగానే ఊపిరితిత్తులను కలిగి ఉంటాయి. కానీ తక్కువ సామర్థ్యంతో ఉంటాయి. కొన్ని పాములు తమ చర్మం ద్వారా కూడా ఆక్సిజన్‌ను కొంతవరకు గ్రహించగలవు.
- ఊపిరితిత్తులు, గాలి సంచులు: పక్షుల్లో ఊపిరితిత్తులు, గాలి సంచులను కలిగిన ప్రత్యేకమైన శ్వాసకోశ వ్యవస్థ ఉంటుంది. ఇది ఊపిరితిత్తుల ద్వారా నిరంతర గాలి ప్రవాహాన్ని అనుమతిస్తుంది. ఇది అధిక - శక్తి వినిమయానికి మరింత ప్రభావవంతంగా ఉంటుంది.
- ఊపిరితిత్తులు, చర్మం: కప్పలు లాంటి ఉభయచరాలు వయోజన శ్వాసక్రియ కోసం ఊపిరితిత్తులను కలిగి ఉంటాయి. అయితే తేమతో కూడిన వాతావరణంలో ఉన్నప్పుడు చర్మసంబంధమైన శ్వాసక్రియ (చర్మం ద్వారా వాయు మార్పిడి)పై ఎక్కువగా ఆధారపడతాయి.
- మొప్పలు: చేపలు మొప్పల మీదుగా నీటిని పంపడం ద్వారా ఊపిరి పీల్చుకుంటాయి. ఇక్కడ నీటి నుంచి ఆక్సిజన్‌ను సంగ్రహిస్తాయి. కార్బన్ డైఆక్సైడ్‌ను వెలువరిస్తాయి. చేపల మాదిరిగానే చాలా క్రస్టేషియన్లు నీటి నుంచి ఆక్సిజన్‌ను గ్రహించడానికి వాటి థొరాసిక్ ప్రాంతంలో మొప్పలను కలిగి ఉంటాయి.
- శ్వాసనాళ వ్యవస్థ: కీటకాలు ట్రాకియాలుగా పేర్కొనే గొట్టాలను ఉపయోగిస్తాయి. ఇవి ప్రసరణ వ్యవస్థ లేకుండా నేరుగా కణజాలాలకు గాలిని రవాణా చేస్తాయి.
- పుస్తకాకార ఊపిరితిత్తులు, శ్వాసనాళాలు: అనేక సాలెపురుగులు, తేళ్లు పుస్తక ఊపిరితిత్తులను కలిగి ఉంటాయి (వాయు మార్పిడి కోసం ఏర్పడిన నిర్మాణాలు), శ్వాసనాళాలు కూడా ఉండవచ్చు.
- చర్మసంబంధమైన శ్వాసక్రియ: వానపాములు తమ చర్మం ద్వారా ఊపిరి పీల్చుకుంటాయి, సమర్థవంతమైన వాయు మార్పిడికి తేమతో కూడిన వాతావరణం అవసరం.

శ్వాసకోశ వ్యవస్థ ప్రధాన విధులు

- వాయు వినిమయం: ఆక్సిజన్‌ను శరీరంలోకి గ్రహించి, కార్బన్ డైఆక్సైడ్‌ను బయటకు పంపిస్తుంది.
- pH నియంత్రణ: శ్వాసకోశ వ్యవస్థ CO_2 స్థాయులను నియంత్రించడం ద్వారా శరీర pHని నియంత్రించడంలో సహాయపడుతుంది.
- ధ్వని ఉత్పత్తి: స్వరపేటిక (వాయిస్ బాక్స్) ఉచ్ఛ్వాస సమయంలో ధ్వని ఉత్పత్తిలో పాల్గొంటుంది.
- రక్షణ అందించడం: శ్వాసనాళం మ్యూకోసిలియరీ క్లియరెన్స్ ద్వారా పీల్చే వ్యాధికారక, కణాలకు వ్యతిరేకంగా రక్షణ కల్పిస్తుంది.
- ఘ్రాణ శక్తి: నాసికా కుహరం వాసనను గ్రహించడానికి ఘ్రాణ గ్రాహకాలను కలిగి ఉంటుంది .



రచయిత
కొర్లాం సాయివెంకటేష్,
అసిస్టెంట్ ప్రొఫెసర్

మాదిరి ప్రశ్నలు

1. శ్వాసకోశ వ్యవస్థ ప్రాథమిక విధి ఏమిటి?
ఎ) రక్త ప్రసరణ బి) వాయు మార్పిడి సి) పోషకాల శోషణ డి) వ్యర్థాల తొలగింపు
2. ఊపిరితిత్తుల్లో వాయువుల మార్పిడికి ఏ నిర్మాణం బాధ్యత వహిస్తుంది?
ఎ) శ్వాసనాళం బి) అల్వియోలీ సి) శ్వాస కుహరం డి) స్వరపేటిక
3. శ్వాసక్రియలో పాల్గొనే ప్రాథమిక కండరం ఏది?
ఎ) డయాఫ్రమ్ బి) ఇంటర్ కోస్టల్ కండరాలు సి) ఉదర కండరాలు డి) పెక్టోరల్ కండరాలు
4. గాలి మొదట శ్వాసకోశ వ్యవస్థలోని ఏ భాగంలోకి ప్రవేశిస్తుంది?
ఎ) ఊపిరితిత్తులు బి) శ్వాసనాళం సి) నాసికా కుహరం డి) స్వరపేటిక
5. ఎర్ర రక్త కణాల్లో హిమోగ్లోబిన్ ద్వారా ప్రధానంగా ఏ వాయువు రవాణా అవుతుంది?
ఎ) కార్బన్ డై ఆక్సైడ్ బి) ఆక్సిజన్ సి) నైట్రోజన్ డి) హైడ్రోజన్
6. కింది వాటిలో ఏ నిర్మాణాలు ఎగువ శ్వాసకోశంలో భాగంగా ఉన్నాయి?
ఎ) అల్వియోలీ బి) శ్వాసనాళాలు సి) ఫారింక్స్ డి) ఊపిరితిత్తులు
7. రక్తం, కణజాలాల మధ్య వాయువుల మార్పిడిని ఏమంటారు?
ఎ) బాహ్య శ్వాసక్రియ బి) అంతర్గత శ్వాసక్రియ సి) సెల్యులార్ శ్వాసక్రియ డి) వెంటిలేషన్
8. ఏ శ్వాసకోశ వ్యాధిని వాయు మార్గాల సంకుచితం ద్వారా కనుక్కుంటారు?
ఎ) న్యుమోనియా బి) ఆస్తమా సి) క్షయ డి) ఎంఫిసెమా
9. శ్వాసకోశ వ్యవస్థ ప్రధాన అవయవం ఏది?
ఎ) గుండె బి) ఊపిరితిత్తులు సి) కాలేయం డి) కిడ్నీలు

సమాధానాల కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

422 Word of the Day

Rectitude

Telugu meaning: విశ్వసనీయత, నైతికత

English meaning: The word 'rectitude' is a noun that describes morally correct behaviour or thinking.

Synonyms: Righteousness, Integrity

Antonyms: Immorality, Dishonesty

Usage: 1. His unwavering rectitude earned him the respect and admiration of his followers.

2. In times of moral crisis, her rectitude guided her decisions, always choosing the path of honesty.

Latest Updates

Apprentice Posts

Canara Bank, Human Resources Wing, Head Office, Bengaluru invites applications from candidates for Engagement of Apprentices. The total no. of posts is 3000. The application fee is Rs.500. The last date for online registration is 4 October 2024.

CIAL, Cochin

Air India Air Transport Services Limited (AIATSL), Cochin International Airport (CIAL), Cochin is inviting applications for filling up the vacant posts in various departments on fixed term contract basis. The total number of posts is 208. The last date for online application is 1 October 2024. The interview dates are 5, 7 October 2024.

Anganwadi Posts

District Women and Child Development Agency, Anantapuramu District invites applications for Anganwadi Posts in 11 ICDS Projects. The total no. of posts 84. Eligible candidates can apply online before 1 October 2024.

Operator Posts

Hindustan Aeronautics Limited (HAL) at Korwa, Amethi, Uttar Pradesh invites applications for the 81 Operator posts on temporary basis. The application fee is Rs.200. The last date for online application is 5 October 2024.


Did You Apply..?

Today (September 26) is the last date for the following Posts/ Admissions

- Software Engineer - Fullstack posts in Phenom Company.
Qualification: Any Graduate.
- Digital Content Associate posts in Amazon.
Qualification: Bachelor's degree or equivalent.

For more information and other notifications - scan QR code

ఈ-బుక్ (ఇండియన్ జాగ్రఫీ)



- భారతదేశం ఒక ఉపఖండం. మన దేశానికి తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన అరేబియా మహాసముద్రం, దక్షిణాన హిందూ మహాసముద్రం, ఉత్తరాన హిమాలయాలు ఎల్లలుగా ఉన్నాయి.
- ఇండియన్ జాగ్రఫీలో భారతదేశ భౌగోళిక స్వరూపం ముఖ్య భాగం. పోటీపరీక్షల్లో భారతదేశ ఉనికి, విస్తీర్ణం, దేశంలోని రాష్ట్రాలు - కేంద్రపాలిత ప్రాంతాలు - వాటి రాజధానులు, భారత్‌తో సరిహద్దు పంచుకునే పొరుగు దేశాలు, అక్షాంశ, రేఖాంశ వివరాలు మొదలైనవాటి నుంచి ప్రశ్నలు వస్తాయి. 'ఈనాడు ఈప్రతిభ' ఈ-బుక్ రూపంలో ఈ అంశాలన్నింటినీ మీకు అందిస్తోంది.

చదవడం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

Current Affairs



Sri Lanka President Anura Kumara Dissanayake appointed Harini Amarasuriya as country's Prime Minister on 24 September 2024. She is the third woman prime minister of Sri Lanka, following the world's first woman prime minister, Sirimavo Bandaranaike and her daughter Chandrika Bandaranaike Kumaratunga.

S&P Global Ratings maintained its growth forecast for India's Gross Domestic Product (GDP) at 6.8% for current fiscal (2024-25). In its latest Asia-Pacific economic outlook report, it also kept its forecast of 6.9% for the next fiscal year (2025-26).

Defence Minister Rajnath Singh inaugurated the 41st Indian Coast Guard (ICG) Commanders' Conference in New Delhi on 24 September 2024. The three-day conference focusses on advancing the growth and infrastructure development of the ICG.

Indian duo Jeevan Nedunchezhiyan and Vijay Sundar Prashanth won the ATP 250 Hangzhou Open 2024 title on 24 September 2024. They defeated German pair Constantin Frantzen and Hendrik Jebens in the men's doubles final in China.

President of India Droupadi Murmu inaugurated the Assembly of the Asian Organization of Supreme Audit Institutions (ASOSAI) in New Delhi on 24 September 2024. The four-day conference will have a series of discussions on the evolving role of Supreme Audit Institutions in fostering transparency and accountability.

For more Current Affairs: Scan QR code

Alphabet Seuqence

Directions (Qs. 1 - 5): *Following questions are based on the five three-digit numbers given below.*

519 328 746 495 837

1. If half of the second highest number is subtracted from the third highest number, what will be the value?
A) 156 B) 146 C) 213 D) 314 E) None of these
2. If the positions of the first and third digits in each of the numbers are interchanged, which of the following will be the second digit of the lowest number?
A) 1 B) 2 C) 4 D) 9 E) 3
3. If in each number the third digit becomes the first digit, the first digit becomes the second digit and the second digit becomes the third digit, which of the following will be the first digit of the second highest number?
A) 9 B) 6 C) 5 D) 7 E) 8
4. Which of the following represents the difference between the first and the second digits of the second highest number?
A) 4 B) 1 C) 3 D) 5 E) None of these
5. If '1' is subtracted from the third digit of each number and 1 is added to the first digit of each number, which of the following will be the sum of the second and third digits of the second lowest number?
A) 13 B) 9 C) 8 D) 6 E) None of these

Bank Exams
Reasoning

Directions (Qs. 6 - 10): *Study the following arrangement carefully and answer the questions given below.*

M 3 R # A P 4 9 K % D 1 U H @ J 2 N © W E Q 5 T 6 $ V 7 * I F 8 B Y

6. How many such symbols are there in the above arrangement each of which is immediately preceded by a number but not immediately followed by a consonant?
A) None B) One C) Two D) Three E) More than three
7. Which of the following is the eighth to the left of the twenty first from the left end of the above arrangement?
A) 1 B) I C) 5 D) Q E) None of these
8. How many such consonants are there in the above arrangement each of which is immediately preceded by a number but not immediately followed by a symbol?
A) None B) One C) Two D) Three E) More than three
9. If all numbers in the above arrangement are removed, which of the following will be the eleventh from the right end?
A) N B) 2 C) E D) W E) None of these
10. What should come in place of the question mark (?) in the following series based on the above arrangement?
3 # A, 4 K %, 1 H @, 2 © W, ?
A) E 5 6 B) E 5 T C) Q T 6 D) Q T $ E) None of these

Directions (Qs. 11 - 15): *The following questions are based on the six words given below:*

ROCK MOCK TONE
FROM TURN EACH

(The new words formed after performing the operation mentioned may or may not necessarily be meaningful English words.)

11. If the first two letters in each of the words is changed to the next alphabet in the English alphabetical order, how many words having no vowel will be formed?
A) Five B) Four C) Three D) Two E) One
12. If the given words are arranged in the order they would appear in a dictionary from right to left (Z-A), which of the following will be the fourth from the left?
A) TONE B) ROCK C) MOCK D) FROM E) None of these
13. If in each of the words, all the alphabets are arranged in the reverse order of English alphabet within the word, how many words will not begin with a vowel?
A) Three B) Four C) Five D) Six E) None of these
14. If in each of the given words, the first alphabet is changed to the previous letter in the English alphabetical order, how many words thus formed will be meaningful?
A) One B) Two C) Three D) Four E) None of these
15. If in each of the given words, first and third alphabets are interchanged and similarly second and fourth alphabets are interchanged, how many words thus formed will end with a vowel?
A) Two B) Three C) Four D) Five E) Six

For Key scan the QR code

These model questions were prepared by subject experts of RACE Institute Hyderabad

జీవో 85తో నష్టపోతున్నాం

ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసిన వైద్యులు



పీహెచ్‌సీ డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధుల విన్నపం స్వీకరిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ కేంద్రాలలో ఉన్న వైద్యులకు రావాల్సిన సీట్లను జీవో 85 దూరం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు తెలిపారు. బుధవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు. గతంలో మూడేళ్ల సర్వీస్ ఉంటే సీటుకు అర్హత ఇచ్చేవారని, ఇప్పుడు అయిదేళ్లు చేయడంతో పాటు ఇన్ సర్వీస్ కోటా సీట్ల శాతాన్ని తగ్గించారని వివరించారు. ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లామని పవన్ వారికి హామీ ఇచ్చారు.

పీజీ వైద్య విద్య ఇన్‌సర్వీస్ కోటా సీట్లు 15% నుంచి 20%కు పెంపు

● మంత్రి సత్యకుమార్



ఈనాడు, అమరావతి: పీజీ వైద్య విద్య క్లినికల్ విభాగంలో ఇన్‌సర్వీస్ కోటా కింద ప్రస్తుతం ఉన్న 15% సీట్ల కేటాయింపును అదనంగా మరో ఐదు శాతం పెంచుతున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. సీట్ల కేటాయింపులో కోత విధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 85పై వైద్యుల వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వీరితో మంత్రి, అధికారులు రెండు దఫాలుగా చర్చించారు. మంగళగిరిలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్య సంఘం ప్రతినిధులతో మంత్రి బుధవారం రాత్రి మరోమారు చర్చించి, ప్రభుత్వ నిర్ణయాలు వెల్లడించారు. 'జీఓ 85ను సవరిస్తాం. ప్రస్తుతం ఆరు స్పెషాలిటీలకు పరిమితం చేసిన 15 శాతం కోటా సీట్లను 20 శాతానికి పెంచుతాం. 19 రకాల స్పెషాలిటీల్లో ప్రవేశాలు పొందేందుకు అవకాశాన్ని కల్పిస్తాం. భవిష్యత్తులో ఇన్‌సర్వీస్ కోటా సీట్ల కేటాయింపులపై సంపూర్ణ అధ్యయనం తర్వాత చర్చించిన అనంతరమే నిర్ణయాలు తీసుకుంటాం. పీజీ నాన్‌క్లినికల్ విభాగంలో పనిచేసే పీహెచ్‌సీల్లో వైద్యులుగా ఉన్న వారు క్లినికల్ విభాగంలో పనిచేయాలంటే అనుమతిస్తాం. డిప్లొమా చేసి, పీజీ చదవాలను కునే వారికి అవకాశాన్ని కల్పిస్తాం. ఇలాంటి పలు ప్రభుత్వ రంగా చెల్లింపులు ఉంచడు. వైద్యుల సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వ సానుకూలంగా ఉంది. ఆందోళనల సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైద్యుల ఆక్షేపణీయ వ్యాఖ్యలు చేయడం సరికాదు. ప్రస్తుతం ప్రకటించిన నిర్ణయాల్లో ఇక మార్పులకు అవకాశంలేదు. విధులకు హాజరుకావాలి' అని ఆరోగ్యశాఖ మంత్రి కోరారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు పాల్గొన్నారు.

ఏపీ సహాయనిధికి విరాళాలిచ్చిన దాతల వివరాలు..

సంస్థ/వ్యక్తి	సాయం (రూ.లలో)
విజయ్ కె.కొసరాజు	9 లక్షలు
అసోసియేషన్ ఆఫ్ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్	8.1 లక్షలు
వి.బలరాం	5.1 లక్షలు
వీఆర్ఎస్ఈసీ క్లబ్	5 లక్షలు
ఎ.బావుచంద్	5 లక్షలు
సీతాపురం రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్	3 లక్షలు
వీవీ సుబ్బారావు	2 లక్షలు
వెంకటాపురం కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్	1.5 లక్షలు
కేపిటల్ ఎంపైర్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్	1.1 లక్షలు
కె.శివరాంప్రసాద్	లక్ష
కె.కృష్ణమోహన్	లక్ష
ముళ్లపూడి రాజేంద్రప్రసాద్	లక్ష
కె.రామ్మోహన్‌రావు	లక్ష
సీకే వీరేశ్వరరావు	56 వేలు
లెనిన్ బాబు	50 వేలు
ఎం.సురేష్‌కుమార్	50 వేలు
ఎస్.ఆనంద్	50 వేలు
జి.చంద్రావతి	50 వేలు
సాయి స్వామి రెసిడెన్సీ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్	50 వేలు
ఎ.కృష్ణమూర్తి	50 వేలు
శ్రీపురం వేణుశివప్రసాద్	50 వేలు
కె.శేషగిరిరావు	50 వేలు
పూర్ణా మార్కెట్ సిటీ సెంటర్	50 వేలు
కోనేరు విజయకుమారి, కోటేశ్వరరావు	50 వేలు
లక్ష్మీ మధుసూదన గార్డెన్స్ ఓనర్స్ సంక్షేమ సంఘం	26 వేలు
కోనేరు కోటేశ్వరరావు	25 వేలు
వి.శరత్‌కుమార్	20 వేలు
కె.నాగజ్యోతి	10 వేలు
కె.వెంకటేశ్వరరావు	10 వేలు
కె.హైమావతి	10 వేలు
తైలజారెడ్డి	10 వేలు
పాంచాలి గ్రామ పరిషత్ ఏపీ తరగతి పిల్లలు (పాకెట్ మనీ)	7 వేలు
కె.శ్రీనివాసరావు	4 వేలు

తితిదేలో అక్రమాలను వెలుగులోకి తేవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: తిరుపతి లడ్డూ తయారీలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందం..సిట్‌ను నియమించడాన్ని ఆహ్వానిస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం తెలిపారు. విజయవాడలో బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. 'సిట్ నివేదిక వచ్చేంతవరకు అన్ని రాజకీయ పార్టీలూ సంయమనం పాటించాలి. కానీ, ఈ సమస్యను అసరా చేసుకుని ఇప్పటికే వాతావరణాన్ని కొన్ని శక్తులు కలుషితం చేస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే దీనికి మతం రంగు పులిమి సామాజిక వాతావరణాన్ని అపవిత్రం చేస్తున్నాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీసుకున్న వైఖరి ఇలాంటి శక్తులకు ఊతమిచ్చేలా ఉంది. వైకాపా అధినేత జగన్ ఈ సమస్య పరిష్కారానికి తోడ్పడేందుకు బదులు ప్రధాని మోదీకి విన్నపాలు చేయడం ఆగ్నికి ఆజ్యం పోయడమే' అని విమర్శించారు. తిరుపతి లడ్డూ వ్యవహారాన్ని తక్షణం ఆపాలని అక్టోబరు 4న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నట్లు తెలిపారు.

బెయిలు మంజూరు చేయండి

ఏసీపీ హనుమంతరావు హైకోర్టులో వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: ముంబయికి చెందిన సినీనటి కాదంబరీ జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలని అప్పటి విజయవాడ వెస్ట్ జోన్ ఏసీపీ హనుమంతరావు బుధవారం హైకోర్టులో వ్యాజ్యం వేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ గురువారం ఈ వ్యాజ్యంపై విచారణ జరపనున్నారు.

లడ్డూ వ్యవహారంపై అత్యవసర విచారణ జరపండి

- హైకోర్టును అభ్యర్థించిన కేఏ పాల్
- నిరాకరించిన ధర్మాసనం

ఈనాడు, అమరావతి: తిరుమల లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యి వ్యవహారాన్ని విచారణ చేస్తూ రాజకీయ నేతలు ప్రకటనలు చేస్తున్నారని, దీంతో రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తిందని, ఈ వ్యవహారంపై అత్యవసర విచారణ జరపాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ బుధవారం హైకోర్టును అభ్యర్థించారు. అత్యవసర విచారణ జరిపేందుకు హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం నిరాకరించింది. రాజకీయ నేతలు ఎక్కడ జరుగుతున్నాయి, ఏ ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిందో చెప్పాలని పాల్‌ను ప్రశ్నించింది. పిల్ దాఖలు చేసే సాధారణ పద్ధతిలో విచారణ చేస్తామని వెల్లడించింది.

ఛైర్‌పర్సన్‌గా తొలగింపుపై.. హైకోర్టులో వెంకటలక్ష్మి పిటిషన్

ఈనాడు, అమరావతి: పదవీ కాలపరిమితి ముగియక ముందే తనను ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా తొలగించడాన్ని సవాలు చేస్తూ గజ్జల వెంకటలక్ష్మి బుధవారం హైకోర్టులో వ్యాజ్యం వేశారు. ప్రభుత్వం ఈ నెల 23న జారీచేసిన మెమోను రద్దు చేయాలని కోరారు. తన పదవీ కాలం 2026 మార్చి 16 వరకు ఉందన్నారు. అప్పటి వరకు తనను ఛైర్‌పర్సన్‌గా కొనసాగే విధంగా ఉత్తర్వులివ్వాలని కోరారు. గురువారం ఈ వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరపనుంది.

గొర్రెలు, మేకల పెంపకం యూనిట్లకు 50% రాయితీ

వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా 50 శాతం రాయితీపై గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకం యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. కనిష్ఠంగా రూ.20 లక్షల నుంచి రూ.కోటి ఖర్చుతో యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు. యూనిట్ వ్యయంలో 50% రాయితీ లభిస్తుందని, 40% బ్యాంకు రుణం, రైతు 10% వాటా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో యూనిట్ల ఏర్పాటు జరిగేలా చూస్తున్నారు. జీవాలపై గ్రామీణ యువతకు పథకంపై అవగాహన కల్పించడం ద్వారా రైతులను వ్యాపారవేత్తలుగా తయారు చేస్తామని తెలిపారు.

అంబేడ్కర్ గురుకులాల్లో 762 మంది సీఆర్‌టీల సేవలు రెన్యువల్

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో నడిచే అంబేడ్కర్ గురుకులాల్లో ఒప్పంద ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న గురుకుల ఉపాధ్యాయుల (సీఆర్‌టీలు) సేవలను రెన్యువల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2024-25 విద్యాసంవత్సరానికి 762 మంది సీఆర్‌టీలను 11 నెలల కాలానికి రెన్యువల్ చేస్తూ సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ప్రద్యుమ్న బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024 జూన్ 1వ తేదీ నుంచి 2025 ఏప్రిల్ 30వ తేదీ వరకు రెన్యువల్ చేశారు.

12.87 లక్షల మందిపై వరద పోటు

- తాత్కాలిక, శాశ్వత పనులకు రూ.7,585 కోట్లు ఇవ్వండి
- తుది నివేదికలో కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం



ఈనాడు, అమరావతి: భారీ వర్షాలు, వరదలతో 12.87 లక్షల మంది ప్రభావితమయ్యారని రాష్ట్ర ప్రభుత్వం లెక్క తేల్చింది. వివిధ రంగాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని.. తాత్కాలిక, శాశ్వత సహాయం, పునరావాస చర్యలకు రూ.7,585 కోట్లు కేటాయించాలని కేంద్రాన్ని కోరింది. ఇందులో తాత్కాలిక సాయం, పునరావాస పనులకు రూ.1,146 కోట్లు, శాశ్వత పనులకు రూ.6,439 కోట్లు అవసరమని పేర్కొంది. పంట నష్టం గణన, సామాజిక తనిఖీ అనంతరం పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేసింది.

నివేదికలో పేర్కొన్న నష్టం వివరాలు..

- వరదలకు వేర్వేరు ఘటనల్లో 74 మంది మృతి చెందారు.
- 7,680 ఇళ్లు పూర్తిగా, 1,18,070 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.
- 1.15 లక్షల హెక్టార్ల వ్యవసాయ, 9,236 హెక్టార్ల ఉద్యాన పంటల నష్టం.
- 247 పడవలు పాక్షికంగా, 131 పూర్తిగా ధ్వంసమయ్యాయి. 7 వలలు దెబ్బతినగా, 1,672 వలలు పోయాయి. 116 మోటారు పడవలకు నష్టం వాటిల్లింది. 1,016 చేపల చెరువులు కోతకు గురయ్యాయి.
- 434 ఆవులు, గేదెలు, 678 గొర్రెలు, మేకలు, 3,487 కోళ్లు చనిపోయాయి.
- విద్యుత్తుశాఖలో 4,478 కి.మీ. తీగలు దెబ్బతిన్నాయి. 9,933 స్తంభాలు పడిపోయాయి. 4,670 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. 33 కేవీ, 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఆధునీకరించాలి.
- రహదారులు భవనాల శాఖలో 4,388 కి.మీ. రోడ్లు, 601 కల్వర్టులు, పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో 2,199 కి.మీ రోడ్లు, 202 కల్వర్టులు ధ్వంసమయ్యాయి.
- తాగునీటి సరఫరా వ్యవస్థలో 4,215 పనులు పునరుద్ధరించాలి.
- పురపాలకశాఖ పరిధిలో 927 కి.మీ. రోడ్లు దెబ్బతిన్నాయి. 390 తాగునీటి పథకాలకు నష్టం వాటిల్లింది. 258 వంతెనలు ధ్వంసమయ్యాయి.

జలవనరులశాఖలో పనులకు రూ.9,338 కోట్లు

జలవనరులశాఖ పరిధిలో 425 చెరువులు, 1,082 కాల్వలకు గండ్లు పడ్డాయి. వీటిని బాగు చేసేందుకు రూ.1,067 కోట్లు కావాలి. రూ.726 కోట్లతో వరద రక్షణ, గట్ల బలోపేత పనులు చేపట్టాల్సి ఉంది. కృష్ణా పశ్చిమాన ప్రాంతంలో బుడమేరు, కొల్లేరు, ఉప్పుటేరు శాశ్వత అభివృద్ధి పనులకు రూ.6,162 కోట్లు అవసరం. గోదావరి డెల్టా, ఏలేరు రిజర్వ్ సిస్టమ్ అభివృద్ధికి రూ.1,383 కోట్లు కావాలి. మొత్తంగా జలవనరుల పనులకు రూ.9,338 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది.

రూ.269 కోట్ల అదనపు సాయం

విపత్తు సమయంలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్‌లో ప్రకటించిన మేరకు బాధితులకు సాయం అందిస్తారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం బాధితులను ఆదుకునేందుకు పెద్దమొత్తంలో ప్యాకేజీ ప్రకటించింది. ఇందుకు ఎస్‌డీఆర్ఎఫ్ నిబంధనల మేరకు రూ.326.18 కోట్లు అవుతుందని అధికారులు లెక్క తేల్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన ప్యాకేజీ అనుగుణంగా చూస్తే.. రూ.595 కోట్లు అయింది. అంటే రూ.269 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. ముంపునకు దెబ్బతిన్న ఇళ్లకు విపత్తు నిబంధనల్లో నిర్ణయించిన సాయం కంటే రూ.117 కోట్లు అదనంగా విడుదల చేశారు. వ్యవసాయ పంటల నష్టానికి గతంలో నిర్ణయించిన పెట్టుబడి సాయం ప్రకారం రూ.193.93 కోట్లయింది. పంటలకు పెట్టుబడి సాయాన్ని భారీగా పెంచడంతో.. అది రూ.281 కోట్లకు చేరింది. ఉద్యాన పంటల సాయమూ రూ.20 కోట్ల నుంచి రూ.33 కోట్లకు పెరిగింది. వాణిజ్య ఆస్తుల నష్టానికి ఎస్‌డీఆర్ఎఫ్ నిబంధనల్లో ఎలాంటి సాయం ఇవ్వాలని లేదు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం రూ.33.10 కోట్లు నిర్ణయించింది. ఆటో రిక్షా, ద్విచక్ర వాహనాలకు, తోపుడు బండ్లకు విపత్తు నిబంధనలను మించి.. రూ.18 కోట్ల మేర అదనపు సాయం అందించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు ఆహార సరఫరాకు రూ.368 కోట్లు, తాగునీటికి రూ.26.80 కోట్లు, నిత్యావసరాల సరఫరాకు రూ.61.28 కోట్లు, పారిశుద్ధ్య పనులకు రూ.51.69 కోట్లు, మొబైల్ జనరేటర్లు, ఇతర సౌకర్యాలకు రూ.14.07 కోట్లు, మందులకు రూ.2.08 కోట్లు, తాత్కాలిక పునరావాసానికి రూ.1.39 కోట్లు ఖర్చయింది.

రంగాల వారీగా కేంద్రాన్ని కోరిన సాయం వివరాలు (ఎన్‌డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం)

రంగం	మొత్తం (రూ.కోట్లలో)
బాధితులకు సాయం, ఉపశమనం	504
వ్యవసాయ పంటల నష్టానికి పెట్టుబడి సాయం	183
ఉద్యాన పంటల నష్టానికి పెట్టుబడి సాయం	19
పశుసంవర్ధకం	5
మత్స్య	3
పట్టు, చేనేత, చేతివృత్తులు	1
గృహనిర్మాణం	154
రహదారులు, భవనాలు	778
పంచాయతీరాజ్ రోడ్లు	693
గ్రామీణ నీటిసరఫరా	654
జలవనరులు	3,300
పురపాలన	434
విద్యుత్తు	781
గిరిజన సంక్షేమం	4
సామాజిక ఆస్తులు	72
మొత్తం	7,585

వరద బాధితులకు రూ.వెయ్యి కోట్ల సాయం

తెదేపా ఎమ్మెల్సీ అశోక్‌బాబు

ఈనాడు డిజిటల్, అమరావతి: వరద బాధితులను ఆదుకునేందుకు, పునరావాసానికి ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు పరిహారంగా అందజేస్తున్నట్లు తెదేపా ఎమ్మెల్సీ అశోక్‌బాబు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు అధికార యంత్రాంగం, ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది అహోరాత్రులు సేవలు చేశారు. వారికి చేతులెత్తి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల పాలనలో ఎన్డీయే ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల్ని వివరించారు.

విశ్వవిద్యాలయాల చట్ట సవరణకు కమిటీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు కలిపి ఒకే చట్టం రూపొందించడం, ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చట్టం సవరణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ ఉన్నత విద్యామండలి ఆదేశాలు జారీ చేసింది. మాజీ ఉపకులపతులు సీఆర్ విశ్వేశ్వరరావు, వి.వెంకయ్య, విశ్రాంత రిజిస్ట్రార్లు ఎస్.రంగయ్య, పీవీఎస్ రెడ్డి, విశ్రాంత సంయుక్త కార్యదర్శి కృష్ణంరాజులను సభ్యులుగా నియమించింది. ఈ కమిటీని సమన్వయం చేసే బాధ్యత ఉన్నత విద్యామండలి సంయుక్త కార్యదర్శి కృష్ణమూర్తికి అప్పగించింది. రాష్ట్రవ్యాప్తంగా 20 విశ్వవిద్యాలయాలు ఉండగా.. వీటికి ఏనిమిది చట్టాలున్నాయి. వీటన్నింటినీ ఒకే చట్టంగా మార్పు చేయనున్నారు. వర్సిటీలకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఉండగా వీటి స్థానంలో కొత్తగా బోర్డు ఆఫ్ గవర్నర్స్‌ను తీసుకువస్తారు. జాతీయ విశ్వవిద్యాలయాల్లో ఈ విధానం ఉండగా.. ఇప్పుడు రాష్ట్ర వర్సిటీల్లోనూ తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి ఛైర్‌పర్సన్‌లుగా పారిశ్రామికవేత్తలను నియమిస్తారు.

దిగువ కోర్టుల్లో ఎందరు ప్రాసిక్యూటర్లు అవసరం?

అధ్యయనం చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని దిగువ కోర్టుల్లో ఎంతమంది పబ్లిక్ ప్రాసిక్యూటర్ల(పీపీ), సహాయ పీపీలు అవసరమో అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. పూర్తి వివరాలు సమర్పించేందుకు విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. కోర్టుల ఆవసరాలకు తగ్గట్లు పీపీ పోస్టుల సంఖ్యను నిర్ణయించాలని ధర్మాసనం అభిప్రాయపడింది. తగినంత మంది పీపీలు లేక క్రిమినల్ కోర్టుల్లో విచారణల్లో జాప్యం జరుగుతోందని న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై బుధవారం హైకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. యోగేష్ వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా 323 మెజిస్ట్రేట్ కోర్టులుంటే 230 మంది పీపీలను నియమించేందుకే ప్రభుత్వ అనుమతి ఉందన్నారు. మంజూరైన 230 పోస్టుల్లో ఇంకా 40 ఖాళీలు ఉన్నాయన్నారు. రాష్ట్రప్రభుత్వం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. హైకోర్టు కమిటీ తాజాగా చేసిన సిఫారసులకు అనుగుణంగా టెన్యూర్ విధానం(నిర్దిష్ట కాల పరిమితి)లో దిగువ కోర్టుల్లో ప్రాసిక్యూటర్లను భర్తీ చేస్తామన్నారు.

సీసీ కెమెరాలను ఎప్పటిలోగా ఏర్పాటు చేస్తారు?

కౌంటర్ వేయాలని సీఎస్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని దిగువ కోర్టుల్లో సీసీ కెమెరాల ఏర్పాటును ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)ని హైకోర్టు ఆదేశించింది. పూర్తి వివరాలతో అఫిడవిట్ వేయాలని స్పష్టంచేసింది. సాధ్యమైనంత త్వరగా ప్రక్రియను పూర్తి చేయాలంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది. అన్ని న్యాయస్థానాల్లో సీసీ కెమెరాలను అమర్చాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదంటూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై బుధవారం హైకోర్టు విచారణ చేపట్టింది.

నేటి నుంచి ప్రజావేదికలో పాల్గొనేది వీరే..

ఈనాడు డిజిటల్, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తోన్న ప్రజావేదిక కార్యక్రమంలో గురువారం నుంచి అక్టోబరు 9వ తేదీ వరకు పాల్గొనే మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతల వివరాల్ని ఆ పార్టీ వెల్లడించింది. ఈ మేరకు ఎమ్మెల్సీ అశోక్‌బాబు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

తేదీ	పాల్గొనేవారు
26.09.2024	మంతెన రామరాజు, గన్ని వీరాంజనేయులు
27	అచ్చెన్నాయుడు, పల్లా శ్రీనివాసరావు
28	మంత్రి డోల బాలవీరాంజనేయస్వామి, పల్లా శ్రీనివాసరావు
30	వంగలపూడి అనిత, బీటీ నాయుడు
3.10.2024	నిమ్మల రామానాయుడు, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి
4	గుమ్మడి సంధ్యారాణి, పల్లా శ్రీనివాసరావు
5	పయ్యావుల కేశవ్, పల్లా శ్రీనివాసరావు
7	బీసీ జనార్దన్‌రెడ్డి, రెడ్డి సుబ్రహ్మణ్యం
8	పొంగూరు నారాయణ, వర్ల రామయ్య
9	అనం రామనారాయణరెడ్డి, వరుదు కళ్యాణి

దంత వైద్యంలో రూ.50 కోట్ల గోల్‌మాల్!

- వైకాపా పాలనలో భ్రష్టుపట్టిన ఆరోగ్యశ్రీ
- నిబంధనలు కాదని 45% క్లెయిమ్‌లలో చెల్లింపులు
- మామూళ్ల కింద ఆసుపత్రుల నుంచి గోల్డ్ కాయిన్స్!
- 'విజిలెన్స్'తో లోతైన విచారణకు ప్రభుత్వానికి సిఫారసు

ఈనాడు, అమరావతి: ఆరోగ్యశ్రీ ట్రస్టు చెల్లించిన దంత వైద్య బిల్లుల్లో భారీయెత్తున గోల్‌మాల్ జరిగింది. కొన్ని ఆసుపత్రులకు అక్రమంగా రూ.50 కోట్లకుపైగా చెల్లించినట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలకు సహకరించిన వారికి గోల్డ్ కాయిన్స్ కూడా దక్కినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. 2019-24 మధ్యకాలంలో సుమారు 2 లక్షల దంత వైద్య క్లెయిమ్స్ ఆరోగ్యశ్రీ ట్రస్టుకు వచ్చాయి. వీటికి సుమారు రూ.260 కోట్లు చెల్లించారు. పలు ఆసుపత్రుల ఫిర్యాదుల మేరకు ట్రస్టు అధికారులు క్లెయిమ్స్ పరిశీలించగా 45% కేసుల్లో అదనపు చెల్లింపులు జరిగినట్లు తేలింది. ఈ వ్యవహారంలో దంత వైద్య బిల్లుల పరిశీలనలో విభాగంలోని ముగ్గురు ఉద్యోగులను తొలగించారు. అక్రమాల తీవ్రత ఎక్కువగా ఉన్నందున విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారించాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వాన్ని కోరింది.

ప్యానెల్ సూచనలు కాదని..

ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లకు దంత వైద్యాన్ని అందిస్తున్నారు. జనరల్ ట్రీట్‌మెంట్ బిల్లుల చెల్లింపులు రూ.వేల కోట్లలో ఉంటాయి. ఈ క్రమంలో డెంటల్ ట్రీట్‌మెంట్, బిల్లుల చెల్లింపుల తీరుపై ఉన్నతాధికారులు పెద్దగా దృష్టిపెట్టలేదు. దీంతో డెంటల్ సెక్షన్‌లో కొందరు ఉద్యోగులు కొన్ని ఆసుపత్రులతో కుమ్మక్కై, అక్రమాలకు తెగబడ్డట్లు ప్రభుత్వ దంత వైద్యులతో ఏర్పాటు చేసిన కమిటీ గుర్తించింది. చికిత్స తీరుకన్నా నకిలీ ఆధారాలతో బిల్లులు పెట్టారు. ఇంకొన్ని ఆసుపత్రులు నాణ్యత ప్రమాణాలు పాటించకున్నా బిల్లులు మాత్రం పూర్తిగా తీసుకున్నాయి. దంత వైద్య ప్యానెల్ డాక్టర్లు కొన్ని ఆసుపత్రులకు బిల్లులు తగ్గించినా.. వాటికి ఎక్కువ మొత్తంలో చెల్లించేశారు. జేఈఓ నేతృత్వంలో పనిచేసే డెంటల్ సెక్షన్‌లోని సిబ్బంది కుమ్మక్కు కావడమే ఇందుకు ప్రధాన కారణం.

- అక్రమాల నేపథ్యంలో ఓ ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. దీనిపై ఇటీవలే వరకూ డెంటల్ విభాగంలో పని చేసిన అధికారి జోక్యం చేసుకున్నారు. ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు సదరు ఆసుపత్రి నుంచి ఓ సీనియర్ అధికారికి 20 గ్రాముల బంగారు కాయిన్ ఇప్పించారు. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి.

కఠిన చర్యలకు ప్రభుత్వానికి లేఖ

– లక్ష్మీశ, సీఈఓ, ఆరోగ్యశ్రీ ట్రస్టు

అంతర్గత విచారణ ముగిసినందున అక్రమాల బాధ్యులపై కఠిన చర్యలకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా విచారణ చేపట్టాలని ప్రభుత్వానికి లేఖ రాశాం. ఇందులో ఎవరినీ ఉపేక్షించేది లేదు. విజిలెన్స్ ద్వారా మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ ఖజానాకు వచ్చిన నష్టాన్ని బాధ్యుల నుంచి తిరిగి వసూలు చేస్తాం.

కొడాలి నాని అనుచరుడు మా స్థలాన్ని కాజేశారు

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

ఈనాడు డిజిటల్, అమరావతి: 'మాజీ మంత్రి, వైకాపా నేత కొడాలి నాని అనుచరుడైన అడపా బాబ్జీరావు కుమారులు తప్పుడు ధ్రువపత్రాలతో నా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. స్థలంలోకి వెళ్తే దౌర్జన్యంగా ప్రవేశించి చెట్లు నరికారు. ఇటుకలు, 25 ట్రక్కుల మట్టి తవ్వుకెళ్లారు. అడ్డుకోబోయిన నా భార్య, బిడ్డలపై దాడి చేశారు' అని కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన జి.సుబ్బారావు వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన 'ప్రజావేదిక'లో మంత్రి అనగాని సత్యప్రసాద్, తెదేపా మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, తెదేపా మైనారిటీ నేత మౌలానా ముస్తాక్ అహ్మద్ తదితరులు వినతులు స్వీకరించారు. పున్నర్మాణం కోసం పడగొట్టిన దేవాలయ శిథిలాల్లో దొరికిన విలువైన దేవాదాయ శాఖ అధికారులు కాజేశారని పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం మన్నేసుల్తాన్‌పాలెంకి చెందిన అక్కల సుబ్బారెడ్డి ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూముల రీసర్వేలో తన పొలాన్ని వేరొకరి పేరుతో మార్చిన అధికారులు వారికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారని, దీనిపై విచారణ చేసి తమ భూమిని అప్పగించాలని గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం సిరిపురానికి చెందిన కడియాల సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. గతంలో ఇన్‌ఛార్జి ఎమ్మార్వోగా పనిచేసిన సునీత రూ.14 లక్షలు లంచం తీసుకొని, అటవీ భూములను డీ-పట్టాలు ఇచ్చారని.. ఆమెపై చర్యలు తీసుకోవాలని బెల్లంకొండ మండలానికి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు.

వైకాపా ఎమ్మెల్సీ బంధువు నా భూమి కబ్జా చేశారు

జనసేన కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపా నాయకుల అండతో విద్యుత్తుశాఖలో లైన్‌మన్‌గా పనిచేస్తున్న వ్యక్తి తమ 10 ఎకరాల భూమి కబ్జా చేసి ఇళ్లు నిర్మించుకున్నాడని ప్రకాశం జిల్లా రావిపాడుకు చెందిన ముత్యాలపాటి లక్ష్మీకాంతమ్మ వాపోయారు. న్యాయం కోసం అధికారులతో పాటు నాటి ముఖ్యమంత్రి జగన్‌కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు. హైకోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని జనసేన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వినతులు స్వీకరించారు. రీసర్వే అనంతరం తన భూమి తగ్గిపోయిందని, దాన్ని వైకాపా ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం బంధువు తురకా కిరణ్ పేరున నమోదు చేశారని పిడుగురాళ్లకు చెందిన తురకా సాంబయ్య ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులకు చుట్టూ తిరిగినా పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ మూడున్నర ఎకరాల భూమిని ఓ పార్టీ నాయకులు గుడిసెల పేరుతో ఆక్రమించారని పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెంకు చెందిన ఆకులకుంట కడియ్య దంపతులు వినతి అందించారు. జీవో 85 కారణంగా పీజీలో 15 శాతం సీట్లు కోల్పోవాల్సి వస్తుందని పలువురు పీహెచ్‌సీ వైద్యులు అర్జీ అందించారు.

వర్సిటీల్లో సమగ్ర పరీక్షల నిర్వహణ విధానం అనుమతికి లేఖలు ఇవ్వండి

రిజిస్ట్రార్లకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి లేఖ

ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాల్లో ప్రైవేటు సాఫ్ట్‌వేర్ సంస్థ ద్వారా 'సమగ్ర పరీక్షల నిర్వహణ విధానం' నిర్వహణకు అనుమతి లేఖలు ఇవ్వాలని కోరుతూ అన్ని వర్సిటీల రిజిస్ట్రార్లకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ లేఖ రాశారు. బుధవారం సాయంత్రం లోపు లేఖ పంపించాలని అందులో పేర్కొన్నారు. వర్సిటీల్లో పరీక్షల విధానాన్ని కంప్యూటరీకరణ చేయాలని ఉన్నత విద్యాశాఖ నిర్ణయించింది. ఆ బాధ్యతను ఉన్నత విద్యామండలికి అప్పగించింది. దీనికి ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) ద్వారా టెండర్ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ సంస్థ ఎంపిక చేసిన ప్రైవేటు సాఫ్ట్‌వేర్ సంస్థ అన్ని వర్సిటీల్లోనూ పరీక్షల నిర్వహణను కంప్యూటరీకరిస్తుంది.

జగన్ నిర్ణయాలే ఆయనకు శాపంగా మారాయి: జగ్గారెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: అధికార మైకంలో జగన్ తీసుకున్న నిర్ణయాలే ఆయనకు శాపంగా మారాయని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తిరుపతి లడ్డూ వ్యవహారంపై స్పందించిన జగన్.. అసలు ఏం జరిగింది? అన్న విషయాలు చర్చిస్తే బాగుండేది.. అయితే బాధ్యతగా వ్యవహరించకుండా.. మతపరమైన అంశాలను తెరపైకి తెచ్చి విద్వేషాలు రెచ్చగొట్టడం ఆ పార్టీకే చేటు తెస్తుందన్నారు. భాజపా అండతో విశ్వాసాలు దెబ్బతీసేలా ఉండటం సరికాదు.

జబ్బులకు 'డబ్బు' చేసింది!

- 2021-22లో చికిత్సలకు ఏపీ ప్రజల సొంత ఖర్చు రూ. 20,320 కోట్లు
- రాష్ట్రంలో వైద్యం నిమిత్తం వెచ్చించిన మొత్తంలో అది 52%
- జాతీయ సగటు వ్యయం 39.4% కంటే చాలా ఎక్కువ

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రజలు 2021-22లో వైద్య ఖర్చుల కోసం సొంత డబ్బు ఏకంగా రూ. 20,320 కోట్లు ఖర్చు చేశారు. ఇది.. రాష్ట్రంలో వైద్యం నిమిత్తం వెచ్చించిన మొత్తం వ్యయం రూ. 39,067 కోట్లలో 52%. అంటే వైద్యానికి సంబంధించిన ప్రతి రూ. వంద ఖర్చులో రూ. 52 తమ సొంత జేబుల్లోంచే ప్రజలు ఖర్చు చేశారన్న మాట. జాతీయ స్థాయి సగటు సొంత వ్యయం (అవుట్ ఆఫ్ పాకెట్ ఎక్స్‌పెండిచర్) 39.4%తో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ బుధవారం విడుదల చేసిన నేషనల్ హెల్త్ అకౌంట్స్ ఎస్టిమేట్స్ ఫర్ ఇండియా 2021-22 నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఆ ఏడాది రాష్ట్రంలో మొత్తం వైద్యం కోసం రూ. 39,067 కోట్లు అయినట్లు అంచనా. ఇది జీఎస్‌డీపీలో 3.4%కి సమానం. వైద్యం కోసం తలసరి రూ. 7,371 ఖర్చయినట్లు లెక్క. ఇందులో రూ. 16,582 కోట్లు (42.4%) ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇది జీఎస్‌డీపీలో 1.5%, ప్రభుత్వం చేసే సాధారణ వ్యయంలో 9.4%. రాష్ట్ర ప్రభుత్వం వైద్యం కోసం తలసరి రూ. 3,129 ఖర్చు చేసింది. మిగిలిన రూ. 20,320 కోట్లను ప్రజలు తమ సొంత జేబుల్లోంచి పెట్టుకోవాల్సి వచ్చింది. ఇది జీఎస్‌డీపీలో 1.8%, ప్రభుత్వ సాధారణ వ్యయంలో 11.6%కి సమానం. ఒక్కొక్కరూ వైద్యం కోసం తలసరి రూ. 3,834 సొంతంగా భరించినట్లు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ (63.7%), కేరళ (59.1%), పశ్చిమబెంగాల్ (58.3%), పంజాబ్ (57.2%) తర్వాత ప్రజలు అత్యధికంగా సొంత జేబుల్లోంచి ఖర్చు చేసింది ఏపీలోనే. నివేదిక విడుదల సందర్భంగా నీతి ఆయోగ్ సభ్యుడు వీకే పాల్ మాట్లాడుతూ.. వైద్యం కోసం ప్రభుత్వం చేసే ఖర్చు 2014-15లో 1.13% ఉండగా, 2021-22 నాటికి అది 1.84%కి చేరిందన్నారు. మొత్తం వైద్య వ్యయంలో ప్రభుత్వ వాటా 29% నుంచి 48%కి పెరిగినట్లు చెప్పారు. దీనివల్ల అవుట్ ఆఫ్ పాకెట్ ఎక్స్‌పెండిచర్ (ప్రజల సొంత ఖర్చు) 64.2% నుంచి 39.4%కి తగ్గిందని వివరించారు.

ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

- ఒక్కో పోస్టుకు రూ.లక్షల్లో అక్రమ వసూళ్లు
- కొన్ని యాజమాన్యాలు, అధికారులు కుమ్మక్కు

ఈనాడు, అమరావతి: ఎయిడెడ్ బడుల్లో టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ బడుల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని యాజమాన్యాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో విద్యాశాఖ ఈ నియామకాల ప్రక్రియను ప్రారంభించింది. అయితే ఈ భర్తీలో ఒక విధానమంటూ లేకుండా పోవడంతో కొన్ని యాజమాన్యాలు, అధికారులు ఇప్పటికే కుమ్మక్కై ఒక్కో పోస్టును రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ముఖ్యంగా ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో ఇదో వ్యాపారంగా మారింది. ప్రభుత్వం సైతం ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోకపోవడంతో ఈ అక్రమాలకు అడ్డుకట్టపడటం లేదు. ఈ అక్రమ నియామకాల కారణంగా ఎయిడెడ్ పోస్టుల భర్తీ ప్రహసనంగా మారింది. ఆయా జిల్లాల్లోనే ప్రకటనలు ఇవ్వడం, యాజమాన్యాలు, అధికారులు కలిసి ప్రశ్నపత్రం రూపొందించడం, పరీక్ష నిర్వహించడం చేస్తున్నారు. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం డబ్బులిచ్చిన అభ్యర్థులకు ఈ ప్రశ్నపత్రాలను లీక్ చేస్తున్నారు. ఆ తర్వాత పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చినట్లు చూపి పోస్టు ఇచ్చేస్తున్నారు. చాలా ఎయిడెడ్ బడుల్లో విద్యార్థులు లేకపోయినా గణాంకాలను తారుమారు చేసి పోస్టుల భర్తీ చేయాలని విద్యాశాఖపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్జీటీ టీచర్లు అదనంగా ఉన్నట్లు విద్యాశాఖ లెక్క తేల్చిన నేపథ్యంలో వీరిని అవసరమైన ఎయిడెడ్ పాఠశాలల్లో సర్దుబాటు చేస్తే సరిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

15 లక్షల మంది విద్యార్థుల ఆధార్ వివరాలు లేవు

వెంటనే అనుసంధానం చేయాలని విద్యా శాఖ ఆదేశాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో చదువుతున్న 15 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఆధార్ వివరాలు అనుసంధానం కాలేదని పాఠశాల విద్యా శాఖ తేల్చింది. 1.19 లక్షల మంది విద్యార్థుల ఫోన్ నంబర్లు తప్పుగా నమోదైనట్లు గుర్తించింది. వీటిని వెంటనే సరిచేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్రంలో 1-10 తరగతి వరకు 70 లక్షలకు పైగా విద్యార్థులు ఉండగా.. 15 లక్షల మంది ఆధార్ వివరాలు లేవు. విద్యార్థుల వివరాలను విద్యా శాఖ ఆన్‌లైన్‌లో నవీకరిస్తోంది. పాఠశాల విద్యా శాఖ ఐటీ విభాగంలోని లోపాల కారణంగా విద్యార్థుల సంఖ్య తరచూ మారుతోంది. క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు సక్రమంగా నమోదు చేయకపోవడం వల్లే ఈ సమస్య ఏర్పడుతోందని ఐటీ విభాగం పేర్కొంటుండగా, ఐటీ విభాగం సక్రమంగా క్రోడీకరణ చేయటం లేదని ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. ఇటీవల సీబీఎస్ఈ విద్యార్థుల సంఖ్య విషయంలోనూ లోపాలు వెలుగు చూశాయి. పాఠశాలల వారీగా వివరాలు సేకరిస్తున్నా.. వాటిని రహస్యంగా ఉంచుతున్నారు. బేస్‌లైన్ పరీక్షల ఫలితాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఇవ్వడం లేదు. ఉపాధ్యాయులకు ఆ వివరాలు తెలిస్తే చదువులో వెనకపడిన పిల్లలపై దృష్టి సారించే అవకాశం ఉంటుంది. కమాండ్ కంట్రోల్ రూమ్‌ల పేరుతో వందల మంది ఉపాధ్యాయులను సమాచారం కోసం వినియోగిస్తున్నా 15 లక్షల మంది విద్యార్థుల ఆధార్ వివరాలు ఎందుకు అనుసంధానం కాలేదు అనేదానిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంలో జాప్యం చేసి.. ప్రజలపై భారం వేయడం తగదు: సీపీఎం

ఈనాడు, అమరావతి: నార్ల తాతారావు, దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్తు నూతన ప్లాంట్ల నిర్మాణ జాప్యం కారణంగా అదనపు పెట్టుబడి వ్యయం భారాన్ని వినియోగదారులపై వేయడం తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు బాబూరావు విమర్శించారు. అదానీ కంపెనీతో సౌరవిద్యుత్తు ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండు చేశారు. కృష్ణపట్నంలోని దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్తు స్టేషన్ స్టేజ్ 1,2లోని 800 మెగావాట్ల ప్లాంట్లు, నార్ల తాతారావు థర్మల్ విద్యుత్తు స్టేషన్ స్టేజ్-5లోని 800 మెగావాట్ల ప్లాంట్ల అదనపు పెట్టుబడి వ్యయం, టారిఫ్ అనుమతులపై విద్యుత్తు నియంత్రణ మండలి ఆన్‌లైన్‌లో విచారణ నిర్వహించింది. దీనికి హాజరైన బాబూరావు మాట్లాడుతూ.. "దాదాపు దశాబ్దకాలం పాటు నూతన ప్లాంట్ల నిర్మాణం జాప్యం జరగడం శోచనీయం. దీనివల్ల పెట్టుబడి వ్యయం రెట్టింపయ్యింది. ఒక మెగావాట్‌కు వ్యయం రూ.5కోట్ల నుంచి రూ.11కోట్లకు పెరిగింది. ఒక్కో ప్లాంట్ వ్యయం రూ.4-5వేల కోట్ల నుంచి రూ.9-10వేల కోట్లకు పెరిగింది. ఖర్చులు పెంచి స్థిరఛార్జీల రూపంలో విద్యుత్తు ఛార్జీల భారాన్ని ప్రజలపై రాబోయే 25 ఏళ్ల పాటు మోపుతున్నారు." అని ఫిర్యాదు చేశారు.

వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేయండి


ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో ఉన్న వన్యప్రాణి కారిడార్లు, అభయారణ్యాల్లోని ప్రాణుల జీవనానికి ఎలాంటి అవరోధాలూ లేకుండా చర్యలు చేపట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. వన్యప్రాణుల సంరక్షణకు తగిన వాతావరణం కల్పించాలన్నారు. తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. వన్యప్రాణి కారిడార్ల పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాల్ని వివరించారు. భారతమాల పరియోజన ద్వారా చేపట్టే నాలుగు వరుసల రహదారుల నిర్మాణం, షార్ సమీపంలో తీరప్రాంత రక్షణ, జెట్టీ నిర్మాణం తదితరాలకు శాఖాపరంగా ఇచ్చే అనుమతుల గురించి అధికారులతో చర్చించారు. ఇతర రాష్ట్రాల్లోని టైగర్ రిజర్వ్ ఫారెస్టుల్లో చేపట్టిన ప్రాజెక్టులకు అనుసరించిన విధానాల్ని అధికారులు ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్‌కు వివరించారు.

కన్సల్టెంట్ల నియామక కమిటీలోకి నివాస్

ఈనాడు, అమరావతి: ఏపీ ఆర్థికాభివృద్ధి మండలిలో కన్సల్టెంట్ల నియామకానికి ప్రభుత్వం రెండు కమిటీలను నియమించింది. అందులో కార్యదర్శి జె.నివాస్‌ను కమిటీ సభ్యుడిగా నియమించారు. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ స్థానంలో నివాస్‌ను నియమిస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులిచ్చింది.

మితిమీరితే మీ బుజ్జాయికి ముప్పే



అధిక యాంటీబయాటిక్స్‌తో చిన్నపిల్లల్లో ఉబ్బసం సమస్య

- పేగుల్లోని మంచి బ్యాక్టీరియాపై దుష్ప్రభావం
- గణనీయంగా తగ్గుతున్న రోగ నిరోధకశక్తి
- 'టీబీసీ' జర్నల్‌లో పరిశోధన పత్రం ప్రచురితం
- ఆచితూచి వాడాలంటున్న పీడియాట్రీషియన్ డాక్టర్ ఉషారాణి

ఈనాడు, హైదరాబాద్: యాంటీబయాటిక్స్... ఔషధ చికిత్సల్లో శక్తిమంతమైన అస్త్రాలు. అయితే వాటిని అవసరం లేకున్నా వినియోగిస్తే, అదీ పసివయసులో వాడితే... చిన్నారులు 'ఉబ్బసం(ఆస్తమా)' బారినపడతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బాల్యంలో యాంటీ బయాటిక్స్ ఉపయోగిస్తే ఉబ్బసం ముప్పు ఎందుకు పెరుగుతుంది? దాని ప్రభావం భవిష్యత్ జీవితంపై ఎలా ఉంటుందనే కోణంలో ఆస్ట్రేలియాకు చెందిన 'మోనాష్ యూనివర్సిటీ' శాస్త్రవేత్తలు ఎలుకలపై పరిశోధన చేశారు. సంబంధిత పరిశోధన పత్రం తాజాగా 'టీబీసీ జర్నల్'లో ప్రచురితమైంది. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం 2.60 కోట్ల మంది ఆస్తమాతో బాధపడుతున్నారని, ఈ వ్యాధితో ఏటా 4.55 లక్షల మంది చనిపోతున్నారని అందులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పిల్లల్లో ఉబ్బసం రావడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిలోఫర్ ఆసుపత్రి సీనియర్ పీడియాట్రీషియన్ ప్రొఫెసర్ **డాక్టర్ తోట ఉషారాణి** 'ఈనాడు'కు వివరించారు.



"ఐదేళ్లలోపు చిన్నారుల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్లకు 90% కారణం వైరస్‌లే. వీటి కారణంగా మొదటి రెండు, మూడు రోజులు జ్వరం ఎక్కువగా ఉండి, నాలుగైదు రోజులకు దానంతటదే తగ్గిపోతుంది. కాకపోతే కొందరు తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతారు. అవగాహన లేని కొందరు వైద్యులు కూడా చిన్నారులకు యాంటీ బయాటిక్స్‌ను సూచిస్తుంటారు. ఇలా వాడితే వాటికి నిరోధకత ఏర్పడి... పిల్లలకు భవిష్యత్‌లో నిజంగా అవసరమైన సందర్భాల్లో యాంటీ బయాటిక్స్ పనిచేయవు. ఈ కారణంగానే ఒకప్పుడు టైఫాయిడ్‌కు బాగా పనిచేసిన సిప్రోఫ్లోక్సాసిన్... ఇప్పుడు పనిచేయడం లేదు.

12 ఏళ్లలోపు పిల్లల్లో 7.9% ముప్పు

పసి వయసులోనే పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఈ కీలక దశలో తల్లిపాలు పట్టడంతోపాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలి. శిశువు ఎదుగుదలకు, రోగ నిరోధకశక్తి చక్కగా పనిచేయడానికి ఈ బ్యాక్టీరియా ఉపయోగపడుతుంది. అయితే యాంటీ బయాటిక్స్ అధికంగా వాడితే పేగుల్లోని మంచి బ్యాక్టీరియాకూ కీడు జరుగుతుంది. రోగ నిరోధక శక్తిపై దుష్ప్రభావం పడుతుంది. ఫలితంగా ఆస్తమా ముప్పు పెరుగుతుంది. ఒక అధ్యయనం ప్రకారం... భారత్‌లో 12 ఏళ్లలోపు పిల్లల్లోని 7.9% మందిలో ఆస్తమా కనిపిస్తోంది. పిల్లలు, పెద్దలు కలుపుకొని... ప్రపంచవ్యాప్తంగా ఆస్తమా కారణంగా సంభవించే మరణాల్లో సుమారు 46% భారత్ నుంచే నమోదవడం ఆందోళన కలిగిస్తోంది.

పిల్లికూతలు... డొక్కల ఎగరవేత

ఆస్తమా... ముందుగా దగ్గుతో వస్తుంది. పిల్లికూతలు వస్తుంటాయి. డొక్కలు ఎగరేస్తారు. ఆయాసం పెరుగుతుంది. ఆహారం తీసుకోరు. అదేపనిగా ఏడుస్తుంటారు. ఉబ్బసం పెరిగితే ఆక్సిజన్ అందక.. జీవన్మరణ సమస్య కూడా ఎదురవుతుంది.

తల్లి పాలు అత్యంత సురక్షితం



శిశువు పుట్టిన తొలి ఆర్నెల్ల పాటు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలి. ఆ తర్వాత రెండేళ్ల వరకు ఇతర ఆహారంతోపాటు తల్లి పాలను ఇస్తే ఆస్తమా బారినపడకుండా రక్షణ లభిస్తుంది. సీసా పాలతో పెరిగిన పిల్లలకు, తక్కువ బరువుతో, నెలలు నిండకముందే పుట్టిన వారికి, సిజేరియన్‌తో జన్మించిన పిల్లలకు ఉబ్బసం వచ్చే అవకాశాలు ఎక్కువ. అందుకే వైద్యులు యాంటిబయాటిక్స్ రాస్తే... వాటి వాడకంపై పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రశ్నించాలి.

ఇన్‌హేలర్లతో తక్షణ ఉపశమనం




ఆస్తమాకు ఇన్‌హేలర్లను వాడితే... పిల్లలకు అలవాటైపోతాయనే అపోహ కొందరు తల్లిదండ్రుల్లో ఉంది. అందుకని సిరప్‌లు ఇవ్వాలని అడుగుతుంటారు. కానీ వాటికంటే ఇన్‌హేలర్లే ఎక్కువ రక్షణ ఇస్తాయి. ఎందుకంటే మందును సిరప్ రూపంలో మిల్లీగ్రాము డోసుల్లో ఇస్తాం. ఇన్‌హేలర్లలో మైక్రోగ్రామ్ డోసుల్లో ఇస్తాం. ఒక మైక్రోగ్రామ్ అంటే.. ఒక మిల్లీగ్రామ్ డోసులో 1000 రెట్లు తక్కువ డోసు. ఇన్‌హేలర్ ద్వారా ఇచ్చే ఔషధం నేరుగా ఊపిరితిత్తులకు చేరుతుంది. తద్వారా వేగంగా ఉపశమనం కలుగుతుంది. ఇన్‌హేలర్లను రెండు రకాలుగా వాడాల్సి ఉంటుంది. కొన్నింటిని ఎప్పుడు దగ్గు, ఆయాసం వస్తే అప్పుడు మాత్రమే ఉపయోగించాలి. మరికొన్నింటిని దీర్ఘకాలం వాడాలి. వీటిని సీజనల్‌గా జూన్, జులైలలో ప్రారంభించి చలికాలం మొత్తం వాడితే.. ఆస్తమా నుంచి పిల్లలను రక్షించుకోవచ్చు. నివారణ మందులు వాడే చిన్నారుల్లో చాలా మందికి వయసు పెరుగుతున్న కొద్దీ ఆస్తమా ముప్పు కూడా తగ్గిపోతుంది. నివారణ మందులు వాడని పిల్లల్లో శ్వాసనాళాలు మందంగా మారి... పెద్దవాళ్లలో వచ్చే ఆస్తమా మాదిరిగా ఉండిపోతుంది. అందుకే వైద్యులు ఎంతకాలం ఇన్‌హేలర్లను వాడమంటే.. అంతకాలమే వాడాలి. శీతల వాతావరణం, చల్లటి, ఉబ్బసం కారక పదార్థాలకు దూరంగా ఉంచాలి. ఆస్తమా బాధిత పిల్లలకు న్యుమోనియా, ఫ్లూ టీకాలు ఇప్పించాలి' ' అని డాక్టర్ ఉషారాణి వివరించారు.

కాలుష్యమూ ప్రధాన కారణమే

- మితిమీరిన పట్టణీకరణ
- వాయు కాలుష్యం, గాలిలో నైట్రిక్ ఆక్సైడ్ స్థాయి పెరగడం
- ఇంట్లో బయటా దుమ్మూధూళి బారినపడడం
- జన్యుపర సమస్యలు
- ఎగ్జిమా, దద్దుర్లు, టాన్సిల్స్, ఇన్‌ఫెక్షన్లు
- పరిశ్రమల నుంచి వెలువడే పొగ, సిగరెట్లు తాగేవారు వదిలిన, అగర్‌బత్తీలు, దోమల నివారణ కాయిల్స్ నుంచి వచ్చే పొగ.

పునరుత్పాదక విద్యుత్ రంగంలో రాష్ట్రం ప్రత్యేకంగా నిలవాలి

- ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కొత్త ఇంధన పాలసీ నిబంధనలు
- ఇంధన శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష



ఈనాడు, అమరావతి: పునరుత్పాదక రంగంలో పెట్టుబడుల లక్ష్యానికి అనుగుణంగా ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ పాలసీ ఉండాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు.. 7.5 లక్షల మందికి ఉపాధి కల్పించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పాలసీ నిబంధనలపై సచివాలయంలో ఇంధనశాఖ అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ''పునరుత్పాదక రంగంలో పెట్టుబడుల ఆకర్షణ పాలసీ ప్రధాన లక్ష్యం. ఒప్పందం కుదుర్చుకున్న ప్రాజెక్టులు ఐదేళ్లలోనే పూర్తిచేసేలా నిబంధనలు ఉండాలి. ఈ రంగం ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వం ఆలోచన. కేంద్రం 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ లక్ష్యాన్ని నిర్దేశించింది. అందులో కనీసం 30% రాష్ట్ర భాగస్వామ్యం ఉండాలనేదే మన ఆలోచన. సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో బీడు భూములను వినియోగించుకుంటాం. తీర ప్రాంతంలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవకాశం ఉంది. పునరుత్పాదక ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టే వారికి ఏ మేరకు ప్రోత్సాహకాలను అందించాలనే దానిపై పరిశీలించాలి. పొరుగునే ఉన్న తమిళనాడు, కర్ణాటక, ఒడిశా కంటే మెరుగ్గా పాలసీ నిబంధనలు ఉండాలి. ఇళ్ల కప్పులపై పీఎం సూర్యఘర్ పథకం కింద ఏర్పాటుచేసే సౌర విద్యుత్ ప్రాజెక్టులను సాధ్యమైనంత మేరకు ప్రోత్సహించాలి. అలాగే పీఎం కుసుమ్ పథకం కింద వ్యవసాయ విద్యుత్ మోటార్లకు సౌరవిద్యుత్ ప్రాజెక్టులను అందించడమే కాకుండా.. వాటిని ఇంధన శాఖ పర్యవేక్షించాలి'' అని అధికారులకు సీఎం సూచించారు. మరో రెండు రోజుల్లో మరోసారి పాలసీ నిబంధనలపై సమీక్షించనున్నట్లు అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబు ఇంటిపై దాడికేసులో.. నిందితులపై కఠిన చర్యలొద్దు

సుప్రీంకోర్టు ధర్మాసనం

ఈనాడు, దిల్లీ: చంద్రబాబు ఇంటిపై జరిగిన దాడి కేసులో నిందితులైన చెరుకు మాధవరావుతో పాటు మరో 9 మందికి సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణ కల్పించింది. ముందస్తు బెయిల్‌కోసం వారు దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసు విచారణకు పూర్తిస్థాయిలో సహకరించాలని పిటిషనర్లను ఆదేశించింది. వారిపై ఎలాంటి కఠిన చర్యలూ తీసుకోరాదని ఏపీ పోలీసులను ఆదేశించింది. 48 గంటల్లో పిటిషనర్లు తమ పాస్‌పోర్టులను దర్యాప్తు అధికారికి అప్పగించాలని నిర్దేశించింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి సమాధానం దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను అక్టోబరు 21కి వాయిదావేసింది. బొర్రా రాంబుజ్జి, షేక్ ముబాకర్ బాషా, మహమ్మద్ పాషీ, నల్లమోతు రవితేజ, మునుగోటి నారాయణ, ఆరేపల్లి రామారావు, జోగి రాము, అవుటపల్లి ధీరజ్‌సింహ, మేడపాటి వెంకనాగిరెడ్డి పిటిషనర్లుగా ఉన్నారు.

నెయ్యి కల్తీపై విచారణ జరిపించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీకి వినతి

ఈనాడు, దిల్లీ: తితిదేలో చోటుచేసుకున్న నెయ్యి కల్తీ వ్యవహారంపై సుమోటోగా విచారణ జరిపించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు ఫిర్యాదు చేశారు. హిందువులు అత్యంత పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదం తయారీకి ఏఆర్ డెయిరీ సంస్థ జంతు కొవ్వు కలిసిన నెయ్యిని సరఫరా చేసి కోట్ల మంది భక్తుల మనోభావాలు దెబ్బతీసినందున బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

వరద బాధితులకు రూ.352.79 కోట్లు

- గతేడాది పీఎంఎంఎస్‌వై చెల్లింపులకు రూ.235 కోట్లు

ఈనాడు, అమరావతి: ఈ ఏడాది ఆగస్టు/సెప్టెంబరు నెలల్లో కురిసిన వర్షాలు, వరదలకు నష్టపోయిన వారికి ఆర్థిక సాయంగా రూ. 352.79 కోట్లను విపత్తుల నిర్వహణశాఖ మంజూరు చేసింది. ఎస్‌డీఆర్ఎఫ్ నిబంధనలకు మించి బాధితులకు సాయం అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక సాయం ప్రకటించారు. ఆధార్ ఆధారిత చెల్లింపు విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో సాయాన్ని జమచేయాలని రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోదియా ఉత్తర్వులిచ్చారు. ◆ 2023-24లో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) కింద చేసిన కార్యకలాపాలు, అభివృద్ధి ప్రాజెక్టులకు రూ.235 కోట్ల నిధుల్ని ప్రభుత్వం విడుదల చేసింది.



తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు పనులు ప్రారంభం

రాష్ట్ర సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. తూర్పు ప్రధాన ద్వారం ఎదుట డిసెంబరు 9న విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

– ఈనాడు, హైదరాబాద్

నటుడు మోహన్‌బాబు ఇంట్లో రూ.10 లక్షల చోరీ

- దొంగతనం చేసింది పని మనిషే..
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

పహాడీషరీఫ్, న్యూస్‌టుడే: సినీ నటుడు మోహన్‌బాబు ఇంట్లో రూ.10 లక్షలు చోరీ అయిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ శివారు జల్‌పల్లిలోని మంచు టౌన్‌షిప్‌లో నివాసముంటున్న మోహన్‌బాబు ఇంట్లో శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన గణేశ్‌నాయక్(24) అనే యువకుడు 8 నెలల క్రితం పనికి కుదిరాడు. మూడు రోజుల క్రితం మోహన్‌బాబు ఇంట్లో ఉన్న రూ.10 లక్షల నగదును గణేశ్‌నాయక్ దొంగతనం చేసి పరారయ్యాడు. విషయాన్ని గుర్తించిన మోహన్‌బాబు సహాయకుడు కిరణ్ తేజ రెండు రోజుల క్రితం పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు బుధవారం నిందితుడిని తిరుపతిలోని ఓ లాడ్జిలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆయన నుంచి రూ.7.50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు

ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మంగళగిరిలోని రామచంద్రాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మధుమేహ బాధితులు ఉన్నారని, వారానికోసారి వారికి పరీక్షలు చేసేలా వైద్యులను అందుబాటులో ఉంచాలని కుర్రే లక్ష్మారెడ్డి కోరారు. నేషనల్ హెల్త్‌మిషన్‌లో నియమితులైన నేచురోపతి మెడికల్ వైద్యులను రెగ్యులరైజ్ చేయాలని పలువురు వైద్యులు వినతిపత్రం అందించారు. తమ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ పరిధిలో కిడ్నీ బాధితుల సంఖ్య అధికంగా ఉందని, మరో 20 డయాలసిస్ పడకలను కేటాయించాలని రాయచోటికి చెందిన శ్రీనివాస్ విజ్ఞప్తిచేశారు.

విద్యార్థి మిత్ర కిట్లకు సమయం నిర్దేశం

ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులకు అందించనున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల కొనుగోళ్లు, సరఫరాకు సమయాన్ని నిర్దేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆర్థిక, పరిపాలన అనుమతులను అక్టోబరు రెండో వారంలోపు పొందాలని, టెండరు డాక్యుమెంట్ల తుది రూపకల్పన మూడో వారం, టెండర్ల ఎంపిక డిసెంబరు మొదటి వారం, సరఫరాకు వర్క్ ఆర్డర్లు మూడో వారం, వస్తువుల సరఫరా ఏప్రిల్ రెండో వారం నుంచి ప్రారంభం కావాలని సూచించింది. పాఠశాలల వద్ద పంపిణీకి జూన్ మొదటి వారానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించింది.

డీఎంఅండ్‌హెచ్‌ఓలు, జీజీహెచ్‌ల సూపరింటెండెంట్ల మార్పు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని కొందరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లను రాష్ట్ర ప్రభుత్వం మార్చబోతోంది. సుమారు 15మంది జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే.. విజయవాడ, గుంటూరు, కర్నూలు, ఇతర బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లను కూడా మార్చే అవకాశం ఉంది. వైద్య ఆరోగ్యశాఖలో ఇందుకు సంబంధించిన కసరత్తు ప్రాథమిక స్థాయిలో పూర్తయింది.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఈనాడు, అమరావతి: ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే బయోమెడికల్ ఇంజినీర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తమ అర్హతలను అనుసరించి తమను ఏఈఈలుగా కూడా గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే బయోమెడికల్ ఇంజినీర్లు తమ అసోసియేషన్‌కు కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగాల్లో పనిచేస్తున్న బయోమెడికల్ ఇంజినీర్లు ఈ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్నారు. అధ్యక్షులుగా రహాన పర్వీన్ పఠాన్, సహాధ్యక్షులుగా సందీప్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగార్జున వ్యవహరిస్తారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శిగా నళిని, కోశాధికారిగా రవివర్మ వ్యవహరిస్తారని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో అధ్యక్షురాలు రహాన తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అడ్వొకేట్ ఫోరం ఆధ్వర్యంలో హైకోర్టు ఎదుట నిరసన

ఈనాడు, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించివేసి, అవమానించారంటూ ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు తీరుపై, కాకినాడ రంగరాయ కళాశాల వైద్యుడు ఉమామహేశ్వరరావుపై కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ దాడి చేయడాన్ని నిరసిస్తూ న్యాయవాదులు హైకోర్టు ఎదుట బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆందోళన చేశారు. ఎస్సీ, ఎస్టీ అడ్వొకేట్ ఫోరం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఎన్‌ఎఫ్‌ఐఆర్‌టీడబ్ల్యూ జాతీయ కార్యవర్గంలోకి ఈయూ నేతలు

ఈనాడు, అమరావతి: నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఎన్‌ఎఫ్‌ఐఆర్‌టీడబ్ల్యూ) సీనియర్ ఉపాధ్యక్షుడిగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, జాతీయ కార్యదర్శిగా ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య ఎన్నికయ్యారు. బెంగళూరులో మూడు రోజులపాటు జరిగిన సమావేశాల్లో జాతీయ అధ్యక్షుడిగా ఎంఎల్ యాదవ్ (రాజస్థాన్), ప్రధాన కార్యదర్శిగా విజయ్‌భాస్కర్ (కర్ణాటక) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఏపీకి చెందిన ఈయూ నేతల్లో జి.నారాయణరావు, వై.శ్రీనివాసరావులు జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులుగాను, పి.సుబ్రమణ్యంరాజు, పి.భానుమూర్తి ప్రత్యేక ఆహ్వానితులుగా ఎన్నికైయ్యారు.

జీతాల నుంచి రికవరీలు ఆపాలి

టైర్లు, స్ప్రింగ్ ప్లేట్లు, బస్సు డ్యామేజీలు, టిమ్స్ డ్యామేజీలకు సంబంధించి ఉద్యోగుల జీతాల నుంచి అధికారులు ఇష్టానుసారం వేల రూపాయలను రికవరీ చేస్తున్నారని, ఈ విధానం ఆపాలని ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది.

రాష్ట్ర సర్వీసు పోలీసులకు ఐపీఎస్‌గా పదోన్నతికి కమిటీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పోలీసు సర్వీసుకి (ఎస్‌పీఎస్) చెందిన అధికారులకు ఐపీఎస్ పదోన్నతి కల్పించేందుకు ఉద్దేశించిన ఎంపిక కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులుగా.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్, డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ లేదా సభ్యుల్లో ఒకరు పదోన్నతుల కమిటీకి ఛైర్మన్‌గా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ కార్యదర్శి, డీజీపీలతో పాటు కేంద్ర ప్రభుత్వం నియమించిన సంయుక్త కార్యదర్శి స్థాయి అధికారులు మరో ఇద్దరు సభ్యులుగా వ్యవహరిస్తారు. 2022, 2023 సంవత్సరాలకు సంబంధించిన పదోన్నతుల జాబితాని ఈ కమిటీ సిద్ధం చేస్తుంది.

సాధారణ పరిపాలన శాఖ పరిధిలోకి ఈడీబీ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డుని (ఏపీఈడీబీ) సాధారణ పరిపాలన శాఖ పరిధిలోకి తెస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఈడీబీ ఇప్పటి వరకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలో ఉండేది.